…ంయొక్క తెయే ప్రేమైకస్వరూపిణియై …డియు సరస్వతి యంతగా నాటపాటల… ఆమె యెప్పుడును గ్రంథములతోడనే …ను. బ్రహ్మసూత్రభాష్యము, గీతా…ము, మొదలగు వేదాంతగ్రంథములను …ను …ము సరస్వతి మిగుల నాసక్తితో నా… …ము నందలపరమా… …ర్థములను గ్రహించుచుఁ గ్రమముగఁ దానే యాగ్రంథములను జదివి తెలిసికొనునంతటి ప్రౌఢపాండిత్యమును సంపాదింపఁగలిగెను.

సరస్వతి నేఁటి యుదయమునుండియును దనశయనమందిరమునందే యొంటిగఁ గూర్చుండి యేమేమియో యాలోచించుకొనుచుండెను. ఆమెసుందరవదన ముదయారుణచంద్రమండలముఁబోలి యెఱ్ఱనై చిఱుచెమ్మటలు గ్రమ్మి యుండెను. నడుమనడుమ వేఁడినిట్టూర్పులు వెలువడి యామెకోమలారుణాధరపల్లవమును వివర్ణముగఁ జేయుచుండెను. అప్పుడప్పుడు వాతాహతిం జలించు వసంతనవకుసుమవల్లికం బోలి యామెసుకుమారసుందరతనులత ప్రకంపితమగుచుండెను. నేఁడామెమనోభావములు విశృంఖలములై విపరీతములగుచుండెను. ఆదుర్దమనీయభావవేగోపశాంతికై యామె మహాభారతమునందలి శాంతిపర్వమును జదువుకొనవలయు నని తీసెను. అది యామెమనసునకుఁ బట్టినది కాదు. తరువాత శృంగారశాకుంతలమును నందుకొని చదువఁ దలంచెను గాని యదియు నామెభావపరివర్తనమునకు సాయపడినది కాదు. ఆగ్రంథమును యథాస్థానమునం దుంచి మేఘసందేశమును గైకొని యొకటిరెండుపుటలను దిరుగవైచెను. అందలి భావము లామెహృదయమునకు మఱిం…

యావేగముం గల్పించెను గాంబోలును! ఆపుస్తకమును గట్టిపెట్టి * యేకాంతసేవావలోకనమున మనసు కుదుగుపఱచుకొనం బ్రయత్నించెను.

విరహాకాతర యగువిశ్వసుందరి విరాణ్మూర్తిని వెదకికొనుచున్నది. వియోగవిహ్వల యగుప్రేమైకమూర్తి భువనకల్యాణస్వరూపుఁడగు పురుషోత్తము నన్వేషించుచున్నది. ప్రణాళిక యగుపరమసుందరబాలికామూర్తి ప్రాణప్రియుని భావనాప్రపంచమునంగాంచి వేడుకొనుచున్నది. సరస్వతిహృదయము మఱింత చలించిపోయెను. చూచుచుండఁగనే యామెనయనకమలము లశ్రుజలపూరితము లైపోయెను. సరస్వతికోమలకరపల్లవమునందలిపుస్తకము క్రిందఁబడిపోయెను. పాప మాబాలిక యేమి చేయఁగలదు? అట్లే భావనాప్రపంచమునం బడి యల్లాడుచుండెను.

గృహకృత్యము లయందు నిమగ్న యైయున్నయన్నపూర్ణాదేవికి సరస్వతి యొక్కసారియైనను గంటఁబడకుండుటచే నేమియుం దోఁచుట లేదు—అన్నపూర్ణాగారిపతులజీవితలతాకుసుమము—నయనానందచంద్రిక—ప్రేమానందైకస్వరూపము—ఇహజీవనసర్వస్వము—సరస్వతి కాక మఱి యెవ్వరు? అప్పుడన్నపూర్ణ పుత్రికాదర్శనలాలసయై సరస్వతిగదిగుమ్మమునొద్దకువచ్చి “అమ్మా! ఏమిచేయుచున్నావు?” అనియెను.

సరస్వతి యలికిపడి లేచి కన్నులం దుడుచుకొని “ఏమియు నులేదమ్మా!” అనియెను.

ముద్దుబిడ్డ యగుసరస్వతికనుగొలుకుల నశ్రుచిహ్నములం గాంచి యన్నపూర్ణహృదయము కళుక్కుమనియెను. అప్పుడామె

* ఏకాంతసేవ—భక్తిభావోద్దీపకమగు పద్యకావ్యము.

విరసభావసూచకం బగుముఖభంగముతో “అమ్మా ! నీకు మతి పోవుచున్నదా యేమి ?” అనియెను.

సరస్వతి మొగ మింత చేసికొని యేమియుమాటాడఁజాలక పోయెను.

అన్న—ఆపిచ్చివానిమాటలకు భయపడుచుంటివా ? ఆ మాటల కర్థ మేమున్నది తల్లీ !

సర—లేకేమి ? కనఁబడుచునే యున్నది కాదా ?

అన్న—పరబ్రహ్మము రాలేదనియేనా ?

సరస్వతి తల వంచుకొని తనకోమలకరపల్లవమునఁ జేలాంచలమును దడవుకొనుచుండెను.

అన్న—తల్లిదండ్రులు లేనివాఁడని—మేనల్లుఁడని—చిన్నతనమునుండియుఁ బెంచి బిడ్డనిచ్చుకొన్నందుకు విచారము మాకుఁగాని చిన్నబిడ్డవు నీకేమి తెలియు నమ్మా !

సర—అమ్మా ! తెలియ కేమి ? తెలిసికొనకుండ నెంతకాల మిట్లు చిన్నబిడ్డనై యుండఁగలను ?

అన్న—ఉండక నీవేమిచేయఁగలవు? ఎవరేమిచేయఁగలరు? మొదటినుండియు వాఁడట్లే యున్నాఁడు. చదువే కావలసినచో నింటనుండి మేనమామయొద్దనింకను జదువుకొనఁగూడదా ! దేశాంతరములకుఁ బోవుట యెందుకు ? ఆవెఱ్ఱివెఱ్ఱిపూజలెందుకు ? తీర్థయాత్ర లెందుకు ? ఇరువదియేండ్లైనఁ దిన్నఁగ నిండలేదు గదా ! ఆనిష్ఠ లెందుకు ? చిన్నతనమునుండియు నెత్తిపెంచిన యాత్మీయుల విడనాడు టెందుకు ? ఈయిల్లనినఁ బెద్దపులిగాఁ జూచుటయెందుకు? చిన్నతనమునుండియుఁ గన్నుల నద్దుకొని పెంచుకొన్నందుకుఁ బ్రతిఫలమా యిది ?

సర — అమ్మా ! తొందరపడి యూరక నిందింపవలదు — నీ మాటలకుఁ బ్రత్యుత్తర మిచ్చుట కాయన నీయెట్టయెదుట లేరు గదా ! నాయందలి ప్రేమచే నీవు వారిని నిందించుచుంటివి గాని నాహృదయమును వేధించుచున్న సంగతియించుకంతయును గ్రహించుట లేదుగద !

అన్న — సరే. నేనూరకున్నను లోకులు నిందింపరా ? ఈడు వచ్చిన బిడ్డ నింట నుంచుకొన్న తల్లిదండ్రులకు విచారము పసిబిడ్డవు నీ కేట్లు తెలియును ?

సర — అమ్మా ! నాకు మాత్రము విచారము లేదా ?

అన్న — లేదని యెవ్వరు చెప్పఁగలరు ? ఉన్నది! — దోసెడు తలబ్రాలు వోసి యగ్నిసాక్షిగఁ బెండ్లియాడినవానికిఁ గూడ నట్టుండవలదా ?

సర — లేదని నీ కెట్లు తెలిసినది ?

అన్న — తెలియకేమి ? ఉన్నచో నింటికి రానే వచ్చును.

సర — అమ్మా! నీవు స్వార్థపరత్వముతో మాటాడుచున్నావు. మేమిరువురము నగ్నిసాక్షిగఁ బెండ్లియాడిన దంపతులము గదా ! ఆయన చెంతకు నేనేల పోఁగూడదు ?

అన్న — పోవుట యెక్కడకు? ఒకయూరా యొకపల్లెయా? ఒకయిల్లా యొకవాకిలియా ?

సర — మేమిరువురమును ధర్మముకొఱకు దంపతుల మైతిమి గాని భవనములకొఱకును బట్టణములకొఱకును గాదుగద !

అన్న — కాకున్న మఱి యెందుకు ? ఏమిసుఖ మనుభవించుటకు ?

సర — అమ్మా ! పరస్పరానుబంధంబున నైహికాముష్మిక సుఖంబుల సమానముగ ననుభవించుటకై దాంపత్యధర్మము విధిం

పఁబడినది. ఆధర్మమును విధ్యుక్తముగ నిర్వహించుట వలననే సర్వసుఖములును లభియింపఁగలవు.

అన్న — సరేకద! అట్లయినచో నీసంబంధమున నీవేమి సుఖపడుచున్నావు— ఆతఁ డేమిసుఖపడుచున్నాఁడు ?

సర — తల్లీ! కడుపుతీపుచే ననాలోచితముగ మాటాడుచున్నావు. క్షణస్థాయి యగు భౌతికసుఖము సుఖము కాదు. చిరస్థాయి యగునాత్మసుఖమే యనంతసుఖము! నిరంతరసందర్శన భాగ్యము లభియింపకున్నను నేను వారిని సర్వదా నాయాత్మలో భావించిధ్యానించుకొనుచుఁ బరమానందసుఖము ననుభవించుట లేదా! అట్లే వారును నన్నుఁ దమహృదయమునం దలంచుకొనుచుఁ బ్రేమానందసుఖము ననుభవింపఁగూడదా ?

అన్న — ఇం కష్ట మెందుకు ? ఇంత పట్టుదల యెందుకు ? వానికి మామీఁదఁ గోప మేమైన నున్నచో మే మా వానప్రస్థాశ్రమమును స్వీకరించెదమే. ఇంటికి వచ్చి సుఖముగఁ గాఁపురము చేసికొనఁగూడదా ? మీయిరువురు నొక్కటియై యానందముతోఁ గాలక్షేపము చేయుచున్నట్లు కర్ణానందముగ వినినమైన మేమానందింతుముగాదా! తల్లిదండ్రులవంటివార మగుమ మ్మానందింపఁజేయుటవలన నాతనికిఁ బుణ్యమే కాని పాపము రాదే !

అని యన్నపూర్ణ కన్నుల నీరుపెట్టుకొనసాగెను. సరస్వతియు మంద్రగద్గదస్వరముతో "అమ్మా! కోరినకోరిక లన్నియును దీరుచునే యున్నచో నిఁక నీప్రపంచమునఁ గష్టసుఖము లను మాట యెందుకు ?" అనియెను.

అన్నపూర్ణ మొగము చిట్లించుకొనుచు విలక్షణస్వరముతో "నీవేదాంతరహస్యములు నాకు బోధపడుటకు నేనంతగాఁ జదువు

కొన్నదానను గాను" అనునంతలో నామెకంఠస్వరము రుద్ధమైపోయెను. ముఖమండలము వైవర్ణ్యమునందెను. ఆకస్మికముగ నామె హృదయమున నెన్నియో భావములు మిలమిల మెఱసిపోయెను.

సరస్వతి చకితనయనములతోఁ జూచుచునిలువఁబడిపోయెను. ఆమె హృదయము కూడ నప్పుడు ఘోరఘోరాపత్ప్రభంజనసమయమునందలి యమృతసాగరముంబోలి ఘూర్ణిల్లుచున్న ట్లామృదుమనోజ్ఞవదనకమలంబునఁ బ్రతిబింబించుచుండెను.

అప్పు డన్నపూర్ణ కన్నీరు నించుచు గద్గదస్వరముతో "తల్లీ నీవు చదువులసరస్వతివై — శూన్యగేహమునకు శుభ్రమణిదీపకళా సరస్వతివై — యాత్మజీవితముల కమృతసరస్వతివై — యనుతప్త హృదయముల కానందసరస్వతివై — కాననికన్నులయెదుటఁ గనకసరస్వతివై — ప్రక్కప్రక్కల బాలికాసరస్వతివై — మెలంగుచున్నంతవఱకే మాబ్రతుకు గాని —" అని యింకఁ మాటాడఁజాలక వెక్కి వెక్కి దుఃఖింపసాగెను.

సరస్వతికిని దుఃఖ మాఁగినది కాదు. ఆమెకన్నదమ్ములనుండి యవిరళాశ్రుధారలు ప్రవహించి వక్షోవసనమును దడిపివైచుచుండెను. అప్పు డచ్చటఁ గరుణరసము భిన్నస్వభావసంకలితమై మూర్తిద్వయవిలసితమై యున్నట్లయ్యెను. అప్పటివారియవస్థఁగాంచినచో నెంతటిధీరోదాత్తులైనను దమయంతర్బాష్పగౌరవమునకు జలాంజలి విడువకమాన రని సాహసించి చెప్పఁగలము.

ఇరువురు నట్లే మౌనముతో నిలిచియుండిరి. ఇంతలో గోస్తనీతీరమునకు మాధ్యాహ్నికకృత్యములం దీర్చుకొనఁబోయిన గౌరీపతిశాస్త్రి వచ్చి వీథిగుమ్మముకడనిలిచి "సరస్వతీ!" అని పిలుచుచుఁ దలుపుఁగొట్టెను.

అంతలో నాయికాపురిమానచింతాభావములకును నంతరాయము సంఘటిల్లెను. అన్నపూర్ణ కన్నులం దుడుచుకొని భర్తకుం దలుపుదీయుటకై వెడలిపోయెను. తండ్రి దేవతార్చనమునకుం బూజాద్రవ్యము-ను సమకూర్చుటకై సరస్వతి పూజామందిరమునం బ్రవేశించెను-

---

నాలుగవ ప్రకరణము.

> సభవ్యముగునట్టి ప్రేమపు ♦ పంచకమున
> కమరపట్టని యొకపల్లె ♦ యైనం గాదు;
> పాదు లేనట్టి ప్రేమపర ♦ పాలయమున
> కంబునిధి యొక శీకర ♦ మైన-గాదు;
> వేయికన్నుల వెలయుచు వా ♦ ప్రేమగతులం
> గన్నుగవతోడ నెవ్వారు ♦ గాంచగలరు?
> ప్రేమ ప్రమదావనము.

వేంకటేశ్వరరావు శ్రోత్రియబ్రాహ్మణకుటుంబమున జన్మించినవాఁడు; ఇరువదియైదేండ్లయీడుగల సంపూర్ణయౌవనుఁడు. ఆతని పూర్వులు కుమారారామము నగ్రహారముగ సంపాదించియుండిరి. అదియంతయు నిప్పుడు లేకపోయినను నాతనికి సంవత్సరమునకు నాలుగైదువేలరూప్యముల యాదాయము వచ్చుభూస్వాస్థ్య మిప్పటికిని నిలిచియున్నది. ఇది కాక తండ్రి సంపాదించి యిచ్చినరొక్కముకూడ విశేషముగ నున్నది. కుమారారామమునం దాతని కొక పెద్దమేడయును దోఁటయు నున్నవి. అనుకూలవతియు నభినవయౌవనయు నగునసూయ యాతనికి సహధర్మచారిణియై యుండెను. ఆతని కేవిషయమునను గొఱంత లేదు.

ఆతఁ డెప్పుడును వినోదవిలాసములతోఁ గాలక్షేపము చేయు స్వభావము కలవాఁడు. శృంగార కావ్యములయందును సంగీతమునం దును నాతనికి మిగుల నాసక్తి ఆతనికిఁ బూర్వాచారము లనిన ననిష్టములేదు కాని యాతఁడుమాత్రము నవీనాచారముల కలవా టుపడినవాఁడు. ఆతఁడు తనయిరువదిమూడవయేఁటఁ దండ్రిమరణిం చినతరువాతఁ దమయింటఁ బారంపర్యముగ నర్చింపఁబడుచున్న దే వతార్చనాపీఠమును బూజింపకుండ నింట నుంచుకొనుట మంచిదికా దని యెంచి సదక్షిణముగ నొకసద్బ్రాహ్మణునకు దానము చేసి వైచెను.

అతఁ డిప్పుడు దామోదరరావుచే సంగీతము చెప్పించుకొను చుండెను. వీణావాదనమునం దాతనికి మంచిసామర్థ్యము కలిగినది. త్యాగరాజకృతులును దీక్షితులవారికృతులును జాలవఱ కాతనికి వచ్చియుండెను.

రాత్రి యెనిమిదిగంట లైనది. వేంకటేశ్వరరావు భోజనా నంతరమునఁ దాంబూలచర్వణముం గావించుచు మేడపై శయనమం దిరమునం దొక రత్నకంబళముపైఁ గూర్చుండి యానందముతో వీణవాయించుకొనుచుండెను. ఆతఁ డతిమధురముగ రాగము నాలా పించి తానమును వాయించి క్రమముగ “తొలినేఁ జేసినపూజాఫ లము” అనుత్యాగరాజకృతిని వీణలోఁ బలికించుచు న్మాదులస్వ రంబున బాడుచుండెను.

ఇంతలో ననసూయ మూర్తీభవించిన శృంగారదేవతవలెఁ బుష్పమాలికాలంకృతయై పుస్తకముం జేతఁ బూని నడకలునేర్చిన నవ్యమరాళిగ్రహముం బోలి సూసాధము నధిరోహించి వచ్చి శయ నమందిరద్వారపార్శ్వమున నొదిగి నిలువఁబడి యానందమును బట్టఁ

జాలక యాపాటతోఁ దనకంఠస్వరముం గలిపి "తొలినేఁ జేసినపూ జాఫలము" అని తానుగూడఁ బాడెను.

స్వరత్రియమునకును సమ్మేళనమైనది. ఫలరసమున నమృత రసము చేరిన ట్లుండెను. మలయవాయువులలో మాధవీకుసుమసౌర భము లలమికొనిన ట్లుండెను. చంద్రికాకాంతిలో విద్యుత్కాంతి ప్రసరించిన ట్లుండెను. ప్రియురాలికలకంఠస్వరము మధురవీణాస్వర ముకంటెను మాధురీమయ మైనది కాంబోలును! అవును— అచే తనమగు వీణ కేవలతాత్కాలికసుఖస్వరమయమైనది మాత్రమే- కాని సచేతనయగు ప్రాణప్రియామోహనమూర్తి నిరంతరప్రేమా మృతరసమయ మైనది !!

వేంకటేశ్వరుఁడు ప్రేమప్రఫుల్లనయనములతోఁ దలయెత్తి చూచెను. ఎట్టయెదుటఁ దొంగితొంగిచూచుచుఁ గలకలనవ్వుచు న్న యలమేలుమంగముద్దుమొగ మాతనికంటఁ బడియెను. అప్పు డు వేంకటేశ్వరుఁడు ప్రేమోద్రిక్తహృదయముతో వీణ మీటుచు-

"అలమేలుమంగ—ఆట లాడంగ
అలరునాఁకిళ్లలో—అమృత మొల్కంగ
శ్రీరంగ రంగ—చిన్నారిరంగ
సేవించురంగ—చెన్నుమీరంగ"

అనిపాడెను. పదములుమాత్రము పాటయందున్నవి గాని భావములన్నియు నంతరంగమునందే నృత్యముచేయుచుండెను. వేంక టేశ్వరుఁడు సముత్సాహపరవశుఁడైనప్పు డనసూయ నిట్లే మేల మాడుచుండును.

అప్పుడు ప్రేమమయి యగునసూయ విలాసమయముం బగు పదవిన్యాసముతో నానందఘుంబులగు కటాక్షావలోకనంబులతో

నవవికసితకుసుమవల్లరింబోలి కలకలనవ్వుచు సమీపమునకుఁ బోయి తనమెడలోనున్న పుష్పహారముతోఁ బ్రాణేశ్వరు నలంకరించెను. అనసూయ పరిహాసప్రియుండగు తనప్రాణేశ్వరుని దానును బరిహాసింపవలయు నని తలఁచినదిగాని యానందాతిరేకముచే నప్పుడు వేంకటేశ్వరుఁడు నిజముగఁ బూలరంగఁ డయ్యెను !!

అప్పుడు వేంకటేశ్వరుఁ డానందముతో ననసూయను గౌఁగిలించుకొని యారత్నకంబళముపైఁ దనపార్శ్వమునఁ గూర్చుండఁజేసికొనియెను. అనసూయ చిఱునవ్వు నవ్వుచు మృదుమధురస్వరముతో "వీణవాయింపుఁడు ! పాటనాఁపివైచితిరేమి ? " అనియెను.

వేంక — (అనసూయ చుబుకమును స్పృశియించుచు) ప్రియా ! ఈపాట నీమాటలకంటెను మధురమైనదా ?

అన — మీరు నాకుఁ జెప్పినకృతు లన్నిటిలోనను "ప్రాబాఘము మే" మిగులరసభావసమన్వితమై మనోహరముగ నున్నది.

వేంక — రాగజ్ఞాతిక వగునీకుఁ దెలియని దేమున్నది ? బాగుగ గ్రహించితివి.

అన — మొన్నటిదినమున శ్రీభీమేశ్వర దేవాలయమున భీమశంకరశాస్త్రి యీకృతినే పాడినాఁడు — కాని యింత బాగుగ లేదు.

వేంక — నీమాట నిజమే. ఈకృతి నిట్టిమధురస్వరసంయుతముగ దామోదరుఁ డొక్కఁడుమాత్రమే పాడఁగలఁడు. పాపము ! సురాపానము మొదలగుదురభ్యాసములు లేకయున్నచో నాతఁడు సభాపూజ్యుఁ డయ్యెడివాఁడే.

అన — ఔను. ఆతఁడు మంచికుటుంబమున జన్మించి మంచి వైభవము ననుభవించినవాఁడేనఁట ! తుదకాతనియదృష్ట మీవిధముగఁ బరిణమించినది.

వేంక—నీకీకృతి యంతయును వచ్చినదా?

అన—కృతి వచ్చినది కాని కల్పితస్వరముమాత్ర మింకను రాలేదు.

వేంక—కలకంఠముకూడ ననుకరింపఁదగిన సహజమధుర కంఠస్వరముఁ గలనీకు కల్పితస్వరముతోఁ బనియేమున్నది?

అన—(మందహాసవదనముతో) మాటిమాటికిని బరిహాసములేనా?

వేంక—హాస్యప్రియ వగునీవు సత్యమునుగూడఁ బరిహాసముగనే భావించుచున్నావు.

అన—మీమాటయే నాకు సత్యము—మీహాస్యమే నాకానందము—

వేంక—నీప్రేమయే నామహాభాగ్యము— నీసాన్నిధ్యమే నాస్వర్గరాజ్యము— నీవేనాప్రాణము—

అని ముద్దుపెట్టుకొనియెను. అప్పుడు ప్రేమభరవిహ్వల యగు ననసూయ ,,తొలినేఁ జేసినపూజాఫలము'' అని పాడఁదొడంగెను. వేంకటేశ్వరుఁడు వీణవాయింపనారంభించెను. ఇరువురు నదే పాట—ఆప్రేమానందమూర్తులసన్నిధానసౌభాగ్యంబునం జేసి ధన్యత్వముం గాంచినదియుం బోలె నావీణయును ,,తొలి నేఁజేసినపూజాఫలము'' అని పాడుచుండెను.

కృతియంతయును బూర్తి యైనది. అనసూయ క్రొత్తకృతిని నేర్చికొనుటకై పుస్తకమును దీసికొని పత్రములను దిరుగవైచుచుండగా దానిలోనుండి యొకకాగితము క్రిందఁ బడియెను. వేంకటేశ్వరరావాకాగితముం దీసిచూచి యాశ్చర్యముతో ,,ఇదియేమి'' అని యడిగెను.

అన — ఈచిత్రపటమును మీరు చూడలేదా ?

వేంక — లేదు. ఇది యెక్కడిది ?

అన — శారదామూర్తివలెఁ దియీపుస్తకమునందే యున్నది.

వేంక — వీణ వాయించుచున్నటు లున్నదే.

అన — అవును.

అని చెప్పి యనసూయ యాచిత్రపటమునందుకొని నిశ్చల నయనములతోఁ జూచుచుండెను. వేంకటేశ్వరరావు వీణమీటుచు ,,అదియేమి యంతవింతగాఁ జూచుచున్నావు ? '' అనియెను.

అన — విశాలము లగుకన్నులును వినీలంబులగుకుటిలకుంతలములును, వికచారవిందసదృశంబగువదనమండలమును విశ్వసుందరదుర్లభంబగుమోహనసౌందర్యమును వింతగనే యున్నవి.

వేంకటేశ్వరుఁడు తృణీకారసూచకస్వరముతో ,,అలాగా ? నీకంటెనా ? '' అనియెను.

అన — ఔను.

పరిశుద్ధగుణగ్రహణసుస్వభావ యగు ననసూయ సత్యముగఁ దానెట్లు భావించుకొన్నదో యట్లే చెప్పినది.

వేంక — (ప్రేమసూచకస్వరముతో) ఓ సిముగ్ధహృదయా ! నీచక్కఁదనము నీకెట్లు తెలియును ?

అన — (మృదుమధురస్వరముతో) మఱి యింకెవ్వరికిఁ దెలియును ?

వేంకటేశ్వరుఁడు — గుండెలపైఁ జేయి పైచుకొని ,,నాకన్నులకు — నాయంతరంగమునకు — నాప్రాణములకు — నాకు —'' అనియెను.

అనసూయ పట్టరాని యానందముతో నాత్మేశ్వరుని గౌఁగిలించుకొనియెను.

అయిదవప్రకరణము.

పుణ్యమో పాపమో నీవు ♦ పూనుకొన్న
యొక్కకార్యంబు నెఱవేర్చు ♦ మన్నయపుడు
మంచిచెడ్డలఁగూర్చి యో ♦ చింపు టెపుడు ?
తెలివిగలదేని నిన్నటి ♦ దినమునందు.

నిన్న—హారావళి.

రాత్రి రెండు యామములు కావచ్చెను. అష్టమీచంద్రుఁ డప్పుడప్పుడే పశ్చిమాశాసముద్రమునఁబతనోన్ముఖుఁ డగుచుండెను. ఆయస్తంగతార్థచంద్రుని క్షీణకిరణము లాషాఢకృశయగుకృష్ణవేణీవిశీర్ణవేణికలం బ్రసరించుచుండెను. అప్పటికి యామినీరమణి తన చుట్టుచెంగావిచీరపై నీలవసనావకుంఠనమును సవరించుకొనుచుండెను. ఆరజనీకాంతతో మంతనములాడుచుఁ బ్రవహించుచున్న కృష్ణవేణీతరంగిణి యప్పుడు సార్థకనామయగుచుండెను. విజ్ఞానవిరహితంబగునంతరంగము నజ్ఞానమాక్రమించుకొనునట్లు, ప్రచురకౌముదీవిహీనంబగు ప్రకృతివంతను బ్రబలావేగముతో నంధకారమాక్రమించుకొనుచుండెను.

ఆసంధిసమయమున విజయవాడకు సమీపమునందున్న రాజమార్గమునకుఁ బార్శ్వమునందలి తరుషండమునుండి యెవ్వరో యిరువురుమనుష్యులు మెల్లమెల్లఁగ మాటలాడుకొనుచుండిరి.

ప్రథ — ఇంకం గార్యము లేదు. పసరు పనిచేసినది కాదు.

ద్వితీ — (నిట్టూర్పు విడిచి) మఱచితిమి గాని దొరగారి మందు మనతో నుండవలసినది.

ప్రథ — శ్రీతిమించిరాగానంబడినప్పు డేమనుకొన్న నేమిలాభము ?

ద్వితీ — ఇంక నేమిచేయుదము ?

ప్రథ — నెత్తింబెట్టుకొని పోవలసిన దే. పట్టువచ్చినప్పుడు పర్వతమునైన మోయంగలము గాని పట్టువదలిపోయినప్పుడు గడ్డిపరకనైనను గదపలేము.

ద్వితీ — చేతులు ముడిచిపెట్టుకొని యిట్లే కూరుచున్నచో జిక్కు కాదా ?

ప్రథ — ఆతొందరలో డొంకలోం బడిపోవుటచే మనయిద్ద ఆకును గాళ్లనిండ ముండ్లు విఱిగినవి గాని పనివచ్చినప్పుడు పాఱిపోలేని పంద యెవండున్నాండు రాయిందులోను ?

ద్వితీ — ఆమాత్రము ధైర్యము చెప్పుటకయిన వాండిట్లయిపోయినాండుగదా !

ప్రథ — చెట్టుపడిపోయినది పిట్టలు చెదరిపోవలసిన కాలము వచ్చినది.

ద్వితీ — ఆమాట చెప్పకురా ! గుండె బ్రిద్దలయిపోవుచున్నది.

ప్రథ — నిజమేరా ! కుడిబుజముకూలిపోయినదిరా !

ద్వితీ — బుజాలేకాదు ప్రాణాలేపోయినవిరా !

ప్రథ — ముందున్నవాండవు వెనుకకు వచ్చుటచేత నీకేది తప్పిపోయినదిరా ?

ద్వితీ — ఏమిలాభము ! గండము తప్పినదిగాని ఫుట్టి ముంచి వేసినదికాదా !

ప్రథ — ఆశకోసి వేసినది — ముందు (బోయినవారు) మన కోస మెదురుతెన్నులు చూచుచుందురు. ఇంత మునింగిన దని వారి కెట్లు తెలియును ?

ద్వితీ — మనము బయలుదేరిన వేళ మంచిదికాదు. ఇన్నిచిక్కులు వచ్చినవి.

అంతలో దూరమునుండి బండ్లువచ్చుచున్న గంటలచప్పుడు వినవచ్చెను. వారిరువురును మాటలను గట్టిపెట్టి నిశ్శబ్దముగ గూరుచుండిరి. అప్పుడనతిదూరమునం దొకవ్యక్తి రాజమార్గము నతిక్రమించి తమవైపునకే వచ్చుచున్నట్లు వారికి దృగ్గోచర మయ్యెను. ఇరువురును అంటుకొనుచు మెల్లమెల్లగ సమీపవృక్షాంతరాళమునకుం బోయి దాంగికొని కనిపెట్టిచూచుచుండిరి.

ఆవ్యక్తి క్రమక్రమముగ వారువదలిపోయిన స్థలమునకు వచ్చి యగ్గిపుల్లను వెలిగించి చూచెను. అచ్చటం గృష్ణవర్ణదీర్ఘకాయుండును, బలిష్ఠుండు నగునొకపురుషుండు నురుగులుగ్రమ్మిన ముఖముతో మృతప్రాయుండై పడియుండెను. ఆవ్యక్తి మరల నగ్గిపుల్లను వెలిగించి యాతని సర్వావయవములను బరీక్షించిచూచెను. ఆపురుషునికుడిపాదమునం జీరుకొనిపోయినట్లున్న చిన్నగాయమును రక్తచిహ్నములును నగపడియెను. పాదమంతయును బసరుడాగులతో నిండియుండెను.

అప్పు డావ్యక్తి యాతనికిం బాముగఱచియుండు నని నిశ్చయించుకొనియెను. తోడనే తనసంచిలోనున్నకరాటముం బైకిందీసి యందలిభస్మమును గాయముపై నంటించెను. మఱికొంతభస్మమునుక

న్నులయందును నాసారంధ్రములయందును గర్ణరంధ్రములయందును బోసి యూదెను. ఆవిధముగఁ జేసినపిమ్మట నేమేమి మోమంత్రము లనుచ్చరించుచు దనచేతులతో నాతనిశిరముమొదలు పాదములవఱ కును స్పృశియించుచు నదేపనిగ నాకర్షణమునకై హస్తసంచాల నము చేయసాగెను ఆచర్యయంతయును సమీపముననే చెట్లచాఁ టున దాఁగియున్నపురుషులిరువురు నాశ్చర్యముతోఁ జూచుచుండిరి

ఆవ్యక్తి తదేకధ్యానముతో నావిధముగ మంత్రించుచుండ గాఁ గొంతసేపటికి మృతప్రాయుఁడై పడియున్న యాతనికిఁ జైతన్య ము కలిగెను. క్రమముగా మరికొంతసేపటి కాతఁడు లేచికూర్చుండె ను. అప్పుడు చెట్లచాటున నున్నపురుషు లిరువురు నద్భుతానందప రవశు లైపోయిరి. అప్పు డాపురుషుఁడు దీర్ఘశ్వాసములను విడుచు చుఁ దనపాదములను గట్టిగఁ బట్టుకొని గోండ్రింప నారంభించెను.

చికిత్సకుఁడు—ఎట్లున్నది ?

పురు—మరణబాధగ నున్నది—అయ్యా ! నన్ను బ్రదికిం పఁజాలినపుణ్యాత్ముఁడ వీబాధనుండికూడ రక్షింపఁజాలవా ! స్వా మీ ! మీ రెవ్వరు ?

చికి—నేను విషచికిత్సకుఁడను.

పురు—నాయనా ! నీవు నా పాలిటి దైవమవు. నీప్రభావము చే నీయాతననుగూడఁ దప్పింపవా ?

చికి—నీ వెవ్వరు ?

పురుషుఁడు సందేహముతో నించుకసే పూరకుండి "నేనె వ్వఁడనైన నేమి ? నన్ను రక్షింపుము !" అని పాదములఁ బట్టుకొని యెను.

చికిత్సకుఁ డాపురుషునిరక్తనాళము లన్నిటను వ్యాపించి చైతన్యమును జంపివైచినవిషమునంతను మంత్రౌషధశక్తులచే నాకర్షించి పాము గఱచినపాదమువఱకును దింపివైచెను; కాని సంపూర్ణముగ విషమును దీసివేయలేదు. అందుచే నాపురుషుండు మిగులబాధపడుచుండెను. చికిత్సకుఁ డాతనింజూచి "నిన్ను బ్రతికించుటకుమాత్రమే మందు నాయొద్ద నుండెను. సంపూర్ణముగ నీవిషమును హరింపఁజేయు నౌషధములు ప్రస్తుతము నాయొద్ద లేవు" అనియెను.

పురుషుఁడు బాధతో 'మహాత్మా! నన్నెందుకు బ్రదికించితివి? ఈబాధ ననుభవింపఁజాలకున్నాను' అనియెను.

చికి—అవకాశ మున్నంతవఱకు నాచేతనైనపని చేసితిని. ఔషధము లేనప్పు డింక నేనేమి చేయఁగలను?

పురు—ఈబాధ కొంచెమైనను దగ్గింపఁజాలవా?

చికి—ఇక్కడ నట్టియౌషధ మేమియును లేదు.

పురు—ఎక్కడ నున్నది?

చికి—నీవు నాతోఁగూడ వచ్చినయెడల—

పురు—(అర్ధోక్తియందే) బాధచే నొక్కయడుగైనఁ గదపఁజాలకున్నాను—నీతో వచ్చుట యెట్లు?

చికి—ఒకబండి మాటాడి తీసికొని వచ్చెదను.

పురు—నేను బండిమీఁద నెక్కి రాను—

చికి—అది యేమి?

పురు—ఒకరివెంట వచ్చుట నాకిష్టము లేదు.

చికి—పోనిమ్ము! తెల్లవారినవెనుక మీవారి నెవరినైన వెంటఁ బెట్టుకొని రావచ్చును.

పురు—పట్టపగలు గుడ్లగూబయైనను ప్రజలకంటఁ బడును గాని ప్రమాదముచేనైన నేనట్లు చేయఁజాలను.

చికి—పోనిమ్మా ! ఇఁక నేఁ బోయెదను.

పురుషుఁ డానిపాదములం బట్టుకొని « పుణ్యాత్మా ! నన్ను నీవు బ్రతికించితివి ! నేను నీబిడ్డను ! నన్నింతటి బాధలోఁ ద్రోసి వైచి విడనాడిపోవుట నీకు న్యాయము కాదు ! ' అనియెను.

చి—నాతో వచ్చినచో నీబాధఁ దీర్చెదను.

పురు—నీతో మాత్రము రాఁజాలను. కాని నీవు రమ్మన్న చోటికి వచ్చెదను.

చికి—ఎట్లు వచ్చెదవు ?

పురు—ఎట్లు వచ్చెదనో చెప్పుటవలన నేమియుపయోగ మున్నది ? ఎక్కడకు రావలయునో సెలవిండు.

చికి—గోదావరీతీరమునందలి గోపాదక్షేత్రమునకు నీవు రావలయును. అచ్చట నున్న వటవృక్షమునొద్ద నన్నునీవు కలిసికొనవచ్చును.

పురు—మహాత్మా ! నాపైఁ బరిపూర్ణానుగ్రహ ముంపవలయును. ఈబాధతీరువఱకు నీప్రాణములతో నాకేమియును సౌఖ్యము లేదు. నేను మీవెనుకనే వచ్చి మిమ్మచ్చటఁ దప్పక కలిసికొనియెదను. మీకుఁ బదివేల నమస్కారములు !

" శీఘ్రముగ నీకు మనశ్శాంతి యగుఁగాక ! " అని యాశీర్వదించి చికిత్సకుఁ డయ్యంధకారమున నంతర్హితుఁడై పోయెను.

పిమ్మట నాచెట్లచాటున నున్న యిరువురుపురుషులును వచ్చి పరమానందముతో నాతని గౌఁగిలించుకొనిరి. ఆపురుషుని మరణమును

గూర్చియు, పునర్జీవనముంగూర్చియు మహాత్ముఁ డగునాచికిత్సకుని మహామహిమంగూర్చియు ననేకవిధములఁ గొంతసేపటివఱకు వారు మువ్వురును బ్రశంసించుకొనిరి.

ఆఱవ ప్రకరణము.

"చెలువల రెండవ పెండ్లికి
బలవంతము సేయుదురఁటె ? వలదనుచుండఁగ
గులజాలు; మా రాలోచన
వ టే—"

కపోతము— హారావళి.

విజయవాడకుత్తరమువైపున రాజమార్గమున కించుకదూరముగ నొక పెద్దప్రహరియును దానినడుమ రెండంతస్థులచిన్నమేడయు నుండెను. ప్రహరిద్వారమునుండి సౌధద్వారమువఱకును గలమార్గమున కిరువంకల నొత్తుగఁ బోఁకచెట్లు పెఱిగియుండెను. సౌధద్వారముకడ ద్వారపాలకులవలె రెండుకొబ్బరిచెట్లుండెను. ఆసౌధమును బరివేష్టించియున్న ప్రహరిమధ్య ప్రదేశమునందంతటను నానావిధఫలవృక్షములును బుష్పలతలును గన్నులపండువుగా నుండెను. ఆమందిరము విశాలోద్యానవనమధ్యమం దుండుటచేతను, బట్టణమునకుఁ గొనయందుండుటచేతను, రాజమార్గమునకించుక తొలఁగియుండుటవలనను, నగరసమ్మర్దమునకు సహింపక నెమ్మదిగ నుండఁగోరువారికతి నివాసయోగ్యమై యుండెను.

ఒకనాఁటిప్రాతఃకాలమున నేనిమిదిగంటలవేళ నాసౌధమునకు మొదటియంతస్తునందలి దక్షిణపువైపుగదిలో నొక పురుషుఁడు మంచముపైఁ బరుండియుండెను. విభూతిరుద్రాక్షమాలికాలంకృతుఁడును, గాషాయవసనావృతవిగ్రహుఁడును, దివ్యతేజోవిరాజమానుండును నగు నొక యోగిపుంగవుం డాతనిసమీపము నందొక పీఠముపైఁ గూర్చుండియుండెను.

శయ్యాగతుండగుపురుషుఁడప్పుడు యోగికి నమస్కరించుచు "మహాత్మా! మీయనుగ్రహముచే నేను జీవింపఁగలిగితిని. మీ మహిమవలన నాశరీరాయాసము చేతితోఁ దీసివేసిన ట్లుపశమించినది. దుర్మార్గులచేతులలోఁ బడిపోకుండఁ బ్రాణదానముం గావించితిరి" అనియెను.

యోగి—ఏమైన నేమి! ఇంకొకయడుగు ముందుగ వచ్చినచో నాదొంగలచేతులలోఁ బడకుండ నీభార్య నీకు దక్కియుండును.

పురు—స్వామీ! ఆమె నాభార్యకాదు!

యోగి—మఱి యెవ్వరు?

పురు—అది యొకవారకన్య—

యోగి—నీయింట నెందు కున్నది?

పురు—నేను పెండ్లియాడవలయునను నుద్దేశముతోఁ దీసికొని వచ్చితిని.

యోగి—ఎంతకాలమైనది?

పురు—ఆఱుమాసము లైనది.

యోగి—ఇంతవఱకు నేల పెండ్లి చేసికొనలేదు?

పురు—వేశ్యావివాహముకంటె విధవావివాహము చేసికొనుటయే యెక్కువలోకోపకారముగ నుండునని యెంచి నేను నామొదటియుద్దేశమును మార్చుకొంటిని.

యోగి చిఱునవ్వుతో " నీవు తీసికొనివచ్చిన వ రకన్య నిన్నుఁ బెండ్లియాడుట కంగీకరించినదా ? " అనియెను.

పురు—అంగీకరించినది—కాని యామెబంధువులుమాత్ర మంగీకరింపలేదు. అందువలననే యింతపని జరిగినది. నాపెదతండ్రి కుమారుఁ డొకఁడున్నాఁడు. వాఁడు త్రాగుబోతు. వేశ్యాలోలుఁడు— రాత్రిజరిగిన యీఘోరకృత్య మాంపరమదుర్మార్గునిమూలముననే జరగినది.

యోగి—పాపము వారామెను జంపివేయరుగద ?

పురు—చంపరు— ఎట్లో మనసు త్రిప్పి దానియింటికే తీసికొని పోవుదురు.

యోగి—ఒకవేళ నీవావారకన్యనిదినటికే పెండ్లియాడి యున్నయెడల నప్పుడు విధవావివాహముకొఱ కామెను నీవు వదలివేయుదువా ?

పురు—అంతకు ముందుగనే నాయుద్దేశము మార్చుకొనుటచే నేనామెను బెండ్లియాడుట మాన్పివైచితిని.

యోగి—తీసికొనివచ్చినదాని నేమిచేయఁ దలఁచుకొంటివి ?

పురు—నావంటిసంస్కారప్రియు లెవ్వరైన నున్నచోఁ బెండ్లిచేయవలయు నని నిశ్చయించుకొంటిని.

యోగి—ఇప్పుడు నీవు వింతతూద్వాహము చేసికొనుటకు నిశ్చయించుకొంటివా ?

పురు—ఔను.

యో—సంబంధము స్థిరపడినదా ?

పురు—స్థిరపడినట్లే—

యో—అదియేమి ?

పురు—అనివార్య మగుపూర్వాచారమునకు భయపడి యీ వధు వింకను నంగీకరించుట లేదు.

యోగి—వధు వంగీకరింపనప్పుడు పెండ్లి యెట్లు?

పురు—అక్కఱలేదు— దురాచారసంస్కరణప్రియుఁ డగు నా మెసోదరుఁ డీవిషయమున మిక్కిలి పట్టుదల కలిగి యున్నాఁడు.

యోగి—ఆ చిరంజీవి యెవ్వరు ?

పురు—అతఁడు నాప్రియమిత్రుఁడు— చెన్నపట్టణమునఁ బట్టపరీక్షకుఁ జదువుచున్నాఁడు— ఆతని పేరు భారతరావు.

యోగి యించుకసే పాలోచించి „ నీవు విద్యార్థికుసివలెనే యగపడుచున్నావు— కాని నీమాటలనుబట్టి నీహృదయ మస్థిర మైనట్లు తోఁచుచున్నది. సంస్కారశూరుఁడవై యుండియు నీవు నిన్నుఁ బ్రేమించిన వారకన్యను బెండ్లియాడుట మానుకొంటివి. నిన్నుఁ బ్రేమించుట కంగీకరింపని వితంతువధువును బలవంతముగఁ బెండ్లిచేసికొనుటకై ప్రయత్నించుచున్నావు. ఇదియా సంస్కారప్రియత్వము ! ఇదియా దేశోద్ధరణధురంధరత్వము ! ఇదియా విద్యార్థికధర్మము ! ఆర్యధర్మనిరతులును, భారతవర్ష మహావైభవ పునరుజ్జీవన కారణజన్ములు నగు రామమోహనుఁడు— ఈశ్వరచంద్రవిద్యాసాగరుఁడు— కేశవచంద్రసేనుఁడు మొదలగు మహామహుల పవిత్రోపదేశముల నీవిధముగనా నీవు గ్రహించినది ? మానవస్వభావమునకు వ్యతిరేకమగు సంస్కారమా ? మనుష్యత్వమునకు విరుద్ధమగు ప్రవర్తనమా ? అనియెను.

పురుషుఁడు విరక్తిభావముతో „ స్వామీ ! మీరు నాయుద్దేశమును బాగుగ గ్రహించినట్లగపడదు. ” అనియెను.

యోగి—ఇందు నీయుద్దేశ మేమి ?

పురు—నాప్రాణమిత్రునియభీష్టమును ఫలింపఁజేయుటకును, ఒకయనాథబాలిక నుద్ధరించుటకును నామొదటియుద్దేశము మార్చుకొనవలసివచ్చినది.

యోగి తీవ్రస్వరముతో 'నీయుద్దేశమే పరమధర్మ మనుకొంటివా? ప్రాణమిత్రునియభీష్టసిద్ధికొఱకుఁ బ్రాణములనైన విడువవచ్చునుగాని భార్యాభర్తృధర్మమును బరిత్యజింపఁదలఁపవచ్చునా?' అనియెను.

పురు— ఆమె నాకు భార్య కాదే!

యోగి—ఆలాగా? —నీవామెను ప్రేమించితివి—నిన్నామె ప్రేమించినది—ఇరువురును పెండ్లియాడుటకు నిశ్చయించుకొంటిరి. ఇఁక నామె నీకేమగును? హృదయ మస్థిర మైనంతమాత్రమున ధర్మ మస్థిరమైపోవునా? కల్యాణమునకుఁ గార్వాససూత్రమే ప్రధానమనుకొంటివా? ప్రేమసూత్రముక్కఱలేదా? ధర్మసూత్ర మక్కఱలేదా?

పురుషుడు వేదన నభినయించుచు మఱిమాటాడ లేదు. మాటలాడుట కాతని కేమియును దోఁచనులేదు. యోగి మాధ్యాహ్నిక కృత్యములం దీర్చుకొనుటకై నదీతీరమునకుఁ బోయెను.

ఏడవప్రకరణము.

ఁజగ మంధకారమయమై
జగవు సముద్రమయి బ్రిదుకు భారంబై తోఁ
చఁగ నగని గోలుపోయిన
వగఁగూలినవనిన్నుఁ జూచి వగపయ్యెడినే !

కపోతము — హారావళి.

సరస్వతియును సత్యవతియును జిన్నతనమునుండియుఁ జెలిమికత్తెలై యుండిరి. ఇరువురు నిరుగుపొరుగువారై యుండుటవలన వారికి నిరంతరసమావేశమున కభ్యంతరమేమియును లేకయుండెను. ఆ కారణముచే వారి స్నేహానుబంధము దినదినాభివృద్ధి నందుచుండెను. ఇరువురును సరళహృదయలు. సర్వసంపన్నంబు లగు సజాతీయ కుటుంబములం జన్మించినవారు; సమానప్రకృతులు ; సమవయస్కలు. శ్రావణతరంగిణులంబోలి వారిరువురును సంపూర్ణయౌవనవతులై యుండిరి. కాని యౌతారుణ్యామృతరసప్రవాహము శరద్వేణికవలె నిర్మలమైనది. ఆయిరువురకును గౌరీపతిశాస్త్రియే చదువు చెప్పెను. అన్నపూర్ణాగౌరీపతులు సత్యవతినిగూడఁ దమ కన్నబిడ్డయగుసరస్వతివలెనే చూచుకొనుచుండిరి.

సత్యవతికిఁ జిన్నతనమునందే పెండ్లి యయ్యెను. ఆమెతండ్రి తనతల్లిమరణించినసంవత్సరములోపలనే సత్యవతికి వివాహముఁ గావించెను. పెండ్లి యగునప్పటికి సత్యవతికి మూడవయేఁడు. ఆమె భర్త యగునారాయణునకుఁ బండ్రెండవసంవత్సరము. నారాయణుఁడు చెన్నపట్టణములోఁ బట్టపరీక్షయందుత్తీర్ణుఁ డైనతరువాత

వచ్చుటఁ దనకు స్నేహితుఁడైన యొక జమీందారునిధనసాహాయ్యముచే నింగ్లాండు దేశమునకుఁ జదువుకొనఁబోయెను. ఆతఁడు విదేశమునకుఁ బోయినకొలఁదికాలముననే దైవదుర్విపాకముచే నాతఁడచ్చట మరణించినట్లు జాబువచ్చెను. పాపము సత్యవతి తనపండ్రెండవయేఁటనే విధంతువయ్యెను.

సత్యవతి యన్నయగు భారతరావు చెన్నపురియందలి క్రైస్తవకళాశాలలో బి. యే. పరీక్షకుఁ జదువుకొనుచుండెను. అతఁడు కరుణామయస్వభావుఁడు. కుశాగ్రబుద్ధి. సత్యవతిం దలంచికొనిన నాతని హృదయము నీరైపోవుచుండును. ఆతఁడు సత్యవతియానందముకొఱకు సత్యవతిసుఖముకొఱకు నిరంతరము నాలోచించుచుండును. తఱచుగ నాతఁడు సత్యవతికిఁ బ్రేమరసము ముట్టిపడునట్టిపలుకులతో జాబులు వ్రాయుచుండును. ఒక్కొక్కప్పుడు తల్లిదండ్రులహృదయములు కరఁగి నీరైపోవునట్లు--ఆకస్మికముగ నాసమయమున దుఃదన హృదయభావము వారికి లీలామాత్రముగ స్ఫురియించునట్లు మనవులను దెలుపుచుండును. ఆయుత్తరములం గాంచి తల్లిదండ్రులు నిరంతరము నెడతెగకుండ దహించుకొనిపోవుచున్న హృదయములతో దీర్ఘశ్వాసముల నువిడుచుచు దమ నుస్సహాజీవితమున నేకష్టముతోఁ గడపుచుండుటయే గాని చిరకాలానుబంధముచే జరపరిచితమై యున్న తమయాచారసూత్రము నుల్లంఘించుటకు సాహసింపఁజాలక చింతించుచుండిరి.

నేఁటిదినమున సరస్వతియింటికిఁ బోవఁదలఁచుచున్న సమయమున భారతరావునొద్దనుండి సత్యవతికి జాబు వచ్చెను. అన్నగారియుత్తరమనిన సత్యవతికి బ్రహ్మానందము. సత్యవతి తనయన్నగారిని దల్లిదండ్రులకంటెను విశేషముగఁ బ్రేమించుచుండెను. భారతరావు తాను వేసవికాలపుసెలవులలో వచ్చెదనని తండ్రిగారికిఁ గూడ నొకలేఖ వ్రాసి పంపెను.

సత్యవతి యొంటిగఁ గూరుచుండి తనప్రియసోదరుఁడు వ్రాసినయుత్తరమును జదువుకొనుచుండెను. అప్పుడామెహృదయకమలము క్షణక్షణవికసిత మగుచుండెను. ప్రేమరసార్ద్రములగుచూపులు ప్రేమభరాలసములగుటచే నక్షరపథమున మందమందముగఁ బ్రచారము సేయుచుండెను. నిర్మలప్రేమైకనిధానంబు లగునందలి మృదులపదంబులు మధురధ్వనితములై మధురభావానుభవంబున కనుబోధము లగుచుండెను. సత్యవతి తదేకదృష్టితో నాయుత్తరమును దిలకించుచుండెను.

"ప్రియసహోదరీ !

నేనిచ్చట సంతోషముతోఁ జదువుకొనుచుంటి నని వ్రాయఁ గలుగుట ప్రేమాంకురవిలసితంబు లగునీజాబులను దలఁచుకఁ జూడఁ గలుగుచుండుటవలననే—పరీక్షలతొందరలో నుండుటచే నీకు వారము దినములనుండి యుత్తరము వ్రాయఁజాలకపోయితిని. నాయాలస్యము నీకించుక మనఃక్లేశమునకుఁ గారణ మగునేమో యని నాహృదయము చలించిపోవుచున్నది. సోదరీ ! సుఖదుఃఖములకు మన మిరువురమును సమభాగులము. ప్రేమవల్లికాపల్లవాంతరాళము నందలికోమలప్రేమైకకోరకములము. నీసుఖమే నాసుఖము. నీయానందమే నాయానందము. నీకించుకమనస్తాపమైనను నేను సహింపఁజాలను. వెన్నెలవెలుఁగని చిమ్మచీకటిలోఁ గన్నులు తెఱవనికాలమునందే ప్రతికూలపవనసూత్కృతరంగము నిన్నుఁ జిక్కించుకొని పోయినది. అది యజ్ఞాత మైనది— అపునరావృత్తమైనది— అది యప్పుడే మహావాయునను దమున విలీన మైపోయినది. లీలామాత్రం బగు నాయనుభవమును భావాంతరమున విలీనముచేసి జీవనప్రపంచమునఁ బురోభిగమనము గావించుటయే మనకర్తవ్యము. సుఖమయప్రప

చమును గన్నెత్తిచూచుటకుఁ బరమేశ్వరునికిఁ బ్రీడాసాలభంజిక లగు జీవులకందఱకును సమానాధికార మున్నది. పరమేశ్వరుఁడు నిన్ను నిరంతరదుఃఖానుభవంబునకే సృష్టించియుండె నని వ్రాసితివి. తల్లీ! ప్రేమైకస్వరూపుఁ డగుజగదీశ్వరుఁ డంతటిదయావిహీనుఁడు కాఁడు. కేవలసుఖమయప్రపంచమున మానసికదౌర్బల్యముచే స్వయముగ మనమే దుఃఖబిభీషికలం గల్పించుకొని నైరాశ్యమును దెచ్చిపెట్టుకొనుచున్నారము. సోదరీ ! నీవు కలఁతనిద్దురలో దుఃఖస్వప్నములం గాంచుచున్నావు. అవి కేవలము భ్రాంతిమూలకము లైనవి. జాగరితవై యించుక యాలోచించి చూడుము! పరిమళకుసుమమును బాదములతో నలపివేయువలయునని యెవ్వరు తలంతురు? నీయుత్తరమును జూచినప్పుడు చిన్నవోయియున్ననీవదనము నాకన్నులఁ గట్టినట్లయినది. నీవేఁడికన్నీటిం దలంచుకొని నారక్తనాళములు శోషించి పోయినవి. చలించిపోవుచున్న నీహృదయకమలమును భావించుకొని నాహృదయసంచాలన మాఁగిపోయినది. తల్లీ! ఇఁక నేనెట్లు సహింపఁగలుగుదును? దూరదేశమందున్ననాహృదయమును విదారణముం గావించునంతటిసునిశితంబు లగుతీవ్రాక్షరముల నీకోమలకరపల్లవమునుండి యెట్లువెలువరించితివి? కుసుమసుకుమార మగునీహృదయమున కంతటికాఠిన్య మెట్లు కలిగినది? సోదరీ! ప్రేమైకమూర్తి వగునీకు నీప్రియసోదరునిపై జాలి లేకపోయినదా? ,, నాకీలోకమునం దిఁక నేమి యున్నది? ’’ అనివ్రాసితివి. ఎంతటినిర్దయురాలవు! త్వదేకప్రాణిమైయున్న నీ యాత్మసోదరుని మఱచిపోయితివా? నీవేఁడి నిట్టూర్పుల నాహృదయకమలమునుండి వెలువరించుచున్నప్పుడు నావేఁడికన్నీటికి నీనయనకమలాంతరమునఁ జోటు లేకుండఁజేయుదువా? అట్లు చేయఁజాలవు. నీకరుణార్ద్రహృదయమును నే నెఱుంగుదును. ప్రియసహోదరీ!

హృదయపూర్వకముగ నొక్కమాట చెప్పుచున్నాను. ఇదియే యుపలాలనము— ఇదియే ప్రార్థనము— ఇదియే ప్రబోధము— ఇదియే యాజ్ఞ — ఇదియే శపథము— ప్రేమైకజ్యోతిస్మూర్తుల మగుమనమిరువురమును నీలాకాశపథంబున నిష్కలంకముగఁ బ్రకాశింపఁగలిగినను, నిబిడజ్యోత్స్నాపటలంబున విలీనమైపోవఁగలిగినను పరమానందమే — నీతోఁబుట్టువు నగు నన్ను నీకష్టసుఖములకు సమభాగార్హునిగాఁ జేయుము! సోదరీ! నీవు సత్యవతివి— ఈమాటమఱవకుము! నేను సెలవులో నంగనతోడనే వచ్చెదను. చి॥ సౌ॥ సరస్వతి నడిగితి నని చెప్పుము!

నీప్రియసోదరుఁడు
భారతరావు'.

సత్యవతిహృదయసరోవర మననుభూతపూర్వంబు లగుభావతరంగములచే సంక్షుభితమైపోవుచుండెను. ఆదుస్తరతరంగమధ్యమున భయధైర్యములకుఁ బరస్పరప్రబలసంఘర్షణ మగుచుండెను. దుఃఖానందముల కన్యోన్యదుర్భరసంఘట్టన మగుచుండెను. తెలియఁబడకుండఁగనే యామెకనుదమ్ములనుండి ముక్తాఫలంబులవలె నశ్రుబిందువులు జాలువారుచుండెను. శీతలప్రేమరసచిహ్నితం బగు నాలేఖ యుష్ణాశ్రుబిందుసంసిక్తమైపోయెను. సత్యవతి కాసంగతి తెలియనే లేదు. దీర్ఘశ్వాససంచలితం బగువక్షోవసనమార్ద్రీభూతమై వక్షోభాగమునొత్తుకొని పోవుటకూడ నామె యెఱుఁగదు.

ఎనిమిదవప్రకరణము.

అరయఁగ నీజీవితము ను
మఱి నాజీవితము నొక్కటె ♦ నాదిరిగా నే
పరుగిడుచు న్నన్నుఁ జూచి
త్వరపడఁగ దమ యాంత్యదశలఁ ♦ బడియుండుఁగో యనేన్.

మక్షికము — హారావళి.

"ఏమే సత్యవతీ! వచ్చెద నని చెప్పి యాలస్యము చేసితివి ?" అని సరస్వతి వచ్చి సత్యవతిని బలుకరించెను.

సరస్వతియమృతస్వరము సత్యవతిహృదయప్రవాహమును భావాంతరమునకు మరలించినది. అప్పుడు సత్యవతి ప్రకృతిస్థయై ప్రేమవికసితనయనములతో సరస్వతిం దిలకించెను. సరస్వతి చమత్కృతయై మృదులస్వరముతో "అదియేమే! అట్లున్నావు ?" అనియెను.

సత్యవతి గద్గదస్వరముతో "ఎట్లున్నాను ?" అనియెను.

సర — సుఖనిద్రలో దుఃఖస్వప్నము గాంచినట్లున్నావు.

సత్య — సఖి ! ఈయిహజీవితమునం దంతకంటె నింక నే మున్నది ?

సర — అది కేవల మజ్ఞానము — దుఃఖనిద్రలో సుఖస్వప్నములను గనవలయును.

సత్య — చెలీ ! నాకంతటియదృష్ట మెక్కడ నున్నది ?

సర — నీకా వెఱ్ఱి వదలుట లేదు. అదృష్టమునకై కన్నులఁ దెఱచి చూచుచుండుటవలన నేమిలాభమున్నది ?

సత్య—ఔను నామాట నిజమే.

సర—ఐనచో నీకవిచార మెందుకు ?

సత్య—అన్నకొఱకు— ఆతనిసుఖముకొఱకు--ఆతనిసంతోషముకొఱకు—

సర—అన్నయొద్దనుండి మరల జాబు వచ్చినదా యేమి ?

"ఔను" అని చెప్పుచు సత్యవతి యాయుత్తరమును సరస్వతిచేతి కిచ్చెను. సరస్వతి యాజాబును సవిమర్శముగఁ దిలకించుచుండెను. సరస్వతికన్నులుకూడఁ గ్రమముగ నశ్రువులతో నిండిపోయెను. ఆమె కొంతసేపటివఱకును మాటాడఁజాలక యొక్కనిట్టూర్పు విడిచి "సోదరీ ! ప్రియసోదరుని నిష్కల్మషప్రేమస్వరూప మీయుత్తరమునందలిప్రత్యక్షరమునందును బ్రతిబింబించుచున్నదిసుమా ! " అనియెను.

సత్యవతివిషాదస్వరముతోఁ "అక్కా ! ఈశూన్యగేహమునకై యాదివ్యజ్యోతి నిరర్థకతేజోవిశిష్టమైపోవలసినదేనా'—ఫలపుష్పవిహీనం బగునీపల్లవలతికకై యాయమృతరసకలశ మంతస్సారశూన్యమైపోవలసినదేనా ? " అని కన్నుల నీరుపెట్టుకొనియెను.

సరస్వతి సాంత్వనస్వరముతో "చెల్లెలా ! ఏల విచారించెదవు ? బహుజన్మసుకృతపరిపాకముచే స్వర్గసుఖస్వరూపుఁడగు ట్టిసోదరునిం బడయుభాగ్యము నీకు లభియించినది. పసిఁడితామరకుఁ బన్నీటికొలనులభియించుట పరమసుఖముకాదా ? " అనియెను.

సత్య—నిరాశాంధకారనిమగ్ననైయున్న నేను సుఖపడుటయెట్లు ?

సర—నిరాశ యనునది కేవలము వట్టి భ్రాంతికల్పితమైన దుఃఖబిభీషికయే కాని వేఱుకాదు—సంతుష్టి యొకటిమాత్రమే సత్యస్వరూపమైనది—సుఖమయమైనది.

ఇట్లు చెప్పునప్పుడు సరస్వతికంఠస్వర మించుకగాద్గద్యమును వహియించెను.

సత్య—అక్కా! నీమాట సత్యమే కావచ్చును. కాని—అనుభవాతీతముగా నున్నది—ఆకాశమునఁ జిత్రలేఖనమా?—అంధకారమునం దద్దముచూచుకొనుటయెట్లు?

సర—వెఱ్ఱిదానా! అంధకారము నీబాహ్యనయనములకే గాని యాభ్యంతరికనయనములకది యెంతమాత్రమును లేదు కాదా?

సత్య—భిన్నప్రకృతులును బేధమరసోత్థితంబులు నగు రెండు తరంగములనడుమ నాశూన్యజీవితనౌక సంచలించిపోవుచున్నది. అందొకటినన్నాయనంత ప్రేమసాగరమున కాకర్షించుచున్నది. వేఱొకటి యగాధప్రేమప్రవాహమున కాభిముఖ్యముం గల్పించుచున్నది—నేనీసంఘర్షణమునఁ గొట్టుకొనిపోవుచున్నాను. నాకిరువంకలను ప్రేమానందజ్యోతులు ప్రకాశించుచున్నవి—కాని నేను మాత్రము దుఃఖాంధకారమూర్తినై యల్లాడుచుంటిని. సోదరీ! ఈ శుష్కవల్లరి కింక వసంతము లేదు—ఈదుఃఖయామినికింకఁ జంద్రసందర్శనము లేదు—ఈవృంతచ్యుతకుసుమమున కింక నీశ్వరపాదసంస్పర్శనసౌభాగ్యము లేదు—సరస్వతీ! ఎందుకీయాశ?

సర—నిరాశపడిమాత్ర మేమిచేయుదువు?

సత్య—సుఖమరణమున కెదురుచూచుచుండుటకంటె నింక నుపాయ మేమున్నది?

సర—అట్లయినచో సామాన్యప్రకృతికిఁ నీకును భేద మేమున్నది? స్వధర్మము నిర్వహింపవలదా?

సత్య—నిజముగా నాకుఁ గర్తవ్య మేమున్నది? ఉన్నను—నితాంతచింతావైకల్యముచే విశ్రాంతివిరహితహృదయ నగు నేనేమి చేయఁగలను?

నర—సోదరీ ! ఆవిషయమున నేనును నీవంటిదాననే కాదా?

సత్య—అది యెట్లు ?— అనుభవము లేకపోయినను నీకాశ యున్నది.

నర—నాకున్నయాశ నీ కేల లేకపోవలయును ?

సత్య—నీకన్నులవెలుఁగు నీసమక్షమున లేకపోయినను నీ యంతరంగమునఁ బ్రకాశించుచునేయున్నది— అందుచేతనే నీ కుత్సాహశక్తియున్నది— స్వధర్మనిర్వహణసామర్థ్యమున్నది —

నర — నీవు మాత్రమట్లేల భావించుకొనఁగూడదు ? నీయంతరంగప్రకాశమును నీవేల సందర్శింపఁగూడదు ? అన్యాయముగ భౌతికప్రపంచమునుబట్టి యనుభవమునకు భిన్నత్వము నాపాదించుకొనుచున్నావు— ఆశానిరాశలను గల్పించుకొనుచున్నావు— సుఖదుఃఖములఁ బరామర్శించుకొనుచున్నావు — కాని భావప్రపంచమున మనయిరువురి యనుభవము నొక్కటియే కాదా ?

సత్యవతి మఱి మాటాడలేదు; మౌనముతోఁ దలవంచుకొని యన్నగారియుత్తరమును నిరుద్దేశముగ నటునిటుఁద్రిప్పుచుండెను.

నర —సత్యవతీ ! ఏమి యాలోచించుచున్నావు ?

సత్యవతి నిట్టూర్పువిడిచి "అన్న వేసవిసెలవులలో వచ్చును" అనియెను.

నర — ఔను— అది మనకు సంతోషసమయము ! కాని— నేనంతవఱకు —

సత్యవతి యులికిపడి "అదియేమే సరస్వతీ యట్లనుచున్నావు?" అనియెను.

నర —అనుట కేమున్నది ? —రేపటిసంగతి యెట్లుండునో యెవ్వరు చెప్పఁగలరు ?

సరస్వతి నిగూఢహృదయమునం దేమున్నదియో గ్రహింపఁ జాలక సత్యవతి "అక్కా! నీమాటలయర్థ మేమియో నాకు బోధపడుట లేదు. విస్పష్టముగఁ దెలుపఁగూడదా? నీప్రాణము నొద్దఁగూడ నీకీసంశయ మెందుకు?" అనియెను.

సర — నాప్రాణమునకుఁ గష్టముంగల్పించుట నాకిష్టములేదు.

సత్య — అట్లనియెదవేమి? నీకష్టము నాకష్టము కాదా? నీసుఖము నాసుఖము కాదా?

సర — ఔను. మనజీవనప్రవాహము లనంతసాగరమునం జేరువఱకు నిర్లేపప్రవహించుటకుఁ బరమేశ్వరుఁ డనుగ్రహించుఁగాక!

సత్య — నామనోరథముకూడ నదియే.

సర — ఎప్పటికిని నీసుఖముకొఱకే నాజీవితమువినియోగపడ వలయు నని నాకోరిక —

సత్య — అక్కా! నీనిత్యసందర్శనమే నాయానందము — నీసుఖమును జూచుచుండుటయే నాకుసుఖము.

అప్పుడు సరస్వతి ప్రేమవికసితహృదయముతో సత్యవతిం గౌఁగిలించుకొని "సోదరీ! మనజీవితమునం దీముహూర్తము చిరస్మరణీయ మైనది!" అనియెను.

సత్యవతి యులికిపడి "అక్కా! అశ్లీలముగవచియించితివి- మనకీజీవితమునం దిట్టిముహూర్తములు నిరంతరానుభవనీయములగుఁగాక!" అనియెను.

సరస్వతి యొక్కింతసేపాలోచించి యొక్కదీర్ఘశ్వాసమును విడిచెను.

సత్య — అక్కా! మరల బావసంగతి యేమైనఁ దెలిసినదా?

సర — నీవానాఁడు గోదావరీతీరమునం జూచి మాటలాడిన తరువాత మఱియెట్టిసమాచారమును దెలియలేదు.

సత్య— అక్క వచ్చినతరువాత మేమిరువురమును గలసి బావ యొచ్చటనున్న నచ్చటకుఁ బోయి పాదములఁ బట్టుకొని బ్రతిమాలి యింటికిఁ దీసికొని రావలయు నని తలంచుచున్నాను.

సర— తల్లీ! ఎంత వెఱ్ఱిదానవు!

సత్య— బావకు నాయం దెంతయో ప్రేమ యున్నది. నా మాటయం దెంతయో గౌరవ మున్నది— ప్రాణాచారము పడి ప్రార్థించి చూచెదను.

సర— ఏమని ప్రార్థించెదవు?

సత్య— నీయర్ధాంగి యగుమాయక్కను నీప్రాణమువలెఁ బ్రేమింపు మని—

సర— సోదరీ! ప్రేమస్వరూపునకుఁ బ్రియవాక్యప్రబోధ మెందుకు? దినకరప్రచారమునకు దీపముం జూపుట యెందుకు?

సత్య— ప్రార్థింపకుండఁ బరమేశ్వరుఁడు సాక్షాత్కరించునా?

సర— అట్లే యైనచో— ఏకాంతభక్తిసాధ్యంబగు నీశ్వర సాక్షాత్కార మితరమూలకముగ నెట్లు లభియించును?

సత్య— (దీనస్వరముతో) ఏవిధముచే నైనను నాదుఃఖజీవనము నీసుఖజీవనమున కెంతమాత్రము నుపయోగపడఁజాలదా?

సర— సోదరీ! నీవట్లెన్నఁడును దలంపవలదు.

అని సత్యవతిం గౌఁగిలించుకొనియెను. సత్యవతి సరస్వతి కంఠముం గౌఁగిలించుకొని కన్నీటితో నామెవక్షోవసనమును దడిపి వైచెను. సరస్వతికనుదమ్ములుకూడ నశ్రుపూరితము లయ్యెను. అప్పు డామధురమూర్తుల మధురహృదయము లనంతప్రేమలీనము లైపోయెను.

ఓరమణీమణులారా! మీజీవనములు ధన్యములు! మీ మైత్రి ధన్యమైనది. మీప్రేమార్ద్రహృదయములు ధన్యతమము

లైనవి ! దుర్భరంబగునీదుఃఖజీవనవనంబున నమృతఫలంబులు మీ చేతులకే లభియింపఁగలవు ! దుస్తరంబగు నీదుఃఖసంసారసముద్రమున నానందతరంగములు మీకన్నులకే యగపడఁగలవు ? మీవంటికుమారీమణులం గాంచుటచేతనే భారతమాత రత్నగర్భ యని పేరుమోయుచున్నది ! పుణ్యమూర్తులగు మిమ్ముఁబోలినసతీమణులింకను నవతరించి ప్రాతస్మరణీయంబులగు భారతవర్షరమణీమణుల చరిత్రములను బెంపొందించెదరుగాక !

తొమ్మిదవ ప్రకరణము.

"ఇది నీకుఁ దగినసదనము
కదలకు మిటనుండి; తుష్టిఁ ♦ గాంచుము; యిదిగా
దది, యదిగా విది యని నె
మ్మదిఁ దోఁచినరీతిఁ జనకు ♦ మా రాచిలుకా !

చిలుక — హారావళి.

కుమారనగరమున గృహమును జేరి యేటియొడ్డున వేంకటేశ్వరరావున కొకసుందరోద్యాన మున్నది. మధురఫలవృక్షములును మనోజ్ఞపుష్పలతానికుంజములును, చిత్రపత్రగుల్మకుండికలును, శీతలజలయంత్రములును గలిగి యాలోకరమణీయమై, యనవరతకలవిహంగసంగీతమధురంబై యున్న యాయుపవనము శృంగారసేవ్యుఁడగుమన్మథుని లీలాభవనముంబోలి విలసిల్లుచుండెను. పచ్చని పచ్చికపట్టునడుమ దిద్దితీర్చినట్లున్న బాటలకిరువంకలను బుష్పకుండికలు

లమర్పఁబడి యుండెను. సురభిళకుసుమనికుంజాంతరముల శృంగార లీలాసదనంబులగు చలువఱాతిన్నెలు కన్నులపండువుగా నుండెను. ఆయుద్యానమధ్యమున నీలశిలాసోపానసమంచిత మగుపుష్కరిణి యొండుగలదు. వికచకమలకైరవకుసుమశోభితమగునావిమలజల పుష్కరిణి నిరంతరమును వినీలనిర్మలాకాశమును గన్నులు విచ్చి చూచుచున్నట్లుండును. అది యాకసమువలెనే క్షణక్షణమునకు వింతమార్పుల నొందుచు నయనాభిరామంబై యుండును.

ఆపుష్కరిణి కుత్తరభాగమునఁ జిత్రశిల్పరచనావిలసితంబగు విహారభవనమున్నది. ఆభవనమునకు నలువంకలను ద్వారములును ద్వారసోపానముల కిరువంకలను బుష్పకుండికలును గూర్పఁబడి యుండెను. ఆమందిరముచుట్టును, ద్రాక్షా, మాధవీ, మల్లికాది లతామంటపములును, కదళీ, నారికేళ, సహకార, వకుళాశోక పున్నాగాదిఫలపుష్పతరుశ్రేణులును విరాజిల్లుచుండును. ఆభవన మంతయుఁ జిత్రపటములు, రత్నకంబళములు మొదలగు నమూల్య పరికరములతో నలంకరింపఁబడి యుండెను. వస్తుప్రదర్శనమునకై యింతవఱకుఁ జెప్పవలసివచ్చినది గాని యామూలముగా నుద్యానవనవర్ణనముం గావింపవలయునని మాతలంపుగాదు. మా నవలాపాఠకులకు సుందరోద్యానములును, పుష్కరిణులును, విహార భవనములును, గ్రొత్తలు కావు; కావునఁ దద్వర్ణనావిషయంబున విశేషపరిశ్రమం దీసికొని పాఠకులహృదయముల నడ్డగించుటకంటె నది సర్వసమృద్ధం బగుసుందరోద్యానమనిమాత్రము ప్రశంసించి యీప్రయత్నము నింతటితో విరమించుచున్నారము.

వేంకటేశ్వరరావు నాఁటిరాత్రి యనసూయ చూపినచిత్రపటమును జూచియుఁ జూడనట్లు చూచియున్నాఁడు. అప్పటికా

తనికన్నుల కాయనసూయ యొక్కతెమాత్రమే భూలోకరమణీమ ణులలో మనోమోహనమూర్తి యైయుండెను; ఆమె నిలిచెడిచో టు నిత్యకళ్యాణమును, దిరిగెడుచోటు దివ్యక్షేత్రము నైయుం డెను. ఆమెరూపమునందలిసారళ్యమును— ఆసారళ్యమునందలి తారళ్యమును— ఆతారళ్యమునందలిమాధుర్యమును, నాతఁ డీయి హాజీవనమునందు మఱి యెచ్చటను జూచియుండలేదు. ఆమెమధు రప్రియవచనములలో నాతఁడు మధురామృతమునాస్వాదించుచుం డెను; ఆమెప్రేమోపచారములలో నానందరాజ్యసుఖము ననుభ వించుచుండెను. ఆతనికిఁ దనప్రాణములకంటెను బ్రియమైనవస్తు వీలోకమునందేమున్నది ? ప్రాణాధికప్రియ యగునసూయ యొ క్కతె మాత్రమే —ఆతఁడు నిరంతరము ననసూయాప్రణయరస తరంగములలో నోలలాడుచుండెను.

నేఁటిసాయంకాలము నాలుగుగంటలు దాఁటినపిమ్మట వేంక టేశ్వరరావు తనసుందరోద్యానవనమందిరమునఁ గూర్చుండి యేది యో పుస్తకమును జదువుకొనుచుండెను. తెఱవఁబడియున్నగవాక్ష ద్వారములనుండి సురభిళవాతపోతము లామందిరమున విచ్చలవిడిగ రాకపోకలఁగావించుచుండెను. ఆకమ్మతెమ్మెరలతోఁగలసి యాతని పుస్తకమునందలిపత్రములుగూడ నెగసి గంతులు వైచుచు నస్పష్ట ముగ నేమేమియో మాటలాడుకొనుచుండెను. అప్పుడు వేంకటేశ్వర రావు చెదరిపోవుచున్నపత్రములను సరి చేసికొనుచు!—

"మనసుకుదురదేమో వేమారు
కోరి వేఁడిన నీ॥ మనసు—"

అని పాడుకొనుచుండెను భువనైకమోహిని యగుమోహిని మధురమోహన సంగీతమును బొంచుండి యాలకించుచు నించిం చుక ముందఱికి వచ్చుచున్నట్లున్నరుక్మాంగదుని చిత్రపట మాతని

కన్నులఁబడియెను. అప్పుడా మోహినికూడ "మనసుకుదుర దేమో" అని పాడుచున్నట్లే యాతఁడు భావించుకొనియెను. అంతలో నాకస్మికముగ నాతనిదృష్టి చెదరి తనప్రాణేశ్వరి యగుననసూయయును దాను నొక్కచోఁ గూర్చుండినట్లున్నచిత్రపటముపైఁ బ్రసరించెను. అప్పు డనసూయ తన్నుఁ జూచి కలకల నవ్వుచున్న ట్లాతని కగపడియెను. ఆతఁ డించుక చకితుఁడై తలవంచుకొని యంతలో మరలఁ గన్నెత్తిచూచెను. ఆమధురమందహాసవదనమునుండి యకృత్రిమప్రణయచంద్రిక లట్లే వెల్లివిరియుచుండెను. ఆసరళతరళకటాక్షావలోకనములు తనకట్లే కలువపూదండలను గల్పించుచుండెను. ఆమె ప్రేమానందమూర్తి— ఆనిష్కళంక ప్రణయమాధురీమూర్తియం దెట్టివిలక్షణచిహ్నమును లేదు. ఆపవిత్రదేవీమూర్తి నిరంతరసన్నిధానసౌభాగ్యముచేతనే వేంకటేశ్వరరావునకు భూలోకస్వర్గము కరతలామలకమై యుండెను. ఆతఁ డనన్యహృదయుఁడై తన ప్రాణేశ్వరివంకనే తదేకదృష్టితోఁ జూచుచుండెను. ఆతని కదియే పరమానందము—ఆతఁడు సుఖోన్నతనిర్మలాకాశమున శుక్రతారయై ప్రకాశింపఁగలుగుట యాప్రణయానందముచేతనే—సంసారస్వర్గసింహాసనమున దేవతాసార్వభౌముఁడై కొలువు సేయఁగలుగుట యాదివ్యప్రణయానందముచేతనే—ఆహా! ప్రణయినీప్రణయహృదయసమ్మేళన మెంతటిమాధురీమయమైనది! ఎంతటిసుఖమయ మైనది!! ఎంతటి యానందమయ మైనది!!!

అప్పుడు వేంకటేశ్వరుని చేతియం దున్నపుస్తకమునందలి పత్రములు విశృంఖలములై గాలికిఁ జెదరి తటతటఁగొట్టుకొనఁ జొచ్చెను. ఆచప్పుడుచే నాతనిదృష్టి చెదరి పుస్తకముపైఁబడియెను. ఆకస్మికముగ నాపత్రాంతరాళమునందున్న ప్రతిబింబపట మాతని కన్నులఁ బడియెను. అప్పు డాతనిదృక్కిరణజాలమార్గము ననుస

రించి యొకవిద్యుత్కిరణము తళుక్కున నయనాంతరాళమునఁ బ్రస
రించిన ట్లయ్యెను. చెదరిపోవుచున్న దృష్టులను సమీకరించుకొని
యాతఁడు మరల నొకసారి యాచిత్తరువుం జూచెను. సమసంచలనం
బగునాతని శ్వాసగమనమున కిప్పు డించుక వైలక్షణ్యము కలి
గెను. ఆతఁడు కంపితకరములతోఁ దనచెంతనున్న బల్లపై నాపుస్త
కము నట్లెయుంచి ప్రాణేశ్వరి యగు ననసూయప్రతిబింబమువైపు
నకు మరలఁ దనదృష్టులను బ్రసరింపఁజేసెను. అనసూయ సుందర
వదనమండలమున నకృత్రిమప్రణయహాస మట్లే విరాజిల్లుచుండెను.

ఆతఁ డాసరళమనోహరమూర్తియందు మాత్రమే లోక
మోహనసౌందర్యమును గాంచుచుండెను. అట్టిసుందరీమణి
కూడ మెచ్చుకొనఁదగునంతటి రామణీయకమూర్తి యీభూలోక
మునం దుండు నని యాతఁ డెన్నఁడును భావించియైన నుండలేదు—
కాని—ప్రాణప్రియ యగు ననసూయయే యాతనిసుస్థిరభావమున
కించుక చాంచల్యమును గల్పించెను. అమాయకహృదయ యగు
ననసూయ కాసంగతి యించుకంతయును దెలియదు. ప్రణయముగ్ధుఁ
డగు వేంకటేశ్వరుఁడుగూడ నాయస్ఫుటపరిణామమును గ్రహించి
యుండ లేదు. దానిమూలముననే యాప్రతిబింబమును మఱియొక
సారి చూడవలయు నని యాతనికిఁ గుతూహలము కలిగినది !!
మరలఁ జూచుటయును గలిగినది—

కాని, వేంకటేశ్వరుఁ డనసూయాప్రాణప్రియుఁ డైనందుకుఁ
దగినపని చేయుచున్న ట్లగపడదు— ఏమనిన:— ఆతఁ డాచిత్ర
మును జూచియుఁ జూడఁజాలకుండెను. చూడకుండవలయునని యా
తని యుద్దేశము—అనసూయ చేతిలోనున్నప్పు డాచిత్రపటము
నాతఁ డేయుద్దేశముతోఁ జూడకుండ నుండెనో, యాయుద్దేశముతోనే

యున్న యెడల నిప్పు డాతఁ డాచిత్రమును నిస్సంశయముగఁ జూడఁ గలిగియే యుండును. ఆయుద్దేశమునందుఁ జూచుటకును జూడకుండుటకును భేదము లేదు. ఇప్పు డామధురామృతరసమునకు మధురసంస్పర్శన మైనదికాఁబోలును! పాప మది యాతని కంతవఱకుఁ దెలియదు. అందువలననే యాతని కాసందేహము!

వేంకటేశ్వరరావు తనప్రాణప్రియయగు ననసూయమాటలను శిరసావహించుచుండెడివాఁడు. ఆమె పరిహాసమునకైన నసత్యము చెప్పదని యాతని నమ్మకము. నాఁటిరాత్రి యామె యాచిత్తరువుం గూర్చి చెప్పినమాటమాత్ర మాతని కప్పు డసంభవముగా నగపడియెను. అనుభవమునుబట్టి యాతఁ డట్లూహించి యుండలేదు— విశ్వాసమునుబట్టి యట్లు నిశ్చయించుకొనియెను. అనుభవము లేని విశ్వాస మగుటచేతనే యనుమానమునకుఁ గారణమైనది.

సత్యమును గ్రహించుటకై యాతఁ డాచిత్తరువు ననసూయ చిత్రపటముతోఁ బోల్చి చూడఁదొడంగెను. తదేకదృష్టితో సవిమర్శముగఁ గొంతసేపు పరిశీలించి "అనసూయమాట కొంతవఱకు సమంజసముగనే యున్నది" అని యనుకొనియెను. ఆసమయమునకు సరిగ నింటిదూలముపై గూడుపెట్టుచున్న యొండుపిచ్చుక ముకుపుటమునుండి తృణలేశము జాఱిపడిపోయెను. అప్పు డది "చుచ్చుచుచ్చు" అనిధ్వని చేసెను. అప్పుడాధ్వని యించుక విషాదసూచకముగనే తోఁచినది. అదియు పక్షికిగ నగపడిన నగపడవచ్చును గాని వేంకటేశ్వరుని హృదయభావమును మనకంటె బాగుగ గ్రహించియే యాపిచ్చుక యట్లు పలికియుండు నని మాత్రము నిశ్చయించుట కవకాశము లేదు. అనసూయ నిష్కళంకహృదయముతో సత్యమునే చెప్పినది. వేంకటేశ్వరుఁడు సవిమర్శదృష్టితోఁ బరీ

క్షించి సత్యమునే గ్రహించెను. గుణమును గ్రహించుటలోఁ దప్పేమున్నది ?

ఆతఁ డంతటితోఁ దృప్తి వహించి యున్నట్లగపడదు—మరలమరలఁ జూచుచునే యుండెను. అనసూయరూపమునందు శాంతశృంగారకళలున్నవి. ఈనూత్నచిత్రరూపమునందుధీరశృంగారచ్ఛాయలున్నవి—ఆచూపులలోఁ దారళ్యము, ఈచూపులలోఁ జాపల్యము—ఆముఖమండలమున సౌమ్యభావము, ఈముఖమండలమున గంభీరభావము—ఆమందహాసమునఁ జంద్రికాకాంతి, ఈ మందహాసమునఁ జంచలాకాంతి—వేంకటేశ్వరుఁ డెన్నియోసారులు చూచి యీవిధముగ స్వరూపభేదమును గ్రహియింపఁగలిగెను. ఇఁకసౌందర్యతారతమ్యమును గ్రహించుట కాతఁ డంతగా శ్రమపడవలసినపని యేమున్నది? ఆమాట ప్రియంవదయగు ననసూయ చెప్పనే చెప్పినది—వేంకటేశ్వరుఁడుకూడ నట్లే నిశ్చయించుకొనియెను. "అప్పుడు నిశ్చయముగ నిదిసుందరీమణియే—ఇట్టిసుందరీశిరోమణిని నేఁ డివఱ కెప్పుడును జూచియుండలేదు." అనువాక్యములప్రయత్నముగ నపూర్వముగ నాతనివదనమునుండి వెలువడియెను. అప్పుడు సమీపవృక్షశాఖపైఁ గూర్చుండియున్న కాకము "కావు. కావు, కావు" మని యఱచెను.

ఆయజ్ఞానవిహంగము "నీప్రణయహృదయమును గావుము-నీపవిత్రశీలమును గావుము—నీప్రియప్రాణమును గావుము—"అని బోధించినదని యెవ్వరు చెప్పఁగలరు? వేంకటేశ్వరున కాశబ్దము వినఁబడినట్లు లేదు. కాని యాతఁడు తనమాటకుఁ దానే యప్రతిభుఁడైపోయెను. ఎట్లయెనుట లోకమోహనమూర్తి యగుప్రాణప్రియ తనపార్శ్వమునందే యుండెను!! అదియే కారణము!—ప్రియురాలివాక్యమును బ్రత్యక్షమునఁ గాంచఁగలిగినప్పుడాతఁ డప్రతిభుఁ

డేల కావలయును? ఎల్లప్పుడును బ్రియురాలివాక్యమునే సత్యమని విశ్వసించునాతఁ డిప్పు డేకాంతముగ నీపూర్వపక్షసిద్ధాంతములు చేసికొనుట యెందుకు? అనసూయ యెక్కడి తెమో సుందరీశిరోమణి యనుమాట యెక్కడకుఁ బోయినది? వీనికి సమాధానము చెప్పుట కాతనికి శక్తి లేదు. అజ్ఞాతముగ నాతనివినిర్మలహృదయాకాశమునం దేదియో యదృశ్యచ్ఛాయ యావరించుకొన్నది!

ఆతఁ డాపుస్తకమును మూసివైచి యటనుండి లేచి మందిరాంగణమునకుఁ బోయి యటునిటు ప్రచారము చేయుచుండెను. ఆతని హృదయాంతరాళమునం దెట్టిగాలి వీచి ఘర్మబిందువులఁ గల్పించుచున్నదో తెలియదుగాని పూలతోఁటనుండి చల్లనిగాలి మెల్లమెల్లగ వీతెంచి యాతనిమేనిపై నున్న యాఘర్మబిందువుల నపనయించుచుండెను. పశ్చిమాకాశతీరమునం దున్న యస్తంగతసూర్యునియరుణకిరణము లాతనిపైఁ బ్రసరించుచునే యుండెను గాని వాని నాతఁడు చూడలేదు. ఆకిరణములు క్రమక్రమముగ నాభానుమండలమునందే యైక్యమైపోవుచుండుటనుగూడ నాతఁడు తెలిసికొనలేదు. తుదకాకర్మసాక్షి కాలజలధాంతరమున మునిఁగిపోవుటయు నాతఁడు గ్రహింపలేదు.

పదియవ ప్రకరణము.

చందమామను గను చెంత ♦ సంరంభో
సలిలకలశంబు చెప్పఁగాఁ ♦ జాలకున్నఁ
బోడఁగని మాతృ సన్నిధి ♦ బోవుచుండు
కలశవారాశిఁ గనియైన ♦ దోసికొనుఁడు !''

చంగమామ —— హోరాళి.

అనసూయ ప్రతిదినమునకంటెను నేఁడించుక యాలస్యముగ నుద్యానమునకు వచ్చెను. ఆమె పూవులం గోసికొని పుష్కరిణి యొద్దనం గలవకులవృక్షము కడనున్న చంద్రశిలావేదికపైఁ గూరుచుండ దండలుగుచ్చుకొనునప్పటికిఁ జంద్రోదయ మయ్యెను. ఎప్పటివలె వేంకటేశ్వరరావామెతోఁ గలసి పూవులఁ గుచ్చుటకు రాలేదు. అనసూయ పూలదండల నెగుడుదిగుడుగను నడ్డుదిడ్డముగను గుచ్చెను. తలక్రిందుగ గ్రుచ్చుటచేఁ జాలవఱకు మల్లెమొగ్గలు చెదరి విడిపోయినవి. ఆవ్యత్యస్తభావ మెందుకుఁ గలిగినదో యామెకుఁ దెలియలేదు. గుచ్చినదండలను ముడివేయుటగూడ నామె మఱచిపోయెను. ఎత్తిపళ్లెరమునందుంచునప్పుడు వానిలోఁ గొన్ని మొగ్గలు జారి పడిపోయెను. నిరుత్సాహభావముతో నాదండల నట్లే ముడిచైచి పళ్లెరమునం దుంచి యటనుండి బయలుదేఱెను. ప్రాణేశ్వరుఁడు సమీపమున లేనప్పు డనసూయ పను లిట్లే యుండును.

ప్రాణేశ్వరుఁ డుద్యానవనమందిరమునం దుండె నని యామె యెఱుంగును. ససంభ్రమమై యచ్చటకుఁ బోయి చూచెను. ఆమందిరమున దీపములేదు. అనసూయ దీపము వెలిఁగించి చూచెను

బల్లమీఁదనున్న పుస్తకము బల్లమీఁదనే యుండెను. ఆతఁ డచ్చట నగపడలేదు. ఆమె యుత్తరద్వారమునొద్దకుఁ బోయి చూచెను. ఆప్రాంగణమునకవ్వల వేంకటేశ్వరుఁడు తలవంచుకొని యిటునటుఁ బ్రచారముచేయుచుండెను. ఆమె నాతఁడుచూడలేదు—దూరమునుండియరుదెంచుచున్నప్రియురాలిమృదుపదన్యాసమునందలియస్ఫుటధ్వనిలేశమునుగూడ నాతఁడాలకింపఁగలిగెడివాఁడు--హృదయేశ్వరియగుననసూయనెమ్మేనితావులం గొనితెచ్చుమందమలయానిలాంకూరసంస్పర్శలేశమునైనను నాతఁడు గ్రహింపఁగలిగెడివాఁడు. ఇప్పుడామె తనయెట్టయెదుట నున్నను నాతఁడు తెలిసికొనఁజాలకుండెను.

పాప మనసూయ కాసంగతియే తెలియదు—ద్వారము నొద్దకు వచ్చి చూచునప్పటి కాప్రాణేశ్వరుఁ డామె కన్నులఁ బడియెను. అంతకంటె నానంద మేమున్నది? ఇఁక నామెకుఁ గావలసిన దేమున్నది? ఆమె యత్యుత్సాహముతో "తొలినేఁజేసిన పూజాఫలము" అని మృదులస్వరమునఁ బాడుచు నాతనియెదుటకు వచ్చెను వేంకటేశ్వరుఁ డులికిపడి ప్రకృతిస్థుఁడై నవ్వుచు "పూలుగ్రుచ్చుట యైనదా?" అనియెను. ఆస్వరముకూడ విలక్షణముగనే యుండెను. అది యనసూయకుఁ దెలియనేలేదు. ఆమె యానందోత్ఫుల్లనయనయై ప్రేమసూచకస్వరముతో "పువ్వులు గ్రుచ్చితిని— మీనవ్వులకుఁ దగినట్లు" అనియెను.

వేం—కాదు—నీనవ్వులకుఁ దగినట్లు.

అన—నానవ్వులో మీనవ్వులో పువ్వులనడిగి తెలిసికొందము రండు!

వేం—నీవు సూత్రధారిణివి—అవి నీవు చెప్పినట్లే ప్రవర్తించును.

మాతృమందిరము.



ప్రాణేశ్వరీ! ఔను. నిజముగ నీవు ప్రేమసూత్రధారిణివే:— నేను నీప్రేమైకనటుఁడను! పుట. 69.

అనసూయ నవ్వుచు ‘‘మీరు సూత్రధారులు—నన్నును సూత్రధారిణిగాఁ జేసితిరి! అదియే నాభాగ్యము!’’ అనియెను.

అడుగుముట్టఁ గలఁగిపోయిన సరోవర మంతలోఁ దేరుకొనియెను. మార్తాండోదయమున మంచువిరిసిపోయిన ట్లయ్యెను—అమృతకిరణప్రసారమున నంధకార మంతరించిన ట్లయ్యెను—మలయవాయు సంస్పర్శనమున మల్లికాముకుళము వికసించినటయ్యెను-ప్రణయముగ్ధహృదయ లగుప్రాణప్రియలమధురసంభాషణములు ప్రాణేశ్వరులహృదయముల కట్లేయుండును.

వేంకటేశ్వరరావు పరమానందముతో ననసూయను ముద్దుపెట్టుకొని యానందసుఖమున నుభవించుచు ‘‘ప్రాణేశ్వరీ!—ఔను-నిజముగ నీవు ప్రేమసూత్రధారిణివే—నేను నీప్రేమకే నటుఁడను.’’ అనియెను.

అనసూయ ప్రేమానందపరవశయై సాధ్వీసముచితం బగునునుసిగ్గుచే నించుక మొగము మరలించుకొనియెను. అప్పుడు సంపూర్ణచంద్రకిరణప్రసారముచే నామె సిద్దంపుఁజెక్కుటద్దముల పయిం దోఁచినతళతళలు వేంకటేశ్వరుని ప్రేమానందతరళనయనములలో మిలమిల మెఱసిపోయెను. అప్పు డాతని కాసంపూర్ణచంద్రమండలమునకును, అనసూయ మనోహరవదనమండలమునకును నించుకంతయైన భేదమగపడలేదు. ఆతఁ డాపున్నమచందమామను, ఆయన్నులమిన్నముద్దుమోమును దనివితీరని చూపులతో మాటిమాటికిని జూడ నారంభించెను.

అప్పు డనసూయ చిఱునవ్వునవ్వుచు ‘‘హృదయేశ్వరా! ఆపూర్ణచంద్రుని చెంత నేయున్న యానక్షత్రముపే రేమి?’’ అని ప్రశ్నించెను.

వేం—ఎఱుఁగవా యేమి? ముక్తాఫలమువలెఁ బ్రకాశించుచున్న యానక్షత్రము చిత్రానక్షత్రము !

అనసూయ ప్రణయపులకితకంఠస్వరముతో "నాపూర్ణచంద్రుని చరణసాన్నిధ్యమున నేనును జిత్రానక్షత్రమనే" అనియెను.

వేంకటేశ్వరుఁడు ప్రసన్నమధురస్వరముతో "ప్రాణేశ్వరీ! నీవు చిన్నినక్షత్రమవు కావు— ప్రేమామృతమూర్తివి— ఈప్రేమామృతకలశమునొద్ద నేను పిపీలికాప్రాయుఁడను" అనియెను.

అనసూయసిగ్గుతో "నేను మీపాదదాసిని— మీ యాజ్ఞాబద్ధురాలను— అంతగాఁ బ్రశంసించుట కర్హురాలను గాను" అనియెను.

వేంక—పోనిమ్ము— అది నీకు సరిపడనిచో—సరే—ప్రేమైకజ్యోతివగునీవు— చక్కని చుక్కవు— అవును.

అన—ఎంతచక్కనిచుక్కకైనను జంద్రచరణసాన్నిధ్యమే దానిసౌభాగ్యము—

వేంకటేశ్వరుఁడా జ్యోత్స్నామయంబగునాకాశమువంకఁ దదేకదృష్టితోఁ జూచుచుండెను.

సరళహృదయయగుననసూయ ప్రణయసాగరమునందలి గభీరతరంగముల నెన్నఁడు నెదుర్కొని యుండలేదు. అందలిదారుణావర్తములయం దెప్పుడును బరిభ్రమించియుండలేదు. అమాయికహృదయయగుననసూయచేఁతలును బలుకులునుగూడ నామెకే ప్రతికూలము లగుచుండెను. ప్రాణేశ్వరునిసమీపమునం దున్నప్పు డామె తన్మయత్వముచే సకలమును మఱచిపోవుచుండును. ఆనందముచే నెట్లుతోఁచిన నట్లే మాటలాడుచుండును. ఇప్పు డామెతన్నుఁ

జిత్రానక్షత్రముతోఁ బోల్చుకొనుట యంత బాగుగలేదు. మఱి మయూరాకారముతో స్వాతీనక్షత్ర మెప్పుడు చంద్రునిసమీపింతునా యని తొంగితొంగి చూచుచున్న సంగతి యీనా కెంతమాత్రమును దెలియకే తెలియదు !

స్వాతి సమీపించినంతనే చంద్రునకుఁ గళ తగ్గిపోవుననిగాని యప్పటికే చిత్రానక్షత్రము దూరమైపోవు ననిగాని, యదియే యాతనిక్షీణత్వమునకుఁ బ్రారంభమనిగాని వేంకటేశ్వరుఁడైన నూహించుకొన్నట్లగపడదు.

పదునొకండవ ప్రకరణము.

“ ఎజ్జేఁయెగా యెఱుఁగకో ♦ యేఁ జేసిట్టి
త్రిప్పలుండిన మదిఁ ♦ దలఁపఁ గాఁ బోక
పాశ్నించి ఘనసుంచి ♦ మఱికొక్కసారి
కన్నులఁబడఁ కుర్వ్వ ! ♦ కరుణాంతరంగ ”

ఏంకాతి సేవ.

గోపాదక్షేత్రమునందలి యంతర్భవనమునం దొకగదిలో నొకపురుషుఁడు దుర్భరబాధ ననుభవించుచుండెను. ఆతఁడు మోకాలిపైఁదలనుంచుకొని రెండుచేతులతోఁ దన గుడికాలి చీలమండ పైభాగమును గట్టిగఁ బట్టుకొని మూల్గుచుఁ గూర్చుండియుండెను. బలిష్ఠముగు నాతనిపరిపుష్టశరీర మించుక సడలియుండెను. భయంకరముగు నాతనినికృతవదన మిప్పుడు యాతనావిషాదచిహ్నితమై

పొక్కియుండెను. స్వభావముచేతనో, సంస్కారవిహీనమైయుండుట చేతనో, యాతని క్లేశబాధము విసివడి యాతనిభయంకరవదనమునకు వికారాకారముం గల్పించుచుండెను. ఆతని మొఱ్ఱనికన్నులు గుంటలు పట్టియుండెను. ఆగదిలో నింక నెవ్వరును లేరు. కిటికీలన్నియును తెఱవఁబడియుండెను. వెలుతురంతగా లేకున్నను గాలిమాత్రము బాగుగ వచ్చుచుండెను. ద్వారపార్శ్వమున నిరువురుసేవకులు కూర్చుండి యుండిరి.

అప్పుడొక మహాపురుషుఁ డాకస్మికముగ నామందిరమునఁ బ్రవేశించి యాతనియెదుట నిలువఁబడియెను. ఆతనిపాదకమలములు పాదుకావిలసితములు; శరీరము కాషాయవసనాచ్ఛాదితము; హస్తయుగళము దండకమండలుసంకలితము; విశాలవక్షోభాగము బీజపూరమాలికాలంకృతము. కంఠసీమ రుద్రాక్షనక్షత్రహారశోభితము. ముఖమండలము శుభ్రశ్మశ్రువిరాజితము; ఫాలభాగము విభూతిరేఖాంకితము; లలాటము కుంకుమతిలకాంచితము. ఆమూర్తి ప్రత్యక్షసదాశివమూర్తి. ఆదివ్యమూర్తి శాంతతేజోవిరాజితమై యుండెను. ఆమహాపురుషుని వదనమండలమునఁ బ్రతిభాశక్తి యున్నది. కటాక్షావలోకనములయం దాజ్ఞాశక్తియున్నది; మధురమందహాసమున నుత్సాహశక్తి యున్నది. ఆసిద్ధమూర్తియందు సర్వశక్తులును మూర్తీభవించిన ట్లుండెను. ఆతఁడు ప్రబోధానందస్వామియే-

బాధపడుచున్న రోగవ్యక్తి తలయెత్తి యామహాపురుషుని వంకఁ జురచురఁ జూడసాగెను.

అప్పుడు ప్రబోధానందస్వామి ప్రశాంతగంభీరస్వరముతో ,, ఏమి యాలోచించుకొంటివి?'' అని ప్రశ్నించెను.

పురుషుఁడు క్రోధకర్కశస్వరముతో ,, ఆలోచన కేమున్నది—నిలువున నిన్నుఁ జీల్చివేయవలయుననియే—'' అనియెను.

మాట ముగియకుండఁగనే స్వామి చిఱునవ్వుతో "రక్షించినవానినిగూడ శిక్షించునంతటి క్రూరరాక్షసుఁడవా నీవు ?" అనియెను.

పురు—చచ్చినవానిని బ్రదికించుటచే నీవు నా దైవమ వనుకొంటిని—కాని—తుదకు నాకిట్టి తీరనియాతనం గల్పించి నాపాలిటి కాలయముఁడవై పోవుదు వని నేననుకొనలేదు.

స్వామి—ఇందు నేఁజేసిన దేమున్నది ?

పురు—మఱి యీ బాధ నేనే తెచ్చిపెట్టికొంటినా ?

స్వామి—కోపమువలదు—ఇది నీవు తెచ్చిపెట్టుకొన్నది కాదు—కాని దీనిని నీవు తీర్చుకొనుట లేదు.

పురు—నేనా ?

స్వామి—ఔను ! నీ వెవ్వరు ?

పురు—ఆసంగతి నీకెందుకు ?

స్వామి—(చిఱునవ్వుతో) నీసంగతి నాకక్కఱ లేనప్పుడు నీబాధసంగతి నాకెందుకు ?

పురు—అట్లయినచో నన్నిచ్చటబంధించుట యెందుకు ?

స్వామి—నీరోగము కుదుర్చుటకు—

పురుషుఁడు క్రోధావేశపరవశుఁడై కన్నులెఱ్ఱఁజేసి పళ్లుపటపటఁ గొఱుకుచు సటలువెరికిన సింహమువలె నొక్కయుదుటున స్వామిపై కుఱుకఁబోయెను. కాని, బాధచే శక్తిహీనుఁడై పోవుటచేతనో, స్వామిమనోబల మాతని నడఁగించుటచేతనో గాని యాతఁడు కూర్చున్నచోటునుండి కదలఁజాలకపోయెను. స్వామియొక్కయుదుటైన వెనుకకు వైవకుండ శాంతభావముతో నాతనివంక నట్లే చూచుచుండెను.

పురుషుఁడు దీర్ఘశ్వాసములను విడుచుచు "మా వాం డె చ్చుటనున్నారు ?" అనియెను.

స్వామి—నీకు మీ హాంద్రలో సంబంధము వదలిపోయినది.

పురు—(తీవ్రస్వరముతో) సంబంధము వదలిపోవుటయా ? ఎట్లు ?

స్వామి—వారిచ్చుటకు రాఁజాలరు— నీవచ్చుటకుఁ బోఁజాలవు—

పురు—నీవేమో బ్రహ్మాండనాయకునివలె మాటాడుచున్నావు ?

స్వామి—బాధ తీరినచో నీవంతవాఁడ వగుదువు.

పురు—ఈ బాధ తీరుట యెప్పుడు ?

స్వామి—నీసంగతి సత్యముగాఁ జెప్పినప్పుడు—

పురు—నేను చెప్పినవి సత్యమో యసత్యమో కనిపెట్టుటకు నీకేమి నిదర్శనమున్నది ?

స్వామి—అంతకును నీబాధయే నిదర్శనము—

పురుషుఁడు తలవంచుకొని చాలసేపాలోచించి నిట్టూర్పులు విడుచుచు "అయ్యా ! నన్నూరక బాధపెట్టుట యెందుకు ? ఒక్కసారిగఁ జంపివేయరాదా ?" అనియెను.

స్వామి—నీనిగూఢచరిత్రమును వెలిపుచ్చుటకంటె మరణమే మేలైనదని నీకుఁ దోఁచుచున్నదా ?

పురు—ఔను.

స్వామి—నీవంత పాపము చేసితివా ?

పురు—పాపమా ?

స్వామి—పాపముగనుక నే బాధ—

పురు—పాపమునకు బాధ యుండునా?

స్వామి— పాపమే బాధ.

పురు—ఆ బాధ యేమైన నున్న యెడలఁ జచ్చినతరువాత నుండవలయును. ఇప్పుడెందుకు ?

స్వామి—అప్పుడు లేకుండుటకే యిప్పుడు—

పురు—ఆలోకములోఁ గాలయమునికిఁ బోటీయా యేమి యీలోకములో నీవు ? ఈలాగెంతమంది నేడ్పింపఁదలఁచుకొన్నావు నాయనా ?

స్వామి—వెఱ్ఱివాఁడా ! ఏడ్పించువారెవ్వరు ? పాపమునకు ఫలము బాధపడి యేడ్చుటయే.

పురు—అదేమిమాట ! పాముకాటునకును పాపబాధకును సంబంధమేమున్నది ?

స్వామి—(శాంతస్వరముతో) నాయనా ! అట్లనుకొనవలదు ! ఆపాపమే పాముకాటు !

పురుషుఁ డింక మాటాడ లేదు. "పాపమే పాముకాటు" అనునాసత్యవాక్యము నారదబ్రహ్మదివ్యవీణాతంతువులనుండి వెలువడినసామశ్రుతివలెఁ బ్రబోధానందస్వామి యమృతమధురకంఠము నుండి వెలువడి చల్లఁగ నాపురుషుని శ్రవణకుహరములఁ బ్రవేశించెను. ఆయమోఘనిస్వన మంతటితో నాఁగిపో లేదు; ప్రతిగగన పరమాణువునందును బ్రతిధ్వనితమై ప్రతివాయుతరంగమునందును బ్రచలితమగుచుఁ గ్రమముగ మృదంగనిస్వనముం బోలె భేరీధ్వని ననుకరించి, యపారపారావారనిర్ఘోషముం దలకడచి, శతసహస్ర సహస్రాశనిపాతదారుణారావముం బ్రతిఘటించుచు నాతనిశుష్కకర్ణకుహరములం బ్రతాడితములుగఁ జేసివైచుచుండెను. ఆతనిహృదయాకాశమునఁగూడ నదియే ప్రతిధ్వనించుచుండెను. ఆతనిప్రతి రక్తనాళమునందును బ్రతిరక్తపరమాణువునందును నదియే ప్రతిధ్వ

నించుచు విశ్వ ద్వేగముతోఁ బ్రవహించిపోవుచుండెను. ఆతని
కప్పు డాంతరిక ప్రపంచమునందును బాహ్యప్రపంచమునందునుగూడ
"పాపమే పాముః కాటు" అను నమోఘధ్వనియే యెడతెగకుండఁ
బ్రిణవధ్వనివలె వినవచ్చుచుండెను.

ఆతనిసకలేంద్రియములును దన్మయము లైపోయెను. అప్పుడాతనికి బాహ్యజ్ఞానము వదలిపోయెను. ఆగభీరారావతరంగములలో నాతనిహృదయము కొట్టుకొనిపోవుచుండెను అప్పు డాతని కంతటను నంధకార మావరించుకొన్నట్లయ్యెను. ఆగాఢాంధకారమున మిలమిల మెఱయుచున్న భయంకరవిషసర్పములు తండోపతండములై వచ్చి యాతనిఁ దరమితరమి కఱచుచుండెను. ఆబాధలకు సహింపఁజాలక యాతఁడు భయభ్రాంతుఁడై పరుగులెత్తుచుండెను. అంతటను విషసర్పములే—నిలువునను జుట్టబెట్టుకొని గరళజ్వాలాకరాళంబులగు కాలసర్పములు కఱచికఱచి కండలెక్కఁదీయుచుండెను. దుస్సహంబగునాకఠోర యాతన నాతఁ డనుభవింపఁజాలక గోలుగోలున నేడ్చుచు నట్టె నిలువునఁ గూలఁబడిపోయెను. అంతలో నయ్యాశీవిషముఖంబులనుండి యొక్కసారిగ నగ్నిజ్వాలలు తరంగాయితములై వెడలువడి యాతని నావరించుకొనియెను. ఆభీకరకాలకూటానలజ్వాలామధ్యమునం బడి యాతఁడు వేగిపోవుచుండెను—ఆతనికి నిష్కృతి యగపడుటలేదు—గతితోఁచుటలేదు—ఇఁకఁ దప్పించుకొనిపాఱిపోవుటకుఁగూడ శక్తి లేదు—రక్షించుటకు దిక్కులేదు—దిక్కులన్నియును గాలకాకోదరభీకరములై యుండెను—కాలానలకీలాభీలములైయుండెను. అప్పుడాతఁడసహాయుఁడై హతాశుఁడై దుస్సహయాతనాపరిక్లాంతుఁడై శుష్కకంఠముతో గద్గదస్వరంబున "దాహము ! దాహము! దాహము!"

అనిరోదనముచేయుచుండెను. ఆబాధకుఁ బరిమితి లేదు—ఆదాహమునకు నిష్కృతి లేదు—

అప్పు డాకస్మికముగ భూమ్యాకాశములకు నిలువునఁ బెరిగినట్లున్న శాంతగంభీరభయంకరశ్యామలదివ్యమూర్తి యాతని కన్నులఁ బడియెను. ఆదివ్యపురుషుని నలువంకలను శతసహస్రసంఖ్యాతీతంబులగు కాలభుజంగములు పరివేష్టించియుండెను. ఆదివ్యమూర్తిం జూచి యాతఁడు భయభ్రాంతహృదయుఁడై మఱింతబిగ్గఱగ ‹‹ దాహము! దాహము! దాహము! ›› అని యఱచుచుండెను. అప్పు డాయపవిత్రకృత్యలీలామూర్తి యాతని సమీపించి మేఘగంభీరస్వరముతో ‹‹ ఓరీ! పుణ్యాచరణంబునకై భువనరక్షకుం డగు పరమేశ్వరుఁడు దయామయుఁడై నీకుఁ బ్రసాదించినయీజన్మమునందు నీవు చేసిన దేమున్నది? ›› అని హెచ్చరించెను.

ఆప్రబోధవాక్యశ్రవణమాత్రమున నాబాధితుని దుస్సహబాధ యాకస్మికముగ శతసహస్రగుణాధికమైనట్లయ్యెను. అప్పు డాతఁడు దుర్భరయాతనావిహ్వలస్వరముతో ‹‹ పాపము! పాపము! పాపము! ›› అని బిగ్గరగఁ బ్రలపింప నారంభించెను.

ఆతఁ డట్లు పాపమంత్రపురశ్చరణము చేయుచుండఁగనే యాదివ్యమూర్తి ప్రబోధానందస్వామియై యవతరించినట్లయ్యెను. తోడనే యాస్వామి జ్వాలామధ్యమునం బ్రవేశించి కుంపటివేఁడికి గోలుగోలున నేడ్చుచున్నచిన్నిబిడ్డను గన్నతల్లి యెత్తికొన్నట్లుగా నాతని నెత్తిపట్టుకొనియెను. అంతలోనే యాకస్మికముగ నామహారోగములు మాయమైపోయెను. సంతాపజ్వాలలు చల్లారిపోయెను. ఆదివ్యమూర్తిసుప్రసన్నవదనమండలమునెదుట నాతనికిఁ జంద్రమండలసాన్నిధ్యమునం దున్నట్లయ్యెను. యాతనాపరిక్లిన్నుఁ డగునాతఁ

డప్పుడు సుఖపరవశుఁడయ్యెను. ఆచల్లనిసమయమునం దమృతమధురస్వరముతో "పాపమునకుమందు పశ్చాత్తాపమే" అనుదివ్యవాక్యము చల్లగ నాతనిచెవులఁబడియెను. ఆతఁ డులికిపడి కన్నులఁ దెఱచి చూచెను. అచ్చట నెవ్వరును లేరు !!

పండ్రెండవ ప్రకరణము.

"భూతపంచక మనియెడి • పోఁగులెల్లఁ
దడవిపురివెట్టి కూర్చిన • త్రాడువంటి
దగును జీవంబు; క్రమముగా • వట్టి పాగి
బిగిసి బిగ్గరగాఁ జాగి • తెగుచుండును"

యాద్దృశ్ఛికమ్ శివన్నశ్యమ్ — హా. రా. లి.

అన్నపూర్ణకు దుస్సహకష్టములచే హృదయము చివికిపోయినది. ఆమెకుఁ బ్రథమసంతానమైనకుమారుఁడు దక్కకుండఁబోయెను. కుమార్తెజీవితమునకు సుఖము లేకుండఁబోయెను. చూచుచు నామె యెట్లు సహించియుండఁగలదు? ఆమనోవ్యాధిచేత నేయామె క్రమక్రమముగఁ గృశించి తుదకుమంచముపట్టెను. పలుకుబడిగల గౌరీపతిశాస్త్రి తనబహిఃప్రాణమగునన్నపూర్ణకు రోగోపశమనమునకై యెన్నియోమందుల నిప్పించుచుండెను. ఎంతయో ద్రవ్యమును దృణప్రాయముగ వెచ్చించుచుండెను. ఏమిచేసిన నేమిలాభము? మనోవ్యాధికి మందెచ్చట నున్నది?

క్రమముగా నన్నపూర్ణసర్వశక్తులు నవసన్నము లైపోవుచుండెను. నిద్రాహారములు కట్టువడిపోయెను. గ్రుక్కెడునీరైన నిందుటలేదు. ఇఁక నౌషధము లేమిపనిచేయును? గౌరీపతిశాస్త్రి భగవంతునిమీఁదనే భారమువైచుకొనిచింతానిమగ్నుఁడైయుండెను. తల్లిప్రాణమునందలియాశచే సరస్వతి గడియకొకమందుగ నామెకు మార్చిమార్చియిచ్చుచుండెను. పాపము సరస్వతికిఁ దోడఁబుట్టువులు లేరు— సతీజీవనమున కేకమాత్రావలంబనస్వరూపుఁడగు ప్రాణేశ్వరుఁడు విదేశములఁబట్టి పోయెను; అతఁ డేమయ్యెనో యెటనుండెనో తెలియుటయైన లేదు; వయసుచెల్లినతండ్రి యన్నివిధముల చేతను దుఃఖసముద్రములో మునిఁగియుండెను. ఇప్పు డేదైనవిపరీతమే తటస్థించినచో నాతఁ డెట్లు జీవింపఁగలఁడు? తలఁచుకొనినప్పుడెల్ల సరస్వతి దుఃఖము పొరలిపొరలివచ్చుచు నేయుండెను—సరస్వతి ధైర్యవతి యగుటచేఁ దనదుఃఖమును లోలోపలనే యడంచుకొని తల్లికుపచారములఁ జేయుచు గృహకృత్యముల నెఱవేర్చుకొనుచుండెను.

సతీశిరోమణి యగుసత్యవతి తనప్రాణసఖియగుసరస్వతికి ధైర్యముచెప్పుచు నాకష్టకాలములో నామెకుఁ దోడునీడయై మెలంగుచుండెను. సరస్వతిధైర్యగ్రంథి మాటిమాటికి శిథిలమైపోవుచునే యుండెను. కాని యామె దుఃఖపరితప్తహృదయుఁడై కృంగిపోయి యున్న వృద్ధుఁడగుజనకునికొఱకుఁ గన్నీరుపెట్టి దుఃఖింపఁజాలకుండెను. అందుచే సరస్వతిదుఃఖము మఱియును దుర్భరముగా నుండెను. సంసారమున సర్వసుఖస్వరూపిణి యగుజననికంటెను బ్రియమైనవస్తు వింకేమున్నది? కనికరపుఁజూపులచేతను, గారవపుఁ జేయ్వులచేతను, బ్రియవచనములచేతను, బ్రేమామృతపరిపారము చేతను, బిడ్డలకష్టములను మఱపించునది కన్నతల్లిగాక మఱియెవ్వ

రు? తల్లియే ప్రేమానందస్వరూపిణి! తల్లియే సుఖస్వరూపిణి! తల్లి
యే సర్వస్వస్వరూపిణి !!

ఆకుమఱుంగుపిందెయై యున్న సరస్వతి యింతవఱకును దాను సుఖవతి యనియే భావించుకొనుచుండెను. తనకుఁ దన ప్రాణేశ్వరుని సన్నిధానసౌభాగ్యము లేకపోయినను, సందర్శనానందసామ్రాజ్యము లేకపోయినను నిరంతరమా ప్రేమైకమూర్తిని నెమ్మనమున ధ్యానించుకొనుచు నానందసుఖము ననుభవించుచుండెను. ఇప్పు డామె హృదయాంతరాళమునం దొకవంక ఝంఝూప్రభంజనములు వీచుచున్నవి— ఒకవంకఁ గాలమేఘము లావరించుకొనుచుండెను. అంతటను గాఢాంధకారము క్రమ్ముకొనుచుండెను.

రాత్రి రెండుజాము లయ్యెను. ఎంతసేపటికిని ప్రొద్దుజరుగుటలేదు. సరస్వతి తల్లి మంచమునొద్దఁ గూర్చుండి తదేకదృష్టితో నామెముఖమువంక నేచూచుచుండెను. అన్నపూర్ణ తన ప్రేమైకపుత్రికయగు సరస్వతి మొగముపైఁ బ్రేమాలసవీక్షణములఁ బరపఁజేయుచుండెను. అవి యంత్యప్రేమావలోకనము లని సరస్వతి గ్రహింపలేదు. పాపమాసంగతి యాబాలిక కెట్లు తెలియును? తెలియకపోయినను నామె తనహృదయమునం దేదియో యాందోళనము ననుభవించుచునే యుండెను. అంతవఱకు మేల్కొనియున్న సత్యవతి యాప్రక్కనే యొకచాపపైఁ బరుండి నిద్రించుచుండెను.

ఆజనని చూపులఁబట్టి సరస్వతి యప్పుడు తల్లికి మందు నీయవలయు నని ప్రయత్నించెను. అన్నపూర్ణ వలదని సంజ్ఞ చేసెను. ఎప్పుడు మందిచ్చినను దీసికొనుచుండునామె యిప్పుడు వలదనుటచే సరస్వతిగుండె గుభిల్లుమనియెను అప్పుడు సరస్వతి శోకగద్గదస్వరముతో ,, అమ్మా! మందుపుచ్చుకొనవా ? ,, అనియెను.

అన్నపూర్ణ యతికష్టముతోఁ దనచేతిని సరస్వతిచేతిపై నుంచెను. అప్పు డామెకన్నులనుండి జొటజొటఁ గన్నీరు ప్రవహింప సాగెను. సరస్వతి విస్మితస్వరముతో "అమ్మా! అది యేమి?" అనియెను.

అన్నపూర్ణ హీనస్వరముతో "తల్లీ! కంటఁ దడిపెట్టకుము! ఏమికావలయునో యది యైపోయినది! నీకష్టమునకును నామరణమునకును నేనే కారకురాలను—ఆఁడుబుద్ధి యసురబుద్ధి యైపోయినది!—" అని యింక మాటాడఁజాలకపోయెను.

అప్పుడు సరస్వతి కన్నీటి నాపుకొనఁజాలక "అమ్మా! నీవు చల్లగ నున్నచో నాకేమికష్టము?" అనియెను.

అన్నపూర్ణ మానసూచకస్వరముతో "బిడ్డా! అజ్ఞానముచే నేనే నీసుఖవల్లికను చేతులారఁ ద్రెంపివైచితిని—నానాలుకపై ముల్లు విఱుచుకొంటిని—నేను పెంచినబిడ్డయని—నీవదలింపఁదగినవాఁడని—నామేనల్లుఁడని—ముందువెనుకలాలోచింపక యెట్లయిన బుద్ధివచ్చునేమో యనుదుర్భ్రమతో "మూఁడుముహూర్తములు దాఁటిపోయినవి! లోకులకుఁ బడలేక నీకు బిడ్డ నిచ్చినందుకు బాగుగనే సుఖపెట్టుచుంటివి! నీకీయకపోయినను నాబిడ్డ సుఖపడునుగదా! నీవిట్టివాఁడ వగుదువని నేననుకొనలేదు' అని యాతనిదూషించి పలికితిని. పాపమాబిడ్డ యానాఁడు—చిన్నఁగఁ గంజియైనను దినలేదు. అదియే కడసారిరాక—మరలనీయింటి గుమ్మము త్రొక్కి చూడలేదు—మూఁడేండ్లయినది—" అని యూరకుండెను.

సరస్వతితలపైఁ బిడుగుపడినట్లయ్యెను. ఆయంత్యసమయమున నట్లు పశ్చాత్తాపమునందుచు శోకించుచున్నతల్లి నెట్లూఱడింపవలయునో యామెకుఁ దోఁచుటలేదు. ఏమియు నెఱుంగనిబిడ్డ కిట్టిసను

యమున నీదారుణవృత్తాంతమును జెప్పి మఱింతదుఃఖపెట్టఁగూడదని యేండ్లు గడపినయన్నపూర్ణకుఁ దోఁచవలసినది—కాని కన్నబిడ్డకే తానుచేసినతప్పు నీయవసానకాలమునఁ గన్నబిడ్డయెద్దఁగాక యన్నపూర్ణ చెప్పకొనుట కిఁకెఁ దావెక్కడనున్నది ? ఈమాటలు భర్తతో నేమని చెప్పఁగలదు ? అదిగాక—ఉపకారమగునని యెంచిన తనమాటలు సరస్వతి కపకారములైనవి. అట్టిసరస్వతికి—అట్టిగారాబుపట్టికి—అట్టిజీవనసర్వస్వమునకుఁ దనయవసానకాలమునందైనను దనతప్పును జెప్పకున్నచో నన్నపూర్ణకు శాంతి యెక్కడనున్నది ?

తల్లి తనయెడఁ దప్పు చేసినదని సరస్వతి యెట్లు భావించుకొనఁగలదు ? దైవదుర్విపాకములవలనం గలిగినసంఘటనమున కెవ్వరేమిచేయుదురు? తనతల్లియిట్టియవసానకాలమునందుఁ బశ్చాత్తాపదుఃఖమును గూడ ననుభవించుచుండుట సరస్వతి చూడఁజాలకపోయెను. సరస్వతి దుఃఖసముద్రమున మునిఁగిపోయెను. అప్పుడామె తనతలిజీవితము వలెనే తనజీవితనౌకయును నట్టనడిమిసముద్రమునందల్లాడుచున్నట్లు భావించుకొనియెను. దుఃఖముచే హృదయమును జెదరఁగొట్టుకొనుట వలన లాభము లేదు—ఆయవస్థలోఁ దల్లిహృదయమున కెట్టులయిన శాంతినిగూర్పవలసియుండెను. దుఃఖతరంగములచేఁ దూలిపోవుచున్నసరస్వతి బాలికయయ్యు నవస్థనుబట్టి యించుక ధైర్యము దెచ్చుకొని ప్రేమకంపితస్వరముతో "అమ్మా! అది యంతయును మఱచిపొమ్ము! నీహృదయమునకు శాంతినీయఁగలమంచితలంపులనే మనసునకుఁ దెచ్చుకొనుము ! " అనునప్పుడు సరస్వతికన్నులనీరు నిండిపోయెను.

అన్నపూర్ణ యనసన్నస్వరముతో— "తలంపుల కేమున్నది. ఒక్కటే—ధ్యానము—" అనియెను.

ఏయదృష్టసూత్రముచే నాకర్షింపఁబడియెనోగాని యింత వఱకు నన్నపూర్ణనుజూచుటకు సహింపఁజాలక దూరదూరమునందే యుండుచున్న గౌరీపతిశాస్త్రి యాకస్మికముగ నాగదిలోపలఁ బ్రవేశించెను. అనివార్యమగుధర్మానుబంధము—అమోఘమగుప్రేమానుబంధము—అనుకూలమగు సహవాససంబంధము—ఎంతపండితుఁడైనను దుఃఖ మాఁగునా? ఆతనికన్నులనుండి యవిరళాశ్రుధారలు ప్రవహించుచుండెను. మినుకుమినుకు మనుదీపపువెలుతురున నన్నపూర్ణ సరస్వతిపైనున్నచూపు మరలించి ప్రాణేశ్వరుని వదనమండలమును గడసారి యొకసారి చూచెను. ఆచూపులలో భారతవర్షపతివ్రతాతిలకములపవిత్రతేజము విరాజమానమగుచుండెను—ఆచూపులలోనే యనుజ్ఞాకాంక్ష యున్నది—ఆచూపులలోనే యంత్యప్రార్థనమున్నది—ఆచూపులలోనే యాత్మపుత్రికాసమర్పణమున్నది—ఆచూపులలోనే యన్నియు నిమిడియున్నవి. ఆచూపు లింక లేవు!!!

పదుమూడవప్రకరణము.

"పురుషునకునర్ధదేహమై ♦ శరణమువను
శరణమై ఘనసంసార ♦ తరణమగుచు
సకలసౌభాగ్యములకును ♦ స్థానమైన
వనితలేకున్న భవనము ♦ వనముగాదె"

గృహలక్ష్మి—వాగావళి.

అన్నపూర్ణ యిహలోకమును విడిచిపోయినది. గౌరీపతిశాస్త్రియుత్సాహశక్తి వదలిపోయినది. సరస్వతికి దిక్కు లేకుండఁబో

యినది. బాలికయగుసరస్వతిహృదయ మెక్కడఁ జెదరిపోవునో యనుభయముచే గౌరీపతి తనదుఃఖమును దనలోననే యడంచుకొనుటకు దుస్సహప్రయత్నములను జేసికొనుచుండెను. ఆఘోర దుఃఖసమయమున సత్యవతియే సరస్వతీగౌరీపతుల కుపచారములను గావించుచుండెను; సరస్వతికనేకవిధముల ధైర్యము చెప్పుచుండెను. గౌరీపతి కాగృహమంతయు నంధకారపూరితమైపోయినట్లుండెను. ఉండదా? అతనియర్ధాంగలక్ష్మి యంతరించిపోయినది. ఆశూన్యగేహమునం దిఁక నేమున్నది? అది యాతనిహృదయమువలెనే దుఃఖమయమై యుండెను.

దుఃఖము దుస్తరమైనదియే— అయిన నట్టిదుఃఖములోనే దినములు గడచిపోయెను. ప్రపంచము చే మఱపించివైచినదుఃఖప్రభావ మిప్పుడు కాలప్రభావమునకించుక లోఁబడిపోయినమాట సత్యమే. కాని గత్యంతరములేని సరస్వతీగౌరీపతుల హృదయములయందుమాత్ర మాదుఃఖ మెప్పటివలెనే యున్నట్లగపడుచుండెను. దుఃఖమునుగూడ సుఖముగనే భావింపనలవాటుపడిన సరస్వతికూడ నిప్పుడు దుఃఖమునకు లోఁబడిపోయెను. కన్నబిడ్డలకుఁ గష్టమను మాట వినఁబడకుండఁ గడుపునఁ బెట్టుకొని వారిజీవితముల సుఖమయములుగఁ జేయవలయునని యెంతటికష్టములనైన నవలీలగ భరించుటకై వెనుదీయని మాతృదేవతం గోలుపోవుటకంటెను దుస్సహదుఃఖ మీలోకమునం దేమున్నది? అట్టిదుస్సహదుఃఖసముద్రమున మునిఁగియుండియు సరస్వతి తండ్రియూఱటకై తనదుఃఖమును లోలోననే యడంచుకొని తల్లిమాటమఱపించుటకై యాతనికనేకవిధములగు నుపచారములను జేయుచుండెను.

చిరకాలానుభవచిహ్నముల నొక్కసారిగఁ దుడిచివేయుట యెవ్వరితరము? గౌరీపతి కాగృహమునందలి ప్రతిపదమునందును

పత్నిస్మారక చిహ్నములే యగపడుచుండెను; ప్రతినిమిషమునందును సరస్వతి భావిస్థితిం గూర్చియే యాతని హృదయము కళవళపడుచుండెను. ఇంక నాతఁడా మందిరమున నెట్లుండఁగలఁడు? ఇట్టియవస్థలో నసహాయయగు పుత్రికను విడిచి యెక్కడకుఁ బోఁగలఁడు? ఆతనికిఁ బూర్వస్థితియంతయును దుఃఖస్వప్నమైపోయినది— భావిస్థితియంతయును గష్టజాగరణమువలెఁ గానవచ్చుచుండెను. ఆతనికేమి చేయుటకును దోఁచుట లేదు. బంధుమిత్రులాతని బరామర్శించుటకై వచ్చుచుఁ బోవుచునే యుండిరి. అందుచే నాతని దుఃఖము మఱింత యతిశయించుచుండెనే గాని యుపశమిల్లుట లేదు. గతవృత్తముకంటె భావిసంశయమే యాతని కధిక మనస్తాప ముంగల్పించుచుండెను.

సంసారచక్రమైనను సంఘచక్రమైనను సామ్రాజ్యచక్రమైనను నిటే నొక్కయిరుసుపై నాధారపడియుండును. ఆయిరుసు చెదరకుండ నున్నంతవఱకే యాచక్రము మిట్టపల్లములయందు సయితము సమగతిని దొరలిపోఁగలిగియుండును. దానికి విచ్ఛిత్తి కలిగినచో నా చక్రము కూలఁబడిపోవలసినదే— పాపము గౌరీపతి సంసార మీ విధముగ నైనది. క్రమముగా నీవిచారముచే గౌరీపతికి నిద్రాహారములుగూడ దూరములై పోవుచుండెను.

ఆతని యవస్థం జూచి సరస్వతికిఁ జాలభయము కలిగెను. ఆమె తనదుఃఖము నడంచుకొని ధైర్యముతో జనకునియొద్దకుఁ బోయి "తండ్రీ! ఇట్లెంతకాలము విచారించిన నేమిలాభము?" యనియెను.

గౌరీపతిశాస్త్రి గద్గదస్వరముతో "తల్లీ! విచారముకాక మఱి యేమున్నది?" అనియెను.

సర—అమ్మ యెన్నాళ్లు విచారించినను మరల రాదుగదా!

గౌరీ—తల్లీ! గతమునకు వగచుటవలనఁ బ్రయోజనము లేదని నేనెఱుఁగనా ?

సర—అట్లయినచో నింక నీమనస్తాపమెందుకు ?

గౌరీ—అమ్మా! మనశ్శాంతి కుపాయము లేదు. ఐహిక తంత్రములం బడి యేఁబదియేండ్లు నిరర్థకములై పోయినవి. కుమారుఁడు పోయెను— భార్యపోయెను— ఇంకను సంసారమునఁ గష్టమే గాని సుఖ మగపడుటలేదు.

సరస్వతి శోకగద్గదస్వరముతో "తండ్రీ! అభాగ్యురాలగు నీపుత్రిక మీపాదములకు సంకెల యైనది. మీసంతానము మా తాపితరుల నుత్తమపథానువర్తులం జేయఁగలుగు లోకములోని సంతానమువంటి దైనది కాదు" అనియెను.

గౌరీ—కన్నబిడ్డలు సుఖపడుచుండఁగాఁ జూచుకొనునంతటి యదృష్టము మాకుఁ బట్టినది కాదు.

సర—మాయదృష్టమునకు మీ రేమి చేయఁగలరు ?

గౌరీ—సర్వేశ్వరుని సంకల్పమునం దేమున్నదియో యెవ్వరు చెప్పఁగలరు?

సర—నాకావిచారము లేదు. నిరంతరపితృసేవాలాభమున నాదుఃఖముల నన్నిటిని మఱచిపోయెదను.

గౌరీ—తల్లీ! నాజీవనపథమునకు నీవొక్కతెవే ఛాయాపృ థుమ వైయుంటివి!

సర—అట్లయినచో నేను ధన్యురాలను.

గౌరీ—ఆమాట నేననుకొనవలసినది. కాని నాకట్టిభాగ్య ము సంపూర్ణముగ లభియించినది కాదు.

సర — తండ్రీ! కష్టములు కలకాలమున్నందునా? రేపటి మాట యెట్లుండునో యెవ్వరు చెప్పఁగలరు?

సరస్వతిహృదయము దారుణదుఃఖానలముచే దహించుకొని పోవుచుండె నని గౌరీపతి యెఱుఁగును — ఆమె యిట్టికష్టకాలమునం దింతటిధైర్యముతో నుండఁగలదని యాతఁ డనుకొనలేదు. ఆతఁడు ధైర్యమును వహించి "అమ్మా! నీవంటిబిడ్డను బడయుటచే నాజన్మము సార్థకమైనది. ఇఁక నాశేషజీవితము నీకుసుఖమును గూర్చుటకే వినియోగపడుఁగాక!" అనియెను.

సర — తండ్రీ! ప్రాజ్ఞులైనమీకు నేను చెప్పవలసిన దేమియును లేదు. కాని, యాత్మశాంతిననుభవింపవలసిన యీవయసునఁ గూడ మీచింతను నాకొఱకు బెంగపెట్టుకొనుట యెందుకు?

గౌరీ — బిడ్డలతండ్రినైన నేను పెద్దపులివలె నెట్లు ప్రవర్తింపఁగలను తల్లీ! తండ్రినైననాకు బిడ్డవగు నీసుఖముకొఱకుఁ బ్రయత్నించుట విధాయకకృత్యముగాదా?

సర — మీరేమిచేయుదురు?

గౌరీ — నాకీయింట మనశ్శాంతి కుదురుట లేదు. ఈనెల దాటకుండఁగ నేబయలు దేరి సేతుస్నానమును గంగాస్నానమును జేసి రావలయుననియున్నది. ఎచ్చటనైనఁ బరబ్రహ్మ మగపడినచో నెట్లైన బ్రతిమాలి తీసికొనివచ్చి మిమ్మొకయింటివారిని జేసిచూడవలయు నని యాశయున్నది.

సర — అయినచో నట్లే బయలుదేరుదము!

గౌరీ — ప్రయాసకష్టముల ననుభవింపఁజాలవు నీవెట్లు వచ్చెదవు తల్లీ!

సర—తండ్రీ! మీయనుగ్రహముచే నాకెట్టికష్టముల నైన ననుభవించుటకుఁ దగినధైర్యము లభియించినది! భర్తృవియోగముకంటెను, మాతృమరణముకంటెను దుస్సహమైనకష్ట మీలోకమున మఱియొకటి యుండదని నాకు నమ్మకము లేదు.

గౌరీపతిశాస్త్రిహృదయము నీరైపోయెను. అతఁడు ప్రాజ్ఞుఁడు— పరిపూర్ణహృదయుఁడు; కేవలసంసారశృంఖలానిబద్ధుండు కాఁడు— అయినను జీవన్ముక్తునకు భవబంధమువలె నాతనికి సరస్వతి యంతరాయముగానున్నదని యాతఁడు భావించుకొనియెను. ఆత్మనిర్వృతికై యాత్మజాతను బరిత్యజించుట మనుష్యధర్మముకాదని యాతనికిఁ దోఁచెను. దుఃఖసముద్రమున మునిఁగి తేలుచున్న ప్రియపుత్రికను నీయవస్థలో నూరక చూచుచుండుటయు నాతనికతిదుర్భరముగ నుండెను. విజ్ఞానధనుఁ డగునాతఁడు కర్తవ్యమూఢుఁడై కొట్టుకొనిపోవుచుండెను.— కాని యాతనికట్టిప్రతిబంధము కలుగలేదు— ఆతనిమానసికపరివర్తనములన్నియును భ్రాంతిమూలకములై పోయెను. సరస్వతి సామాన్యబాలిక కాదనియు, జ్ఞానతేజోమూర్తి యనియు నిప్పుడాతనికి స్పష్టముగ బోధపడియెను. అప్పు డాతఁడు తనపూర్వచరిత్రమునంతను మఱచిపోయెను. సరస్వతిని వెంటఁబెట్టుకొనియే పుణ్యతీర్థముల సేవింపవలయునని గౌరీపతిశాస్త్రి నిశ్చయించుకొనియెను.

పదునాలుగవ ప్రకరణము.

"ఆదిగదా యుత్తమోత్తమ ♦ మైనపేరు!
ఆట్టిపేరు నంటినఁగాఁ శివ ♦ మమృత మగును;
కాలకాకోదరము పూల ♦ మాల యగును;
దారుణారణ్య మభినవో ♦ ద్యాన మగును;
జ్వలనకుండంబు చందన ♦ కలశ మగును;
బండఱాలేల యరవిరి ♦ పాను పగును;
మండు తేజంబురొంపె రే ♦ యెండ యగును;
మాతృదేవత సమాఖ్య ♦ మంత్ర మగును."

శ్రీష — ప్రమదావనము.

నాఁడు శుక్రవారము. కనకదుర్గాదేవ్యాలయము నిత్యోత్సవములతోఁ గన్నులపండువై యుండెను. దుర్గామూర్తి సర్వాలంకార విభూషితయై భక్తులకు సాక్షాత్కారిణియై తనజగన్మాతృత్వమును బ్రత్యక్షము చేయుచుండెను. భక్తిపరవశులగు స్త్రీపురుషు లనేకులు వేలకొలఁదినారికేళఫలంబులఁ గొట్టి దుర్గాదేవిపాదాభిషేచనముం గావించుచుఁ దమతమ మ్రొక్కులను జెల్లించుకొనుచుండిరి; లలితాసహస్రనామములతోఁ గుంకుమపూజలఁ గావించితమజన్మముల సార్థకములుగఁ జేసికొనుచుండిరి. సంధ్యాసమయమున దివ్యదీపారాధనములైనది మొదలుగ నెడతెఱపిలేకుండఁ బూజలు జరుగుచుండెను. శ్రీసూక్తస్తుతులచేతను, ప్రణవసంకలితదివ్యసహస్రనామోచ్చారణములచేతను బ్రత్యేకప్రార్థనావాక్యములచేతను గర్భాలయమంతయుఁ బ్రతిధ్వనించుచుండెను.

నిమిషనిమిషమునకును నీరాజనములే. మాటిమాటికిని మంత్రపుష్పములే. భక్తిపరవశులగు స్త్రీపురుషుల రాకపోకలచే దేవాలయ మంతయు నతిసమ్మర్దముగ నుండెను. భర్తలవెంట భార్యలును, తల్లులవెంట బిడ్డలును బోయి కలియుగప్రత్యక్షదేవి మూర్తి యగు కనకదుర్గం గన్నులారఁ గాంచి ధన్యంమన్యు లగుచుండిరి; ఫలపుష్పాదులను సమర్పించి పరమానందము నందుచుండిరి. కొందఱు కన్య లనుకూలవరులం గోరుకొనుచుండిరి. కొందఱు సువాసినులు నిత్యసౌభాగ్యమును గాంక్షించుచుండిరి. కొందఱు దంపతులు సార్థకసంతానఫలము నర్థించుచుండిరి. అనేకు లనేకవిధముల దీనజనోద్ధారిణియగు నాదేవిని బ్రార్థించుచుండిరి. వాంఛావిరహితులగు యోగులుకూడ నాత్మానందము నభిలషించి సేవించుచుండిరి. ఆజగన్మాత నర్థింపఁగాని దేమున్నది? ఆతల్లి ప్రసాదింపఁజాలని దేమున్నది?

రాత్రి పదిగంటలైనను జనసమ్మర్ద మింకను దగ్గలేదు. దేశదేశములనుండి భక్తులు వచ్చుచుఁ బోవుచునేయుండిరి. పరమభక్తాగ్రేసరుఁ డగు గౌరీపతిశాస్త్రి తనభార్య యగుసరస్వతిచే లలితా సహస్రనామములతో దుర్గాపూజ చేయించుచుండెను. సరస్వతి మాతృభావముతో — భర్తృభావముతో — దుర్గాదేవి దివ్యమంగళచరణపీఠముపైఁ గుంకుమపూజ గావించుచుఁ దదేకధ్యానముతోఁ దన్మయురాలై యుండెను. అప్పుడాదీపకాంతులయెదుట నాదివ్య తేజోమూర్తి మాతృపూజానిమగ్న యగు రెండవకనకదుర్గంబోలి నిగానిల్లుచుండెను. మూర్తీభవించిన భక్తికళాసరస్వతి యైయున్న యాసరస్వతిం జూచి యచ్చటివా రెల్లరును విస్మితులైపోయిరి. సరస్వతియం దట్టిభక్తిపారవశ్యమును గౌరీపతిశాస్త్రి యెన్నఁడును జూచి యుండలేదు. ఆతఁడును ముక్తకంఠుఁడై షోవుచుండెను.

సరస్వతి యేమి ధ్యానించుచున్నది? ఆమె యేమని ప్రార్థించుచున్నది? భర్తృసందర్శనము వాంఛించి యుండును—పితృమనశ్శాంతి నాకాంక్షించి యుండును. అంతకంటె నామెకుఁ గోరఁదగిన కోరిక లేమున్నవి? అప్పు డామె యేమి వాంఛించినను సర్వఃఫలము లభియింపవలసినదే— సరస్వతి యంతటి యేకాగ్రచిత్తముతోఁ దల్లి నారాధించుచుండెను. అనితరభావసంపన్నంబగు ననుకూలభక్తిసాధనముచే సందుకొనరాని దేమున్నది?

సహస్రనామపూజ సమాప్తమైనది. ధూపదీపాద్యర్చనములైనవి. సరస్వతి ముకుళితకరకమలయై దేవీసాన్నిధ్యమున నిలువఁబడియుండెను. గౌరీపతిశాస్త్రి భక్తిభావపులకితకంఠస్వరముతో శ్రీసూక్తపారాయణముం గావించుచుండెను. ఆనందపారవశ్యముచే నాతఁడఖిలమును మఱచిపోయెను. ఆకస్మికముగ సరస్వతిసర్వశరీరమును బులకితమైపోయెను; దృష్టులు చెదరిపోయెను; ముఖమండలమున వికాసము దోఁచెను గాని సకలాంగకములును బ్రకంపితములైపోవుచుండెను. విభ్రాంతురాలింబోలె నప్పుడామె చటాలున నాగర్భాలయమునుండి వెలుదిరిగి వచ్చి వెలుపలనున్న జనసంఘమునఁ బ్రవేశించెను. ఆదీపపుఁగాంతులలో నామె తరళనయనము లొక్కసారిగ నచ్చటనున్నయందఱవదనమండలములయందును జంచలకటాక్షములను బరగించెను.

సరస్వతి యాజనసంఘమునఁ దోవచేసికొనుచుఁ దటిద్వేగముతో నొక్కనిమిషములో ముఖద్వారమునొద్దకు వచ్చెను. ముఖమంటపమునఁగూడ జనసమ్మర్దము విశేషించియుండెను. సరస్వతి యున్మత్తింబోలి యాముఖమంటప మంతటను దిరిగెను. నిమిషములో నామంటపసోపానముల నవతరించి దేవాలయముచుట్టును బరిభ్రమించెను. అంతటను దీపకాంతులే— అంతటను జనసంఘమే—

సరస్వతి నిలిచినచోట నిలుచుట లేదు. చూచినచోటు చూచుట లేదు. అందఱును భక్త్యుత్సాహపూరితహృదయులై వచ్చుచుం బోవు చుండుటచే నప్పు డామె నెవ్వరును లక్ష్యము చేయుట లేదు. సరస్వతి క్రమముగా దుర్గాలయపశ్చాద్భాగమునం దున్నకొలనియొద్దకుం బోయెను. ఆమె యచ్చటను నిలువంబడ లేదు. ఆగిరి సమగ్రదేశ మంతటను దిరిగితిరిగి తిన్నగా గుహాముఖమునొద్దకుంబోయెను; నిర్భయముగ నాగుహాగర్భమునం బ్రవేశించి యంతలోనే దిరిగి వచ్చెను.

అటనుండి యామె యతిశీఘ్రముగ వెనుకకుం దిరిగి నిమిషములో నాలయప్రవేశద్వారమునొద్దకు వచ్చెను. అప్పు డామెమనస్స్థితి యెట్లుండెనో యూహించుట కసాధ్యముగ నుండెను. దుర్గాదేవి యామెచెవిలో నేమి చెప్పినదో ఆమెకన్నుల కేమి యగపడినదో — కాని శ్రీసూక్తపారాయణమున నిమగ్నుడై యున్నతండ్రికొఱ కామె నిరీక్షింపలేదు. పిచ్చిదానివలె గిరిసోపానముల నవతరించి క్రిందికిం బోయెను. కనకదుర్గాదేవిప్రసన్నం బగుననికస్థముంబోలి యష్టమీచంద్రుండు ప్రకాశించుచుండెను. సరస్వతి విభ్రాంతి వహించినదియుం బోలె నటునిటుం దిరుగుచు నంతలో శీఘ్రపదగమనములో నామార్గమునుబట్టి దక్షిణాభిముఖియై బయలుదేరెను. ఆమెచూపు లడుగుజాడలపైం బ్రసరించుట లేదు; తీవ్రవేగముతో ముందఱికే పరుగెత్తుకొని పోవుచుండెను.

క్రమముగ సరస్వతియును బరుగెత్తుట కారంభించెను. నిమిషములో నామె కృష్ణానద యొద్దునకు వచ్చెను. అప్పటితరుణచంద్రికాంతులలో నాకృష్ణవేణీచంచలతరంగములు తళతళ మెఱయుచు నాసరస్వతిహృదయభావతరంగముల ననుకరించుచుండెను. అట్టితరంగహాస్యములతోడనే యాదివ్యస్రవంతి యామెను జేరంబిలుచు

చుండెను. ఆనదీవేణికలంబోలి సరస్వతి ప్రతిరక్తనాళమునందును నుష్ణరక్త మతితీవ్రముగఁ బ్రవహించుచుండెను. తీరనికషంబులగుధ్వనితతరంగముల ననుకరించి యామె హృత్స్పంద మతివేగముగఁ గొట్టుకొనుచు హృదయాంతరాళమును విదారితముగఁ జేసివైచుచుండెను. ఆమె వేఁడినిట్టూర్పులచే నదీజలశీతలసమీరణంబులకుఁ గూడ వడ దాఁకుచుండెను. ఆమె కోమలశరీర మాపాదమస్తకమును స్వేదసంసిక్తమైపోయెను. తీరమార్గము ననుసరించి యామె యట్లే పోవుచుండెను; పార్శ్వభాగములఁ బరీక్షించుచుండెను; ఉన్నతప్రదేశముల నధిరోహించి యగపడునంతదూరమువఱకుఁదన తీవ్రదృష్టులను బురోభాగమునకుఁ బ్రసరింపఁజేయుచుండెను. ఆమె కోమలశరీరము నలయింపఁజేయుటకెంతమాత్రమును జింతాలేశములేక — ఆమె స్థిరహృదయమునుగూడ నాకర్షించుసామర్థ్యము గలిగి — ఆమె కన్నులయెదుట దూరమునం దేమియగపడుచున్నదో యూహించుటకుఁగూడ నసాధ్యమై యుండెను.

విరామము లేకుండ నామె యట్లే పరిభ్రమించుచుండెను. పాప మాకస్మికముగ సరస్వతి యున్మాదిని యైపోయినదా యేమి ?— ఎవ్వరేమైపోవుచున్నను గాలముమాత్రము తిరిగిచూడకుండఁ దన దారిని పోవుచునే యుండును. గ్రహచారముకూడ దాని ననుసరించియే యుండును — చూచుచుండఁగనే తరుణచంద్రుఁడు పశ్చిమాకాశతీరమునకుఁ బోయెను. బాహ్యప్రపంచమును మఱచి యామె పరుగెత్తుచుండెను — ఆయాసముచే నామె సొలసిపోయెను. అంతలో నమ్మృగాంకకిరణుఁడపరగిరిశిఖరమున కవ్వలఁ బడిపోయెను. ఆకస్మికముగ నాలో చంద్రిక యంతరించిపోయెను. అప్పుడు సరస్వతికంతయు నంధకారమైపోయెను. ఆశావిహీనయై యామె యట్లే కూలఁబడిపోయెను.

అప్పటి యామెహృదయావస్థ యెట్లుండెనో తెలిసికొనుట కుపాయ మేమున్నది? ఆమె చాలసేపటివఱకట్లే దీర్ఘశ్వాసములను విడుచుచుఁ గూర్చుండి యుండెను. అప్పు డామె హృదయాంతరాళమున నెన్నియో యాలోచనాపరంపరలు తరంగితములై యుండును! ఎన్నియో పూర్వపక్షసిద్ధాంతములై యుండును— ఆకస్మికముగ నామె యటనుండి లేచెను; నలువంకలను దిరిగి దిరిగి చూచెను. ఏమున్నది? అంతటను గాఢాంధకారమే—

అప్పు డామె తీరమును వదలి నదీజలముల కభిముఖముగ బయలుదేరెను. నిమిషములో నామె సర్వజీవోద్ధారిణి యగునదీమాతృకను సమీపించెను. సరస్వతిపావనచరణకమలములకుఁ బవిత్రనదీజలస్పర్శన మైనది. ఆపావనజలతరంగములా మెపాదములపైఁ బడి యేమేమియో బ్రతిమాలుకొనుచున్నట్లుండెను. తదేకదృష్టితోనున్న సరస్వతి కాసంగతి యేమియును దెలియదు. ఆమె యప్పుడు "హా! పరమేశ్వరా!" అని శోకగద్గదస్వరముతో బిగ్గరగ నెలుఁగెత్తి యేడ్చెను. మాతృమరణసమయమునఁగూడ నామె యట్లు దుఃఖింపలేదు. అంతమాత్రముచే వివేకవతి యగుసరస్వతి తుదకధైర్యవతి యైపోయిన దని సంశయపడ నక్కఱలేదు— ఎవ్వరు తమజీవితకాలమునం దొక్కప్పుడైన నట్టిపవిత్రదుఃఖలేశమునైన ననుభవించి యెఱుంగరో— అట్టివారి జీవితము నిస్సారమైనది! నిరర్థకమైనది! సరస్వతిహృదయము మన కవేద్యమై యున్నది గాని యామెహృదయసరోవరమున నిట్టికరుణరసతరంగములు నిరంతరమును బ్రతిధ్వనితము లగుచునే యుండును!—

ఆయమృతకళ క్రమక్రమముగ నమృతగర్భమునఁ బ్రవేశించుచుండెను. ఆమెకోమలాంగకములు పావనగౌరవములైనవగుటచే జలనిమగ్నము లగుచుండెను. అప్పు డానముత్తుంగతరంగము లా

మెను బలవంతముగఁ దీరమునకుఁ జేర్పఁ బ్రయత్నించుచుండెను. ఆదృఢహృదయమును మరలించుటకు క్షణభంగురము లగుజలభంగముల కెట్లు సాధ్యమగును? తుదకామె ,, హా! ప్రాణప్రియా! హా! ప్రాణకాంతా! హా! ప్రాణేశ్వరా!'' అని యాత్మేశ్వరుని దివ్యనామమంత్రోచ్చారణముం జేయుచు నామంత్రరాజమహామహిమంబుచేతనుం బోలె నానదీగర్భమున నంతర్నిమగ్నయైపోయెను. ఆదివ్యతేజోమయసరస్వతికిని నాకృష్ణవేణీసరస్వతికిని నైక్యానుసంధాన మైపోయెను. అప్పు డాయమృతమయమూర్తి యమృతమయప్రపంచమున నంతర్ధానయై పోయెను.

ఆయమృతమూర్తి యంత్యమధురస్వరమునుండి వెలువడినపావనమంత్రాక్షరము లింకను నాగాఢాంధకారమున దశదిశలఁ బ్రతిధ్వనించుచునే యున్నవి. ఎంతటి విపరీతసంఘటనము! ఎంతటి విచారకరసందర్శనము. కరుణామయి యగుప్రకృతిదేవి యాకష్టసందర్శనమునకు సహింపఁజాలక కన్నుల మూసివైచుకొన్నది! కరుణార్ద్రహృదయయగు కృష్ణాతరంగిణి తరంగహస్తంబులఁ గొట్టుకొనిపోవుచున్నది! ఆకృష్ణవేణీతరంగములకంటెను దీవ్రముగ మనహృదయములుకూడఁ గొట్టుకొనిపోవుట కేమిసంబంధమున్నది? పరిచయానుబంధమే మనల నిట్లు బాధించుచున్నది! కేవలపరిచయముచే మనమే యిట్లగుచుండఁగాఁ బాప మేకపుత్రికామాత్రజీవనుఁడగు గోపతిశాస్త్రి యెట్లుండునో గదా!!

మధుసేవన ప్రకరణము.

“త్రాగుము నాతో నేఁటు
త్రాగినవటు త్రాగుమీ ! స్వతంత్రతతోడన్
రాగిల్లెదరిక నమ్మా !
యీగర్వము చప్పరింపు మీ మెలమెల్లన్ !

వక్షీకము — హారావళి

రాజమహేంద్రవరనగరము నందలి గోదావరియొడ్డున కించుక దూరమునం దొకవిశాలభవనము కలదు. ఆమందిరమున సాయంకాల మాఱుగంటలు మొదలు రాత్రి పదిగంటలవఱకును జనులరాకపోకలు విశేషించి యుండును. దానిని గొందఱు విహారమందిర మనియును, గొందఱు విశ్రామభవన మనియును గొందఱానందనిలయ మనియును భావించుచుందురు. ఎవ్వ రెట్లనుకొన్న నేమి? విలాసప్రియు లగువారి కది పరమమిత్రస్థానమనియే చెప్ప వచ్చును.

రాత్రి యేడుగంట లైనది. ఆసౌధమునందలి యంతస్థు లన్నియును జనసంకులములై యుండెను. ఒక్కచో సంగీతరసతరంగములు — వేఱొకచో సరససల్లాపసుధాతరంగములు - మఱియొకచో వివిధమధురాహారభోజనకోలాహలతరంగములు — ఇంకొకచోఁ దీవ్రమదిరారసప్రతిబింబితదీపమాలికాతరంగములు — ఆసౌధమంతయు నీవిధముగ విలాసోత్తేజితమై యుండెను. ఆభవనమునందలి క్రిందియంతస్తునకుఁ బశ్చాద్భాగమునం దున్నవిశాలచతురంతప్రదేశమే మధుమతీవిలాసనిలయము — అదియే రహస్యపాననిరతుల నిత్యసేవాస్థానము — అందిప్పుడు మధురభాషిణి యగుమధుమతీ

దేవి యానందనృత్యము చేయుచుండెను—ఆశ్రితకోటి కానందో త్సాహములం బురికొల్పి నవ్వించుచుండెను—నాట్యము చేయించు చుండెను. ఆయుత్సాహసమయమున నొకమోహినీమూర్తి భక్తుల కందఱకును బానపాత్రములం బ్రిసాదించుచుండెను. ఆదేవీప్రసాద మునకై యందఱును దొందరపడుచుండిరి— ఉవ్విళ్లూరుచుండిరి— దేవీప్రతిమూర్తి యగునాసుందరి సిప్పటి పాతముగ నందఱకును గ్రిమ్మక్రమముగ నందించుచునే యుండెను.

ప్రదీపకాంతులలోం బానపాత్రములు మెఱసిపోవుచుండెను. మదిరారసమున నామదవతీకటాక్షములు మీనపుచ్ఛములంబో లి సంచలితము లగుచుండెను. భక్తులదృష్టు లన్నియు నాసుందరీమూ ర్తిసుందరకటాక్షములపై నాధారపడి యుండెను. అచ్చటం జిన్నపెద్ద తనముల విభేద మెంతమాత్రిమును లేదు. సర్వసౌభాత్రిత్వ మా సేవామందిరమున మూర్తీభవించిన ట్లుండెను. ఆసుందరీమూర్తి కొ అప్పుడీఁగవలె నంతటను దిరుగుచు:—

«« మఱచితివో నాయకా
మెమ మఱచితివో నాయకా!
నను మఱచితివో నాయకా!—
మఱిమఱి బిలిచ్చిన మాటాడవు నీ
నరస నిలిచి కల శమము రాకున్నది--మఱ--''

అని మృదులస్వరమునం బాడుచు నొయ్యారముగ నానవకల శముల నందించుచున్న ట్లుండెను. తన్మయత్వముచే నెల్లరును మో హినీదేవి యమృతకలశమును దమకందించుచున్నట్లే భావించుకొను చుండిరి. ఇంకేమి కావలయును? భూలోకస్వర్గము వారికన్నుల యెుట్టఁ దాండవ మాడుచున్నది! వారికిం దనివి తీరుట లేదు. అందఱు నాసుందరమూర్తిని గనకకుసుమములతోఁ బూజించుచుం

డిరి. అర్థప్రాణము లామె కధీనము చేసి యానందపరవశులై పోవుచుండిరి. ఆదేవి సుప్రసన్నవదనయై యందఱను సమభావముతోనే యాదరించుచుండెను.

అర్ధస్ఫుటస్వరముతోఁ గొందఱు పాడుచుండిరి. అడుగువరుసలతోఁ గొంద ఱాడుచుండిరి. నిశ్చలచిత్తములతోఁ గొంద ఱాలకించుచుండిరి. నిమీలితనయనములతోఁ గొంద ఱాలోకించుచుండిరి. కొంద ఱాసుందరీమూర్తిని ధ్యానించుచుండిరి. కొందఱు పలుమాఱుఁ బిలుచుచుండిరి. కొంద ఱామెతో నవ్వుచుండిరి. ఆసుందరి వేయి గన్నులతో నందఱను బరికించుచునే యుండెను. వేయిచేతులతోఁ బానపాత్రముల నందించుచునే యుండెను.

అప్పు డొకయువకుఁ డాకస్మికముగ నాపానమందిరమునఁ బ్రవేశించెను. ఆతనివయ సిరువదియేండ్లకు మించి యుండదు. ఆతని శరీరము మిగులబలిష్ఠమై చూచుటకు సుందరమై యుండెను. ఆతని దుసులు నూత్నము లయ్యును మలినములై యుండెను. ఆతఁడు ఖీపమును ధరించియుండెను. ఆతనివదనము స్థిరగంభీరధీరభావవిలసితమై యుండెను; కన్నులు విశాలములై చూపులు తీవ్రములై యుండెను. నాసిక దీర్ఘమై యగ్రమున నించుక వంగి యుండెను. తుమ్మెదఱెక్కలవలె నీలములై యొత్తుగనున్న మీసము లాతనివదనమున కందముం గూర్చుచుండెను. ఆతనిశరీరచ్ఛాయ చామనచాయ—ఆజానుబాహుఁ డగునాతఁడు మల్లవిద్యాపారంగతునివలె నగపడుచుండెను.

అప్పుడే మధుపాత్రము నందుకొని త్రాగఁబూనుచున్నయొక పురుషుఁ డాతనిం జూచి యించుక విస్మితుఁడై "గంగా! విడుదలయైనదా?" అనియెను.

పదునాఱవ ప్రకరణము.

"కులకాంతల నినుఁ బోలం
గలవారలు కోటికొక్కరు కలరో లేరో
కులశీలవ్రతగరిమం
బలు నీకే చెల్లెనమ్మ పులుఁగుపడంతీ!

కపోతము — హారావళి

సరస్వతి తండ్రితో బయలు దేరునప్పుడు సత్యవతి నెన్నియో విధముల నుపలాలించి ప్రబోధించి యెట్లో యామెకడ సెలవు గైకొనియే వెడలిపోయెను. సత్యవతికి గత్యంతరము లేక యంగీకరింపవలసివచ్చెను. కాని యామె యప్పటినుండియును ప్రాణముం బాసినశరీరమువలెఁ గళావిహీనయై యుండెను. ఆశుభసమాచారము లోకమునం దతిశీఘ్రముగఁ బ్రచారమగుచుండును. చెన్నపురినుండి బయలుదేరి వచ్చుచున్న భారతరావునకు విజయవాడలో సరస్వతీమరణవృత్తాంతము తెలియవచ్చెను. ఆదుఃఖకరసమాచారము సోదరునివలన సత్యవతి వినియెను. ఆమెకీజగమంతయు నంధకారమయమైపోయెను. ఎలదుఃఖములను నిమిషములో మఱపింపఁజాలిన ప్రాణసఖి యగుసరస్వతియే మరణించినది. ఇఁక నాసత్యవతికి దుఃఖసముద్రమును దరించుట కుపాయ మేమున్నది?

అన్నవచ్చినసంతోష మామె కించుకంతయును లేకపోయెను. ఆతఁడుపట్టపరీక్షయం దుత్తీర్ణుఁడయ్యెనని తెలియవచ్చినప్పటిసంతోషముకూడ నామె కగపడలేదు. ఆమెకన్నుమూసినప్పుడెల్ల సరస్వతిం గూర్చినస్వప్నములనే కాంచుచుండెను. సరస్వతి దూరమునందుండి

చేయెత్తి యామెను బిలుచుచున్నట్లు—సరస్వతితల్లివచ్చి "సత్యవతీ" సరస్వతినివిడిచి యొక్కతెవు నిట్లుంటివేమే!" అని పలుకరించుచున్నట్లు—తాను గృష్ణానదిలో స్నానముచేయుచు మునిఁగిపోయినట్లు—సరస్వతి యతివేగముగ వచ్చి తన్నుదరించి యొక్కడకో తీసికొనిపోయినట్లు—ఇట్టివియేస్వప్నములు!

ఆమెకు నిరంతరమును సరస్వతీధ్యానమే—తన్ను సరస్వతితోఁ గూడఁ బంపుటకుఁ దనతల్లితండ్రు లంగీకరింపలేదు. కూడఁ దీసికొనిపోవుటకు సరస్వతియు నంగీకరించినది కాదు. తాను దోడు గనున్నచో సరస్వతి మరణించుట కవకాశము లేకపోవును. తానును బయలుదేరకపోవుటయే యామెమరణమునకుఁ గారణమైనది—సత్యవతి యీవిధముగ భావించుకొనుచు హృదయపరితాపము ననుభవించుచుండెను. భారతరా వామెహృదయమును లోకవ్యాపారములకు మరలించుటకై యెన్నియోవిధములఁ బ్రయత్నించుచుండెను; వార్తాపత్రికలను జదివి చెప్పుచుండెను; మహాపురుషులయుపన్యాససారాంశములను బ్రబోధించుచుండెను. అన్నమొగమాటముచే వినుచుండెను గాని యామె కేమియును రుచించుట లేదు. క్రమక్రమముగ నామెమనఃపరితాపముచేఁ గృశించుచుండెను.

ఒకనాఁడు భారతరా వామెయొద్దఁ గూర్చుండి "సోదరీ! నీసంగతి యేమియును బాగుగ లేదు." అనియెను.

సత్యవతి నిట్టూర్పులు విడుచుచు "నాయదృష్టము!" అనియెను.

భార—ఇప్పుడు నీయదృష్టమున కేమిలోపము?
సత్య—అనుభవించుటకు బ్రదికి యుండుటయే లోపము!
భార—ఇంకను నీవెఱ్ఱివేదాంతములు వదలిపెట్టవా?

సత్య—నీవు పెండ్లి చేసికొని యొకయింటివాఁడవై తల్లిదం డ్రులతోఁగలసి సుఖయింపవచ్చును. అనేకకుటుంబములను బోషించుచునదృష్టము పరమేశ్వరుఁడు నీకుఁ బ్రసాదించినాఁడు ?

భార—నేను బెండ్లియాడినచో నిజముగ సంసారసుఖము లభియించునా ?

సత్య—సుఖావకాశ మున్నది— ఆశ యున్నది—

భార—నీకాయాశ యేల లేకపోవలయును ?

సత్య—నాయాశాచంద్రుఁ డస్తమించి పోయినాఁడు.

భార—నిన్నటిరాత్రి యట్లే యున్నదా ? నేఁడు సూర్యోదయము కాలేదా ? రాత్రి మరలఁ జంద్రోదయము కాదా ?

సత్యవతి మౌనముతోఁ దలవంచుకొనియెను.

భార—సోదరీ ! మాటాడ వేమి ? నా యానందచంద్రిక యస్తమింపలేదా ? చిన్నతనమునసే నాభార్యమరణించినది కాదా? అంతమాత్రముచే నేను హతాశుఁడనై పోయితినా ? అదృష్టముం దలఁచుకొని పరితపించుచుంటినా ? నీజీవితముతోఁగూడ నాజీవితమును సంతోషవంతముగఁ జేయుటకుఁ బ్రయత్నము చేయుచుంటినిగాదా ? సుఖము మనచేతిలో నున్నప్పుడు — మనహృదయములో నున్నప్పుడు— ఈయనర్థకవిచారమును దెచ్చిపెట్టుకొనుట యెందుకు?

సత్యవతి యాపాదమస్తకము గంపించి పోవుచుండెను. అన్నమాటలకు సమాధానము చెప్పుట కామెకు ధైర్యము లేదు; అన్నహృదయమును హరలించుటకు శక్తి లేదు. అన్నమనస్సు నొప్పించుట కామె కిష్టములేదు. సత్యవతిహృదయము కొట్టుకొని పోవుచుండెను; పరితపించిపోవుచుండెను— ' సరస్వతి యిట్టిదున్న హాసందిగ్ధసమయమునం దుండినచో నెంత యనుకూలముగ

నుండును ? ” అని యామె భావించుకొనియెను. సరస్వతి యామెజీవితమార్గమును నిర్మలముగఁ జేసిపోయినది— భక్తిరసార్ద్రముగఁ జేసిపోయినది— ఆనందచ్ఛాయల నావరింపఁజేసిపోయినది. భారతరా విప్పు డామార్గమునే పరిమళవంతముగఁ జేయఁజూచుచున్నాఁడు— ప్రేమామృతరససిక్తముగఁ జేయఁ దలఁచుచున్నాఁడు— సుఖకుసుమనికుంజావృతముగఁ జేయనెంచుచున్నాఁడు. భారతరావు పట్టినపట్టు వదలుస్వభావము కలవాఁడు కాఁడు. ఇది యాతయుం దలఁచుకొని సత్యవతి రత్నప్రతిమవలె నిశ్చేష్టయైపోయెను.

అప్పుడు భారతరావున కొకయుత్తరము వచ్చెను. అతఁడు దాని నందుకొని చదివిచూచి యాజాబును సత్యవతిచేతి కిచ్చెను. సత్యవతి యాయుత్తరమునుఁ జదివెను. అందిట్లున్నది.

“మిత్రమా !

నీవు పట్టపరీక్షయం దుత్తీర్ణుఁడ వైతి వనుసంగతి తెలిసి యానందించితిని. నేను విజయవాడనుండి కాకినాడకు వచ్చి క్రైస్తవపాఠశాలయందు ఉపాధ్యాయుఁడుగా నుంటిని. ఈవిద్యాశాలయం దింకొక యుపాధ్యాయుఁడు కవలసి యుండెను. నీవు వచ్చినచోఁ జాల బాగుగ నుండును. నీజాబున కెదురు చూచుచున్నాను. నీక్షేమము వ్రాయుము. చి॥ సత్యవతి సుఖవతియై యున్న దని తలంచెదను. విశేషములు వ్రాయుము !

ఇట్లునీమిత్రుఁడు

చంచలరావు”

సత్యవతి సంతోషముం దెచ్చుకొని “అన్నా ! నీకుద్యోగ మగును గాఁబోలును ! ” అనియెను.

భార— రావచ్చును !

సత్య—ఆచంచలరా వెవ్వరు? ఆతఁడు నన్నెట్లెఱుంగును?

భార—నామిత్రుఁడైనప్పుడు నిన్నెఱుఁగకుండునా? నీసంగతి యంతయు నాతనికిఁ దెలియును—ఆతఁ డెప్పుడును నీకొఱకే జాలి పడుచుండును.

సత్య—ఆలాగా?

భార—ఔను. ఆతఁడు నిరంతరపరోపకారపరాయణుఁడు-దయార్ద్రహృదయుఁడు.

సత్య—కావుననే నీకు మిత్రుఁడు.

భార—నాకు నాతనికి నెంతయంతర మున్నది? ప్రాణమిత్రుఁడనిన నాతఁడే—నీమాట తలఁచుకొని నాకంటెను నాతఁ డెక్కుడుగ విచారించుచుండును.

సత్య—పవిత్రస్నేహభావ మట్టిదియే కాదా?

భార—అతనిచరిత్రముకూడ నతిపవిత్రమైనది. బాలవితంతుసముద్ధరణమునకై యాతఁ డెల్లప్పుడును బాటుపడుచుండును—

సత్యవతి యప్రతిభ యయ్యెను "బాలవితంతుసముద్ధరణమా?—బాలికలను వితంతువులుగాఁ జేసినవాఁ డెవ్వఁడు?" అని ప్రశ్నింపఁ దలఁచెను గాని యందుపైఁ దనయన్న యనాలోచితముగఁ "దల్లిదండ్రులు" అని బదులు చెప్పునేమో యని యాపె సంశయపడియెను. అన్నచే నంతమాట యనిపించుట కవకాశముం గల్పించుట సత్యవతి కిష్టము లేదు. ఆమె యాకస్మికముగ నిరుత్తరయైపోయెను. భారతరావున కదియే యాలోచనమున కవకాశమును గల్పించెను.

పదునేడవ ప్రకరణము.

"తెల్లనివి పాలు నల్లని
వెల్లను నీళ్లనుచుఁ దలఁచె • దీనేమియు నా
యుల్లిక తెలుఁగవు గుండెఁ
దల్లడపా టొందవి నేమి • తారొక్కఁటే గదా !"

చిత్రకథాసుధాలహరి.

రసము పుల్లనైయున్నను రంగుమామిడిపండ్లనే యేరికొనుచుందురు. మేనికి దెగులు తెచ్చుచున్నను మిపనుబియ్యమునే వాంఛించుచుందురు. మన్నిక తక్కువైనను మాంఛెస్టరుబట్టలనే యుపయోగించుచుందురు. చెక్కులుమండిపోవుచున్నను సీమసబ్బులనే వాడుకొనుచుందురు. మదుపు తక్కువైనను మాయ మెఱుఁగులకే పడిపోవుచుందురు. రూపమోహము చాలఁ జెడ్డది! శాల్మలీఫలమున కాశపడి పోయి చిలుక కన్నులఁబోఁగొట్టుకొనుచున్నది! దీపకాంతులకు భ్రమపడి పోయి శలభము నశించిపోవుచున్నది! రూపమునం దట్టిమాధుర్య మున్నది! రూపమునం దట్టియద్భుతాకర్షణశక్తియున్నది. కాని రూపమోహ మతివినిందితమైనది! రూపకాంతి కన్నులను మూసివైచుచుండును. అట్టిరూపమును గన్నులఁ దెఱచి చూడఁగలవాఁ డొక్కఁడుమాత్రమే యీలోకమున ధన్యుఁడని చెప్పవచ్చును.

వేంకటేశ్వరరావు సామాన్యప్రకృతి. ఆతనిహృదయము పరిపక్వమైనది కాదు. వినిర్మలప్రేమనిబద్ధమైనదియే గాని విలాసచంచలమైనది. కావుననే యాతఁ డిప్పు డమృతకలశము తన చెంతనే యున్నను—ఆనవపాత్రమునకుఁ బ్రాఁకులాడుచున్నాఁడు—ముద్దు

గులాబిపువ్వు చేతిలో నున్నను మోముగుప్పావునకుఁ గన్నులు మరలించుచున్నాఁడు. ఆచిత్రపటమును జూచినకొలఁదిఁ గ్రమముగ నాతని కామూర్తినే ప్రత్యక్షముగఁ జూడవలయు నని కోరిక కలుగుచుండెను. ఆమె యెవ్వరో యనసూయకుఁ దెలియదు; తనకును దెలియదు. దామోదరరావు నడుగవలయు నని యాతఁ డనుకొనియెను. దామోదరుఁడీనడుమఁగొన్నిదినము లనుండి యిచ్చటకు వచ్చుట లేదు. ఊరికిఁ బోయెద నని మాత్రము చెప్పియున్నాఁడు. ఇంకను వచ్చియుండఁడు—వచ్చెనో నాతఁడు తన్నుఁ జూడకుండ నుండఁగలఁడా?—వేంకటేశ్వరరా వీవిధముగ నాలోచించుకొనుచుండెను.

మరలమరల నాతనికాకోరిక కలుగుచునే యుండెను. ఆకస్మికముగ నేదియో మనసునకుఁదట్టుటచే మరలించుకొనుటకుఁ బ్రయత్నించుచునే యుండెను. ఎంతప్రయత్నించినను నాతని కాధ్యానము వదలుట లేదు. ఆతఁడట్లే భావించుకొనుచుండెను. అప్పు డనసూయ మెల్లమెల్లగ వెనుకనుండి వచ్చి పరాకుగనున్న యాతనికన్నులను మూసెను. ఆసుఖస్పర్శచే వేంకటేశ్వరునిసర్వాంగకములు నానందపులకితము లయ్యెను. ఆతనిశరీరమునందలి ప్రతిపరమాణువునుగూడ నాసుఖస్పర్శమునందలియానందము నెఱుంగును. వేంకటేశ్వరునకు ధ్యానభంగ మయ్యెను. అప్పు డాతఁ డనసూయకరకమలములపైఁ దనచేతులనుంచి: —

"వెనెలచాటున వీరెవరు?
నెఱవన్నెచాటున వారెవరు?
చిఱునవ్వులలో విరిదండ
బంగరుపువ్వులలోఁ గలకండ!"

అని పాడనారంభించెను. అనసూయ నవ్వుచు ముందటికి వచ్చి మృదులస్వరముతో "అంతపరాకుగ నున్నారేమి?" అనియెను.

వేంకటేశ్వరుఁ డులికిపడి సంభ్రమముతో "ఏమియు లేదు. నీవువచ్చితి వని చూడలేదు" అనియెను.

అన—ఎందుచేత?

వేంక—పరధ్యానముతోఁ గూర్చుండియుంటిని—

అనసూయ నవ్వుచు "ఔను! అది యెందుచేత ననియే నడుగుచుంటిని" అనియెను.

వేంకటేశ్వరుఁ డప్పుడు తా ననందర్భముగ మాటలాడితి నని గ్రహించుకొనియెను. తనహృదయభావముల కాటును గోటును గలిగియున్నసంగతి నాతఁడు తెలిసికొనియెను. వేంకటేశ్వరుఁ డప్పు డాత్మభావగోపనమునకై చిఱునవ్వునవ్వుచు "ప్రాణేశ్వరిపై మన సుపోయినప్పుడు పరాకు కాదా?" అనియెను.

అనసూయ యాతనిపైఁ బ్రేమైకవీక్షణములఁ బరగించుచు "నేనాలస్యముగ వచ్చితి ననుకొనియెదను" అనియెను.

వేంక—వంటలక్కతో మాటాడుచుంటివి కాఁబోలును?

అన—లేదు. ఆమె యీనడుమఁ గొన్నిదినములనుండి "నీనాథుఁ డట్లున్నాఁడేమి? అంతపరాకుగ నున్నాఁడేమి? ఆత నిచూపు లట్లున్న వేమి?" అని నన్నుఁ బ్రశ్నించుట కారంభించినది. ఆమాటలకు నాకరము తెలియుటలేదు. అందుచే నేనామెతోఁ దఱచుగ మాటాడుట మానివైచితిని. భోజనము చేసి మేడమీఁదికి వచ్చుచుండఁగాఁ బంజరములోని చిలుక నన్నుఁ బలుకరించినది. దానికొక పనసతోన నందించి మఱి వచ్చితిని. అందుచే నించుక యాలస్యమైనది.

వేంక — పరాకుగ నుంటి ననుట కది యా కారణము?

అన — కాదు కాదు! పరిహాసమునకై వంటలక్క యన్న మాటయే మరల నేను నంటిని.

వేంక — అలాగా? నిజముగ నేనట్లు లేనుగద?

అన — ఉన్న నేమి? పరాకుగ నుండుటగూడఁ దప్పా?

వేంక — తప్పు కాదుగద! నాయందుఁ దప్పు లేదని నీవు భావించుటయే నాకుఁ గావలసినది. చెప్పుము! తప్పు లేదుగద!

అన — చెఱకుపానకమునఁ జేఁదు లేదని చెప్పుట యెందుకు? వెన్నెలవెలుఁగున నేంద్రము లేదని చెప్పుట యెందుకు?

వేంకటేశ్వరున కింతవఱకు ననసూయ తనతప్పులను గ్రహియింపఁగలుగుటయే యానందముగ నుండెడిది. ఇప్పుడో—తనయందెంతమాత్రమును దప్పు లేదని యామె మనఃపూర్వకముగఁ దెలుపువఱకును దృప్తి కలుగుట లేదు. ఆతఁడు స్వప్నచిత్తముతో "ప్రాణేశ్వరీ! నీవు ప్రేమమయమూర్తివి! నీహృదయము నిష్కల్మష మైనది! నీనిస్తరంగప్రేమామృతసాగరమున నాజీవితనౌక చల్లగ జరిగిపోవుచున్నది. నిన్ను జీవితేశ్వరిగఁ బడయుటచేతనే నాజన్మము సార్థక మైనది!" అనియెను.

తనప్రాణేశ్వరుఁ డింతటివిలక్షణముగ సంభాషించుట యనసూయయిదివఱకు వినియుండలేదు. ఆమాటలనుబట్టి యాతనిహృదయపరిణామము సులభముగ బోధపడుచునే యున్నది. ఆదృష్టియే లేనియనసూయ కాసంగతి యెట్లు తెలియును? ఆసంభాషణమునందుఁగూడ నామె యభినవానందము ననుభవించుచుండెను.

అంతలో దామోదరరా వచ్చటికి వచ్చెను. అనసూయ వెలుపలిసోపానముల నవతరించి క్రిందికి దిగిపోయెను. వేంకటేశ్వరుఁ

దప్పకు "దామోదరా! రమ్ము!" అనిపిలిచెను. దామోదరుఁడు లోపలకుఁ బోయి యొకకుర్చీపైఁ గూరుచుండెను.

వేంక—మిత్రమా! ఈనడుమ నెక్కడకుఁ బోయితివి?

దామో—రాజమహేంద్రవరము.

వేంక—ఎందుకు?

దామో—అడుగవలయునా?

వేంక—జూదమును మానఁదలఁచుకొన లేదా?

దామో—జూదము మానినచోఁ ద్రాగుటకు ధన మెక్కడ నుండివచ్చును?

వేంక—త్రాగుటమాత్ర మంత మంచిదా?

దామో—మధ్యమవయసుకూడఁ గడచిపోవుచున్న యిప్పుడా మంచిచెడ్డలను బరామర్శించుట?

వేంకటేశ్వరుఁడు నవ్వుచు "నీకొఱకుఁ గన్నులు కాయలు కాచినట్లున్నవి" అనియెను.

దామో—అంతయావశ్యక మేమివచ్చినది?

వేంకటేశ్వరుఁడు సంభ్రమముతో నటునిటుఁ దిరిగి చూచెను; కుర్చీపైనుండి లేచి వెలుపలిసోపానములవఱకును బోయి పరిశీలించెను. అనసూయయెచ్చటనైన దాఁగి యున్నదేమో యని యాతని సంశయము! పాపము! నిర్మలస్వభావ యగుననసూయ యప్పుడే క్రిందికి దిగిపోయినది. వేంకటేశ్వరునిహృదయము శంకాకళంకిత మగుటకుఁ గారణ మాతఁడు రహస్యచింతానిమగ్నుఁడై పోవుటయే. అతఁడు సుఖామృతకలశ మానందసౌధమునందలి శాంతిపీఠమునుండి పరిభ్రష్టమై క్రమముగ సోపానముల నంతరాంతరములనుండి యధోముఖముగ దొరలిపడిపోవుటకారంభ మయ్యెను. వేంకటేశ్వరుఁడు

మెల్లమెల్లగ మరల వచ్చి యథాస్థానమునం గూర్చుండి ‘‘దామో దరా! రహస్యముగ నినొక్క మాటయడుగవలయుననియున్నది’’ అనియెను.

దామోదరుఁడు నవ్వుచు ‘‘నేను వినవచ్చునా?’’ అనియెను.

వేంక — పరిహాసము కాదు. అంతరహస్యము! మాట చెప్పి మఱచిపోవలయును.

దామో — అదియెట్లు? మఱచిపోవుటయును నిదురపోవుటయును మనప్రయత్నములకు సాధ్యమగునవియా?

వేంక — కాదు. ఈరహస్యము మనయిరువురిలోనే యుండవలయును.

దామో — సరే.. చెప్పుము!

వేంకటేశ్వరుఁడు సంగీతపుస్తకమునుండి చిత్రపటమును దీసి దామోదరునకుఁ జూపించెను. దామోదరుఁడు నవ్వుచు ‘‘బహిరంగముగఁ జాలదినములనుండి యీపుస్తకమునందే యున్నదీనిలో రహస్యమేమున్నది?’’ అనియెను.

వేంక — ఈమూర్తి యెవ్వరు?

దామో — స్త్రీమూర్తి —

వేంక — అదికాదు — ఈమె యెవ్వరు?

దామో — ఆసంగతి నీకెందుకు?

వేంక — ఈమెసౌందర్యమును జూచి మాయనసూయకూడ మెచ్చుకొన్నది.

దామో — సానిమెఱుఁగులు సంసారులకు వింతగ నుండవా మఱి?

వేంకటేశ్వరుఁ డాతృతో ‘‘ఈమె సానియా?’’ అనియెను.

దామో—సాని గాకున్న నీమెచిత్రము నాపుస్తకములోని కెల్లువచ్చును ?

వేంక—ఈమె నీయొద్ద సంగీతము నేర్చుకొనుచున్నదా ?

దామో—సంగీతమే కాదు. చాలఁగఁజదివినది ! సానివాడ యంతయును సంసారిగూడెము చేయవలయు నని యామె యుద్దేశించినది.

వేంక—అది యెట్లు ?

దామో—తాను పెండ్లి యాడి యందఱు నట్లు ప్రోత్సహింపవలయు నని యామెయూహ.

వేంకటేశ్వరుఁడు మందహాసముతో "భోగముదానికిఁ బెండ్లియా ?" అనియెను.

దామో—సానులే పెండ్లియాడినచో సంసారుల పెండ్లిండ్లకు సంగీతమేళములమాట యేమనియా నీసంకోచము ?

వేంక—అదికాదు—ఆపెండ్లి లోకస్వభావమునకు విరుద్ధము కాదా ?

దామో—అట్లయినచో సానులవృత్తియే లోకస్వభావానుకూలముగ నున్నదని కాఁబోలును నీయూహ ?

వేంక—కాదా మఱి ?

దామో—ఈనడుమ నీస్వభావము మారినట్లున్నదే !

వేంకటేశ్వరుఁ డప్రతిభుఁడై పోయెను. దామోదరుఁడు తన జాలసూత్రములను బలముగ బిగిపెట్టుచున్నసంగతి పాపము చపలహృదయుఁడగు వేంకటేశ్వరుఁ డెట్లు గ్రహింపఁగలఁడు ? అతఁడతిమందస్వరముతో "ఆమెకుఁ బెండ్లియైనదా ?" అనియెను.

దామో—అంతయును సిద్ధమైనది— తుద కస్తవ్యస్తమైనది.

వేంక—ఇప్పు డామె సానిగనే యున్నదా ?

దామో—లేదు— కన్యయై యున్నది.

వేంక—ఇంకను పెండ్లి యాడఁదలఁచియే యున్నదా ?

దామో—తగినవరుఁడు దొరకినచో—

వేంకటేశ్వరుఁడు సంకోచముతో "ఆమె నొకసారి చూడవలయు నని యున్నది" అనియెను.

దామో—ఆమె సామాన్యురాలు కాదు. మంచిమాటలతో మనయింటికి వచ్చునను నమ్మకము లేదు.

వేంక—రహస్యముగా మనము పోయి చూడవచ్చునా?

దామోదరుఁడు వికటహాసము చేయుచు "మనయిరువురిలో నుండవలసినరహస్య మిదియే కాదా ?" అనియెను.

వేంక—ఔ—ను—

దామో—అలాగా? కంపుగొట్టకుండఁ గల్లుత్రాగుటయెట్లు?

ఆమాట వేంకటేశ్వరునిహృదయమున బల్లెపుఁబోటువలె నాటెను. అంతటితోవారిఘాతముల కాతనిహృదయ మలవాటుపడునట్లు చేయుటయే వేంకటేశ్వరుని దనకపటజాలములఁ గదలకుండఁ జిక్కించుకొనుటకుఁ బ్రధానసూత్రమని దామోదరుఁడు నిశ్చయించుకొనియెను. ఆతంకముల నధికముగఁ గల్పించుటయే యాశనభివృద్ధిపఱచుటకుఁ బ్రధానోపాయ మనునాకర్షణ సూత్రసాంప్రదాయములను దామోదరుఁడు బాగుగ నధ్యయనము చేసి యుండెను. వేంకటేశ్వరుఁ డొక్కయక్షరమైనఁ దప్పకుండ దామోదరుఁ డనుకొనినట్లే యాతనికపటసూత్రమునఁ గట్టుబడిపోయెను. ఆతనినిర్మలప్రేమాంతరంగమున నీచమోహచ్ఛాయ యావరించుకొనుట కవకాశముగ నాశావాయుసంచాలన మయ్యెను.

పదునెనిమిదవ ప్రకరణము

" ఎలుగొకింతయును బా
ముల గోఁకిచి చెట్లఁబట్టి పోవఁగఁ జనునే!
యలబెదిరి బోయ లాగిన
వలలోఁబడఁ బ్రాణహాని వచ్చుట గాదే "

చిలుక — హంసావళి.

క్షీరకలశమునకు క్షారజలస్పర్శన మైనది. తూలరాశికిఁ శిలాసంపర్కము కలిగినది. పూలదండకుఁ గాలాతపతాపము సోఁకినది. వేంకటేశ్వరుని హృదయము స్థానము తప్పిపోవుచుండెను!—తీవ్రవేగముతోఁ గొట్టుకొనఁ బోవుచుండెను. ఏదియో తప్పుచేయుచున్న ట్లాతఁడు తల్లడిల్లి పోవుచుండెను. కాని యాతని వివేచనాశక్తి యంతరించి పోయినది. అనసూయతో నేమని చెప్పుదు నని యాతఁడు సంకోచించుచుండెను. ఇదివఱ కాతఁ డెక్కడకును బోవుట లేదా? ఆమెతోఁ జెప్పుట లేదా? ఇప్పుడెందుకుఁ జెప్పఁ గూడదు? ఆతఁడనసూయను దఱచుగఁబనిలేకుండఁగనే పలుకరించుచుండెడివాఁడు; ఇప్పుడామెకన్నులఁ బడుటకే కళవళపడుచుండెను. వేంకటేశ్వరుఁ డెట్లో తెగించి నాటకసందర్శనమునకై తాను బెద్దాపురము పోవలయు నని యనసూయతోఁ జెప్పెను. అనసూయ యాత్మేశ్వరుని యానందమున కెన్నఁడు నభ్యంతరముగల్పించి యెఱుఁగదు. ఆతని యానందమే యామె యానందము! అనన్యహృదయ యగు ననసూయ యాతని ప్రయాణమునకు హృదయపూర్వకముగ సమ్మతించెను.

రాత్రి భోజన మైనతరువాత దామోదరుఁడును వేంకటేశ్వరుఁడును గుఱ్ఱపుబండిపైఁ బెద్దాపురమునకు బయలుదేరిరి. బండి కదలినది. ఆకస్మికముగ నప్పుడేదియో యదృశ్యసూత్రము వేంకటేశ్వరుని మెడకుఁ జుట్టుకొని మేడమీఁదికి లాగుచున్నట్లయ్యెను. గుఱ్ఱము ముందఱికిఁ బరుగెత్తుచున్నది. అతని కంఠము బిగిసికొనిపోవుచుండెను. బండి యూఁగుటలేదు. అందుచే బలవంతముగ నాపరిమళసూత్రము పటాలునఁ దెగిపోయెను. ఆచప్పుడు వేంకటేశ్వరునిహృదయస్పందనస్వరంబున విలీనమైపోయి యుండును. వేంకటేశ్వరుఁడప్పుడు గళము సవరించుకొని ,, దామోదరా! నేఁడు వెన్నెలయెంతసేపటికివచ్చును? '' అనియెను.

దామోదరుఁడు నవ్వుచు ,, పెద్దాపురము వెళ్లునప్పటికి—'' అనియెను.

వేంకటేశ్వరుఁ డేకాంతముగా ,, రాజరత్నము నాటకముఁ జూచుటకుఁ బోదుగద? '' అనియెను.

దామో—పోయిన మనసా మ్మెమిపోయినది?

వేంక—పోవద్దని చెప్పలేదా?

దామో—చెప్పితిని.

వేంక—నేను వచ్చెదననికూడఁ జెప్పితివా?

దామో—చెప్పిన నేమిలాభము? దానిని నీవెంతగ నెఱుఁగుదువో యది నిన్నంతగా నెఱుఁగును!

వేంక—వినియుండు ననుకొనియెదను.

దామో—వినకయున్నచో నీప్రయత్న మంతయు నెందుకు?

వేంక—నామనసునం దేమో యదటుగా నున్నది.

దామో—క్రొత్తగావున నట్లే యుండును.

వేంక—ఆమాట నిజమే.

వారిట్లు సంభాషించుకొనుచుండఁగా గుఱ్ఱపుబండి పెద్దాపురమున నాటకశాలయొద్దకు వచ్చెను. అప్పు డాయిరువురును బండి దిగి గుఱ్ఱపువానితో బండి పార్శ్వమునందుంచి కానికొనియుండుమని చెప్పి ముందువైపునకుఁ బోయిరి. నాఁడు ధనాభిరామనాటకమును బ్రదర్శించుచుండిరి. వారు నాటకశాలలోనికిఁ బోలేదు. రాజమార్గమునకుఁ బార్శ్వమునందలి మరిడమ్మగుడివీథినిబట్టి పోయిరి. దామోదరరా వావీథియందున్న యొకమేడయొద్ద కాతనిఁ దీసికొనిపోయెను. ఆసౌధముఖద్వార మొరువాఁకిలిగ మూయఁబడియుండెను. అప్పుడు దామోదరుఁడు "రమ్ము" అని చెప్పి యాతని లోనికి వెంటఁబెట్టుకొని పోయెను. మంత్రముగ్ధునివలె వేంకటేశ్వరుఁడు దామోదరునియడుగుల నాశ్రయించి పోవుచుండెను. చిన్నగఁ వారిరువురును సోపానముల నధిరోహించి మేడమీఁదికిఁ బోయిరి. అప్పుడొక యువతీమణి ద్వారయవనికాంతరాళమునుండి వెలుపలికి వచ్చి మందహాససుందరవినీతవదనముతో వేంకటేశ్వరునకు నమస్కరించి "దయచేయుఁడు!" అనియెను.

వేంకటేశ్వరుఁడు నివ్వెఱపడిపోయెను. అతఁ డప్పు డభూతపూర్వంబగు నొకమనోహర రచనకు లోనైపోయెను. దామోదరుఁ డాతనిచేయి పట్టుకొని పార్శ్వమునం దలంకరింపఁబడిన యొకగదిలోనికిఁ దీసికొనిపోయెను. వేంకటేశ్వరుఁడు దామోదరునిచేతిలోని జంత్రపుబొమ్మ యైపోయెను. దామోదరుఁ డాతని నొకకుర్చీపైఁ గూర్చుండఁజేసి తానును గూర్చుండెను. క్రింద నొకరత్నకంబళముపైఁ గూర్చుండి యాయువతీమణి తములపాకులను మడఁచుచుండెను. వేంకటేశ్వరుఁ డోరకంటితోఁ జూచి యామెయే రాజరత్న మని యనుకొనియెను. బాగుగ నాలోచించి చూచెను. నవనవోత్తేజితమగు నాయాశ మిచ్చట సముత్తేజితమైయుండెను. అవ్యక్తమధురం

బగునాలావణ్య మిచ్చట సువ్యక్త మైయుండెను. ఈమె యామె యన్యాకమైయుండు నని యాతఁడు నిశ్చయించుకొనియెను.

అప్పుడు దామోదరరావు ‹‹ నాగమణీ! వేంకటేశ్వరరావు గారీయనయే. ›› అనియెను.

నాగమణి మృదులస్వరముతో ‹‹ వినియుంటిని— దర్శన భాగ్యము నేటివఱకు లభియింపలేదు ›› అనియెను.

దామో—(నవ్వుచు) వచ్చుటకుఁ బని యేమున్నది?

నాగ—పటకుటీరమునకుఁ బట్టభద్రుఁడు వచ్చిన ట్లున్నది.

దామో—పట్టభద్రుఁడుగావుననే రాజరత్నమును జూడవలయు నని వచ్చినాఁడు.

వేంకటేశ్వరున కామాట లాకర్షణమంత్రములవలెనుండెను. ఊరక కూరుచుండుట యాతని కుచితముగ నగపడుటలేదు. మాటాడుటకు మాటలు స్ఫురింపకుండెను. అప్పుడు నాగమణి తాంబూలపుఁబళ్లెరము నాతని సమీపమునందున్న బల్లపై నుంచెను. దామోదరుఁడు నవ్వుచు ‹‹ తీసికొనుము! ›› అనియెను. వేంకటేశ్వరున కామర్యాదలు తెలియవు. ఆతఁడు కంపితహస్తముతో నాయాకు మడపుల నందుకొనియెను.

నాగమణి మృదులకంఠముతో వ్యక్తావ్యక్తమధురస్వరంబున:—

‹‹ ఉపచారము చేసేవా
రున్నారని మఱవకు రామ॥ఉపచారము॥ ››

అని యించుకపాడి యంతలో నాఁగి కంఠమును సవరించుకొని ‹‹ రాజా! ›› అని పిలిచెను.

తోడనే రాజరత్నము తొలుకరిమెఱపువలె నామందిరమునఁ బ్రత్యక్షమయ్యెను. వేంకటేశ్వరునికన్నులు చెదరిపోయెను. ఆతని

కప్పుడు కలలోఁగన్న నిధానము కన్నులఁబడినట్లయ్యెను. ఆతని రక్త నాళము లన్నియును విద్యుత్తంత్రులవలెఁ దీవ్రవేగసంచలితము లైపోయెను. ఆతని యాపాదమస్తకమునుగూడ నవ్యక్తభావోద్రేకముచేఁ బ్రకంపితమైపోవుచుండెను. ఆతఁ డెట్లో మఱియొకసారి కన్నెత్తి చూచెను. రాజరత్న మించుక తల వంచుకొని తలుపుచాటున నిలిచి యుండెను. వేంకటేశ్వరుఁడు సమాధినిష్ఠునివలె— చంద్రకాంతశిలావిగ్రహమువలె నిశ్చలుఁడై యట్లే కూర్చుండి యుండెను.

దామోదరుఁడు మందహాసము చేయుచు "మిత్రమా! నాపలుకు చెల్లినది— నీతలఁపును దీఱినది. చాలరాత్రి యైనది-- ఇఁక నాటకములోనికిఁ బోవుదమా?" అనియెను.

వేంకటేశ్వరునిగుండె గుభిల్లు మనియెను. ఆమందిర మాతనిస్వేచ్ఛావిలసనమున కత్యంతరముగ నున్నను బ్రియముగనే యుండెను. అందాతనికిఁ బలుకులు స్ఫురింపకున్నను భావములు మెఱసిపోవుచునే యుండెను. మధురపరిమళములు వెలువడకున్నను మనఃకమలము వికసించుచునేయుండెను. అంతరంగమునకు బోధపడకున్నను నానందము నిండుచునే యుండెను. ఆతఁడు కంపితస్వరమాత్రో "దామోదరా! అప్పుడే పోవుటయా?" అనియెను.

దామో— నాటక మైపోయినతరువాత నేమిలాభము?

వేంక— నాటకము చూచుటకంటెఁ బాట వినుటయే నాకానందము.

దామోదరుఁడు చిఱునవ్వుతో "ఆలాగా? రాజరత్నము తలయెత్తి చూచినచో నీయుద్దేశమును గ్రహించియుండును. గ్రహించినచో నీవు తలయూఁచునట్లు పాడియే యుండును.

నాగమణి దామోదరునిమాట కడ్డము వచ్చి "అట్లనవలదు. తుదకు మీరు తలవంచుకొనవలసివచ్చునేమో!" అనియెను.

దామో—నాకేమి ?

నాగ— గురుత్వ మున్నది గాదా ?

ఈమాటలసందడిలో వేంకటేశ్వరుఁ డింకొకసారి రాజరత్న మును జూచెను. అప్పుడే యామెకన్నులుకూడ నాతనికన్నులలోఁ బ్రతిఫలించినవి.

దామోదరుఁడు చేసన్న చేయుచు మందహాసముతో "నాగ మణీ! ఇంకను మనగురుత్వ మెందుకు ?" అని రాజరత్నముం జూచి "రాజా! ఇటురమ్ము! సిగ్గుపడువానియొద్ద సిగ్గెందుకు ?" అనియెను.

నాగమణి స్వభావమున కించుకభిన్నముగఁ బకృకున నవ్వెను. వేంకటేశ్వరుఁడు నిలువున నీరయ్యెను. రాజరత్నము రివ్వున నట నుండి వెడలిపోయెను. దామోదరుఁ డామెను బట్టితీసికొనివచ్చుట కై వెడలిపోయెను. అప్పుడు నాగమణి వేంకటేశ్వరునిం జూచి "అయ్యో ! ఏమియింపుడు! మా రాజరత్నమునకుఁ దలకుమించిన సిగ్గు! అది సానియింటఁ బుట్టఁదగినది కాదు. సభకు నూటపదియాఱు లిచ్చె దనన్నను బోదుగద! సరసులవంకఁ గన్నెత్తి చూడనైనఁ జూడదు గద! దాంచదువే చదువు— సంగీతమే సంగీతము! మీవంటి వారుగనుక సరిపోయినది. మఱియొక రైనచోఁ గోపగించుకొనరా?' అనియెను.

వేంకటేశ్వరరావు కంపితస్వరముతో "ఇందుఁ గోపమున కేమున్నది ? క్రొత్తగదా!" అనియెను.

నాగ—క్రొత్తయేమి ? సానికి దినదినముఁ గ్రొత్తయే— దాని కామార్గమే నచ్చదు! చదువుకొన్నది కాదా ? పెండ్లియైనఁ జేసికొనునఁట !— పెండ్లామువలె నొక్కనియధీనమునం దైన నుండునఁట!—

వేంక—మంచియుద్దేశమే—

నాగ—అమ్మా! ఆమాట నిజమే— మంచికొంటకుఁ జూచినచోఁ దరువాత మామొగ మెవ్వరు చూచెదరు ? సానిపుట్టువుకంటెను హీనజన్మమీలోకమునందున్నదా ? నోరెత్తినచోరాగ-నోరుమూసికొన్నచో మూఁగ— ఈమంచిచెడ్డ లన్నియును మా యింటఁ బుట్టిన దానికిఁ దెలియవలయును గాని—చెప్పినను వినదే! దానితో నేను పడుచున్న పాట్లు దైవమునకుఁ దెలియును— దామోదరరావుగారెఱుఁగుదురు !

నాగమణి యిట్లుపన్యసించుచుండఁగా దామోదరుఁడు రాజరత్నమును దీసికొని వచ్చెను. రాజరత్నము నాగమణిపార్శ్వమున రత్నకంబళముపైఁ గూర్చుండెను. వేంకటేశ్వరున కూపిరి తిరిగినట్లయ్యెను. అప్పుడు దామోదరుఁడు వీణ తెచ్చి రాజరత్నమున కిచ్చెను. ఆమె యొయ్యారముగ వీణాతంతువులను సారించుచు శ్రుతులను సరిచేసి యొక్కసారి వేంకటేశ్వరునిపై నిశితకటాక్షములను బరగించెను. సుసజ్జితమగు ధనువునుండి వెలువడిన వాఁడిబాణములవలెనవి యాతనిహృదయమున దూసికొనిపోయెను. అప్పుడు వేంకటేశ్వరునిహృదయమును గిన్నెలునుగూడఁ జెదరిపోవుచుండెను. నాగమణి తంబురతో శ్రుతివైచుచుండెను. దామోదరుఁ డేమంత్రమునుపదేశించెనోగాని రాజరత్నము తనమధురకంఠస్వరమును వీణాస్వరముతోఁ గలిపి:—

“ తొలి నేఁజేసినపూజాఫలము ”

అనుకృతిని బాడుచు వాయింప నారంభించెను. వేంకటేశ్వరునివీనుల కమృతాభిషేక మైనట్లయ్యెను. అప్పు డాతని కామందిరము స్వర్గధామమువలె నగపడియెను. నాగమణియు రాజరత్న

మును రంభాతిలోత్తమలవలె నగపడుచుండిరి. ఆయానందములో నాతఁడు తన్నుఁ దానే మఱచిపోయెను. ఆయజ్ఞాతసమయమునందే యాతనిజీవనప్రవాహమున కజ్ఞాతపరివర్తనము కలిగెను. వేంకటేశ్వరుఁడు దిగ్గున లేచి తాను బయలుదేరివచ్చునప్పు డనసూయతన మెడలోవైచిన పుష్పహారమును దీసి రాజరత్నముకంఠము నలంకరించెను. ఆసందడిలో నానివ్రేలికల్యాణాంగుళీయకము జారి క్రిందఁ బడిపోయెను. అప్పుడు దామోదరుఁడు లేచి పకపక నవ్వుచు:—

“ఆనంద మానంద మాయెను మా
జానకి పెండ్లికూఁతు రాయెను.”

అని పాడ నారంభించెను. వేంకటేశ్వరుఁడు చిత్రప్రతిమయైపోయెను. అప్పుడు రాజరత్న మాయుంగరమును దీసి వేంకటేశ్వరునకిచ్చెను. ఆతఁడామెదక్షిణహస్తమును గ్రహించి యామెయనామికాంగుళమునం దాయుంగరము నలంకరించెను. దామోదరుఁడు పకపక నవ్వుచు “అయంముహూర్తస్సుముహూర్తోస్తు” అనియెను. వేంకటేశ్వరుఁడు విభ్రాంతుఁడై పోయెను.

రమణీమణి యగునసూయ ప్రేమతోఁ దనకొసంగినపూలదండతో రాజరత్నము నలంకరించుట వేంకటేశ్వరునకు ధర్మమా? అగుఁగాక! అనసూయ పెండ్లివేళఁ దనకువరదక్షిణగా లభించిన యుంగరమునుగూడ నామెకిచ్చుట కాతని కధికార మెచ్చటనున్నది? తదేకప్రాణయగు నసూయపరోక్షమునం దట్టియపరాధమును గావింపవచ్చునా?—వేంకటేశ్వరుఁ డంతవఱకు నాలోచింపలేదు. ఆతని హృదయకమల మంధకారమున వికసించినది—ఆతనిబుద్ధిశక్తి యుపమార్గమున విజృంభించినది!

వేంకటేశ్వరుఁడు ప్రకృతిస్థుఁ డగునప్పటికిఁ దాను జేసిన దంతయుఁ దప్పే యని యాతనికి బోధపడియెను. ఆతనిహృదయాంతరాళమున సహస్రఘంటారవములతో "తప్పు! తప్పు!". అని యెవ్వరో ప్రబోధించుచున్నట్లయ్యెను. ఆవికలసమయమున "కొక్కొరోకో!" అనుకోడికూఁత యాతనిచెవులఁ బడియెను. వేంకటేశ్వరుఁడు సంభ్రమముతో "దామోదరా! ఇఁకఁ బోవుదము" అనియెను.

ఇరువురును వెలుపలకు వచ్చునప్పటి కెవ్వరో యొకస్త్రీమూర్తి వారిని బాగుగఁ బరిశీలించి వారిప్రక్కనుండియే వెడలిపోయెను. వేంకటేశ్వరుఁ డదరిపడియెను. అల్లే యాతఁ డడుగడుగునకు నదరిపడుచునే యుండెను. ఇరువురును నాటకశాల యొద్దకుఁ బోయి గుఱ్ఱపుబండి నెక్కి మరల కుమారనగరమునకు వెడలిపోయిరి. ఇరువురిలోనుండఁదగినరహస్య మిప్పు డేమైనది? అందఱకు ననుమానకారణ మగుటయేకాక తుదకు గుఱ్ఱమునకును బండికినిగూడఁ దెలిసిపోయినది!!

పందొమ్మిదవ ప్రకరణము.

"ఎవనిగతిభేదమునఁ జేసి ♦ యీ జగంబు
వివిధపరిణామములతోడ ♦ వెలయుచుండు
నట్టి కాలాత్మకునకు ని ♦ రంతరునకు
ననితర ధీనగతికి వం ♦ దనశతంబు."

సంశయము. — హేమావళి.

"ఆస్త్రీమూర్తి యెవ్వరు? వేశ్యాగృహమునుండి వెలువడు నప్పటికి మాప్రక్కనుండియే పోయిన యాస్త్రీమూర్తి యెవ్వరు? అనసూయయై యుండునా? అనసూయ యచ్చటి కెందుకువచ్చినది? ఎట్లు వచ్చినది? అనసూయ యట్లు వచ్చుటకుఁ గారణమేమి? ఇంతవఱ కామె ముఖమున నెట్టియనుమానచిహ్నమును గనఁబడుట లేదే! ఆమె యనసూయ కాదు—ఆమె యంతటిసంశయహృదయ కాదు—అంతటిధైర్యవతియును గాదు—ఒకవేళ నామె యనసూయయే యైనచో నాసంగతి యంతయు నామెకుఁ దెలియనే తెలిసినది. కానిచో—ఆమె కెంతమాత్రముఁ దెలియనే తెలియదు! ఎట్లయినను నాముందుమార్గమున కడ్డము లేదు—కాని నాయర్ధాంగలక్ష్మి యగు ననసూయయెడల—మదేకప్రాణయగు ననసూయయెడల— నేనొనరించినది యపరాధము కాదా?—ఇం దపరాధ మేమున్నది? ఏ యనసూయ నన్నే ప్రాణముగఁ జూచుకొనుచున్నదో యట్టి నాప్రాణములను జలింపఁజేయుచున్న రాజరత్నము నొకసారి చూచి యాప్రాణముల నిలుపుకొనుట యాయనసూయ కుపకారమే కాదా? ఈసమర్థనము కేవలము నిరర్థకమైనది— అమాయికహృదయ యగు ననసూయను బులిమిపుచ్చుటకై

యుపయోగింపఁదగిన యుక్తివాదము — కాని యుదియుత్తమధర్మమని యెవ్వరంగీకరింతురు ? — అధర్మమే కావచ్చును. కాని నాజీవితము దుస్సహమై పోవుచున్నప్పుడు నేనేమి చేయుదును ? ప్రతీకారము చేసికొనక్కఱలేదా ? ఇంతమాత్రముచే ననసూయపై నాకుఁ బ్రేమ లేకుండఁ బోయినదా ? ఆమెను నాప్రాణమువలెనే చూచుకొనుచుండెదను. తప్పెఱింగిననే నామె కింకరు దాసానుదాసుఁడనై మెలంగుచుండెదను. ఇఁక నామెకుఁ గష్టముగ నుండవలసినపని యేమున్నది? తనలీలాకపోతమింకొకరిసౌధముపైనాడుచుండుటయెవ్వరికిఁ గష్టముగనుండదు? అంతమాత్రముచే నేమి? అది తిరిగి తనయింటికే వచ్చుచున్నది కాదా—అనన్యగతిక యగుననసూయ నన్నే ప్రాణముగఁ జూచుకొనుచున్నది. నాయందలిస్వల్పపరిణామమునుగూడ నామె సహింపఁజాలదు—కాని నాహృదయము నావశమునందు లేనప్పుడు నేనేమి చేయఁగలను ? తనకంటె రాజరత్నమే సౌందర్యవతి యని యనసూయయే యంగీకరించినది—అంతే కాదు. రాజరత్నముచతురమతి—సంగీతకళానిధి—అనసూయ నాహృదయము నలరించుచునే యున్నది—కాని రాజరత్నము బలవంతముగ నాహృదయము నాకర్షించుచున్నది. ఎట్లునిలువఁగలను ? ఎట్లు పోవఁగలను—పోయినఁ దప్పేమున్నది ? అందమందఱకు నాదరణీయమైనదే—ఉపభోగార్హమగుసౌందర్యమునకై యుత్సాహపడుట తప్పా ? చంద్రికను జూచినకన్నులతో నింద్రధనుస్సును జూడఁగూడదా ? మాధవీసౌరభము నాఘ్రాణించుట మల్లికాలతకేమినష్టము ?—మృదులస్వభావ యగుననసూయ యింతవఱకాలోచించుకొనఁగలదా ? ఎట్టయిన నామెకు ధైర్యము చెప్పెదను-ఏమని చెప్పుదును ? చెప్పకున్న నామెకుఁ దెలియదా ? తెలిసి

యీమెయే సమాధానపడుఁగాక ! నేను నాహృదయమును మరలించుకొనఁ జాలను—నాకోరికల నడఁగించుకొనఁజాలను. సముద్రము మేరమీఱినప్పు డెవ్వ రాఁగఁగలరు ? " అని యనేకవిధముల వేంకటేశ్వరుఁడు పూర్వపక్షసిద్ధాంతములను జేసికొనియెను.

నదీజలము సస్యక్షేత్రముకంటె సముద్రమునకే యతివేగముగఁ బ్రవహించి పోవుచుండును. ఆరూపము మారిపోవును—ఆ మాధుర్య మంతరించిపోవును—ఆయుపయోగమే యగపడకుండఁ బోవును. వేంకటేశ్వరునిజీవితప్రవాహమున కిట్టిసంఘటనము కలిగినది. ఆతనిప్రేమచంద్రిక మోహమేఘాచ్ఛన్న మైపోయెను. ఆతని శాంతిదీప మాశావాయుసంచలిత మైపోయెను. ఆతనిహృదయమునకు భావాంతరము కలిగెను—ఆతనిచూపులకు రూపాంతరము కలిగెను. ఆతనికోరికలకుఁ బ్రకారాంతరము కలిగెను. ఆతనిచరిత్రమునకు యుగాంతరము కలిగెను. ఆతనికీయిహజీవితమునందే జన్మాంతరము కలిగినది !

అనసూయను రాజరత్నమునుగూడ నొక్కకంటితోఁజూడవలయు నని యాతఁడు నిశ్చయించుకొనియెను. అది యెట్లు? ఒకవృంతమున రెండుపుష్పములు నలరించుట యెట్లు ? ఒకపుష్పమున రెండుపరిమళములు వెలువరించుట యెట్లు ? ఒక్కరియందు గౌరవము, మఱియొక్కరియం దభిమానము—ఒక్కరిపై ననురాగము, మఱియొక్కరిపై మోహము— ఒకచో నానందము, మఱియొకచో నుత్సాహము— వేంకటేశ్వరుఁడు వడియేటఁ బడి కొట్టుకొనిపోవుచుండెను. ఆప్రవాహవేగ మేతీరమునకు మరలిన నాతీరము నొరసికొనుచుఁ బోవుచుండెను. ఆతనికి స్వతంత్రత లేకుండఁబోయినది-- స్వస్థత లేకుండఁ బోయినది—ఆతనిప్రచారము దినమున కొకరీతిగఁ

బరిణమించిపోవుచుండెను. క్రమక్రమముగ వేంకటేశ్వరుని గుఱ్ఱపు బండి రాత్రులందుండేగాక పగళులయందుఁగూడఁ బెద్దాపురమునకుఁ బ్రయాణము చేయుచుండెను. వేంకటేశ్వరునికన్నులు మూసికొనిపోవుచున్నకొలఁదిని దామోదరుని మాయాజాలసూత్రములు బిగిసికొని పోవుచుండెను.

వేంకటేశ్వరుని రహస్యము క్రమముగ విశ్వవ్యాప్తమైపోయెను. కొంతకాలమున కనసూయకుఁగూడఁ దెలిసిపోయెను. ఆత్మేశ్వరునియధర్మపద్ధతి ననసూయ యంగీకరించి యుండునా? ఉన్నచో నది మానవప్రకృతికి విరుద్ధము కాదా? పతిప్రాణయగు ననసూయ వేంకటేశ్వరునిస్వేచ్ఛకు భంగము కలిగింపఁజాలకుండెను. అంగీకారమునకును నౌదాసీన్యమునకును జాలభేద మున్నది! ఆమె యాకష్టమును సుఖముగ భావింపఁజాలకుండెను గాని యంతటికష్టమునుగూడ సుఖముగ ననుభవించుచుండెను. ప్రేమమయి యగు నామె ప్రాణేశ్వరునితప్పుల నొప్పులుగఁ దలంచుట లేదు గాని యాతనియెంతటితప్పులనైనను క్షమియించుచుండెను. అనసూయ తన ప్రేమమయహృదయమున నాత్మేశ్వరుని భరియించుచున్నది. ఆతనిమూలమునఁ దన కెంతటికష్టములు తటస్థించినను నామె సహింపఁగలదు! ఆమణిదీపము నెట్టిఝంఝాప్రభంజనములును జలింపఁజేయఁజాలవు— ఆయమృతవల్లిక నెట్టిగ్రీష్మాతపములును గసుగందఁజేయఁజాలవు!

ఆమెకు దుఃఖము లేకపోలేదు. అనసూయ యేకాంతముగ నొక్కచోఁగూర్చుండి యదృష్టమును భావించుకొని యేడ్చుచునే యుండెను- ఆనందముతో నాత్మేశ్వరున కుపచారములు చేయుచునే యుండెను. వేంకటేశ్వరుని నడవడి యెట్లు ద్వైరూప్యమును వహిం

చుచున్నదో యటే యనసూయహృదయానుభవముకూడ ద్వైవిధ్య మును బొందుచుండెను. ఈపరిణామ మంతయు నొక్కనిమిషములో నైనదా? లేదు — అపునరావృత్తం బగుకాలపరిచారమునఁ బ్రతి నిశ్శబ్దపదచలనమందునుగూడ నజ్ఞాతముగ నాపరిణామము జరిగిపోవుచుండెను. ఆపరిణామరహస్యము నిరంతరస్వేచ్ఛాపరిచారపరాయణుఁ డగు వేంకటేశ్వరున కించుకంతయును బోధపడుట లేదు. పాపము— నిరంతరత దేకపతిధ్యాననిమగ్నయగు ననసూయకూడ నాపరిణామవిభేదములను గ్రహింపఁజాలకుండెను.

ఆదాంపత్యధర్మ మీవిధముగఁ బరిణామచక్రాంతరాళమున బరిభ్రమించిపోవుచుండెను. కాలక్రమమున వేంకటేశ్వరుఁ డధఃపతితుఁడై పోవుచుండెను. అబలయగు ననసూయ యేమిచేయఁగలదు? ఆతనినుద్ధరించుట కామెకు శక్తియెక్కడనున్నది? లేకపోవుఁగాక! అనసూయ ప్రేమమధురవచనములతో వేంకటేశ్వరునిఁ బ్రబోధింప వలసినది. ప్రణయమంత్రములతో నాతనిఁ బ్రార్థింపవలసినది. కాని యామె కంతటి ధైర్యము లేదు. ప్రాణేశ్వరునితప్పును దలఁచుకొనుటకుఁగూడఁ బ్రాణములు చలించిపోవుచున్న యామె నాథునియెదుట నాతనిలోపములంగూర్చి యెట్లుమాటాడఁగలదు? అనాలోచితముగ ననసూయపైఁ దప్పు పెట్టుటయేగాని మోహముగ్ధహృదయమును బశ్చాత్తాపఖేదము మరలించినట్లు ప్రేమసూత్రి మాకర్షింపఁగలదా? జ్వరతాపము నౌషధతాపమే శమింపఁజేయవలయునుగాని జలపానముచే నేమిలాభము?

వేంకటేశ్వరునకు మనస్తిమితత లేదు. ఆతనిసహధర్మిణి యగు ననసూయకును లేదు. ఆయిరువురినడుమను బ్రతికూలవాయువులు వీచుచున్నవి. తుద కేవిధముగఁ బరిణమించునో యెవ్వరుచె

ప్పఁగలరు? కష్టమునకును సుఖమునకును భేదమునే యంగీకరింపని ప్రాజ్ఞులమాట యెట్లున్నను సామాన్యముగ లోకులందఱు ననసూయగతికి విచారించుచుండిరి. అనసూయ చెప్పకొనకున్నను లోకులందఱును వేంకటేశ్వరుని నిందించుచుండిరి. అది యనసూయకుఁ గష్టముగనే యుండవచ్చును. ఆకష్టమునుగూడఁ బరిగణించుట లోకమునకు విధాయకకృత్యము కాదు. అనసూయసుస్వభావమే వేంకటేశ్వరుని దుస్స్వభావమునకు మెఱుఁగుపెట్టి లోకము కన్నులయెదుట విస్పష్టముగఁ బ్రదర్శించుచున్నది! ఆకన్నుల నెవ్వరు మూయఁగలరు? లోకస్తుతి నిందలకు లోఁబడకుండ నెవ్వరు తప్పించుకొనఁగలరు?

ఇరువదియవప్రకరణము.

"శ్రీమంతంబై విభవో
ద్దామంబై పుణ్యలోక ♦ ధామం బగుని
త్యామోదస్థానము హ
స్తామలకం బగును సుకృతు ♦ లగువారలకున్ "

కపోతకథా — భోగావళి.

సేవాసులభుఁడగు శ్రీరంగనాయకునికంటెఁ దీవ్రప్రభావుఁడగు తిరుపతివెంకన్నకే లోకులు భయపడుచుందురు. గ్రామపాలకుఁడగుగోపాలస్వామికంటె గ్రామదేవతయగుగోఁగులమ్మకే జాతరలు విశేషముగ జరగుచుండును. మహాలక్ష్మీప్రభావముకంటె మారీదేవతాప్రసాదమునే లోకులు వాంఛించుచుందురు. పిఠాపురమున

మరిడమ్మకు భయపడనివారు లేరు. ఆ దేవిని గొలువనివారు లేరు. ఆమె కుపహారముల నర్పింపనివారు లేరు. జ్వరము వచ్చినచో మరిడమ్మకుఁ జలిమిడి పెట్టవలయును. చేను పండినచో మరిడమ్మ గుడిలోఁ గుంచెఁ గట్టవలయును కష్టసమయములయందును, సుఖ సమయములయందునుగూడ నాయూరివారి కా దేవియనుగ్రహమే శ్రీరామరక్షయై యుండెను.

ఆగ్రామ దేవతామందిరమునఁ గొన్నిదినములనుండి యొక ప్రత్యక్ష దేవతామూర్తి వెలసియుండెను. ఆదివ్యమూర్తి తీవ్రస్వభావ యగుశక్తిస్వరూపిణి కాదు— శాంతస్వభావ యగు దేవీస్వరూపిణి. ఆమూర్తి దివ్యసుందరీమూర్తి యగుటచే నానగరప్రజ లందఱు నామెకుఁ "బూవులమ్మ" యని పేరుపెట్టుకొనిరి. భయభక్తులతో నామె కనేకు లనేకవిధముల నుపహారముల నర్పించుచుండిరి. ఆమె ప్రత్యక్షముగ వాని నన్నిటి నందుకొని యందఱకును బంచిపెట్టు చుండెను. తానుఁ గూడఁ బ్రత్యక్షముగనే యారగించుచుండెను. ఆ దేవి యెవ్వరియుపహారము నారగించునో వారు తాముధన్యుల మైతిమని భావించుకొనుచుండిరి. ఆమె యెవ్వరికిఁ బ్రసాదమును గటాక్షించునో వారనుగ్రహింపఁబడితి మని సంతుష్టినందుచుండిరి. పరమాన్నపాత్రములును, ఫలాహారభాజనములును, పానకపుబిందె లును, లెక్కలేకుండ వచ్చుచుండెను. ఆ కారణముచే దరిద్రనార్థు లగుచిన్నపెద్ద లందఱకునుగూడ నిరంతర దేవీప్రసాదము లభియిం చుచుండెను. అనేకు లామెకుఁ జేయెత్తి మ్రొక్కుచుండిరి; చిన్న బిడ్డల నామెపాదములపైఁ బడవైచుచుండిరి; బహువిధములఁ బ్రార్థిం చుచుండిరి. ఆ దేవి తనకటాక్షవీక్షణమాత్రముననే యందఱ నాద రించుచుండెను. విలాసచేష్టామాత్రముననే యందఱ నానందింపఁ జేయుచుండెను.

ఆ దేవిచరిత్రమునుగూర్చి నగరప్రజలలో ననేకులనేకవిధములుగఁ జెప్పుకొనుచుండిరి.:— "కలికాలవశంబునఁ గర్మభ్రష్టులైన ప్రజలలో మరల దైవవిశ్వాసముంగల్పించుటకై మహామాత మామిడిపూవునుండి యవతరించి యీరీతిగ మనకు సాక్షాత్కరించినది" అని కొందఱును, "సుకవిశాపముచేఁ జీర్ణీభూత మైపోయిన పెద్దాపురదుర్గమునందలి దుర్గేశ్వరి పాండవులమెట్టపైనున్నయదృశ్యగుహాగర్భమునందలి యమృతసరోవరమునఁ గనకకమలముపై నింతవఱకు నిదురించుచున్నదనియు మంచికాలము వచ్చునప్పటికి మరలఁ బ్రత్యక్ష మగుననియు మాతాత చెప్పుచుండెడివాఁడు; పెద్దలమాట యెప్పుడును నిరర్థకముగఁబోదు; దానికిదియే నిదర్శనము! ఆదుర్గేశ్వరియే యీపూవులమ్మ— ఇఁక మనజన్మక్షేత్రమున జగపతిదుర్గముకూడఁ బునరుద్ధారితము కావచ్చును" అని కొందఱును "బోగముదాని చెఱువుగట్టునఁ బూవులు గుచ్చుకొనుచుండఁగాఁ బురసంచారము చేయుచున్న మరిడమ్మ యీమెను జూచి తనమందిరమున నుంచుకొనియెనఁట!" అని కొందఱును "ఈ మరిడమ్మనూటయెనమండ్రుసోదరీశక్తులలోనిదియు నొకసోదరీశక్తి" అని కొందఱును దమతమవిశ్వాసములకుఁ దగినట్లు చెప్పుకొనుచుండిరి. ఎవ్వ రెట్టి నమ్మకము కలిగియున్నను నామె పూవులమ్మ యనియే యందఱు నేకగ్రీవముగ నంగీకరించియుండిరి.

ఆర్షప్రజ లగుభారతీయులభక్తి యనితరసాధారణమైనది. పరదేవతావిషయంబున వారివిశ్వాసముకూడ నతినిగాఢమైనది. ఆమె యెవ్వరైన నేమి? గ్రామదేవతయగుమరిడమ్మ మందిరమునం దున్నది. ఆ దేవీమూర్తియందు దివ్యతేజము విరాజిల్లుచున్నది. కావుననే యీమె నందఱును బూవులమ్మయని భావించి పూజించు

చుండిరి. ఈపవిత్రహృదయభావమును గ్రహింపఁజాలకయే—భారతీయులు చెట్లను, బట్టలను, గొండలను, బండలను గూడ దేవతలుగ నమ్మి యారాధింతు రని యనాలోచితముగఁ గొంద ఱాక్షేపించుచుందురు. పరమార్థ మనుమాటయే యెఱుంగక కేవలభౌతికసుఖమే భవపరమావధిగఁ దలంచుకొను పరిజ్ఞానవిహీనులు భారతీయులపరంపరాగత మగుపవిత్రస్వభావను నెట్లెఱుంగఁగలుగుదురు? "సర్వంవిష్ణుమయం జగత్" అనుదివ్యగీతము భారతఖండప్రజల ప్రతిహృద్గోళసంచలనమునందును బ్రతిధ్వనించుచుండు ననుసంగతి కేవలభౌతికసుఖవాంఛాపరాయణుల గర్వోన్మత్తహృదయములకు బోధపడుటయెట్లు? ఆదైవవిశ్వాసమువలననే యానగరప్రజ లందఱుఁ గూడ నాదేవీమూర్తిని బూవులమ్మగా భావించుకొనిరి.

ఆదైవవిశ్వాసమే భారతభూమియం దంతటను శాంతిస్థాపనముం గావించినది. అదియే భారతప్రజలహృదయములకు నిత్యసంతుష్టిం బ్రసాదించినది. అదియే భారతసోదరులలో సర్వసమష్టిభావమును నెలకొల్పినది. అట్టిదృఢవిశ్వాసపరిపూర్ణహృదయములనుండియే "ఆత్మవత్సర్వభూతాని" "పరోపకారార్థమిదంశరీరమ్" అను మహావాక్యామృతరసతరంగిణులు ప్రవహించినవి. భౌతికసుఖదుఃఖములను మఱపించి భావనాప్రపంచము నానందస్వర్గముగఁ జేయుటకు భక్తిమార్గముకంటె సర్వోత్తమసాధనము మఱియొకటి యేదియును లేదు.

పూవులమ్మసమాచార మానగరప్రజలకందఱకును దెలిసిపోయెను. భక్తిరసావేశముచే ననన్యభావహృదయు లగునాప్రజలకందఱకు నామె దేవీమూర్తియే యైయుండెను. మానవాకారముచే సాక్షాత్కరించిన దేవీమూర్తి నిదివఱకు వారెన్నఁడును జూచి

యుండలేదు. అయినను వారామెను బూవులమ్మ యనియే నమ్ము చుండిరి. నిశ్చలభక్తితేజమునెదుట సంశయాంధచ్ఛాయలు నిలుచుటకుఁ దావెక్కడనున్నది? ఆమెను సందర్శించుటకై — ఆమెకు వందనముచేయుటకై — ఆమెను బ్రార్థించుటకై — ఆమెకుపహారముల నర్పించుటకై — పురజనులందఱును దండోపతండములుగ నాగ్రామదేవతామందిరమునకు వచ్చుచుఁ బోవుచునే యుండిరి. సూర్యోదయముమొదలు జాముర్రాత్రివఱకు నాశక్తిమందిరము జననముదగ్రకోలాహలితమై సముత్సాహపూరిత మగుచుండెను.

రాత్రి పదిగంట లైనది. ఆలయమున నప్పుడు జనసమ్మర్ద మేమియును లేదు. ఆలయద్వారములు తెఱవఁబడియేయుండెను. చీఁకటి రాత్రి — దేవీమందిరాంగణమునఁ బోతురాజు నొద్ద గండదీపము వెలుంగుచుండెను. ఆప్రదీపకాంతులలో మఱిడీమహాలక్ష్మిదివ్యవిగ్రహము విస్పష్టముగ నగపడుచుండెను. పూవులమ్మ యాగండదీపమున కెదురుగ నొకపసుపుఁబీటపైఁ గూర్చుండియుండెను. మఱిడీశక్తి యాదీపప్రకాశమున నుత్తేజితమగుచున్న యాత్రిపురసుందరీమూర్తి దివ్యతేజమును గన్నులుర్వాల్పక కనుఁగొనుచుండెను. ఆదివ్యతేజమునకు లజ్జించుచున్న దేమోయనునట్లు దీపజ్యోతి చలించిపోవుచుండెను. అచ్చట మఱి యెట్టిజనసంచారమును లేదు. ఆశాభిహతంబు లగుశలభములుమాత్రము ఫలభ్రాంతిచే నాదీపమును సమీపించుచుండెను. కొన్ని భగ్నపక్షములై ప్రతప్తతైలాంతరమునఁ బడిపోవుచుండెను. కొన్ని తమకుఁగూడ నాగతి కలుగువఱకు నాదీపముచుట్టును బరిభ్రమించుచుండెను. దురాశదుర్గతికి మూల మనుసంగతి యందొకటియును గ్రహించుట లేదు.

పూవులమ్మ యంతయును జూచుచునేయుండెను. ఆసమయమునం దొకపురుషుఁడు మెల్లమెల్లగ నామందిరమునఁ బ్రవేశించెను.

దీపపు వెలుతురున నాతనియాకారము స్పష్టముగ నగపడుచుండెను. ఆతఁ డెవ్వఁడు ? మనదామోదరరావే— దామోదరునిఁ జూచిన తోడనే పూవులమ్మ పుత్తడికీలుబొమ్మవలెఁ బీఠమునుండి లేచి యాతని కెదురు వచ్చెను. ఆశ్చర్యము ! దామోదరుఁడుత్సాహావేశముతో నామెం జూచి "మధుమతీ !" అని సంబోధించెను. మధుమతి మాటాడలేదు; మధుమతి యిక్కడ కెందుకు వచ్చినది? దివ్యజ్యోతి యగునీతేజోమూర్తి యీభూలోకమున కెందుకు వచ్చినదని యాశ్చర్యపడవలసినది— ఈత్రిపురసుందరిని దేవీమూర్తిగ భావించి పరిజనులందఱును సేవించిరనుటలో వింత యేమున్నది? మహారాజ్ఞీమణి కాఁదగినయీసుందరీమూర్తి మద్యవిక్రేతయధీనమునం దుండఁదగినదా ? ఈమె యానాఁడు నన్నుఁ జూచినది. నాయందను రాగముచేతనే యిప్పుడు నాచెంతకు వచ్చియుండును ! నాఁటిరాత్రి వేంకటేశ్వరుఁడును నేనును నాగమణియింటినుండి వెలుపలికివచ్చి నప్పుడగపడిన స్త్రీమూర్తియీయామెయే కావచ్చును. ఆసందడిలో నంతఁగఁ బరిశీలింపలేదు. దీనినిబట్టిచూడఁగా నీమె నాకొఱకే యన్వేషించుచున్నదని తోఁచుచున్నది" అనునీయాలోచనము లన్నియు దామోదరునిహృదయాంతరాళమున నొక్కసారిగ నిమిషములో మెఱసిపోయెను.

దామోదరుఁడు మరల నింకొకసారి మధురస్వరముతో "మధుమతీ !" అని పలుకరించెను. మధుమతి మాటాడలేదు. లోపల నెవ్వరైన నుండిరేమో యనుసంశయముతో దామోదరుఁడు మఱిమాటాడక మధుమతిం జూచి "రమ్మ" అని సంజ్ఞ చేసెను. మధుమతి యాతనివెనువెంటనే బయలుదేరెను. దామోదరుఁడు ముందునడచుచుండెను. మధుమతి యాతనివెనుకనే మాటాడకుండఁ బోవుచుండెను. దామోదరుఁ డామె నెచ్చటకుఁ దీసికొనిపోవును ?

నాగమణియింటికిఁ గొంపోయినచోఁ గొంపమునిఁగిపోవును. ఇఁక నెట్లు? ఊరివా రందఱు నామెను బూవులమ్మ యని యెఱుఁగుదురు— ఆయూర నామె నెచ్చట రహస్యముగ దాఁపఁగలఁడు? పూవుదాఁచినను బరిమళము దాఁగదుగదా— ఆతని కాలోచనకు పాలుపోవుట లేదు.

నిరుద్విష్టభావముతో నాతఁ డట్లే యామెను దీసికొనిపోయెను. తుదకు వారిరువురును గాట్రావులపల్లిబండ్లఘట్టమువఱకును బోయిరి. అచ్చట నొకమద్యవిక్రయశాల యున్నది. దామోదరుఁ డా యింటియొద్దకుఁ బోయి ‘‘నూకాలు!’’ అని పిలిచెను. దామోదరునికంఠస్వరము నానవాలుపట్టి యొక యాఁడిగయువతి చేత దీపముపట్టుకొని వచ్చి తలుపు తెఱచెను. ఆకస్మికముగ నామెచేతిలోని దీపపుబుడ్డి క్రిందఁబడిపోయెను. తోడనే గుభాలునఁ దలుపుమూసికొన్నచప్పు డయ్యెను. ఆమె దామోదరుఁ డనియే తలుపు దీయ వచ్చినది. కాని యాతనివెనుకనున్నపూవులమ్మ యామెకన్నులఁ బడియుండును. అందుచేతనే యామెసర్వాంగకములును గంపించిపోయినవి— చేతిలోనిదీపము జారిపోయినది— ఆభయమే మరల నామెచేఁ దలుపులను మూయించివైచియుండును.

దామోదరున కాశాభంగమయ్యెను. ఇఁక నానగరమునం దాతనికిఁ దావు దొరకదని తోఁచెను. తెల్లవారకుండ నామెను దాళ్లూరు తీసికొనిపోవలయు నని తలంచెను. తిరుగుప్రయాణము దొరకక యొకబండిమాత్ర మాఘట్టమునం దుండెను. దామోదరుఁడా బండివానింబిలిచి ‘‘తాళ్లూరునకు బండి కట్టెదవా?’’ అని యడిగెను.

బండి— ఎప్పుడు?

దామో— ఇప్పుడే— తెల్లవారకుండఁ బోవలెను.

బండి — ఈమార్గమున దొంగలభయము!

బండివానిమాట నిజమే — రాత్రిజాముదాటినతరువాత నా దారిని బండ్లు నడవవు. మధుమతియొద్ద నాలుగైదువందలవిలువగల వస్తువులుకూడ నున్నవి. కార్యాతురుఁ డగుదామోదరుఁ డాసంగతి నంతగాఁ బాటింపలేదు. ఆతఁడు బండివానిం బిలిచి "నీకు నాలుగు రూపాయ లద్దె నిచ్చెదను. బండికట్టుము!" అనియెను. అద్దెకాసపడి యాతఁడు బండి గట్టెను. దామోదరుఁడు మధుమతిని బండిపై నెక్కించి తానుగూడ నెక్కెను. బండి యతిత్వరితముగ గాఢాంధకారమున ఘంటానాదముతో నడచుచుండెను.

బండి యెఱ్ఱగుట్టలవఱకును బోవునప్పటి కాకస్మికముగ మధుమతి కెవ్వునఁ గేక వైచి బండిలోనుండి క్రింది కుఱికి పడిపోయెను. బండి యాఁగిపోయెను. దామోదరుఁడు బండ దిగి యామెను లేవనెత్తుటకుఁ బ్రయత్నించెను గాని మధుమతి యాతని చేతులనుబట్టి యావలకుఁ ద్రోసివైచెను. మధుమతి శక్తిస్వరూపిణియే — ఆమెశరీరమునం దెంతశక్తి యున్నదో దామోదరునకుఁ దెలిసిపోయెను. అందుచే నాతఁ డామెను స్పృశించుటకుఁగూడ భయపడుచుండెను. దామోదరుఁ డనేకవిధముల నామెను బ్రతిమాలి చూచెనుగాని యామె మెట్టిప్రత్యుత్తరమునీయలేదు. చపలహృదయుఁడగుదామోదరునిపై నాకస్మికముగ నామెకుఁ గోపము కలిగియుండును. సాత్త్వికస్వభావయగు నాసుందరమూర్తి రసనారంగమునుండి యెట్టిపరుషభాషణములును వెలువడలేదు. ఆమె కూరుచున్నచోటునుండి లేవలేదు. ఆతనితో మాటాడుటకుఁగూడ నామెకసహ్యముగ నుండెనుగాఁబోలును! మౌనభావముతోనె కన్నులెఱ్ఱచేసి యాతనిఁ బొమ్మని సంజ్ఞ చేసెను. స్త్రీహృదయములు కుసుమసుకుమారములయ్యును సమయమునుబట్టి వజ్రకర్కశములై పోవుచుండును.

దామోదరునిప్రయత్న మంతయు విఫలమైపోయెను. ఆతని కాశాభంగమైపోయెను. బండివాఁడు నాతఁడును గలసి యామెను బలవంతముగ బండిలోఁ బడవేయవలయు నని ప్రయత్నించుచుండిరి. కాని యామె వారిరువురను ద్రోసివైచుచుండెను. ఇంతలో నొక దొంగలగుంపు వారిని జుట్టుబెట్టుకొనియెను. బండివాఁడు పాఱిపోయెను. దొంగలదండాఘాతములచే దామోదరుఁడు స్మృతి తప్పిపడిపోయెను. నిమిషములో దొంగలందఱును మధుమతిని జేతులపై నెత్తికొని యాతాళవనమధ్యమునం బడి యెఱ్ఱగుట్టలవైపునకుఁ దీసికొని పోయిరి. అంతలో నాగాఢాంధకారము నిశ్శబ్దమైపోయెను. కొంత సేపటికి బండివాఁడు వచ్చి దామోదరుని బండిపై నెక్కించుకొని మరలఁ బెద్దాపురమునకుఁ దీసికొని పోయెను.

దైవసంఘటనము లవేద్యము లైనవి. ప్రకృతిపరిణామములు విచిత్రము లైనవి. విలాసభవనమున మదపరవశులకు మద్యపాత్రములఁ బ్రసాదించినమధుమతి మరిడమ్మమందిరమున భక్తిపరవశులకు ఫలాహారములఁ బ్రసాదించినది. అచ్చట జగదేకసుందరీమూర్తి యిచ్చటఁ బ్రసన్నైకదేవీమూర్తి యైనది. అచ్చటఁ గామింపఁదగినకామినీమణి యిచ్చటఁ బూజింపఁదగినపూవులమ్మ యైనది. మధుమతి యెవ్వరు ? ఆమెవిలాసభవనమును విడిచి పెద్దాపురము వచ్చుటకుఁ గారణమేమి ? అచ్చటఁ దన్నందఱును దివ్యశక్తిగఁ దలంచి పూజించుచుండఁగాఁ దాను దాసివలె దామోదరునివెంటఁ బోవుట యెందుకు ? అంతలో నాతనిపై నామె కేల కోపము కలిగినది ? దొంగలందఱును బలవంతముగ నామె నెత్తికొనిపోవునప్పు డాభయంకరసమయమున నామెవదనమునుండి యొక్కపరుషవచనముగాని దుఃఖాలాపముగాని యేల వెలువడలేదు ? ఆసుందరీమూర్తి దివ్యశక్తియే కాకున్నచో నసహాయ యయ్యు నావిధముగ సంచ

రింపఁగలుగునా? అంతరాత్రివేళ నొంటిగా దామోదరుని వెంటఁ
బోవఁగలుగునా? అందఱు దొంగలు తన్నుఁ బట్టి తీసికొనిపోవుచుం
డఁగా, నార్తనాదమైనఁ జేయక నిర్భయముగ నుండఁగలుగునా?
ఈప్రశ్నలకు మధుమతి మనకు సమాధానము చెప్పదు. మధుమతి
సత్యచరిత్రమున కడ్డముగ మహామాయాంధకార మావరించినది.
అందుచే నది మనకవేద్యమై యున్నది. జన్మపరిణామముచే జ్ఞాన
సూర్యోదయ మైనట్లుగా సమయపరిణామముచే సత్యసూర్యోదయ
ము కావలయును. సత్యమును సత్యమునందు విలీనము చేయుటయే
పరిణామరహస్యమునందలి పరమార్థము! కావున సత్యమెప్పటికై
నను బయలుపడక మానునా?

ఇరువదియొకటవ ప్రకరణము.

"ఏమయిన నేమి కొంచెమూ ♦ హించిచూడఁ
బ్రేమమయుఁ డీశ్వరుఁడు, సృష్టి ♦ ప్రేమమయము
ప్రేమమయు లెల్లజీవులు ♦ ప్రేమయొకటె
పావనం బైనదని బోధ ♦ పఱచుచుండె"

ప్రేమ — హారావళి.

రంగనికి నావారని చెప్పఁగొనఁదగినబంధువు లెవ్వరును లేరు.
నాది యనియనుకొనఁదగినయిల్లెచ్చటను లేదు. ఆతనికిఁ గాసునకు
గతి లేదు— కోటికిఁ గొదవయును లేదు. జను లందఱు నాతని
దొంగరంగఁ డని చెప్పుకొనుచుందురు. ఆతఁడు పరోపకారముకొఱ
కుఁ బరపీడనముం గావించుచుండును; దరిద్రులకొఱకు ధనవంతు

లను బాధించుచుండును; ఒకరికడుపుమంట చల్లార్చుటకై యింకొక
రిహృదయమును మండించుచుండును. ఒకరికష్టమును దీర్చుటకై
యింకొకరిసుఖమునకు భంగము కలిగించుచుండును. ఆతని దెంతటి
దయార్ద్రహృదయమో యంతటిక్రోధకర్కశహృదయము. ఆతఁడు
భాగ్యవంతులకుఁ బ్రక్కలోనిభల్లము — నిరుపేదలకుఁ బెరటిలోని
కల్పకము; పాపపుణ్యప్రవాహములనడుమ నాతనిజీవితనౌక కొట్టు
కొని పోవుచున్నది !

అధికారులనిన నాతని కెంతమాత్రమును భయము లేదు.
కారాగృహము నాతఁడు పుట్టినింటికంటెను బ్రియమైనసుఖనివాస
ముగ భావించుచుండును. రాజదండన మైనచో నిఁక యమదండన
ముండదని యాతని దృఢవిశ్వాసము. అందుచేతనే యాతఁ డెట్టియ
కార్యమునైనను బహిరంగముగనే చేయుచుండును. ఆవశ్యకమై
నచో నాతఁ డెట్టియధర్మమున కైనను వెనుకంజ వేయువాఁడు
కాఁడు; కాని యాతనికిఁ గొన్నిధర్మములుకూడఁ దెలియును. ఆతఁ
డెప్పుడును గేవలము స్వార్థపరత్వముచే నితరులను బాధింపఁడు.
పరులకొఱకే పరులను బీడించుచుండును — కాని తనకడుపుమాడి
నప్పుడుమాత్రము ధనవంతులను బ్రార్థించుచుండును; బలవంతము
గ బాధించుచుండును. ధనలుబ్ధులదుష్ప్రవర్తనములే లోకమునకు దరి
ద్రము గల్పించుచుండెనని యాతనిమూఢవిశ్వాసము.

ఎవ్వరేమన్నను నాతని కభిమానము లేదు. కాని తన్నెవ్వ
రును దొంగయని తలంచుట కాతఁ డిష్టపడఁడు. ఇతరులద్రవ్య
మును రహస్యముగ నపహరించుటయే దొంగతనమని యాతని
యుద్దేశము. ఆతనిపేరు విన్న భయపడువా రెందఱుండిరో యాతని
పేరుచెప్పి మ్రొక్కుకొనువారుకూడ నంతకంటె నెక్కుడుగనే
యుండిరి. ఆతఁడు సుఖదుఃఖముల నొక్కరీతిగనే యనుభవించు

చుండును; నిందాస్తుతుల నొక్కమాదిరిగనే పరిగణించుచుండును; కీర్త్యపకీర్తుల నొక్కపోలికనే భావించుచుండును. ఆతనికి సత్కర్మమును దుష్కర్మమును సమానమే — కాని యింతవఱకాతని నెవ్వరును గర్మయోగి యనిమాత్రము పొగడియుండలేదు.

ఆతఁ డడిగినది లేదనుట కెవ్వరికిని సాహసము లేదు. అట్లని యాతఁడు నిరర్థకముగ నితరులను బాధింపఁడు— రక్షకభటులాతని నదలించుటకు భయపడుచుందురు. అపకారులుకూడ నాతనిపై నధికారులయొద్ద నభియోగము తెచ్చుటకు భీతిల్లుచుందురు. ఆతఁ డొకప్పు డొకతహశ్శీలుదారునిఁ బొట్టకూటికై ప్రార్థించి విఫలుఁడై యాక్షేపముచే నిర్భయముగ నాతని నట్టనడివీథిలోఁ గొట్టెను. ఆనేరమునకై యాతని కాఱుమాసములు శిక్షవిధింపఁబడెను. ఆశిక్ష ననుభవించి కారాగృహము నుండి వెలువడిన కొలఁదిదినములకే రాజమహేంద్రవరమునందలి విలాసభవనమున మన కాతనితోఁ బరిచయము కలిగినది. దామోదరుఁ డాతనికిఁ ద్రాగినంత మద్యము నిప్పించినసంగతి మనకు జ్ఞప్తియం దుండవచ్చును. ఆతనియెదుట ననుటకు భయము గాని యాతఁడే దొంగరంగఁడు !

ఇంకను నాలుగుగడియలరాత్రి యున్నది. రంగఁడు చామర్లకోటనుండి బయలుదేరి పిఠాపురమునకుఁ బోవుచుండెను. ఆతఁ డుత్సాహముతో దారిని నడచుచు:—

“ ధనము దాఁచుట దొంగతనము— ప్రేమ
ధనము గడించుటే ధర్మసాధనము— ధన.
కుడిచి త్రేనుచుట దుర్భరము— పేద —
కడుపునింపి చూడఁ గనుటే సంబరము— ధన —
తనిసి కుల్కుట చిన్నతనము— తోడి
తమ్ములఁ దనియించుతలఁపే పెత్తనము. ధన. ”

అని పాడుకొనుచు నిర్విచారముగఁ బోవుచుండెను. ఆతఁడు బంతులమేడయొద్దకుఁ బోవునప్పటికి దూరమునుండి యొకగుఱ్ఱపుబండియెదురుగవచ్చుచున్నశబ్దము వినఁబడుచుండెను. ఆయశ్వపదశబ్దముతోఁగూడ "నాయనా! ధర్మము! నాలుగునాళ్లనుండి తిండిలేదు—బాబు! ధర్మము" అనుదీనాలాపములుకూడ నాతనిచెవులఁబడియెను.

రంగఁడు శీఘ్రగమనముతో బండికెదురుగఁబోయి సమీపించునప్పటికి చండాలదంపతులు పదియేండ్లయీడుగల తమ యాఁడుబిడ్డతోఁగూడ నాబండికడ్డముగ నిలిచి "బాబూ! కడుపు మండుకొనిపోవుచున్నది! కరుణించి యొక్కకాసు ధర్మము చేయవలయును" అని ప్రార్థించుచుండిరి. అప్పుడు బండిలోనియాతఁడు కోపముతో నాచండాలుని దనచేతనున్నగుఱ్ఱపుచబుకుతోఁ జెడీలునఁ జెళ్లిచ్చి కొట్టెను. ఆదెబ్బతో నాతఁడు క్రిందఁ బడిపోయెను. అప్పుడాతనిభార్యయునుబిడ్డయు గోలుగోలున నాతనిచెంతఁ గూలఁబడి రోదనము చేయుచుండిరి.

రంగనికాయార్తనాదముచే వీరావేశముకలిగెను. తోడనే యాతఁడు పఱుగెత్తుకొనిపోయిబండి నాఁపించిబండిలోనున్నయాతని దనచేతికఱ్ఱతో నొకదెబ్బ కొట్టెను. ఆదెబ్బతో నాతఁడు క్రిందఁ బడిపోయెను. బండివాఁడాతనిఁజూచి పాఱిపోయెను. గుఱ్ఱము నిలువఁబడిపోయెను. బండిలోనుండి పడినయాతఁడు పాపము వేంకటేశ్వరరావు—ఆతఁడు రాజరత్నమునింటినుండి బయలుదేఱి కుమారనగరమునకుఁ బోవుచుండెను.

రంగఁడు స్మృతితప్పిపడిపోయిన వేంకటేశ్వరుని జేబును దడవి చూచెను. అందుఁ బదిబంగారుకాసు లుండెను. ఆకాసులతో రాజరత్నమున కేదియోవస్తువు చేయింపవలయు నని యాతఁడు కొని

యుండును. రంగఁడాకాసులను దీసికొని యాపేదచండాలురయొద్దకుఁ బోయెను. వారాతనిఁజూచి యింకను దమ్ముఁ గొట్టుటకే వచ్చుచుండె నని భయపడిరి. రంగఁడు వారిం జూచి సాంత్వనస్వరముతో "రండు! నాతోఁ గూడ రండు!" అని పిలిచెను. ఆయాసముతో నాచండాలుఁడు లేచెను. రంగఁడాతనిచేయి పట్టుకొని నడపించుకొని పోయెను. ఆతనిభార్యయును బిడ్డయునుగూడ నాతని వెంటనే వచ్చుచుండిరి. ఆతఁడు కొంతదూరమువఱకుఁ దీసికొని పోయి యాపదికాసులనుగూడ నాచండాలున కిచ్చెను. ఆతఁడదరిపడి "బాబూ! కడుపుఁగూటివాండ్రకుఁ గాసులెందుకు?" అనియెను.

రంగ — ఈసొమ్ము నీకుటుంబపోషణమున కొకయేఁడాదికి సరిపోవును. తీసికొనుము!

చండా — అక్కఱలేదు బాబు! నేనీబంగారము దాఁచుకొనలేను. కాసుచూచినఁ గన్నులు తిరిగిపోవుచున్నవి.

రంగ — నీపేరెవరు?

చండా — అప్పఁడు.

రంగ — అప్పఁడా! నీకేమియును భయము లేదు. నీకొక కాసు మార్చియిచ్చెదను. తక్కినవి నీయొద్దదాఁచుకొని కావలసినప్పుడు మార్చుకొనుము.

అప్ప — పదిదినములు కడుపునిండఁ దిండిదొరకినచోఁ దరువాతఁ బాటుపడిసంపాదించుకొందును — ఇఁక నాకు సొమ్మెందుకు?

రంగ — వెఱ్ఱివాఁడా! సొమ్మెందు కనియెదవేమి? నీబిడ్డ కొకవస్తువు చేయించుకొనుము.

అనునప్పటి కాచండాలబాలిక మొగమింత యయ్యెను. ఆబాలికతళుకుఁజూపులతో రంగని జూచుచుఁ గులుకునడకలతోఁ దండ్రియొద్దకుఁబోయి యాతనియుదరముపై నుత్తమాంగము నుంచి బాల

మృణాళములంబోని తనచిన్నచేతులతో నాతనినడుమును గౌఁగిలించుకొనియెను. అప్పుడు ప్రియపుత్రికాస్పర్శసుఖపరవశుఁడై రంగనిం జూచి "బాబూ! మాపేదముత్యాలమ్మకుఁ బూవులే వసువులు!" అనియెను.

అప్పుడు చెప్పినమాట నిజమే. ముత్యాలమ్మ యెప్పుడు నడవిపూలతో నలంకరించుకొనుచుండును. ఆపూలదండలతోడనే యామెయాఁకలిమంట చల్లారుచుండును. ఆమెకు మెయినిండ వసనము లేకయున్నను మెడనిండఁ గుసుమమాలికలు వ్రేలాడుచుండెను. చండాలబాలికయైనంతమాత్రమున సౌందర్యమును బ్రేమింపఁగూడదా?—సౌరభమును మెచ్చుకొనఁగూడదా? కూటికిఁ బేదతన మున్నది కాని గుణానురాగమునకుఁ బేదతన మెక్కడనున్నది?

ముత్యాలు పసిబాలిక — భారతసంతానమునఁ గడఁగొట్టు చెల్లెలు— భారతారామమునఁ గడజాతి కోరకము — భారతజన పదమునఁ గడయింటిదీపము— ఆబాలికజీవితమునకుఁ బరంపరాగతమగుచండాలచ్ఛాయ సోఁకినది. అందుచే నామె చండాలిని యైపోయినది. ఈచండాలసాంప్రదాయము మనుజులలోననే గాదు; మృగములవఱకును బక్షులవఱకునుగూడ వ్యాపించినది. రంగని కాబాలికయవ్యక్తమధురస్వరూపమును, స్వభావమును, విలాసమునుగూడఁ జాల ముచ్చటగ నగపడియెను. నీలమైనను రత్నము కాదా? పట్టివేరైననేమి పరిమళించుచున్నప్పుడు?— ఆమె చండాలబాలికయని రంగనికి నిరసనభావము కలుగలేదు. ఆముత్యాలమ్మకుఁ గాసు లీయవలసిన దనియే యాతనికిఁ దోఁచెను. ఆతఁ డాబాలికం జూచి "ఇవి నీవు తీసికొనుము" అని రూకలను నామె కీయఁబోయెను. బాలిక తండ్రివంకఁ జూచెను. అప్పుడు సంతోషముతో "అమ్మా! ఆబాబు దయతో నిచ్చుచున్నప్పుడు తీసి

కొనకున్నఁ దప్పు! తీసికొనుము " అనియెను. ముత్యాలు చిగురాకులవంటి తనచిన్ని చేతులను సోయిలించెను. ఆ బాలిక దోయిటి యందు రంగఁ డాకాసులను బడవైచి చటకండి వెడలిపోయెను.

ఆ చండాలకుటుంబమున కాప్రభాతము సుప్రభాత మయ్యెను. ఆ చల్లని ప్రభాతవాయుతరంగములలో విస్పష్టమధురస్వరంబున—

"కులమే కావలెనా మఱిసద్గుణమే కావలెనా
కలకల విరిసిన తామరక్రొవ్విరి
వలపులచలువలు తెలిసినవారికి ॥కుల మే॥
అందమె కావలెనా మాటలచందమె కావలెనా
కెందలిరాకులసందున కోకిల
సుందరగానముఁ జూచినవారికి ॥అంద॥
చేలమె కావలెనా నిర్మలశీలమె కావలెనా
శ్రీలలనావరు మేలిమిగన్నకు
చేలునిమదిఁగనఁజాలినవారికి ॥చేల॥

అను మనోహరానుభావగీతము విశ్వవ్యాప్త మగుచుండెను.

ఇరువది రెండవ ప్రకరణము.

"తల్లులను ముగ్గురను గన్న ♦ తల్లి, కడుపు
చలువగలతల్లి, ముజ్జగం ♦ బులకుఁ దల్లి
మూడుమూర్తులతల్లి యా ♦ మొదటితల్లి
యగుచు నమ్మలు మాకు ది ♦ క్కగును గాక !"

మాతృస్తవము — హాసవల్లి.

ప్రథమప్రకరణమునందే మనకు ధర్మగిరింగూర్చి కొంతపరిచయము కలిగినది. ఆగిరిగర్భమునందలి విశాలదేవాలయమునఁ గలియుగప్రత్యక్షదైవత మగు సత్యనారాయణుని యర్చావిగ్రహము ప్రతిష్ఠింపఁబడి యుండెను. ఆదివ్యమూర్తి యేకాలమునం దేదేవతలచేఁ బ్రతిష్ఠింపఁబడియెనో యెవ్వరికిని దెలియదు. అప్పుడప్పుడు పర్వదినములలో నర్ధరాత్రివేళ దేవతలు మనుష్యరూపముం దాల్చి వచ్చి యాదేవునర్చించి పోవుచుందురనియు నప్పుడు వారిదివ్యసంగీతవాద్యధ్వనులు వినఁబడుచుండుననియు నచ్చటిజనులకు దృఢవిశ్వాసము కలదు. ఆశైలశిఖరమునందుఁ బ్రతిధ్వనిస్వరూపిణి యగు గిరిపాలికాదేవిమందిర మున్నది. ఆయారణ్యకుల కంతకును నాభూధరమే పుణ్యక్షేత్రమై యుండెను. హింసాచౌర్యములే వారి నిత్యకృత్యములు. మధుమాంసములే వారినిత్యజీవనాధారములు. వారు తమకోరికలు నెఱవేఱుటకై సత్యదేవునకు నానాఫలోపహారముల సమర్పించుచుందురు; తమతలపూవు వాడకుండుటకై గిరిదేవత యగుకులదేవతకు మ్రొక్కులు చెల్లించుచుందురు. భారతవర్షమునం దెంతటిక్రూరాత్ములకైనను భక్తివిశ్వాసములు సహజములుగదా! — ఆశైలగర్భాలయమునఁ గొంతకాలమునుండి యొకసన్న్యాసి నివసించి యుండెను. ఆప్రజలందఱు నాతని దేవతాప్రతినిధిగ భావించి సేవిం

చుచుందురు. ఎంతకాలము గడపినను దేవతలు త్రిదశులే యైనట్లుగా నెన్నాళ్లనుండియో యీతఁ డిచ్చటనే నవయౌవనుఁడైయుండెనని యీతనిమాహాత్మ్యముంగూర్చి యనేకు లనేకవిధములుగఁ జెప్పుకొనుచుందురు.

ఆమహాత్ముఁడు వారల నాదరించుచు వారికి భక్తిమార్గమును బ్రబోధించుచు వారిచ్చుఫలోపహారముల నారగించుచుండును. ప్రత్యక్షదైవస్వరూపుఁ డగు నాతఁ డప్పుడప్పుడు దనదలగువారి కన్నదానముం గావించుచుండెను; వస్త్రదానములను జేయుచుండెను. కేవలధనైకసాధ్యంబు లగు నన్నవస్త్రములా సన్న్యాసి కెట్లు లభియించినవి? ఆ సిద్ధపురుషుని పీఠమునఁ జింతామణిశక్తి యున్నదనియు దానిమూలమున నాతఁడు తలఁచినదంతయు సిద్ధించుచున్నదనియు వారినమ్మకము! భుక్తిముక్తులను బ్రసాదింపఁజాలిన యామహాత్ముఁడు వారికెల్ల విధముల దైవముగనే యుండెను. ఆతఁడేనాఁడీదేవాలయమునఁ బ్రవేశించెనో చూచినవా రెవ్వరును లేరుగాని యీతనిదివ్యదర్శనము లభియించినప్పటినుండియు వారిసుఖానందములు వర్ధిల్లుచుండుటచే నందఱు నాతని నానందస్వామియని పిలుచుకొనుచుండిరి. సౌలభ్యము కొఱకు వారట్లు వాడుకొనుచుండిరికాని నిజముగ నామహాత్ముని నామము కల్యాణానందస్వామి.

గిరిపాలికామందిరమునఁ దఱచుగ బలిదానములు జరుగుచుండును. మదిరాసమారాధనములు నిర్వర్తింపఁబడుచుండును. ఆ మందిరమున నర్చావిగ్రహము లేదు. పీఠముమాత్రమున్నది. ఆమందిరద్వార మెప్పుడును తెఱవఁబడియేయుండును. రాత్రులయందా దేవి సహచరీసమన్వితయై యామందిరమునఁ గొలువుదీర్చుచుండు ననువిశ్వాసముచేఁ బ్రజలు రాత్రులయందాప్రదేశమునకుఁ బోవుటకు భయపడుచుందురు. ఔను—నరకపాలమాలికాధారిణి యగు

నాదివ్యశక్తి రక్తపానవిరతలగుసహచరీశక్తులచేఁ బరివేష్టింపఁబడి యట్టహాసమునఁ గొలువుచేయుచున్నపు డాచండికామూర్తిని సందర్శించుట కెవ్వరు సాహసింపఁగలరు ?

నాఁడేమోగాని యాదేవ్యాలయద్వారములు మూయఁబడి యుండెను. ఆరాధనమునం దేమియపరాధము కలిగినదో యని యందఱును భయభ్రాంతులగుచుండిరి. ఆదిశక్తి యగపడకున్నను నామెపీఠము కన్నులం బడినంతమాత్రమున వారికిఁ బరమానందమగుచుండెను. నేఁడట్టి భాగ్యము వారికి లభియించుటలేదు. ఇంతకును వారుచేసినయపరాధ మేమైయుండును ? మ్రొక్కుబడులు చెల్లించుటలో నేదియో లోపము జరిగినది— నిన్నటిదినము బలిదానసమయమున వేటపోతుశిర మొక్కవ్రేటునకుఁ దెగిపడలేదు. నిప్పునకుఁ జెదలుపట్టినట్లు నిర్నిమిత్తముగ శ్రీచరణసమర్పితమద్యభాండమునకుఁ జీమలుపట్టినవి. గొంతుకోసిన కోడిపుంజు కోయని పలికినదిగాదు. అమ్మవారిగుడిలోని గండదీప మాకస్మికముగ నారిపోయినది. నిండుభక్తితోఁ ద్రొక్కుచున్న నిప్పులగుండము నీరైపోయినది. బలి నిరర్థకమైపోయినది. నైవేద్య మపవిత్రమైపోయినది. అందుచేతనే యమ్మవారు తోడఁబలికినదికాదు. ఆకారణముచేతనే వారంతగాఁ దల్లడిల్లిపోవుచుండిరి— ఇన్నిలోపములుండఁగా లోపము లేదని యెవ్వరు చెప్పఁగలరు ?

ఏయపరాధముచే నిట్లయినదో వారికి బోధపడుట లేదు. కాని యెట్టిప్రతిక్రియనైనను జేయుటకు వారు సిద్ధముగనేయుండిరి. తల్లియే కోపగించినప్పుడు తనయుల కింకదిక్కేమున్నది ?— వారికేమియును దోఁచుట లేదు. ఏమియరిష్టము తటస్థించునో యను భయముచే నందఱు నాందోళితహృదయులై వచ్చి కల్యాణానందస్వామిపాదములపైఁబడి సర్వవృత్తాంతమును నివేదించుకొనిరి. స్వా

మి సన్న్యాసియైనను నాతనికి సంసారము వదలినదికాదు. అజ్ఞానులు నార్తులు నగు నభ్యాటవికుల నుద్ధరించుట కాతనికంటె నింక దిక్కెవ్వరున్నారు? వా రెట్లున్నను స్వామి యింతవఱకును వారి నుదాసీనభావముతోనే చూచుచుండెను. ఔను! సమయము తటస్థించువఱకును సర్వేశ్వరుఁడైన నేమియుఁ జేయఁజాలఁడు— ఇప్పుడా మహాత్మునకుఁ దనశిష్యులను బ్రసన్నభావముతోఁ జూడవలసిన సమయము వచ్చినది.

ఆతఁ డించుక సేపాలోచించి వారికభయప్రదానముం గావించి ప్రబోధించి యందఱితోఁ గలసి దేవీమందిరద్వారమునొద్దకు వచ్చెను. తలుపు లట్లే మూయఁబడి యుండెను. కొందఱు భజనలు చేయుచుండిరి. కొందఱు ప్రార్థనలం గావించుచుండిరి. కొందఱు బలిపశువులఁ దోలికొనివచ్చుచుండిరి. కొందఱు మద్యభాండముల నెత్తికొనివచ్చుచుండిరి. కొందఱా దేవికుపహారములుగఁ గుంకుమ, పసుపు, పండ్లు, పానకములు, పత్రములు, పుష్పములు, దీసికొనివచ్చుచుండిరి. ఆజనసంఘమం దంతటను భయభక్తిసూచకంబు లగు కోలాహలధ్వనులుబయలు వెడలుచుండెను. అప్పు డందఱు నైకకంఠ్యముగ భక్తిపారవశ్యముతో!—

॥అపరాధ మపరాధ మమ్మా! యే
నేరము లెన్నక మమ్ముఁ ♦ గృపఁజూడు మమ్మా॥ అప
కొలువు చేయించుకోవమ్మా! మా
తలఁగొట్టి మున్నిత్తుఁ ♦ దలఁకఁబోమమ్మా! ॥అప
తలుపులు దీయవె తల్లి! పేరఁ
బిలిచిన నోయని ♦ పలికెదితల్లీ! అప॥
కంటఁబడవె కన్నతల్లీ! మా
కంటికి తెప్పవై ♦ కాపాడుతల్లీ! ॥అప॥

వేయాఱువేఁటలతల్లీ ! మాకు
సాయమైయుండవె ! చల్లనితల్లీ ॥అ॥

అనిపాడుచునాడుచుం బార్థింప నారంభించిరి. కాని తలుపులు విడలేదు. అప్పుడు డందఱును చ్చైస్స్వరములో "స్వామీ ! మాయపరాధములను క్షమించి మాతల్లి మాకుం బ్రసన్నురాలగునట్లు చేయుము ! " అని వేఁడుకొన్నిరి.

అప్పుడు స్వామి తనదక్షిణహస్తమును పైకెత్తి మఱియొకసారి యందఱకు నభయప్రదానముం గావించి యాలయద్వారమువంకఁ దదేకదృష్టితోఁ జూచుచు :—

"సర్వార్థదా సర్వజగత్ప్రసూతిః
సర్వేశ్వరీ సర్వభయాపహాంతీ,
సర్వోన్నతా త్వం సుముఖీ భవశ్రీః
హిరణ్మయీ మే భవసుప్రసన్నా.
సమస్తవిఘ్నౌఘవినాశకారిణీ
సమస్తభక్తోద్ధరణే విచక్షణా
అనంతసమ్మోదసుఖప్రదాయినీ
హిరణ్మయీ మే నయనే ప్రసన్నా"

అని స్తోత్రము చేయనారంభించెను. ఆయతీంద్రునిప్రార్థన మమోఘమైనది. అంతలోఁ దలుపులు విడిపోయెను. ఎట్టయెదుట దివ్యపీఠముపై నెన్నఁడు సదర్శించి యెఱుఁగని త్రిపురసుందరీమూర్తి సుప్రసన్నవదనముతో సాక్షాత్కరించియుండెను. ఆదేవీపార్శ్వమునఁ బ్రబోధానందస్వామి పుష్పాంజలి బద్ధుఁడై మూర్తీభవించినసదాశివునిబోలి నిలువఁబడియుండెను. అందఱు నద్భుతానందవిభ్రాంతచేతస్కులై నిలువుగన్నులతో నమూర్తిద్వయమును సందర్శించుచుండిరి. ఆదేవీమూర్తి సహస్రకరాళవదనమండలముఁ

డిత కాదు— ప్రసన్నైకవదనమండల పరిశోభిత. ఆదివ్యశక్తి నర కపాలమాలికావిరాజిత కాదు— పరిమళకుసుమమాలికావిరాజిత. ఆజగన్మాత రక్తాంబరధారిణి కాదు — పరిశుభ్రదుకూలవసనధారిణి. ఆజనని కఠోరాయుధకరసహస్రసమంచిత కాదు— వరాభయ ప్రదానకరకమలయుగళసమంచిత. ఆనిరుపమాన తేజోమయ దివ్యమూర్తి నిర్భయదర్శనీయ మైయుండెను. అందఱును దదేక ధ్యానముతో నట్లే చూచుచుండిరి. అప్పు డాత్రిపురసుంద రీమూర్తి సుప్రసన్న దృష్టులతోఁ గల్యాణానందస్వామిని బిలిచిన ట్లయ్యెను. కల్యాణానందస్వామి దేవీమందిరమునఁ బ్రవే శించెను. ఆ దేవీకటాక్షవీక్షణమాత్రముచేతనే కల్యాణానందస్వామి కాజ్ఞానుబోధ మయ్యెను. తోడనే యాస్వామి దేవీపార్శ్వమున నిలిచి యుండఱను దయార్ద్రసకటాక్షములతోఁ దిలకించుచుఁ బ్రశాంతమధు రస్వరంబున "బిడ్డలారా! మాతృదేవతాప్రేరితుఁడనైన నేను జగ న్మాతయాజ్ఞగా మిమ్ముల నుద్బోధించుచున్నాఁడను. అనన్యహృద యములతో నాలకించి తల్లియాజ్ఞలను బరిపాలింతురుగాక! అణువు మొదలుగ బ్రహ్మాండమువఱకును గలయీప్రపంచమునందలి సకల జీవులును సర్వభూతదయాపరతంత్ర యగునీజగజ్జనని ప్రియసంతా నమే కాని వేఱు కాదు. అట్టిసంతానమున కెట్టిహింస యైనను దల్లి సహింపఁజాలదు. బలిప్రదానముచేతనే పరదేవత ప్రసన్నురా లగు నని మీరు భావించుచున్నారు. అది కేవలము వట్టిభ్రాంతి. బిడ్డలను దినుతల్లి విశ్వసంరక్షిణి యెట్లగును? మీయజ్ఞానమును మా న్చుటకే— మీయకృత్యములను ఖండించుటకే యింతవఱకు నుదాసీనయై చూచుచున్నయీజగన్మాత యిప్పుడు మీయెట్ట యెదుట సాక్షాత్కరించినది! ఇంతటినుండి మీకీదేవీమందిరము నెదుట బలిప్రదానములు గావింపకుండుటకై యేకగ్రీవముగ శప

ధము చేయవలయును. మఱియును — అమృతరసప్రవాయినియగు నీ
యంబికాదేవి శతపత్రపదోపహారముల నర్పించుటకంటె నపవేక
మింకేమైన నున్నదా? ఇది మొదలుగ మీరట్టియాచారమునుగూడ
మానుకొనవలయును. భక్తరక్షిణి యగునీచిదానందాదేవి పర్వదిన
ములయం దిట్టే యీమందిరమున మీకు సాక్షాత్కరించి మీమ్రొ
క్కుల నందుకొనుచుండును! మీకష్టసుఖములఁ గనిపెట్టిచూచు
చుఁ గన్నబిడ్డలవలె మిమ్మెల్లవిధములఁ గాపాడుచుండును!
ఈవాక్యములు జగన్మాతవాక్యములు; ఇది జగజ్జనని యాజ్ఞ!" అని
ప్రబోధించెను.

అప్పు డటనున్నవారందఱు నేకగ్రీవముగా, "అపరాధులము!
అజ్ఞానులము! ఆనందస్వామీ! అమ్మ యాజ్ఞల కడుగుదాటకుండ
నాచరించెదము!—అమ్మా! నీచరణసేవకులము! నీదాసానుదాసు
లము! నీకన్నబిడ్డలము! నీకంటె మాకిఁక దిక్కెవ్వరున్నారు? తల్లీ!
దయయుంచి మమ్ముఁ గాపాడుము! ఎఱుఁగక చేసినమాయపరాధ
ములను క్షమియింపుము! నీమాటవెంబడినే నడచెదము! మాతో
డునీడవై మెలంగుచు మమ్ము రక్షింపుము. తల్లీ! రక్షింపుము!
రక్షింపుము! రక్షింపుము!" అని లెంపలు వైచికొనుచుఁ బ్రార్థింప
నారంభించిరి.

అప్పు డాచిదానందాదేవి మందహాసవదనముతో నాటిపైఁ గ
రుణావీక్షణములఁ బ్రసరింపఁ జేయుచున్నట్లు గనపడెను — అభయహస్త
ముం బ్రసాదించినట్లయ్యెను. అద్భుతానందపరవశులై యందఱును
దదేకదృష్టితో నాదివ్యమూర్తిం దిలకించుచుండిరి. తెఱచినకన్నులు
తెఱచినట్లుండఁగనే యాకస్మికముగ మఱల నాలయద్వారకవాట
ములు మూఁతలువడిపోయెను. ఆకనాటఘంటాధ్వనులతో జయ
జయధ్వనులు విలీనములైపోయెను.

ఇ రు వ ది మూ డ వ ప్ర క ర ణ ము.

మాయలోపల నెంత ♦ మమత యున్నదియొ
మమతలోపల నెంత ♦ మహిమ యున్నదియొ
తారాపథములోఁ ♦ దళతళ మెఱసి
నిర్వ్యామోహానమైన ♦ విభ్రాంతి దోఁచె.

ఏకాంతసేవ.

ప్రథమప్రకరణమునం దేవ్యకాంతరాళమునం దొకస్త్రీమూర్తి నుద్ధరించుటకై ప్రయత్నములు జరుపఁబడియెనో యావ్యకాంతరాళమునం దిప్పు డాప్రబోధానందస్వామి కూర్చుండియుండెను. అప్పు డాతనియనుచరుఁడై వచ్చినప్రియశిష్యుఁడే యిప్పటి కళ్యాణానందస్వామి — కల్యాణానందస్వామి యించుకయవనతమస్తకుఁడై ప్రబోధానందుని పాదసాన్నిధ్యమునఁ గూర్చుండియుండెను. తరుపత్రాంతరాళములనుండి ప్రసరించుచున్న వెన్నెలపొడలు వారి కాషాయాంబరములకు వింతచందమును గల్పించుచుండెను. కొంతసేపటివఱకు నెవ్వరును మాటాడలేదు. అప్పుడు కల్యాణానందుఁడు నిట్టూర్పువిడిచి మందగద్గదస్వరముతో " మహాత్మా! ప్రకృతిపరిణామములంగూర్చి నాకంతఁగా విచారములేదు కాని—' అనియెను.

ప్రబోధానందుఁ డర్థోక్తియందే " కానియేమి! పాపపుణ్యములఁ బరిగణింపనక్కఱలేదా? " అనియెను.

కల్యా—అందుకే భయపడుచున్నాను.

ప్రబో—ఆభయము తత్పూర్వమందే యుండవలసినది!

కల్యా—అట్టివైపరీత్యము తటస్థించునని నేననుకొనలేదు.

పరిబో—పరిబోధానందుని శిష్యుఁడ వయ్యును జపలహృదయుఁడవై పోయితివి!

కల్యా—నేను నిశ్చలహృదయుఁడ నైయుంటి ననియే నావిశ్వాసము.

ప్రబో—కాదు—నీవు కఠినహృదయుఁడవు. హృదయము నిశ్చల మైనంతమాత్రమున నేమిలాభము? ప్రేమార్ద్రమై యుండవలదా?

కల్యా—ప్రేమార్ద్ర మగుటచేతనే పిఱికితనము కలిగినది.

పరిబో—ఇంతపిఱికివాఁడవు మాతృసేవ నెట్లు నిర్వహింపఁగలవు?

కల్యా—గురుకటాక్షముచే నావిషయమున నెట్టిలోపమును గలుగకుండఁ బ్రయత్నించుచునే యుంటిని.

ప్రబో—తల్లిమూలమున నాచే నాజ్ఞాపింపఁబడిన నీవిధాయక కృత్యము నేమిచేసితివి?

కల్యాణానందుఁడు నిరుత్తరుఁ డయ్యెను.

పరిబోధానందుఁడు మధురస్వరముతో "కుమారా! నీకోమల హృదయమును నేనెఱుంగుదును—కావుననే నిన్నంతగఁ బ్రబోధించితిని. ఏమైన నేమి? తుద కీవిధముగ జరగిపోయినది!" అనియెను.

కల్యా—అంతటియసాధ్యకార్యమునకు నన్ను నియోగింపవలదని నేను మొట్టమొదటనే మిమ్ములను బ్రార్థించితిని.

పరిబో—అజ్ఞానము వదలకపోవుటచే నీకది యసాధ్యముగఁ దోఁచినది.

కల్యా—నాహృదయమున కంతటిశక్తి లేకపోయినది.

పరిబో—ఆహృదయదౌర్బల్యమె పాపమునకుఁ గారణమైనది. ఆదౌర్బల్యముచేతనే యమృతస్వరముల వెలువరించుచున్న వీణా

తంతువు త్రుటితమైపోయినది—వికసనోన్ముఖమైనపరిమళకుసుమము వృంతచ్యుతమైపోయినది—పావనకళాకలితంబగుజీవచింతామణి చిదురుపలైపోయినది. అద్భుతానందరసప్రవాహిని యగు చిత్రకథ యాకస్మికముగఁ దుదముట్టిపోయినది !

కల్యాణానందుఁడు గద్గదస్వరముతో “మహాత్మా ! కథ ముగిసిపోయినది ! అదియే మాతృదేవతయెడల నేఁజేసినమహాపరాధము—” అనియెను.

ప్రబో—ఆయపరాధముచేతనే నీకుమాతృమందిరసందర్శనలాభము లేకుండఁబోయినది.

కల్యా—స్వామీ ! ఈయపరాధమునకు నిష్కృతి లేదా ?

ప్రబో—బుద్ధిపూర్వకముగఁ జేసినపాపమునకు నిష్కృతి యేమున్నది ?

కల్యా—మహాత్మా ! తప్పునకు దండనము లేదా ?

ప్రబో—ఉన్నదికాదా ?

కల్యా—ఉన్నచోఁ బాపమునకు శాంతియేల లేకపోవలయును ?

ప్రబో—మాతృదేవత యేయాజ్ఞను బరిపాలించుటకు నీవసమర్థుఁడవైపోయితివో యాయాజ్ఞను నిర్వహించువఱకు నీకు నిష్కృతి లేదు.

కల్యా—ఇప్పుడు తల్లి యేమి యాజ్ఞాపించినను నవలీలగ నెఱవేర్పఁగలుగుదును.

ప్రబో—ఇదివఱ కట్లేల చేయలేదు ?

కల్యా—ఆయొకపనిమాత్రము చేయఁజాలనైతిని.

ప్రబో—మరల మహామాత నిన్నట్టికార్యమునందే నియోగించినచో నేమిచేయుదువు ?

కల్యా—చేయుట కింక నేమున్నది ?

ప్రబో—ఇప్పుడు చేసిన దేమున్నది ? ఇంకను జేయుట కెంతయో యున్నది—

కల్యా—ఉన్నచో నేను ధన్యుఁడనే యగుదును.

ప్రబో—నిన్ను ధన్యునిగఁ జేయవలయుననియే— నిన్నుఁ గన్నయాంధ్రదేశమును ధన్యముగఁ జేయువలయు ననియే మహా మాత యభీష్టము.

కల్యా—స్వామీ ! తల్లి నాతప్పును క్షమియించినదా ?

ప్రబో—ఆజనని నిత్యక్షమాశాలిని—నీతప్పును క్షమింపఁ గలదు—

కల్యా—తండ్రీ ! నాకింక మాతృసేవాభాగ్యము లభియించునా ?

ప్రబో—మాతృప్రసాదము సర్వసులభమైనదే కాని మాతృసేవమాత్ర మట్టిది కాదు—

కల్యా—అమ్మ కటాక్షించినచో నందరాని దేమున్నది ?

ప్రబో—ఆకటాక్షసంపాదనమున కర్హత యుండవలయును.

కల్యా—స్వామీ ! భయభక్తివిశ్వాసములతో సేవించుచున్న నే నింకను బంధవిమోచనమున కర్హుఁడను గాలేదా?

ప్రబో—లేదు—నీవు దివ్యతేజమునం దుండియుఁ దిమిరమును దలంచి భయపడిపోయితివి—అమృతమును సేవించుచుండియు నామయమును శంకించి తల్లడిల్లిపోయితివి.

కల్యా—ఏమిచేయుదును ? ఆకస్మికముగ మనస్సంయమన మసాధ్యమైపోయినది.

ప్రబో—మనసుతోఁగూడఁ బోవుచున్నంతవఱకు నీకు మాతృసేవాభాగ్యము లేదు.

కల్యా—ఇక నట్టిభయము లేదుగాదా ?

ప్రభో—వెఱ్ఱివాఁడా ! మనసు స్వాధీనమునందు లేనంతవఱకే ప్రపంచమునందు భయము లేనిచో నెక్కడ నున్నది ? భవబంధము వదలనంతవఱకుఁ బరిణామము లేనిసమయ మెక్కడ నున్నది ?

కల్యా—స్వామీ ! ఇంకను నాకెంత రాయము లున్నవా ?

ప్రభో—అజ్ఞానము వదలనంతవఱ కన్నియు నంతరాయములే—

కల్యా—గురుదేవా ! విజ్ఞానమును సాధించుటకై యింకను నేనేమిచేయవలయునో యనుగ్రహించి బోధింపుఁడు !

ప్రభో—కొంతకాలమువఱకు నీవిచ్చటనే యప్రమత్తుఁడవై యుండి నీవిధాయకకృత్యములను నిర్వర్తించుచుండుము. మాతృసేవాపరాయణుఁడ వగుచున్న మహామాత యచిరకాలములోనే యనుగ్రహింపఁగలదు. నీకేవస్తువలన భయమగుచుండెనో యేవస్తువు దలంచిన నీహృదయము చెదరిపోవుచుండెనో యావస్తువునే యనంతశక్తిస్వరూపముగ భావించి ధ్యానించుచుండుము. ఇదియే నీజ్ఞానసాధనమునకుఁ బరమోపాయము.

అని చెప్పుచుఁ బ్రబోధానందస్వామి లేచెను. కల్యాణానందుఁ డాతనిపాదములకు నమస్కరించి వీడ్కొనియెను. అంతలో నాస్వాము లిరువురు నాచంద్రికాంతరాళమునం దదృశ్యులైపోయిరి.

ఇ రు వ ది నా లు గ వ ప్ర క ర ణ ము.

గోడ వెట్టినట్టు ♦ లోఁతుది బొంకినఁ
బురుషుఁడైనఁ దప్పఁ ♦ బూసినట్టు
లనుట నిక్క, మట్టె ♦ నరయుము మీ మతిమంతు
మంకి జంత రెంత ♦ బొంకు బొంకె?

చిత్రకథాసుధాహారి.

వేంకటేశ్వరుఁడా దెబ్బతో స్మృతితప్పి పడిపోయెను. బండివాఁడు కొంతసేపటికి కక్కడకు వచ్చి యాతనిసేద దేర్చి బండిపై కెక్కించెను. అప్పుడు వేంకటేశ్వరుఁడు బండివానితో ,,అపశకునమైనది. బండి పెద్దాపురమునకే మరలింపుము" అని చెప్పెను. బండివాఁ డేమియు మాటాడకుండ నాతనియాజ్ఞను బరిపాలించెను. బళ్లునఁ దెల్లవారునప్పటికి బండి పెద్దాపురమున రాజరత్నమునింటి యొద్ద నిలిచెను. రాజరత్నము బండిచప్పుడువిని పరుగెత్తుకొనివచ్చి ద్వారముకడ నిలువఁబడియెను. వేంకటేశ్వరుఁ డాయాసముచేఁ దూలుచు బండిదిగెను. రాజరత్నము తత్తరముతో వచ్చి యాతని బట్టుకొని ,,ఇదియేమి? ఇట్లున్నారు" అనియెను. వేంకటేశ్వరుఁడు ,,దైవానుగ్రహముచే బ్రదికియున్నాను" అనియెను. రాజరత్నము భయసంభ్రమములతో నాతనికిఁ గైదండయొసంగి మెల్లగ మేడమీఁదికిఁ దీసికొనిపోయి యొకసోఫాపైఁ గూర్చుండఁజేసెను.

ఇంతలో నాగమణి సంభ్రమముతో నచ్చటికి వచ్చి వేంకటేశ్వరునివలన సకలవృత్తాంతమును విని యాలోచనము నభినయించి ,,ఇంకేమి? అనుకొనుచున్నట్లే యైనది!" అనియెను.

రాజ — అక్కా! అదియేమి?

నాగ—నీవింకను బెడదారినే యున్నావు. అందఱును నీవలె నే యుందురనుకొంటివా వెఱ్ఱిదానా ?

రాజ—ఏమి ?

నాగ—నీప్రేమయేమో, నీప్రియుఁడేమో, నీవేమో—అంతియేకాని నీకు రెండవలోకమే తెలియదు ! ఎట్లున్నను నీవు సానివేగాని సతీమణివి కాఁజాలవుగదా !

వేంకటేశ్వరుఁ డులికిపడి ,, సతీమణి కాకేమి ? ఈసతీమణి సాహచర్యసంప్రాప్తిమూలముననే నామరణము తప్పిపోయినది '' అనియెను.

నాగమణి చేతులు త్రిప్పుచు ,, మీరు మీసతీమణియొద్దనే యున్నయెడల నిట్టికష్టములు కవకాశమే లేకపోవును గాదా ? '' అనియెను.

వేంక అట్లయినచో నిచ్చటిసుఖసామ్రాజ్య మెట్లు లభియించును ?

నాగ—మీరు సుఖసామ్రాజ్యమనుకొనునది మీసహధర్మిణికి దుఃఖాంధకారాగారము కాకుండునా ?

వేంక— ఇది యేమి సహధర్మిణీధర్మము ?

నాగ—ఆయమ కీయమ యెంతదూరమో యీయమకా యమయు నంతియేకాదా ?

వేంక—అనసూయ యెన్నఁడు నట్లు తలంచి యుండ దని నేననుకొందును.

నాగ—ఔను— కులవధువునకున్న గౌరవమదియే—

రాజ—అక్కా ! నీవు నిందాగర్భముగ మాటాడుచున్నావు —అనసూయ నిజముగ ననసూయ యనియే నేను వినియుంటిని,

నాగ—నీవు వినియుంటివి— ఈమాన కనియుండిరి. మీ యిరువురు నొక్కస్వభావము కలవారు కావుననే యిరువురకు నన్యోన్యానురాగము దృఢపడినది. ప్రణయముగ్ధహృదయులగు మీకు దూరాలోచన మెక్కడ నుండును?— ఫలరసము మధురసముగ మారినప్పుడు దానిగుణము కూడ మారుననుటలో వింత యేమున్నది?

రాజ—కావచ్చును— అనసూయస్వభావముమాత్ర మట్లెన్నటికిని మారునని నాకు నమ్మకము లేదు.

నాగ—అనసూయగుణము మారనిచో నాత్మేశ్వరునకుం గశాఘాతము లెందుకు?

వేంకటేశ్వరుఁ డదరిపడి "నాగమణీ! ఏమంటివి?" అనియెను.

నాగమణి పెదవులు విఱుచుచు "అనుట కేమున్నది? అనుభవమునుబట్టి తెలియుచునే యున్నది!" అనియెను.

రాజరత్న మాశ్చర్యముతో "అక్కా! అనసూయయే యిట్లు చేయించియుండుననియా నీయభిప్రాయము?" అనియెను.

నాగ—ఇంకను సందేహమా? పరవశుఁడై పోయిన పతితో నామె కేమిప్రయోజన మున్నది?— ఆమె గర్భవతి యంట కాదా? ఆమె కిఁక సంతానసుఖము లభింపనున్నది. ఆసుఖ మార్గమున కీకంటకములుకూడ నెందుకు?

వేంకటేశ్వరుఁడు తీవ్రహృదయముతో నాలోచింపఁ దొడంగెను.

రాజ—అక్కా! అంతసాహసమా?

నాగ—స్త్రీసాహసము నీటిలోఁబుట్టిన నిప్పువలె ననివార్యమైనది. ఆబడబానలజ్వాలలలో నెన్నిప్రాణము లాహుతులు కా

లేదు ?— ఎన్నిరాజ్యములు నాశనముకాలేదు ?— ఎన్నికోటలు కూలిపోలేదు?

వేంకటేశ్వరుని సర్వాంగకములును గంపించిపోవుచుండెను. ఆతని రక్తనాళములలో నుష్ణరక్తమతివేగముగఁ బ్రవహించిపోవుచుండెను; ఆలోచనాపరంపరలచేఁ దలదిమ్మెక్కిపోవుచుండెను; హృత్పిండము కొట్టుకొనిపోవుచుండెను; శిరవుఁడై నిస్తబ్ధుఁడై యాతఁడు నిర్విణ్ణుఁడైపోయెను.

రాజరత్నము మందస్వరముతో "అక్కా! నాకుఁ జాల భయమగుచున్నది" అనియెను.

నాగ—అమ్మా! నీకు భయము కాదా? ఎవ్వనిహృదయమును నీహృదయము నేకమైనదో, యెవ్వనిజీవితమును నీజీవితము నేకమైనదో యాప్రాణమునకే మూపక కలుగనై యున్నప్పుడు నీకు భయము కాక మఱి యెవ్వరికి ?

రాజ—అనసూయ మాత్రమ ట్లాలోచించుకొనఁజాలదా ?

నాగ—ఆమె యెంతటియాలోచనకలది గాకున్న నింతపని చేయింపఁగలదు ?

రాజ—ఆమెయేయీదారుణకృత్యము చేయించినదందువా?

నాగ—ఇంకను సందేహమా ?

రాజ—అంతఃపురము దాఁటియెఱుంగని యామె కంతటి సామర్థ్య మెక్కడిది ?

నాగ—ధనమున కందఱును దాసులే.

రాజ—పాప మామెకు ధన మెక్కడిది ?

నాగ—నిన్నమొన్నటివఱకును వేలకొలఁది రాఁబడిగల విభుని ప్రేలితో నడపించిన యామెకు ధనమున కేమిలోపము ?

రాజ—అదొంగరంగని నామె యెట్లుఱుంగును ?

నాగ—వెఱ్ఱిదానా! మగనిపై మతివిఱిగినమగువల కెఱుంగ రాని దేమున్నది?

రాజ—నీమాటయందు నాకంతగా నమ్మకము కలుగుటలేదు.

నాగ—ఆయనకు నమ్మకము లేదు. అందుచే నీకును లేదు. ఆయనప్రతిధ్వనియే నీవు—

రాజ—ఆమాట కేమిగాని—ఆపనియే యామె చేయందలంచినచో నింతప్రయత్న మెందుకు? ఈయన ప్రతిదినమును దన యింటికే వచ్చుచుండిరి గాదా!

నాగ—అదియే దూరలోచన లేనిమాట—ఇతరులచేత నే తీఱిపోవుచున్నప్పుడు స్వయముగం జేయి చేసికొనుట యేల? అది యనితరసాధ్యమైనప్పుడు తాను స్వయముగనే చేసితీరును!

వేంకటేశ్వరుఁడు క్రుద్ధస్వరముతో "ఔను! ఇఁక నే నా యింటికిఁ బోను! ఆపాపాత్మురాలి మొగముచూడను!" అనియెను.

రాజరత్నము నివ్వెఱపడిపోయెను. నాగమణి దీనస్వరముతో "పదికాసులు పోయినను భగవదనుగ్రహముచేఁ బ్రాణములుదక్కినవి. ప్రాణములు చల్లగ నున్నచో భాగ్యముతోఁ బనియేమున్నది? మనకున్నది మనకుఁ జాలును. ఇఁక మీరాజోలికిఁ బోవలదు. మా ప్రాణము లన్నియు మీయొక్క ప్రాణముపై నిలువఁబడి యున్నవి. మీరు జాగరూకులై యుండవలయును. ఆయాదాయ మంతయు నామెనే యనుభవింపనిండు." అనియెను.

వేంకటేశ్వరుఁడు క్రోధకర్కశస్వరముతో "ఆపాపాత్మురాలి కొకచిల్లిగవ్వయైనఁ దక్కనిచ్చెదనా? ఎంత పనిచేసినది! దామోదరుఁడు రానిమ్ము! ఏమిచేయించెదనో?" అనియెను.

వేంకటేశ్వరుని ప్రణయచంద్రమండలము సంపూర్ణరాహు గ్రస్తమైపోయెను. ఎల్లయెడల మోహాంధకారము క్రమ్ముకొని పోయెను. ఆతనిజీవనారణ్యమధ్యమునఁ గంటకలతయేదియో కల్ప లతయేదియో నిర్ణయింపరాకుండఁబోయెను. ఆగాఢాంధకారపూరి తం బగునాతనిహృదయాంతరిక్షమునం దింతవఱకు ననసూయ యరుంధతీనక్షత్రముఁబలె మినుకుమినుకు మనుచుండెను. ఆకస్మిక ముగ నిప్పుడాచుక్క కాలయవనికాంతరాళమునం బడి యగపడ కుండఁ బోయినది. ఆతనిప్రేమమయ జీవితమున కవసానకాలము సంప్రాప్తమైనది కాఁబోలును! వేంకటేశ్వరుఁడు రాజరత్నముకొఱ కు మోహసాగరమున మునిఁగి తేలుచు నిరంతరమును గొట్టుకొని పోవుచుండెను.

ఇ రు వ ది యై ద వ ప్ర క ర ణ ము.

పలుకులఁ గూరిమి నెఱపెడు
తలఁపుల నొండొరుల మించు • దంపతులకు దు
ర్బలవిధిచేత వియోగము
గలిగిన శోకరణి నోర్వఁ • గావచ్చుఁ గటా!

కపోతము — హారావళి.

అనసూయ పతిప్రాణ; పతిదైవత; పతివ్రత—పతి యడు గులో నడుగువైచి, పతిహృదయమున హృదయము చేర్చి పరమా నందముతో జీవయాత్ర గడపఁగోరినది. కాని యామెకు దైవకటా క్షము దుర్లభమైపోయినది—కాలపరిణామము వ్యత్యస్తమైపోయి నది. ఆకుసుమవల్లిక గ్రీష్మాతపతాపమునకు గుఱియైపోయినది. ఆ

యమృతఫలశాఖ ప్రబలప్రభంజనాహతికిఁ బాలైపోయినది. ఆమెను కుమారహృదయముకష్టసహనసామర్థ్యముకలది; కావుననే యామె తననాథునిసుఖముకొఱ కెట్టికష్టమునైన ననుభవింపఁజాలియుండెను. ఏమాట యాడిన నేమనుకొనునో యనుసంశయముతో నామె తన నాథుఁడడిగినమాటకు మాత్రము ప్రత్యుత్తరము చెప్పి యంతమాత్రముచేతనే సంతుష్టినందుచుండెను. ఆతఁడు మునుపటివలెఁ జనవు చూపకున్నను నాతనిసందర్శనమునకు మాత్రమే సంతోషించుచుండెను. దినదినమునకుఁ బ్రాణేశ్వరునిపరివర్తనము మారిపోవుచున్నటు స్పష్టముగ నగపడుచున్నను జూచియుఁ జూడనట్లు మసలుచుండెను. ఎంతకష్ట మెంతకష్టము! సతీమణులు తమప్రాణములనైన నవలీలగ నితరులకొఱ కర్పింపఁగలరు గాని, ప్రాణేశ్వరుని జేతులార నితరులచేతుల కొప్పగించుటకు సహింపఁగలరా ?

అనసూయ కిప్పుడు భర్తృసందర్శనసౌభాగ్యము కూడ దూరమైపోయెను. కేవల మమాయకురాలై యుండుటయే యనసూయయందలి యొకగొప్పలోపము. ఏమాట యేటుపనిచేయునో యేపని యేవిధముగాఁ బరిణమించునో, యేపరిణామ మెంతవఱకు వచ్చునో పాప మామెకుఁ దెలియదు. అందుచేతనే యామెయాడినమాటలును, జేసినపనులునుగూడ నామె కింతవఱకుఁ దెచ్చినవి. ఆవినిర్మలప్రేమామృతమూర్తి యగుననసూయకుఁ బ్రేమతక్క మఱియేమియును దెలియనే తెలియదు. ఈసత్యమును వేంకటేశ్వరుఁడు తన ప్రేమనయనములతో విస్పష్టముగఁ దిలకించియేయున్నాఁడు. ఆప్రేమామృతము నాతఁడుఁగూడ నాస్వాదించియే యున్నాఁడు. ఆయమృతపానముచేసిన యాతని కీవిషవిషమవికృతి యేల కలుగవలయును? ప్రేమమయప్రపంచమునఁ బ్రేమచంద్రికలనే గాంచవలసిన వేంకటేశ్వరుఁ డీమోహాంధకారములో నేల మునిఁగిపోవలయును ?

అదియే పరమరహస్యము ! అదియే సృష్ట్యాదినుండియుఁ దెలియఁ బడనివిషయము. నిర్వికారుఁడగు పరమేశ్వరునకును వికారాకారిణి యగు ప్రకృతికిని నడుమఁ దెలియఁబడనియిట్టిరహస్యమే యున్నది- దీనినే జ్ఞానవాదులు మాయ యనిరి; కర్మవాదులు కర్మ మనిరి; యోగవాదులు యోగ మనిరి—ఆనిగూఢశక్తిప్రభావముచేతనే వేంకటేశ్వరుని ప్రేమమయహృదయాంతరాళమున మోహాంధకారము వ్యాపించినది ! ఈరహస్యసూత్రమును జ్ఞానధనులగుమహర్షులుకూడ దాఁటఁజాలకపోయిరి —ఇఁక వేంకటేశ్వరుఁడన నెంతటివాఁడు?—

ఏది యెట్లున్నను సామాన్యముగ లోకమంతయు గ్రహియింపఁగలిగిన దేమనఁగా:—“కుండెడుపాలలోనొక్క విషబిందువు పడినంతమాత్రమున నదియంతయు విషమైపోవును— కుండెడువిషములో నెన్నిపాలు పోసినను బాలు గానేరవు— వేంకటేశ్వరునియు హృదయకలశమున విషబిందువు పడినది. అందుచే నంతయును విషమైపోయినది. ప్రేమామృతప్రవాహిని యగు ననసూయ యింకేమి చేయఁగలదు ? ఇంతకును గారణము సహవాసదోషము! దామోదరుని దగ్గఱకుఁ జేరనీయకున్నచో నింతపట్టియునుఁగదు—”

ఇంతమాత్రమే —

వేంకటేశ్వరు నెఱిఁగినవారందఱు నీవిధముగ జాలిపడుచుండిరి. అనసూయ సామాన్యవ్యక్తి కాదు— దివ్యశక్తి— అందుచేతనే యింతటికష్టమును సహింపఁగలుగుచున్నది. కాని యీానడుమ భర్తయింటికి రాకపోవుటచే — ప్రాణేశ్వరుని సందర్శనలాభము కలుగకపోవుటచే నామెదుఃఖము దుర్భరముగనే యుండెను.

ఆవసంతకాల మాకస్మికముగఁ దిరిగిపోయినది. ఆసుఖదినములంతలో మారిపోయినవి. అనసూయ యెంతటిజ్ఞానవతియైనను

స్త్రీప్రకృతి— ఆమెహృదయాంతరాళమునం దప్పటియుత్సాహము లేదు— ఆమెవదనకమలమునం దప్పటివికాసము లేదు. ఆమోహనసౌందర్యమునం దప్పటిమాధుర్యము లేదు. ఆవినిర్మలతేజమునం దప్పటిలావణ్యములేదు. ఆరూపము మారిపోయినది. ఆమెకు నిద్రాహారములు దూరము లైపోయెను. ఆమెకోమలాంగకములు శుష్కించిపోయినవి. ఆపరిమళపుష్పహారములు— ఆయుద్యానవనవిహారములు— ఆమణిమయాలంకారములు— ఆయాకస్మికసాతౌత్కారములు— ఆయాటలు— ఆపాటలు— ఆమాటలు - అవి యన్నియు నిప్పు డేమైపోయినవో?— అనసూయ యిప్పుడు పాముకుబుసమువలె నొక్కచోఁబడి పొరలాడుచున్నది!!

ఆమె కిప్పుడు వంటలక్కయగుజోగమ్మకంటె మఱిదిక్కు లేదు— దుర్భరదుఃఖానుభవముకంటె నింక గతి లేదు. అనసూయ జోగమ్మయొడిలోఁ దలనుంచుకొని వెక్కివెక్కి యేడ్చుచుండెను. జోగమ్మ యేమేమియో చెప్పి యామె నూఱడించుచునే యుండెను. మంచిమాటలచే మఱపించుట కనసూయ పసిబిడ్డయా? ఆమెహృదయపరితాపము హృదయేశ్వరునివాగమృతప్రసారముచేతనే చల్లారవలయును— ఆమెదుఃఖాశ్రువులు ప్రాణేశ్వరుని కోమలకరపల్లవములచేతనే పరిమార్జితములు కావలయును— కాని యామెకాయాశ లేదు. నిరాశాప్రభంజనములలో నామెప్రాణదీపకళికలు ప్రకంపితములై పోవుచుండెను. అప్పుడు జోగమ్మ యామె కన్నీరు దుడుచుచు ,, తల్లీ! దుఃఖపడకుము! హృదయపరితాపముచేఁ బువ్వువంటినీమెత్తనిమేను వాడి వఱుగైపోవుచున్నది. అమ్మా! నీకష్టమును నాపాపపుఁగన్నులతోఁ జూడఁజాలకున్నాను '' అనియెను.

అనసూయహీనగద్గదస్వరముతో ,,అత్తా! నేనేమిపాపము చేసితిని? తుదకుప్రాణేశ్వరునిదర్శనముకూడ లేకుండఁబోయినది!'' అనియెను.

జోగ—అమ్మా! అంతగా నడలెదవేల? నేఁడుగాకున్న రేపైన నాతఁ డింటికి రాకమానఁడు— అతఁడుమాత్రము నిన్నుఁ జూడకుండ నుండఁగలఁడా? ఈమాత్ర మున కింతవిచార మెందుకు?

అన—మునుపు పగ లెక్కడఁ దిరిగినను రాత్రి కింటికి వచ్చెడివారు. క్రమముగాఁ దరువాత రాత్రులుతిరిగి పగ లింటికిఁ దప్పకుండ వచ్చెడివారు. ఇప్పుడు రాత్రియుఁ బగలునుగూడ నింటిమాటయే తలపెట్టుట లేదు. ఇఁక వారు నాకంటఁబడుదురను నాశ యేమున్నది? ఏమోకాని నేఁడు నాహృదయము చేపట్టికలఁచివేసినట్లగుచున్నది. నాప్రాణములు తల్లడిల్లిపోవుచున్నవి.

జోగ—తల్లీ! వట్టిభయము పెట్టుకొని బెంగచేఁ గుందిపోవుచున్నావు. ఆనిశరీర మెక్కడ నున్నను బ్రాణము లన్నియు నీమీఁదనే యుండును—

అన—ఆదినములు తిరిగిపోయినవి. ఇఁక నాకెందు కాశపెట్టెదవు? ఆయనకు నాపలయు ననియున్నచో నడ్డగించువారెవ్వరు?

జోగ—అమాయకురాలవు నీకాసంతి యేమి తెలియును?

అన—అందు చేతనే యింత మునిఁగినది.

జోగ—ఏమి మునిఁగినది? నీకు ధైర్యము లేదుకాని—నీమాట కాతఁ డడ్డము చెప్పఁగలఁడా?

అన—ఆయన పలుకరించుటయే మానుకొనినప్పుడు నేనేమనిమాటాడఁగలను?

జో—తప్పంతయు నాతనిమీఁద నుండఁగా నాతఁడు నిన్నే మొగముపెట్టుకొని పలుకరింపఁగలఁడు?

అన—ఆయనది తప్పని నేనెన్నఁడు ననలేదే! అట్లని నా మనసునందుఁ గూడ భావించుకొనలేదే! కాని యీయన యట్లు

భావించుకొనుట లేదు. అట్లే తలంచుకొన్నచో నాకంటఁ బడకుండ నుండఁ గలరా? నన్నుఁ బలుకరింపకుండ నుండఁగలరా? నేను తన హృదయములోని హృదయమనే కానా? తనప్రాణములోని ప్రాణమనే కానా? ఆయనకా సందేహ మేల కలుగవలయును?

జోగ—సహవాసదోషముచే నాతని స్వభావము మాఱి పోయినది.

అన—స్వభావము మాఱిన మారుఁగాక! సంబంధము వదలిపోలేదే!

జో—అది యెట్లు వదలిపోవును? ఎప్పటికైన నిది నిత్యము గాని యది నిత్యమా? నీవు సంతానవతివై—

అన—అయ్యో! ఈ దౌర్భాగ్యురాలి కంతటి యదృష్టమా?

జోగ—కాలకర్మవశంబునం గలిగినకష్టములు కలిగినట్లే యుండవు.

అన—కష్టముల ననుభవించుటకే యీ నసూయ పుట్టినది. కాకున్నచో నఱచేతిలోనియమృత మందకుండఁబోవుట యేమి?

జోగ—ఎక్కడకుఁ బోవును? ఆకర్షణయంతము నీగర్భమునందే యున్నది కాదా?

అన—అత్తా! అంతమాత్రమున నేమిలాభము? కొమ్మ విఱుగకుండ నున్నప్పుడుగద కుసుమము ఫలియించుట? ఉత్తరక్షణము మనది గాదు. రేపటిమాట యెట్లుండునో యెవ్వరు చెప్పఁగలరు?

జో—అమ్మా! అధైర్యపడుటచే నేమిలాభము? ధైర్యము వహించి సుఖకాలమునకొఱకు నిరీక్షింపవలయును.

అన—నాయందలి ప్రేమచే నిట్లనుచుంటివిగాని నాజీవితమున కిఁక సుఖలేశమైన నున్నదా?

జోగ — నీవింతగా నిరాశఁ జెందుటకు నీపై నాతని కేమైనఁ గోపమున్నదా ?

అన — లేదుగావుననే యీశరీరమునం దింకను బ్రాణములు లేకుండఁ బోలేదు — అందుచేతనే యీదుఃఖము ! ఈదుర్భరదుఃఖశాంతికి సుఖమరణముకంటె గత్యంతర మేమున్నది ? ఆత్మేశ్వరుని ప్రేమైక తేజము నాగర్భమునం దుండుటచే నదియును నాకు దుర్లభమై పోయినది. ఇఁక నేనేమి చేయుదును ?

అని యనసూయ జోగమ్మకంఠమును గౌఁగిలించుకొని వెక్కి వెక్కి యేడువఁదొడంగెను. జోగమ్మహృదయము దహించుకొని పోవుచుండెను. ఆమెకును కన్నీ రాఁగినదిగాదు. ఏమనియూఱడింపఁ గలదు ? ఆమె యెట్లో ధైర్యమును దెచ్చుకొని యనసూయకన్నీరు దుడుచుచు ,, తల్లీ ! దుఃఖింపకుము ! నాప్రాణము లుండఁగా నీకెట్టికష్టమును రానీయను ! నీసుఖముకొఱకు నాప్రాణములనైన వినియోగించెదను ’’ అని యుపలాలించెను.

ఇంతలో వీధిగుమ్మముకడ గుఱ్ఱపుబండి వచ్చి నిలిచినచప్పుడయ్యెను. జోగమ్మ యతిత్వరితముగఁ దలుపు తెఱచుటకై పోయెను. ఆనిమిషములో ననసూయ పవిత్రహృదయాంతరాళమున నెన్నియో భావస్ఫులింగములు నక్షత్రములవలె మెఱసిపోయెను.

ఇ రు వ ది యా ఱ వ ప్ర క ర ణ ము.

అకట ! యెంతటి దాంపత్య ♦ మెంతమైత్రి,
యెంతచనవు, వలపెంతగాఢము, ♦ యెంతగరువు,
మంతెడఁగు, యెంతమర్యాద, ♦ యెంతమోహ,
మంతయు నొక్క మెత్తులో ♦ నైతఁ గంటె !
కుటిలమైనతాత్కాలిక ♦ కోపవహ్ని
జాఱిబడి పోవఁదగునదా ♦ ప్రణయమహిమ ?

ప్రణయకోపము—హేరావళి.

ఉత్తరక్షణముననే యనసూయ కాత్మేశ్వరునిసాక్షాత్కారము లభియించెను. ఆనిమిషముననే యామెశారీరకమానసిక వ్యాపారములకు విలక్షణపరిణామము కలిగెను. తోడనే యామె చటాలున లేచిప్రకంపితసర్వావయవయై వచ్చి ప్రాణేశ్వరునిపాదములపై బడి తనకరకమలములతో నాథునిచరణకమలములం బట్టుకొని వేఁడికన్నీటితో నభిషేచనము గావించెను. అప్పుడు వేంకటేశ్వరుఁడు క్రోధావేశపరవశుఁడై తనయెడమకాలితో ననసూయయుత్తమాంగమును నిష్కారణముగఁ దన్ని నెట్టివైచెను. శివశివా! ఇది యెట్టివిరూపసంఘటనము ! ప్రణయసాగరతరంగడోలికావిలసితంబులగు రాయంచదంపతులంబోని యీయువతీయువకులయమూల్యప్రేమమయదాంపత్యధర్మమునకుఁ గాలకర్మవశంబున నెంతటివిఘాతము సంభవించినది!! నిరంతరసతీహితపరాయణుఁ డగునావేంకటేశ్వరుఁడేనా యితఁడు? ప్రణయలీలామృతతరంగిణియు, ప్రసవసుకుమారశరీరిణియు, పతిగతైకజీవనయు నగునసూయను—తనసహధర్మచారిణియగు ననసూయను—సవిలాసముగ, సోత్సాహముగ, సాన

దముగ, సానురాగముగ నుపలాలింపవలసినయనసూయను — ఇట్లు చేయఁదగునా ? అర్థాంగలక్ష్మియు, నబలయునగు ననసూయను మన్నింపవలసినమార్గ మిదియా ?

రాకాచంద్రశీతలస్వభావుఁడగు నావేంకటేశ్వరుఁ డిప్పుడు గ్రీష్మమధ్యందినమార్తాండప్రచండమూర్తియై యుండెను. అమృతమోహనమూర్తి యగు ననసూయ యిప్పుడాతనికంటికిఁ గరాళమృత్యుదేవతాస్వరూపిణిగ నగపడుచున్నదా? కాఁబోలును! చందనరసశీతలం బగునామెసుకుమారసుందరకరమిప్పు డాతనికి దారుణకలికిలాసదృశ మైపోయినది కాఁబోలును! ఆతనికన్నులు కెంజాయవారిపోయెను. క్రోధావేగముచే నతని సర్వాంగకములును గంపించి పోవుచుండెను.

అప్పు డనసూయ మెల్లగ లేచి దీనమానసమితవదనయై శోకవినమ్రగద్గదస్వరముతోఁ బ్రాణేశ్వరునుద్దేశించి ‹‹ నేనేమియపరాధము చేసితిని ? ›› అనియెను. ఆదీనస్వరమునఁ గరుణారసము పొంగి పారలిపోవుచుండెను. ఆమెకనుదమ్ములనుండి వేడికన్నీరు వెల్లివిరిసిపోవుచుండెను.

వేంకటేశ్వరుఁ డలక్ష్యభావముతో ‹‹ చేయఁదలఁచినను నీవేమి చేయఁగలవు ? లెమ్ము ! ఇఁక నీవీయింట నుండవలదు ›› అనియెను.

అనసూయ కామాటలయర్థము బోధపడలేదు. ఆమె దీనస్వరమున ‹‹ ఇఁక నేనీయింట నొంటిగ నుండఁజాలను — మీపాదసేవచేయుచు నచ్చటనే యుండెదను. ›› అనియెను.

వేంకటేశ్వరుఁడు కర్కశస్వరముతో ‹‹ఎచ్చటనుండెదవు?›› అనియెను.

అన — మీచరణకమలసన్నిధానమునందే—

వేంక — చాలు ! ఇఁక నాతో నీకు సంబంధము లేదు.

అనసూయ కాకస్మికముగఁ దలపైఁ బిడుగుపడినట్లయ్యెను— ఆమె యేడ్చుచు “మీహృదయేశ్వరికి మీహృదయాంతరాళమునఁ జోటు లేకపోయినను మీపదతలమునందైన నించుక తావు దొరకదా ?” అనియెను.

వేంకటేశ్వరుఁడు వికృతస్వరముతో “ఇఁక నీకా యోగము లేదు ?” అనియెను.

అనసూయ సుడిగాలికిం దూలుసుమవల్లరింబోలి గడగడ వడఁకిపోయెను. భర్త యుదాసీనుఁడై యున్నప్పుడే యామె మాటాడుటకు భయపడుచుండెడిది. ఇంతవఱ కనసూయ తనప్రాణేశ్వరుని వదనమండలమునం దుంచుకకోపచిహ్నమైనను గని యెఱుంగదు. ఇంతటితీవ్రక్రోధపరవశుఁడగునాథునితో నిప్పుడామె యెట్లు మాటాడుటకు సాహసింపఁగలదు ?— కాని మానవతియగునామెకు మనసుకరఁగునట్లుగఁ బ్రాణేశ్వరునితో మాటలాడుటకంటె—మనవిచేయుటకంటె నింకఁ జేయవలసిన దేమున్నది ? ఆవశ్యకమును బట్టి యాకస్మికముగ నామెకాభయము వదలిపోయినది. ఆహృదయదౌర్బల్యము వదలిపోయినది—

అప్పుడనసూయ ప్రణయసూచకదీనస్వరముతో “ప్రాణేశ్వరా ! ఇఁక నాకా యోగము లేదా ? ఇది మీకరుణార్ద్రహృదయమునకుఁ దగినమాటయేనా ? మీప్రణయమధురరసనారంగము నుండి వెలువడఁదగినమాటయేనా ? మీపాదదాసినగు నే నేమియపరాధము చేసితిని ? మీయానందలీలాసాలభంజిక నగునన్ను మీప్రేమమయహృదయమునకు దూరముగఁ జేసివైచితిరి. మీప్రసన్నకటా

డుములకు దూరముగఁ జేసివైచితిరి. నే నేమి నేరము చేసితిని ? పూల దండ సంకెలయైపోయినదా ? పన్నీరు లక్కతైల మైపోయినదా ? అమృతవల్లిక గరళవల్లిక యైపోయినదా? నే నేమి పాపము చేసితిని ?' అనియెను.

వేంకటేశ్వరుఁడు కోపముతో "ఈగొడవ యంతయు నెందుకు ? శీఘ్రముగ నీయిటనుండి వెడలిపోవలయును" అనియెను.

అన — నాథా ! నే నెక్కడకుఁ బోవుదును ?

వేంక — నీయిష్టమువచ్చినచోటికి —

అన — నాకీప్రపంచమున మీకంటెను మఱి యిష్టవస్తువే మున్నది ? నాసుఖముపై నాకిష్టము లేదు — నాశరీరముపై నాకిష్ట ములేదు. నాప్రాణములపై నాకిష్టము లేదు. నాకీయిహజీవితము నందును బరజీవితమునందును మీకంటె మఱి యెట్టిగతియును లేదు.

వేంక — ఇహలోకమున నింత యైనది చాలదా ? ఇఁకఁ బర లోకమునఁగూడ నన్ను వదలవు కాఁబోలును !

అన — ప్రాణేశ్వరా ! ఎట్లు వదలఁగలుగుదును ? నాలుక తోడుకొనిపోవుచున్నను మీనామమంత్రమును వదలఁగలుగుదునా? ప్రాణములు వెడలిపోవుచున్నను మీపాదపద్మధ్యానమును విడువఁ గలుగుదునా ?—

వేంక — చాలు! అంతటితోఁ గట్టిపెట్టి నన్ను వదలిపెట్టుము

అన — నాథా ! ఎంతమాట ? వదలిపెట్టుట మాటలలో నున్నదా ? ఏదియో యాకస్మికక్రోధముచే నట్లనుచుంటిరి గాని మీరుమాత్రము నన్ను వదలిపెట్టఁగలరా ?

వేంకటేశ్వరుఁడు కన్నులెఱ్ఱగఁ జేయుచుఁ గఠినస్వరముతో "ఏమి ? నీవేమిచేయఁగలవు ? ఇప్పుడు నీవీయిల్లువిడిచిపోయెదవా లేదా ? " అని గద్దించిపలికెను.

అనసూయ ప్రార్థనాదీనకంపితస్వరముతో "నాథా! నేనెన్నఁడైన మీయానతి కమగుదాఁటితినా? ఇంత తీవ్రముగ శాసించుటకు నేనే యపరాధము చేసితిని? తప్పు దెలుపకుండ దండించుట వలనఁ బ్రయోజన మేమున్నది? పాపమునకుఁ బశ్చాత్తాపమునఁగాని నిష్కృతి లేదు కాదా?" అనియెను.

వేంక — ఓహో! ఈపిశాచహృదయమునకుఁ బశ్చాత్తాపము కూడనా?

అన — ప్రాణేశ్వరా! ఈనిర్భాగ్యురా లొకప్పుడు నీప్రియురాలే కాదా? వెలయాలినిఁ జూచినకన్నుల కీప్రియురాలు పిశాచమైపోయినదా? కాదు కాదు! కన్నులు మారినచోఁ గళలు మారిపోవు — ఊరు మారినచోఁ బేరు మారిపోదు!

వేంక — ఏమియీ శ్రీరంగనీతులు! పాపాత్మురాలా! నీమొగము చూచినఁ బాపము రాఁగలదు.

అన — నాథా! నేనేమి పాపము చేసితిని? ఏమియు నెఱుఁగని పాపమునకంటె నాకేమియును దెలియదు. నాహృదయమును భేదించి పరీక్షింపుము! — నిరంతరము నిన్ను ధ్యానించుటకంటె నీప్రేమైకమూర్తి నారాధించుటకంటె — నీచరణకమలములను సేవించుటకంటె నేనేమియు నెఱుఁగను. నీనిరంతరసేవాలాభమును వాంఛించుటకంటె నీయిహజీవితమునందు నాకేమియును గోరిక లేదు. మఱియెట్టికోరికయును లేని నే నేమిపాపము చేసితిని! ప్రాణేశ్వరా! నేను నీప్రాణేశ్వరిని — నేనే పాపము నెఱుంగనిదాన నని నీ వెఱుంగవా? హృదయేశ్వరా! నేను నీహృదయేశ్వరిని — నాహృదయ మంతకఠినమైనది కాదని నీకుఁ దెలియదా? నాకొక్కటే కోరిక యున్నది. అట్లు కోరుకొనుట పాపము కాదు. ఈలోకమున [illegible]

కంటె నాకు దిక్కెవ్వరున్నారు? నీకంటె నాకో యిక దీర్చువా రెవ్వరున్నారు? జీవితేశ్వరా! ఈశుష్కనయనములతో నీసుధామధుర విగ్రహమును దిలకింపనిమ్ము! ఈశుష్కకంఠముతో నీశుభనామ మంత్రమును జపియింపనిమ్ము! ఈశుష్కహస్తములతో నీసుందర చరణకమలములను సేవింపనిమ్ము! ఆత్మేశ్వరా! నీవే నాయాధారము! నీవే నాయానందము! నీవే నాకులదైవము—నా సర్వస్వమును నీవే! నీకంటె నాకింక నేమున్నది! నేనేపాపము నెఱుంగను. నీ ప్రణయకటాక్షవీక్షణములపై నాజీవిత మాధారపడి యున్నది. హృదయేశ్వరా! నన్ననుగ్రహింపుము.

అని యేడ్చుచు నగతిక యగుననసూయ యాతనిపాదముల పైఁబడియెను. వేంకటేశ్వరుఁడు క్రోధవికృతస్వరముతో "దురాత్మురాలా! నీనక్కవినయము లింకఁ జాలును! నీవు పయోముఖ విషకుంభమవు— గోముఖవ్యాఘ్రమవు— భేకస్వరభీకరభుజంగమవు! పాపాత్మురాలా! నడువుము— ఇంక నీవీయింట నుండఁదగవు- నావెంట నుండఁదగవు— ఇట్టినీవు నాయిల్లాల వని చెప్పుకొనుటకుఁ గూడ నాకు సిగ్గగుచున్నది క్రూరాత్మురాలా! ఈకపటదీనాలాపములచే— ఈకృత్రిమదుఃఖాభినయములచే- ఈమృషాభయప్రకంపనములచే— పాపకళంకము పరిమార్జిత మైపోవు ననుకొంటివా? పద. పద" అనిగద్దించిపలుకుచు వేంకటేశ్వరుఁ డతిదారుణముగ నామెను ద్రోసికొనిపోయి వీథిగుమ్మమునవ్వలకు గెంటివైచెను.

అంతఃపురవధూమణి యగుననసూయ యప్పుడు నట్టనడి వీథిలోఁ దూలిపడిపోయెను. మొట్టమొదటినుండియు నోట మాట రాక విభ్రాంతయై చూచుచున్న జోగమ్మ భయావేగముచే వేంకటేశ్వరుని నిందించుచు నడ్డగించుటకుఁ బ్రయత్నించినది కాని యది

యబలయగు నామెకు సాధ్యమగునా ? ఆమె గోలుగోలున నేడ్చుచుఁ బోయి యనసూయను లేవఁదీసి పట్టుకొనియెను. ఆగోలవిని యిరుగుపొరుగువా రందఱును వచ్చి మూఁగిరి గాని వేంకటేశ్వరుని భయముచే నెవ్వరు నేమియు ననఁజాలక హృదయము కరఁగిపోవుచుండఁ గన్నీరునించుచుఁ గాంచుచుండిరి. వేంకటేశ్వరుఁడు క్రుద్ధవ్యాఘ్రమువలె రోజుచు ద్వారప్రదేశమున రోషస్తంభితుఁడై కాలయమునివలె నిలువఁబడిపోయెను.

అనసూయ కిఁక నేమున్నది ? ఆప్రణయచంద్రిక యస్తమించిపోయినది— ఆప్రణయప్రాసాదము కూలిపోయినది—ఆప్రణయకల్పకము మూలచ్ఛిన్నమైపోయినది—ఆమె దుస్సహదుఃఖభారముచేఁ దూలిపోవుచుండెను— దురంతపరితాపాతిరేకముచే దీర్ఘశ్వాసములను విడుచుచుండెను. దారుణావమానశరాఘాతముచేఁ గుంగిపోవుచుండెను. ఆమెశరీరమునం దింకను బ్రాణము లున్నవిగాని హృదయమునం దాశలు వదలిపోయినవి—అప్పు డామెహృదయమునందు దుఃఖము లేదు. భయము లేదు. క్రోధము లేదు— మానవతియగు నాసతీమణిహృదయాంతరాళమునం దప్పు డేదియో యనిర్వాచ్యమగు దివ్యశక్తి యుత్తేజిత మగుచుండెను. ఆమె కీప్రపంచమునం దేమియు నగపడుట లేదు. ఎట్టయెదుట భర్తమాత్రమే యగపడుచుండెను.

అప్పు డామె యభిమానోద్రిక్తగంభీరస్వరముతో .‘నాథా ! మీరు నిష్కరుణులై మీసహధర్మచారిణి యగునర్ధాంగిని దూరముగఁ ద్రోసివేయఁదలంచితిరి. కాని మీరుమాత్రము నాకెన్నఁటికిని దూరము కాఁజాలరు ! మీయమృతమోహనవిగ్రహము నా హృదయమందిరమునందే యున్నది. మీప్రణయమధురతేజము నా

గర్భగోళమునందే యున్నది. మీ రెట్లు పరిత్యజించినను నేనుమాత్ర ము మీ దాననే—సత్యముగఁ జెప్పుచున్నాను—శపథముచేసి చెప్పు చున్నాను—ధర్మమున్నచో—దైవమున్నచో—నెప్పటికిని మీరు నావారే—మీపవిత్రప్రణయచంద్రికపైఁ గాలమేఘము క్రమ్ముకొన్నది—ఆయంధకారములో మీరు విభ్రాంతులై పోయితిరి. అందు చేతనే మీరు చింతింజను జింతామణిగ గ్రహించి పూలదండను గాలకాకోదరముగ భావించుచున్నారు. అందుచేతనే మీకింతటి యసమసాహసము కలిగినది—కాని యింతమాత్రముచే నా యాశ యింకను సంపూర్ణముగ నంతరించిపో లేదు—ఆ యాశాలేశముచే తనే నేను జీవించి యుండెదను. కాలము చంచలమైనది—మీహృ దయమునందలి యాకాలమేఘము మాత్రము సుస్థిరమైనదా? ఎప్పటి కైన మీహృదయాంతరాళమునఁ బశ్చాత్తాపప్రభంజనము వీవక మానదు—ఎప్పటికైన నాపాపపుమేఘము పటాపంచలై పోకమా నదు—ఎప్పటికైన నాప్రణయచంద్రిక మరల నెప్పటివలెఁ బ్రకా శింపక మానదు—ఎప్పటికైన నాశరచ్చంద్రికలలో మీరు నన్ను వెదకికొనకమానరు—నన్నుఁగూర్చి యుచ్చైస్స్వనమున విలపింపక మానరు. ప్రణయామృతకలశమును బాదములతోఁ దన్నివైచు కొంటినే యని విచారింపకమానరు. భ్రాంతిమూలకమైనయీదుష్కృ త్యముం దలంచుకొని పరితాపపడకమానరు—ధర్మమే సత్యమైన చో—దైవమే సత్యమైనచో—ప్రేమయే సత్యమైనచో—నా మాట యసత్యము కాదు. సత్యము! సత్యము!! ముమ్మాటికిని సత్యము!!!" అని యామెయచ్చటినుండి గిరుక్కున మరలి రాజ మార్గమునుబట్టి పోయెను. జోగమ్మకూడ నామె ననుసరించియే పోయెను. వేంకటేశ్వరుఁడు ప్రతిభుఁడై యట్లే నిలువఁబడిపోయెను.

అప్పు డాకస్మికముగ నప్రయత్నముగ నాతనివదనమునుండి ‘‘పోవే! పిశాచీ!’’ అనుమాటలు వెలువడియెను.

‘‘హా! పరమేశ్వరా! ఏమియీదారుణవైపరీత్యము!’’ అని యందఱు ననుకొనసాగిరి.——

శ్రీరామచంద్ర.

మాతృమందిరము

ద్వితీయభాగము.

మొదటి ప్రకరణము.

కలితగంగాప్రవాహోన § గాహనమున
గాత్రము పవిత్రమై కాంతిఁ § గాంచినట్లు
అనుపమానప్రభావది § వ్యాంజనమున
నేత్రములు నిర్మలంబులై § నెగడినట్లు
కమ్రితరశాణయంత్రసం § ఘర్షణమున
జీవమణి దీప్తమై విరా § జిల్లినట్లు
పటుతరానలసంపుట § పాకకలనఁ
గనక ముత్తప్తమై వన్నెఁ § గన్నయట్లు
సరసకావ్యరసామృతా § స్వాదనమున
హృదయనీము పవిత్రమై, § సదమలమయి,
దివ్యమై, తీక్ష్ణమై సము § ద్దీప్త మగుచు
నిశ్చలానందపదవి నం § దించుచుండ
నీనరుఁడు కోరఁదగినది § కేమి గలదు!

కావ్యగీతమా — హారావళి.

గౌతమీపుణ్యతరంగిణీతీరమునందలి గోపాదక్షేత్రము సుప్రసిద్ధపుణ్యక్షేత్రములలో నొక్కటిగఁ బరిగణింపఁబడుచున్నది. ఆదివ్యక్షేత్రమునందలి యంతర్నిలయమునందే యతిలోకసుందర

మగు మాతృమందిర మున్నది. ఆపవిత్రమందిరమునందే సర్వజగ ద్ధారిణియు, సర్వసంతానసముద్ధారిణియు, సర్వపాపసంహారిణియు, సర్వలోకైకాధారిణియు నగుజగన్మాత సర్వమంగళాకారిణియై వేం చేసియుండి తనదివ్యమంగళకరుణామృతమధురకటాక్షములచే లోక మును బరిపాలించుచున్నది. పాపపుణ్యములం బరిశీలించుచున్నది. దుష్టశిక్షణశిష్టరక్షణమార్గములం బ్రవర్తించుచున్నది. ఆదివ్యమంగ ళకరుణాకటాక్షములచేతనే సర్వమును జరగిపోవుచుండెను. ఆపవి త్రస్థానమును భక్తిజ్ఞానసంపన్నులగు పెద్దలందఱు నైశ్వర్యకైలాస మనియు, నారోగ్యవైకుంఠమనియు, నానందబ్రహ్మనిలయ మనియు భావించుచుండిరి. ఆమాతృమందిరము ప్రబోధానందునియనుగ్రహ ములేక యప్పటికి నిప్పటికినిగూడ నగోచరమై యగమ్యమై యుండెను.

అది యొకదివ్యనగరమువలె నుండెను. మధ్యభాగమునందే మాతృదేవతామందిర మున్నది. ఆమాతృమందిరమునకు వామ భాగమునం బ్రబోధమందిరమును, దానిననుసరించి శిక్షామందిరము నుండెను. దక్షిణభాగమునం దానందమందిరమును, దానితోంగలసి విజ్ఞానమందిరము నున్నవి. ప్రబోధమందిరమున కెదురుగ సరస్వతీ మందిరమున్నది. ఆనందమందిరమున కెదురుగ నన్నపూర్ణామందిర మున్నది. మాతృమందిరమునకు వెనుకభాగమున నెన్నియోనిగూఢ మందిరము లున్నవి. వానినామములన్నియును దెలిసికొనుటకుంగాని యందెవ్వరెవ్వరుందురో, నిరంతరము నచ్చట నేమేమికార్యములు జరగుచుండునో తెలిసికొనుటకుంగాని ప్రస్తుతము మనకంతగా నావ శ్యకములేదు—అందలియొక్కొక్కమందిర మొక్కొక్కచిన్ననగ రమే యని చెప్పవచ్చును. ఆయంతర్నగర మేకాలమున నేవిశ్వ

కర్మచే నిర్మింపఁబడెనో యెవ్వరికిని దెలియదు. మాతృమందిరమున కెదురుగ విశాలరాజమార్గమున్నది. దానికిరువంకలను జల్లిఫలవృక్షములును, బుష్పలతానికుంజములును వరుసగఁ బెరిగి హృదయ నయనానందకరంబులై యుండెను

దూరమునం దొకవిశాలసుందరారామమును, నానడుమఁ జంద్రకాంతశిలాసోపానసమంచితమగు విశాలసరోవరమును గలవు. అదియే యమృతసరోవరము. గోదావరీగర్భమునందలి యమృత సూత్రము నుండి గంగాజలము సుధారసముగఁ బరిణమించి పొంగి పొరలిప్రవహించుచు నిరంతరము నాసరోవరము నమృతపరిపూర్ణ ముగఁ జేయుచుండును. ఆసరస్తీరమునందలి బిల్వవనమధ్యమునందే ప్రబోధానందస్వామియాశ్రమ మున్నది. ఆమహానుభావుఁ డేనాఁటివాఁడో యెవ్వరికిని దెలియదు. ఎందఱోమహానుభావు లాపుణ్యమూర్తిని సందర్శించి యాతనియనుగ్రహముచే నయ్యమృతసరోవరమునం దవగాహనముల నాచరించి మాతృసేవాదీక్షితులై జీవన్ముక్త భావమునఁ బుణ్యచరితులైనట్లు తెలియవచ్చుచున్నది.

తొల్లి శ్రీరామచంద్రుఁ డీసరోవరమునఁ గ్రుంకులిడి సీతావియోగదుఃఖమును మఱచి కార్యదీక్షాతత్పరుఁ డయ్యెను. పాండవాగ్రజుఁ డాపవిత్రజలస్నానానంతరమునందే భారతవర్షమునకుఁ బట్టభద్రుఁ డయ్యెను; అశోకుఁ డశోకుఁ డయ్యెను; విక్రమార్కుఁడు సాహసాంకుఁ డయ్యెను; శాలివాహనుఁడు శకకర్త యయ్యెను. రాజరాజనరేంద్రుఁ డాయమృతస్నానమువలననే పంచమవేదమగు భారతేతిహాసమునకుఁ గృతిభర్త యయ్యెను. శ్రీకృష్ణదేవరాయ లాపావనసరోవరావగాహనమాహాత్మ్యము చేతనే— ఆమాతృదేవతాప్రసన్నకటాక్షప్రభావముచేతనే— రాజచక్రవర్తియై, కవి

రాజచక్రవర్తియైన త్రిమూర్తులం దనయింటిలీలాసాలభంజికలుగాఁ జేసికొనఁగలిగెను.

ఆదికవిసార్వభౌముఁ డగువాల్మీకిమహర్షి యీయమృతసరోవరతీరమునందలి పావనతుసీవనమునందే శ్రీమద్రామాయణమహాకావ్యరచనాదీక్షితుఁ డయ్యెను. మహాత్ముఁ డగువేదవ్యాసుఁ డాప్రబోధానందానుగ్రహముచేతనే యమృతసరోవరమున సుస్నాతుఁడై మాతృదేవత నారాధించి యోగమవిభాగమ్ముం గావించి యష్టాదశపురాణములను వ్రాయఁగలిగెను. ఆమూలమువనే మాతృదేవతానుగ్రహమును సంపాదించి కాళిదాసు మహాకవి యయ్యెను. ఆపుణ్యజలస్పర్శనమైనతరువాతనే నన్నయభట్టారకుఁడు మహాభారతము నాంధ్రీకరింపఁదొడంగెను. కవిబ్రహ్మయగుతిక్కనసోమయాజి యీయమృతసరోవరమునందే యవభృథస్నానముం గావించి భారతామ్నాయమును సంపూర్ణముగ నాంధ్రీకరింపఁగలిగెను—వేయేల? మహాత్ములనియు, మహారాజు లనియు, మహాకవులనియు, మహాపురుషులనియు మనచేఁ జేర్కొనఁబడుచు నారాధింపఁబడుచున్న మహనీయులగుపుణ్యపురుషులందఱునుగూడ నాయమృతసరోవరావగాహనములం గావించినవారే—ఆప్రబోధానందగురుకటాక్షములం గాంచినవారే—ఆమాతృదేవతాప్రసాదమును స్వీకరించినవారే—

మాతృమందిరము నిత్యకల్యాణమయమైనిత్యోత్సవములతో నిండియుండును. పూజాసమయసూచకంబగుఘంటానాదము వినవచ్చినంతనే భక్తిభావహృదయులగు నచ్చటిపురుషులును స్త్రీలు నందఱును గలసి ప్రబోధానందు ననుసరించి యీమాతృమందిరమున కుఁబోయి మాతృదేవత నారాధించుచుందురు. అన్నపూర్ణామందిరమున నమృతాన్నపానములును, సరస్వతీమందిరమున సర్వవిద్య

లును నిరంతరము లభియించుచుండుటచే నటనున్నవారి యానందశ్రే
ణిని వనమున కెట్టికొఱంతయును లేదు.

కాని యీస్వర్గఖండమునందుఁగూడ నరకనిలయము లేకపో
లేదు. అదియే శిక్షామందిరము. ప్రబోధానందుఁడు పాపాత్ముల
నందుంచి పశ్చాత్తాపము కలుగువఱకు ననుకూలదండనముం గావిం
చి తుదకు వారిని బ్రబోధమందిరమునం జేర్చి యుద్ధరించుచుండును.
మన మొకప్పుడొక యంతర్గృహమునఁ బాపబాధాపీడితుఁ డగు నొ
కపురుషుని జూచి యుంటిమి—ఆగృహ మీశిక్షామందిరమునందలి
యొకభాగమే. ప్రబోధానందుఁ డట్టివారి నెందఱనో మాతృభక్తు
లనుగాఁ జేసియున్నాఁడు! ఆశిక్షామందిరమునందలి పురుషుఁడప్పటికి
సంపూర్ణముగఁ బశ్చాత్తప్తుఁడైనాఁడు. సర్వజ్ఞుఁడగుస్వామి యీ
సంగతిని గ్రహించెను; ఆతని కీదినమున మాతృదేవతాసందర్శన
లాభముం గల్పింపవలయు నని నిశ్చయించెను. ఆపురుషుని మాతృ
సేవాదీక్షితునిగఁ జేయఁ దలంచెను.

సాయంసమయపూజాసూచకం బగుఘంటాధ్వని వినవచ్చె
ను. నిమిషములో నానందమందిరమునుండి భక్తశిఖామణులగు స్త్రీ
పురుషు లందఱును బయలుదేరిరి. పురుషులందఱు నొక్కటేమాది
రిదుసులను ధరించి యుండిరి— అట్లే స్త్రీలందఱును సమవసనభూ
షణాలంకృతలై యుండిరి. ఇదివఱకే సూచితమైయున్న స్వామి యాన
తిననుసరించి స్త్రీలందఱు నొకపార్శ్వమునను బురుషులందఱు నొక
పార్శ్వమునను నిలిచి క్రమముగఁ బ్రబోధమందిరాభిముఖులై నడ
చుచుండిరి. ఆభక్తశిఖామణు లందఱును బరిమళసుమమాలికా
లంకృతులై యుండిరి. అందఱకరకమలములును దీపకంకణసంక
లితములై యుండెను. అందఱవదనకమలములును బ్రేమానందవిక
సితములై యుండెను. అందఱును మధురకంఠములతో మాతృగీత

ములను బాడుచు నడచుచుండిరి. ఆమధురగీతములలో నమృతము వర్షించుచుండెను; ఆనందము వెల్లివిరియుచుండెను— అట్లే నియమము చెడకుండఁ గ్రమముగ నందఱును బ్రబోధమందిరద్వారము నొద్దకుఁబోయిరి.

రెండవ ప్రకరణము.

పసుపురాచినయట్టి ♦ భవ్యనూత్నమున
సౌభాగ్యమయరేఖ ♦ సంధింపఁబడియె;
మెఱుఁగుపెట్టినయట్టి ♦ వింమటద్దమున
నమృతసుందరమూర్తి ♦ హత్తింపఁబడియె;
దిద్దితీర్చినయట్టి ♦ దివ్యాంబమున
విజ్ఞానదీపంబు ♦ వెలిఁగింపఁబడియె;
కొందలు తీర్చినయట్టి ♦ కోటగుమ్మమున
జయకేతనంబు సం ♦ స్థాపింపఁబడియె;
విజ్ఞానసీమలో ♦ విహరించకంటె
నానందవీథిలో ♦ నాడుటకంటెఁ
బరసుధామంబులోఁ ♦ బాడుటకంటె
నిప్పుడు కోరుటకు నీ ♦ కేమికావలెనె?
మలయమారుతమ్ముదు ♦ మధువీచికల
నమృతశీకనాట్య ♦ మాడుచుండె
మలయమారుతమ్ముదు ♦ మధురరాగమునఁ
బాడవే కోకిలా! ♦ పాడవే పగము!—

ఏకాంతసేవ.

అంతలోఁ బ్రబోధానందస్వామి విషవిషమపీడితుఁడగు నా పురుషుని దనతో వెంటఁబెట్టుకొని వచ్చి యాభక్తమండలమధ్యమునఁ బ్రవేశించెను. తోడనే యందఱు నేకకంఠముతో:—

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః"

అని స్తోత్రముచేయ నారంభించిరి. అప్పు డానూత్నపురుషుం డానందవిస్మితుం డైపోయెను. ఇంతకాలమునుండి శిక్షామందిరమునం దున్న యాతని కింతవఱకు నితరప్రపంచమే తెలియదు. అప్పు డాతనికన్నుల కదియంతయు నానందస్వర్గధామమువలె నగపడుచుండెను. ఆతనికి మానవత్వము వదలి దేవత్వము లభియించినట్లనుభవ మగుచుండెను. ఏమిమాటాడిన నేమగునో, యేమిచేసిన మరల నెట్లు పతితుండ నైపోవుదునో యనుభయముచే నాతండసిధారావ్రతము నవలంబించి మౌనముతో స్వామి ననుసరించి నడచుచుండెను.

క్రమముగ నందఱును మాతృమందిరముఖద్వారము నొద్దకు వచ్చిరి. ఆమందిరద్వారము లన్నియును మణిదీపజాలికాలంకృతము లైయుండెను. ప్రతిద్వారపార్శ్వములను భవ్యమణిభూషణాలంకృత లగు ద్వారపాలికలు వేత్రహస్తలై నిలిచియుండిరి. మందిరమంతయును మంగళసంగీతములతోఁ బ్రతిధ్వనించిపోవుచుండెను. అప్పు డాభక్తు లందఱును బ్రబోధానందపురస్సరులై కొలఁదిసేపటిలోఁ గక్ష్యాంతరములఁ గడచి గర్భాలయమునఁ బ్రవేశించిరి. ఎట్టయెదుట మధురమందహాసకళావిలసితయు, మనోజ్ఞవేషాలంకృతయు నగు మాతృదేవతామూర్తి వరాభయకరకమలయై సుప్రసన్నమందహాసవదనముతోఁ దనభక్తసంతానముపై మధురామృతకటాక్షములను బ్రసరింపఁజేయుచు సాక్షాత్కరించి యున్నది!

ఆ దేవీపాదపీఠమునకు వామభాగమునఁ ద్రిపురసుందరీమూర్తివలె దివ్యభూషణవిభూషితయై తరుణీమణి యగు నొకరమణీమణి పరిమళపుష్పాంజలినిబద్ధయై పుష్పించినవసంతవల్లికవలెఁ గుసుమ

విలసితం బగునుత్తమాంగము నొక్కించుకవంచి నిలువఁబడి యుండెను. ఇప్పు డామెయే మాతృదేవతకుఁ బూజాపరిచారిక — ప్రబోధానందుని యాజ్ఞాపరిచారిక — ఆమె నందఱు నానందాదేవి యని పిలుచుచుందురు. ప్రబోధానందుఁ డంతర్మందిరమునఁ బ్రవేశించి యాదివ్యసుందరీమూర్తి కెదురుగ దేవీపాదపీఠమునకు దక్షిణ భాగమున ధ్యానమ్రమవదనుఁడై నిలువఁబడియెను. భక్తులందఱును స్త్రీపురుషులు వేర్వేఱుగ వరుసలుతీరి ముకుళితకరకమలులై తమ నిశ్చలదృష్టులను దేవీచరణకమలములయందుంచి ధ్యానమగ్నులై యుండిరి.

అప్పు డాజగన్మోహనసుందరీమూర్తి ప్రబోధానందునకుఁ గన్నులతోడనే నమస్కారములం గావించి భక్తసంతానమువంకఁ బ్రసన్నమధురదృష్టిప్రసారముం గావించుచు నమృతమధురకంఠస్వరముతో:—

"యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః
యా దేవీసర్వభూతేషు పితృరూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు భ్రాతృరూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు బంధురూపేణ సంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు శాంతిరూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు దయారూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు ధర్మరూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు కర్మరూపేణసంస్థితా॥ నమః
యా దేవీసర్వభూతేషు ఫలరూపేణసంస్థితా॥ నమః॥
శ్రీలోచనకృతోల్లాసఫలదాయై నమోనమః
శ్రీసుధాబ్ధిమణిద్వీపమధ్యగాయై నమోనమః

శ్రీవీరభక్తవిజ్ఞాననిదానాయైనమోనమః
శ్రీనాథసోదరీభూతశోభితాయైనమోనమః
మాతృమండలసంయుక్తలలితాయైనమోనమః
మహాతాపౌఘపాపానాంవినాశిన్యైనమోనమః
సమస్తహృదయాంభోజనిలయాయైనమోనమః
సహస్రారసరోజాతవాసితాయైనమోనమః
భక్తరక్షణదాక్షిణ్యకటాక్షాయైనమోనమః
పద్మకైరవమందారసుమాలిన్యైనమోనమః
అమృతాదిమహాశక్తిసంవృతాయైనమోనమః
అనాద్యంతస్వయంభూతదివ్యమూర్త్యైనమోనమః.'

అని యామాతృదేవతామూర్తిని బ్రార్థింప నారంభించెను. భక్తులందఱు నాదివ్యగీతముల ననువదించి పాడుచుండిరి. ఆప్రార్థనానంతరమున నాత్రిపురసుందరి యగు నానందాదేవి దేవిపావనపాదపీఠముపైఁ బరిమళపుష్పాంజలి విడిచి పిమ్మట నానిర్మాల్యకుసుమములను దేవీప్రసాదముగ భక్తులందఱకు నొక్కొక్కటిగఁ బ్రసాదించెను.

ఆనూత్నపురుషుఁ డది యంతయు నువిభ్రాంతుఁడై చూచుచు నిశ్చేష్టుఁడై నిలువఁబడియుండెను. ఆనందాదేవి యాతనికిఁగూడ దేవీప్రసాదము నొసంగి తనకోమలకరపల్లవము నాతనియుత్తమాంగముపై నుంచి మృదుగంభీరస్వరముతో "తల్లిని దర్శించితివా?" అని హెచ్చరించెను.

పురుషుఁ డానందగద్గదస్వరముతో "తల్లీ! జగన్మాతను దర్శించి ధన్యుఁడ నైతిని. ఆకస్మికముగ నావిషబాధ యంతయు మంత్రించినట్లుగ నంతరించిపోయినది! నాపాపములు పటాపంచలై

పోయినవి. నాజన్మము తరించిపోయినది! తల్లీ! దయామయివగు నీకుఁ బదివేలనమస్కారములు!' అని యాతఁడామె పాదములపైఁబడఁబోయెను.

ఆనందాదేవి యాతని వారించి పూజాకుసుమములతో నాతనికన్నులను దుడిచి "చూడుము! మహాశక్తి యగుమాతృదేవతను మఱియొకసారి సందర్శింపుము!' అనియెను.

ఏమి యీయద్భుతపరిభావము! ఆకస్మికముగ నాతనికన్నుల కామాతృదేవతామూర్తి విశ్వదేవతామూర్తియై యగపడియెను. సహస్రశీర్షయు శతసహస్రబాహుసమన్వితయు, సహస్రసహస్రనేత్రవిరాజితయు నగునాశ్వమూర్తిం జూచి యాతఁడదరిపడియెను. సర్వశక్తులు నామెయందు మూర్తీభవించి యున్నవి. సర్వజీవులు నామూర్తి నాశ్రయించియుండెను. సర్వము నావిశ్వరూపమునందే నిండియుండెను. అచ్చటనే స్వర్గసౌధ మున్నది? నరకక్షేత్రముకూడ నచ్చటనేయున్నది. పుణ్యాత్ములాస్వర్గసౌధమునందుచితసౌఖ్యముల ననుభవించుచుండిరి. పాపాత్ములానరకక్షేత్రమునఁ బాపఫలముల ననుభవించుచుండిరి. తానప్పుడే యానరకప్రాకారమును దాఁటి స్వర్గసౌధప్రథమసోపానముకడ నిలిచియున్నట్లును—ఆనరకభటులు తన్ను సమీపింపఁజాలక దూరమునందుండియే చేయెత్తి పిలుచుచున్నట్లును నాతనికి గోచరించెను. ఆదివ్యమూర్తియందెచ్చటఁ జూచిన నచ్చటనే ప్రబోధానందస్వామిసాక్షాత్కారము లభియించుచుండెను—ఆస్వామివెనువెంటనే నృత్యముచేయుచు మెఱపుదీఁగవలె నాత్రిపురసుందరి యగు నానందాదేవి యెల్లెడలఁ బ్రత్యక్షమగుచుండెను. ఆతఁడు తదేకధ్యానముతో నంతయుం జూచుచుఁ దన్మయుఁడైపోయెను.

అప్పు డానందాదేవి యుచ్చైస్స్వరముతో "జగన్మాతను సందర్శించితివా?' అని ప్రశ్నించెను.

పురు—తల్లీ! తల్లిని దర్శించితిని. నాపాపపుఁగన్నులు పవిత్రము లైనవి— నానిష్ఠురహృదయము కృతార్థ మైనది.

ఆనం—ఇఁక నీవీజగన్మాతసన్నిధానమున నీసత్యచరిత్రమును జెప్పి నీతప్పుల నొప్పుకొందువా?

పురు—తల్లియెదుటఁ దప్పులు నివేదించి క్షమాప్రార్థనముం జేసికొందును.

ఆనం—నీపేరెవ్వరు?

పురు—భీముఁడు.

ఆనం—పాముకఱచిననాఁటిరాత్రి నీకుజ్ఞప్తియందున్నదా?

భీము—లేకేమి? ఒకనిమిషముక్రిందటివఱకు నావిషబాధ ననుభవించుచునే యుంటిని గాదా?

ఆనం—ఆనాఁ డంతరాత్రివేళ నీవెక్కడకుఁబోవుచుంటివి?

భీము—నన్నాశ్రయించినదామోదరుఁడను నొకమిత్రునకు సాహాయ్యము చేయవలయు నని పోవుచుంటిని.

ఆనం—ఆతనికిఁ జేయవలసినసాహాయ్యమేమి?

భీము—పెద్దాపురమునం దాతఁడు చేపట్టినవేశ్య యొకతె యున్నది. ఆమెకుఁ గన్యయగు నొకసోదరి కలదు. ఆమెను బెండ్లియాడెద నని భ్రమపెట్టి చంచలరావనువిద్యాధికుఁ డొకఁ డామెను విజయవాడకుఁ దీసికొనివచ్చెను. ఆతనికిఁ దెలియకుండ మరల నామె నెత్తుకొనివచ్చి దామోదరున కొప్పగింపవలయు నని నేనా నాఁడు ప్రయత్నించితిని.

ఆనం—అంతదూరము వచ్చి యంతటిసాహసకృత్యమును నెఱవేర్చుట యసాధ్యము కాదా?

భీము—భీమున కసాధ్య మగుపనియొకటి యున్నదా? నాపేరందఱు నెఱుంగుదురు. కాని యింతవఱకు నన్నుఁ జూచినవా రొ

క్కరును లేరు. నాపరిచారకులుకూడ నించుమించుగ నాతోసమానమైనవారే— ఇతరులకంటెఁ బడకుండఁ గార్యములను సాధింపఁగలరు !

ఆనం—ఆనాఁడు నీవు పాముగఱచి పడిపోయితివిగదా ! పని జరిగినదా ?

భీము—ప్రాణములు పోవుచున్నను— ప్రళయము వచ్చుచున్నను — తలంచినపని జరగితీరవలసినదే— మావాండ్రుపోయి యామెను మంచముతో నెత్తికొనివచ్చి యారాత్రియే దామోదరున కొప్పగించివైచిరి. ఎవ్వరో యొకబాలయోగి వారినడ్డగి చెనఁట గాని లాభము లేకపోయినది. అప్పుడు మిత్రకార్యముమాత్రమే ప్రధానమైనదగుటచే మావాండ్రతనియింట నొకచిల్లిగవ్వయైన దొంగిలింపలేదు.

ఆనం—దొంగిలించుట కూడనా ?

భీము—నిజముగ దొంగిలించినచో నొకనల్లపూసయైన మిగులకుండ నాతనియిల్లంతయు గుల్లయై పోవలసినదే.

ఆనం—నీవు దొంగవా ?

భీము—దొంగభీముఁడనియే నాప్రసిద్ధి—నాతాత దొంగ-- నాతండ్రి దొంగ— నాయన్న దొంగ— నేను దొంగను— నా పరిచారకులు దొంగలు— మాకులవృత్తియే యిది ! పూవు కందకుండఁ దేనెఁ దీసికొన్నట్లుగఁ దనువు నొవ్వకుండ ధనము దోఁచుకొనుచుందుము ఇన్నాళ్లనుండి దొంగతనము చేయుచుంటినిగాని యొక్కరిపైఁ జేయిచేసికొనలేదు. ఒక్కరిచేతికి లొంగలేదు ! ఒక్కరికంటెఁ బడలేదు— ఏమైననేమి ! తుదకు నేనొకమహాపాప కార్యమును గావించితిని— ఆపాపమునకుఁ బ్రాయశ్చిత్తము లేదు. తలఁచుకొనినచో నాపరితాపమునకవధిలేదు— దేవీసందర్శనానం

దనుచే నెంతటి నిశ్చింతమై యున్నను నా హృదయము నాపాపపరిభంజన మింకను బ్రకంపితముగఁ జేయుచునే యున్నది.

ఆనం — భయపడకుము! పాపమోచని యగుతల్లి యెదుటఁ బాపముం దెలిపి ప్రార్థింపుము! ఏమి చేసితివి ?

భీము — మాతృసమాన యగుభ్రాతృదేవిని గంఠమున కురి వోసి చెట్టునకుఁ గట్టివేసితిని! కోపము తీరిన వెనుకఁ దోడనే పశ్చాత్తాపము కలుగుటచేఁ బరుగెత్తుకొని వచ్చి చూచితినిగాని మఱి యామె నాకగపడలేదు. ఆత్రాళ్లు తెగిపోయినవి. ఆమె చచ్చిపడి పోయినది — ఏ క్రూరమృగములో యామృతకళేబరము నీడ్చుకొని పోయి యుండును. తల్లీ! జగన్మాత యెదుట సత్యము చెప్పుచున్నాను. నేను హంతకుఁడను — స్త్రీహంతకుఁడను — మాతృహంతకుఁడను — నాయీ ఘోర పాపమునకు నిష్కృతి లేదు.

ఆనం — అంత కోప మేల కలిగినది ? ఎందుకట్లు చేసితివి ?

భీము — ధనముకొఱకు — మాసంఘమునకు మాయన్న రాజుగా నుండెడివాఁడు — మావదినె రాణియై యుండెడిది. అందుచే సంపాదితద్రవ్య మంతయు నామెయొద్దనే యుండెను. ఆరహస్యనిధి యాయిరువురకు మాత్రమే తెలియును. ఒకప్పుడొక గోడపైనుండి యుఱికి యాకస్మికముగ మాయన్న మరణించెను. పిమ్మట మావాండ్రు నన్ను నాయకునిగఁ జేసికొనిరి. ఆకారణముచే మా సంఘమునకుఁ జేరినమూలధనము నాకు స్వాధీనము కావలసి యుండెను. మావదినె నడిగితిని — ప్రార్థించితిని — ఆమె యొక్కటే మాట — నే నెఱుఁగ ననినదే — ఆ కారణముచే నాకుఁ గోపము కలిగినది — ఆ కోపముచేతనే యంతపని చేసితిని — తుచ్ఛధనలోభముచే దురంత పాపకర్మమునకు లోఁబడిపోయితిని.

ఆనం—ఆమె యాచనను నీకెందు కిచ్చినది కాదు? ఆమెకు నీకంటెను బరమాప్తు లింకెవ్వ రున్నారు?

భీము—ఆమె కప్పటికిఁ బదునాలుగేండ్లకుమారుఁ డొకఁ డున్నాఁడు—అతన మెట్టయిన నాతనికిఁ జెందింపవలయు నని యామె యుద్దేశము—

ఆనం—నీవాకుమారునిఁ గూడఁ జంపితివా యేమి?

భీము—లేదు—చచ్చినను నామెయుద్దేశము సఫలముకాఁ గూడదని యెంచి బలవంతముగ నాయన్నకుమారుని నావెంటనే తీసికొనిపోయితిని.

ఆనం—ఆతఁ డిప్పుడు మాసంఘమునకు యువరాజుగ నున్నాఁడు కాఁబోలును!

భీమ—నిజముగ మాయన్నబిడ్డ యైనచో నట్టే యుండును. జ్ఞానము వచ్చినతరువాత నాతనికి దొంగతన మనిన నిష్టము లేకుండఁ బోయినది—ఆసంగతి నాకుఁ దెలిసిన నేనేమందునోయనుభయముచే నాయెదుటఁ బడకుండ నెక్కడకో పాఱిపోయినాఁడు. నాఁటి నుండి నేఁటివఱకును వాఁడు నాకంటఁ బడనే లేదు.

ఆనం—ఆపిల్లవాని కున్నంతజ్ఞానము నీకు లేకుండఁ బోయినదిగదా!

భీము—దొంగతనము మాకులవృత్తి యగుటచే నప్పటికి నాకిది యంతయధర్మముగ నగపడినది కాదు. కాని యీజీవితమునందు నేనెన్నఁడు నెఱుఁగని స్త్రీహత్యాపాతకమున కొడిగట్టుకొంటిని. ఆదారుణపాపతాపమే యిప్పటికి నాహృదయము నుడికించి వేచుచున్నది.

అప్పు డారమణీమూర్తి భక్తమండలమునందలి స్త్రీసంఘము వంకఁ దనదృష్టులను బ్రసరింపఁజేయుచు "జీవమణీ!" అని పిలి

చెను. తోడనే నలువదియేండ్లయీడుగలయోగినీమూర్తి యామెను సమీపించి వినయవినమితవదనయై నిలువఁబడియెను. ఆమెం జూచి భీముఁ డద్భుతానందపరవశుఁడై "తల్లీ! బ్రదికి యుంటివా? మరల నాకన్నులఁబడితివా? మాతృదేవతాసాన్నిధ్యమున నాయపరాధముల క్షమింపుము! క్షమింపుము! క్షమింపుము!" అనుచుఁ జటాలున నామెపాదములపైఁ బడియెను.

జీవమణి యాతని లేవనెత్తి "వత్సా! సర్వపాపసంహారిణి యగుజగన్మాత నీసర్వాపరాధములను క్షమియించును." అనిచెప్పి యామె యెప్పటివలె యథాస్థానమునకుఁ బోయి నిలువఁబడియెను.

భీము—నిర్విణ్ణుఁడై యచ్చటనే నిలువఁబడిపోయెను—అప్పు డాజగన్మోహనమూర్తియగునాన౦దా దేవి యాతనిం జూచి "ఆమె యెవ్వరు?" అనియెను.

భీము— నాభ్రాతృభార్య—నాతల్లి—

ఆనం—ఆమె యెట్లు జీవించినదో తెలిసినదా?

భీము— ఇంకను దెలియదా? నావిషబాధ యేదేవతా కటాక్షముచే నుపశమించినదో యామాతృదేవతానుగ్రహముచేత నే యామె మరణబాధయు నుపశమితమైపోయినది.

ఆనం—నీవు హత్యచేయుటమాత్రమే యపరాధ మనుకొను చుంటివి. నీకులవృత్తియగుటచే దొంగతనము నీకుఁ బాపముగఁ దోఁచుటలేదు. అది కేవలమవివేకము. కులవృత్తియైనంతమాత్రమున దొంగతనము పాపము కాకపోదు—జీవులయెడల శారీరకమానసికంబులగుకష్టములంగల్పించు నెట్టికార్యమైనను హింసయే—ఆహింసయే పాపము—అదియే యధర్మము—తెలిసినదా? ఇప్పు డేమందువు? దొంగతనము ధర్మమా? అధర్మమా?

భీము—తనువు నొవ్వకున్నను ధనాపహరణముచే నితరుల హృదయములు పరితపించునుగావున దొంగతనము పాపమే యగును. తల్లీ! ఇఁకఁ దెలిసినది. జీవుల నేవిధముచే హింసించినను బాపమే యని బోధపడినది.

ఆనం—హింసయే యధర్మము—ఇఁక ధర్మమును వినుము! ఈ దేవీమూర్తి నీకేమగును?

భీము—నాతల్లి.

ఆనం—నీతోడిజీవులందఱకు నేమగును?

భీము—ఈజగన్మాత యందఱకును దల్లియే.

ఆనం—అయినచో జీవులందఱు నీకేమగుదురు?

భీము—సోదరు లగుదురు.


ఆనం—అట్టిసోదరుల నందఱను నీవు సమానముగఁ బ్రేమింపఁగలిగినప్పుడే నీతల్లి నిన్నుఁ బ్రేమింపఁగలదు.

భీము—ఔనుతల్లీ! నీయనుగ్రహముచే ధర్మశాస్త్రమంతయు నా కొక్కమాటలోఁ దెలిసిపోయినది.

ఆనం—పశ్చాత్తప్తహృదయుఁడ వగు నీవు మాతృదేవతా సమక్షమునం దీధర్మసూత్రమును గ్రహించెదవా? ఇంతటినుండి దొంగభీముఁ డనునామమును రోసి దేవీదాసుఁ డనుపేరితోఁ బరోపకారపరాయణుఁడవై చరించెదవా? సర్వసౌభ్రాతృత్వముంజూపుచు మాతృసేవాదీక్షితుఁడ వయ్యెదవా?

భీముఁడానందసంభ్రమముతోఁ బులకీకృతశరీరుఁడై సముత్సాహపరికంపితకంఠస్వరమున "తల్లీ! ఈదీనునిపైఁ గటాక్షింపుము! ఈదాసానుదాసుని గరుణింపుము! అనుగ్రహింపుము!" అని పలుకుచు దేవీమూర్తి కెదురుగఁ బడి సాష్టాంగదండప్రణామముం గావించెను.

మాతృమందిరము.



ప్రబోధానందస్వామి ♦ ♦ ♦ యాతనిదక్షిణకరమును దీక్షాకంకణాలం
కృతముగఁ జేసి యనుగ్రహించెను. పుట. 197.

ఇంతవఱకును మౌనముతో నున్నపరిబోధానంద స్వామి యా తని తేవనెత్తి యాతనిదక్షిణకరమును దీక్షాకంకణాలంకృతముగఁ జేసి యనుగ్రహించెను. ఆశుభసమయమున మరల భక్తమండలము నందంతటను బ్రార్థనాగీతములు వెలువడి పరమేశ్వరీమందిరము నానందపరిశుద్ధ్వనితముగఁ జేసి ప్రకాశించెను—

"సర్వమంగళమాంగళ్యే శివేసర్వార్థసాధకే
శరణ్యేత్ర్యంబకే దేవి నారాయణినమోస్తుతే
దేహిసౌభాగ్యమారోగ్యం దేహి మే పరమంసుఖం
దేహిమే దేవికల్యాణం దేహిమే విపులాంశ్రియం
లక్ష్మీప్రదానసమయేనవవిద్రుమాభాం
విద్యాప్రదానసమయేశరదిందుశుభ్రాం
విద్వేషివర్గవిజయేతుతమాలనీలాం
దేవీంత్రిలోకజననీంశరణంప్రపద్యే.
ఓంశాంతిశ్శాంతిశ్శాంతిః

———

మూడవ ప్రకరణము.

ఒకలం తెలియక యిదియేమన్న యప్ప
డేమి యయ్యెనో నీగతి యెఱుఁగవుగద!
యేమి యయ్యెనో నిజాతి యెఱుఁగవుగద!
యేమి యయ్యెనో నీమత మెఱుఁగవుగద!
తోడివారలతో నీవుఁ గూడి మాడి
పాటుఁబాడుము లేచి యీ పాటకైన!

జాతీయగీతము.

చండాలుఁడగునప్పుడు తనవెన్నుపై గుఱ్ఱపుఁజబుకుదెబ్బచేఁ జీల్చుకొనిపోయినగాయపుఁబచ్చి యింకను నారకుండఁగనే పరోపకారపరాయణుఁడగుతరంగుఁ డిచ్చినపదికాసులతోడను బిళాపుర

మునఁ బ్రవేశించి మాంసవిక్రియవ్యాపారము నారంభించెను. ధన
ము దుష్కర్మముల కుపయోగపడినటుగా సత్కర్మముల కుపయో
గింపదు. ఆతఁడు ప్రతిశనివారపుసంతయందును రహస్యముగఁ బశు
వులను గొని చంపి యామాంసమును విక్రయించి వచ్చినలాభము
తోఁ గుటుంబపోషణము చేసికొనుచుండెను. అది తనకులవృత్తియే
గదాయనుతాత్కాలికసంతుష్టి యాతనిహృదయమునఁ గలిగియుం
డుటచేఁ బశువిశసన మాతనికి బ్రహ్మయజ్ఞముకంటెను బవిత్రమై
నదిగా నగపడుచుండెను. కాని యాపదికాసులతోడను బదిపాడిప
శువులనుగొని కష్టపడి మేపుకొన్నచో జీవహింసాదోషము నెత్తిపైఁ
బడకుండుటయేకాక ఘృతక్షీరవిక్రయములచే నింతకంటెను విశేష
లాభము వచ్చు నని బుద్ధిహీనుఁ డగునాతనికిఁ దోఁచినది కాదు—

శ్రీకల్యాణానందస్వామి ప్రతిపట్టణమునకును బ్రతిపల్లెకిని
బోయి మహోపన్యాసముల నిచ్చి యందందు విజ్ఞానపుస్తకభాండా
గారములను, బ్రబోధానందమందిరములను నెలకొల్పుచునే యుం
డెను. భారతవర్షమునకుఁ బశుధన మెంతటియుపయోగకర మైన
దో బోధించి యచ్చటచ్చట గోసంరక్షణశాలలను స్థాపింపఁజేయు
చునే యుండెను. సర్వజనసులభంబు లగువిద్యామందిరములఁ గట్టిం
చుచునేయుండెను. దయాళుఁడగు నొకమహీపతినుద్బోధించి యసం
ఖ్యదరిద్రసాధ్యంబగు ననాథశిశుసంరక్షణాగారము నాతనిచే నాతని
రాజధానియందు వెలయింపఁజేసెను. కాని ప్రపంచమునం దొక్క
సారిగాఁ బాపమునకుఁ జోటు లేకుండఁజేయుట యనిన సామాన్య
కార్యమా ? ఎంతకాలమునుండియో యధఃపతిత మైపోవుచున్న
భారతసౌభాగ్యము నొక్కసారిగా యథారూపమునఁ బునరుద్ధారణ
ముం గావించుట యనిన సాధారణకృత్యమా ? అగుఁగాక ! ఇట్లని
యెంచి యజ్ఞానులవలె మహాత్ములుమాత్రము తమప్రయత్నములను

విడువఁజాలరు. అట్టిమహాపురుషులింకను జయించుచుండుటచేతనే పాతాళమునఁ బడిపోవుచున్న భారతభూమి యిప్పటికినిబరమధామమునకే కన్నెత్తిచూడఁగలుగుచున్నది !

అప్పనికిఁ గ్రమముగాఁ జర్మవ్యాపారమును శిల్పవ్యాపారమును జేయుటకుఁ దగినయవకాశము లభియించెను. ఆతని కప్పటికి రాఁగఁ డిచ్చిన పదికాసులును బాపము పెరిఁగినట్లుగఁ బదివందలకాసులయ్యెను. బాలికయగుముత్యాలు పశువిశసనమునకు భయపడుచుండుటచే నాతఁ డాపల్లెకు దూరమునందున్న పెరటిలోఁ బశుమారణకర్మశాల నేర్పఱచుకొనియెను. ముత్యాలిప్పుడు నిమ్నజాతిబాలికాపాఠశాలలో జదువుకొనుచున్నది. ఆపాఠశాల కల్యాణానంద స్వామిచే స్థాపింపఁబడినదే. స్వామి యచ్చట నిమ్నజాతిసులభంబగురాత్రిపాఠశాలకూడ సంస్థాపించెను.

ఒకనాఁటిసంతలో నప్పడు చాలఁ బశువులను గొనియెను. అందొక గోవు నాలుగైదుమాసముల చూలుగలదియై యుండెను. అది తొలుచూలగుటచే నాపెయ్య మిగులనందముగను గోమలముగ నుండెను. ఈఁగవ్రాలినఁజో జారిపోవునట్లుగానుండెను. అమ్మాత ధవళవర్ణశోభిత యగునాగో వాదిలక్ష్మివలె నగపడుచుండెను. ఆలక్ష్మిఁజూచి యప్పనియిల్లాలిమనసు కరఁగిపోయెను. స్త్రీహృదయము మిగులఁ గనికరమైనది. అవును! స్త్రీలే లోకమునకుఁ గన్నతల్లులు! లోకముననుద్ధరించుతల్లులు! తల్లికంటెను దయామయమూర్తి మఱియెక్కడనుండును? లోకమునం దీపరమార్థమును గ్రహియింపఁజాలనియజ్ఞాను లాత్మ[illegible]లై పోవుచుందురు.

ఆమె తనభర్తను బ్రార్థించి యెటో యంగీకరింపఁజేసి యాగర్భిణీధేనువును దనయింట నుంచుకొని మేపుచుఁ దనబిడ్డవలె నెంత

యోగారాబమునఁ బెంచుకొనుచుండెను. విశ్రాంతిసమయముల యందు బాలిక యగు ముత్యాలు కూడ నాగోవునకు నీరునుమేతయుఁ బెట్టుచు నానందముతోఁ జూచుకొనుచుండెను. దానికొమ్ములకుఁ బూవులను జుట్టుచుండెను. దాని మెడలోఁ బుష్పహారములను వైచుచుండెను. బడినుండి వచ్చి మరల బడికిఁ బోవువఱకు నామాతంగ బాలిక యాగోదేవితోడనే యాడుకొనుచుండెను.

ఆనాఁడొక దొరగారికిఁ జాలావృషమాంసము విందునకై కావలసివచ్చెను. అతఁ డాసమాచారమప్పనికిఁ దెలియఁజేసెను. అప్పనికిఁ బశువధోద్యోగమునందే కాక శల్యచర్మవ్యాపారములయందుఁ గూడ నాదొరగారిసాహాయ్యము విశేషముగ లభియించియుండెను. ఇప్పు డాతనిమాట యెట్లు త్రోసివేయఁగలఁడు ; కాని యాకస్మికముగఁ జాలా విప్పు డెక్కడ దొరకును ? ఆకారణముచే నప్పుడు తనయింటనున్న లేఁజాలిపెయ్య నుపయోగించి దొరగారికోరికం దీర్పవలయు నని నిశ్చయించుకొనియెను. పాపమాగంగిగోవున కింకను గండము వదలిపోలేదు కాఁబోలును! తినఁగోరుదొరగారినిరోధము తీవ్రమైనప్పుడు— ఖండించుకటికవానికిఁ గనికారము లేకుండఁ బోయినప్పుడు— సధుజంతువగు గోవునకుఁ జావుకంటె గత్యంతర మేమున్నది ? అప్పుడు తనభార్యకుఁ దెలియకుండఁగనే యాగోవును వధ్యశాలకుఁ దోలుకొనిపోయెను.

ముత్యాలు బడినుండి యింటికి వచ్చెను ; పుస్తకముల నింట నుంచి తిన్నఁగఁ బశుశాలయొద్దకుఁ బోయెను. ఆమె కచ్చట నావగపడలేదు. గుండెలుకొట్టుకొనుచుండ నాబాలిక తల్లియొద్దకుఁబోయి యావేమైనదని యడిగెను. పాపమామెకుమాత్ర మేమి తెలియును? పనితొందరలో నామె „ పొలముతోలిరేమో ? ” అనిప్రత్యుత్తర మిచ్చెను ముత్యాలున కంతమాత్రముచేఁ దృప్తికలుగలేదు

ఆ బాలిక వెంటనే పశుఖండనశాలవైపునకుఁ బరుగెత్తుకొనిపోయెను. అప్పటి కప్పుడే నలుగురుమనుష్యులా గోవుపాదములను బంధించి పడఁద్రోసి పట్టుకొనియుండిరి. అప్పుడు కత్తి చేతఁ బట్టుకొని దాని గళబంధము నెడలించి చంపుటకు సిద్ధముగ నుండెను.

పరుగెత్తుకొని వచ్చుచున్నముత్యాలు దూరమునుండియే యీదారుణప్రదర్శనము నవలోకించి కరుణాకంపితస్వరముతో ,, నాయనా! నాయావును జంపకుము! నాప్రాణపదమైన గంగిగోవును జంపకుము! చంపకుము! చంపకుము! '' అని కేక వైచెను. అప్పుడు వెనుదిరిగి చూచి ,, పొమ్మా! ఇంటికిఁ బొమ్మా! నీవిక్కడ కెందుకు వచ్చితివి? '' అని గద్దించిపలికెను. ఆ బాలిక నేసందులనుండి చూచినదో— ఆమెమధురస్వరము నెంతలో వినినయానవాలు పట్టఁగలిగినదో గాని పాపము మృత్యుముఖమునఁబడిపోవుటకు సిద్ధముగ నున్న యాగోవు భయసూచకస్వరముతో ,, అంబా! యని యొక్కయఱపఱచెను. ఆయార్తస్వరశ్రవణమున గుండె చెదరి బాలిక యగుముత్యాలు నిలువునస్రుక్కై నిలిచినచోటనే కూలఁ బడిపోయెను.

అప్పు డాసంగతిని గ్రహింపకుండఁగనే యతిత్వరితముగఁ దనకార్యమును నిర్వహించుట కుద్యుక్తుఁ డయ్యెను. అంతలో బలిష్ఠుఁడగు నొకయౌవనపురుషుఁడు పరుగెత్తుకొనివచ్చి యాయుధసహితమగు నప్పనిచేతిని బట్టుకొనియెను. ఆతనిం జూచి భయపడి సహాయపరిచారకులు దూరముగఁ దొలఁగిపోయిరి. అప్పుడు నిర్విణ్ణుఁడై పోయెను. ఇప్పు డాతనిచేయి పట్టుకొన్నవా రెవ్వరు? ఒకప్పు డాతనికి మహోపకారముఁ గావించినరంగఁడే!

రంగఁ డతిశీఘ్రముగ నప్పనిచేతిలోనికత్తిని లాగికొని గోవును బంధించినత్రాళ్ళనన్నిటిని నిముసములోఁ గోసివైచెను. అప్పు

డేమియును మాటాడఁజాలకపోయెను. ఆవు చలాలున లేచిపరుగెత్తి పోవుచు దారమునఁ బడియున్న బాలిక యగుముత్యాలుం జూచి యచ్చట నిలువఁబడిపోయెను. అప్పుడు రంగఁ డప్పునిం జూచి “ఓరీ! కాసునకుగతిలేక కడుపుమంటచే దీనుఁడవై తిరుగుచున్న యానాఁడు నీకుఁ దగిలినదెబ్బకు నీప్రాణము లెట్లు కొట్టుకొనిపోయినవో యని జాలిపడి నేను నీకుఁ జేసినయుపకారము నీవిధముగ నిష్కరుణుఁ డవై నోరెఱుంగని యెన్నియో ప్రాణములను దీయుటకై యుపయోగ పడుచుంటివా? సామాన్యపరిచయముగలపశువు ప్రాణములకు భయపడి పాఱిపోవుచున్నసమయమునఁ గూడఁ బడిపోయిననీబిడ్డను జూచి కాలుగదపఁజాలక నిలువఁబడిపోయినది! చూడుము! బలవంతమగుప్రాణాపాయస్థితియం దున్నపశువును జూచి పెంచినప్రేమచే నీపసిబిడ్డకూడ గుండెచెదరి కూలఁబడిపోయినది! హా! హరీ! నీకా పశువునకున్నజ్ఞానము లేకపోయినది! ఆపసిబిడ్డ కున్నజ్ఞానము లేకపోయినది! ఎంతయపాత్రుఁడవై పోయితివి?” అని మూఁకలించి పలికెను.

తనయేకపుత్రిక పడిపోయిన దనుమాట విన్నతోడనే యప్పనిగుండె చెదరిపోయెను. శూలాఘాతములవంటి రంగనిమాటలా హృదయమును మఱింత కలఁచివైచెను. అందుచే నప్పు డాతఁడున్మత్తునివలె రోఁజుచుఁ దనతనయ పడిపోయినదిక్కునకుఁ బరుగెత్త నారంభించెను. రంగఁ డాతని ననుసరించి పోయెను.

అప్పుడు పోయి చూచునప్పటి కాతనితనయ యొకమహాత్ముని యొడిలో నచేతనయై పడియుండెను. అప్పనికన్నులు చెదరి పోయెను. ఆతఁడు శోకగద్గదస్వరముతో “తండ్రీ! నాబిడ్డను బ్రదికింపుము!” అని యాతనిపాదసాన్నిధ్యమునఁ బడిపోయెను. రంగఁడు విభ్రాంతుఁడైపోయెను! ఆమహాపురుషుఁడు కల్యాణానందస్వామి!

ఆస్వామియిప్పు డామాతంగకన్యకను దనయొడిలోఁ జేర్చుకొని చేతనోద్దీపకములగు నుపచారములం గావించుచుండెను!

కల్యాణానందస్వామి దుఃఖముచేఁ దల్లడిల్లిపోవుచున్న యప్పనిం జూచి సాంత్వనస్వరముతో ''భయము లేదు! జీవహింసం జూచి సహింపఁజాలక యీపసిబిడ్డ కోమలహృదయము చెదరిపోయినది. మఱియేమియును భయము లేదు. కొలఁదిసేపటిలో నీమె తేరుకొనఁగలదు'' అనియెను.

అప్పుడు రంగఁడు తత్తరముతో ''స్వామీ! పీడ కలుగకుండ గాలిసోఁకకుండ, దృష్టితగులకుండ రక్షగా నీపదకమును మాయమ్మ నామెడలో వైచినది. ఈపిల్ల యిప్పుడు జడిసికొని యుండవచ్చును. ఈపదకమునుధరించినచో నట్టిబాధ నివారణముకాఁగలదు' అని చెప్పుచుఁ దనకంఠమునందున్న పదకమునుదీసి యాబాలిక కంఠము నలంకరించెను.

స్వామి తనకమండలూదకముల నాబాలిక మోముదమ్మిపైఁ జిలుకరించుచుండెను. కొంతసేపటి కాబాలికకుఁ దెలివి వచ్చినది. ఆమె కన్నులఁదెఱచి చూచి తాను స్వామియొడిలో నుంటి నని తెలిసికొని సిగ్గుచేఁ జటాలున లేచి తండ్రియొద్దకు వచ్చెను. అప్పుడు పరమానందముతో నామెను గాఁగిలించుకొని ''అమ్మా! భయము లేదు. నీప్రాణములను నిలిపిన యీమహాత్మునకు నమస్కరింపుము!'' అనియెను.

ఆబాలిక స్వామికి నమస్కారముచేసి నిలువఁబడియెను. అప్పుడు రంగఁ డామెం జూచి ''పేకిఁక భయము లేదు. నీమెడలోని యీపదకము నటే యుంచుకొనుము! ఎప్పుడును దీసివేయవలదు!'' అనియెను. బాలిక తనమెడలోని బంగారుపదకముం జూచుకొని సిగ్గుచేఁ దలవంచుకొని తిర్యక్ప్రసారితంబు లగుమధురవీక్షణము

లతో రంగని దిలకించెను. ఆచూపులలోని భావమును రంగఁడు గ్రహించెనో లేదో కాని మహాత్ముఁడగుస్వామికిమాత్రి మంతయు ను దెలిసిపోయెను.

అప్పుడు చేతులు జోడించుకొని స్వామివంకఁ దిరిగి కృతజ్ఞతాసూచకముగ "స్వామీ! మీయనుగ్రహముచే నాబిడ్డ బ్రతికినది! నేను బ్రదికితిని! మీదాసానుదాసుఁడను! మీయుపకారమును నాజీవితమున్నంతవఱకు మఱవను. నేఁడు మీదర్శనము లభియించుటచేఁ గృతార్థుఁడ నైతిని!" అనియెను.

స్వామి — ఇదియొక కారణముగఁ బరమసాధువగు నొక యావు చావుతప్పిపోవుటచే మనమందఱమును గృతార్థులమే. నీవీయావునే చంపివైచినచో నీబిడ్డగుండెపగిలి మరణించియుండును. పశ్చాత్తాపదుఃఖముచే నీవును మరణించియుందువు. ఈదారుణవార్తనాలకించి నీభార్యయూత్రము జీవింపఁగలదా? జీవహింసాదోషము తుదకు నీకుటుంబము నింతవఱకుఁ దెచ్చియుండును. కాని, యదృష్టవశము చే నాపద తప్పిపోయినది.

అప్ప — ఔను తండ్రీ! నాపూర్వపుణ్యవశముచే నాబిడ్డ నాకు దక్కినది.

స్వామి—పుణ్యమున కంతశక్తియున్నదని తెలిసిన నీకుఁ బాపమునకు భయమేల కలిగినదికాదు?

అప్పనికాపాదమస్తకమును బ్రికంపించిపోయెను. తాను చేసినదంతయు మహాపాపమే యను యాకస్మికముగ నాతనియంతరాత్మకుద్బోధనము కలిగెను. అప్పుడాతఁడు భయవిహ్వలుఁడై "స్వామీ! దాసానుదాసుఁడను! నాసర్వాపరాధములను క్షమియించి నన్నుఁ బాపకూపమునం బడిపోకుండ నుద్ధరింపుము!" అని యాతని పాదములపైఁ బడియెను.

స్వామి యాతని లేవనెత్తి "వత్సా! నీవు దారుణవ్యాపారముచే ధనవంతుడవైతివి—ఇంక నైనను దయావంతుడవై పశ్చాత్తప్త హృదయముతో ధర్మాచరణమునకుం గడంగనిచో నీపాపమునకు నిష్కృతిలేదు" అనియెను.

అప్ప – స్వామీ ! నేను మహాపాపాత్ముడను! నాకెట్టులైనం దరణోపాయము ప్రసాదింపుడు !

అప్పుడు రంగం డప్పనిం జూచి "ఇంతటినుండి యెన్నడు నిట్టిపాపమును జేయ నని నీవీస్వామిపాదములనుముట్టి ప్రతిజ్ఞచేయుము!" అనియెను.

అప్పడు భయసంభ్రమములతో మరల స్వామిపాదములపైం బడి "స్వామీ ! నీపాదములసన్నిధి — పరమేశ్వరునిసన్నిధిని— పంచభూతములను సాక్షులుగా మనఃపూర్వకముగం బ్రతిజ్ఞచేయుచున్నాను. నేనింక నాజీవితమునం దెన్నడును జీవహింస చేయం బోను! చేయంబోను! ముమ్మాటికిని జేయను ' అనియెను.

స్వామి యాతని లేవందీసి "వత్సా! పరమేశ్వరుండు నిన్నాశీర్వదించుంగాక! నీవేస్థలమునం బశుమారణకర్మాగారమును స్థాపించితివో, యాస్థలమునందే గోసంరక్షణశాలను నెలకొల్పి జీవితము సార్థకముగం జేసికొనుము. అందుచే నీపాపము శాంతింపంగలదు! నీవు కృతార్థుండవు కాంగలవు!" అనియెను.

అప్ప —స్వామీ ! మీపాదసాక్షిగ నింతటినుండి యటు చేసెదను. ఇదిమొదలు నాధనజీవితములను సాధుజంతుసంరక్షణమునందే వినియోగించెదను.

స్వామి —మంచిది ! నీకు శుభమగుంగాక ! కరుణామయి యగునిబిడ్డ నీబిడ్డయైపుట్టుటచేత నీవు ధన్యుడవైతివి.

ముత్యాలు సిగ్గుచేఁ దలవంచుకొనియెను. రంగఁడు పరమానందభరితుఁడయ్యెను. కరుణార్ద్రహృదయుఁ డగు రంగని కెంతయో యానందము—నవనవోన్మేషయౌవనవిరాజితయుఁ గుసుమకోమలియు నగునాబాలిక నిజముగ నానందస్వరూపిణియే యయి యుండెను.

ముత్యాలు స్వామికిని రంగనికిని నమస్కరించి సెలవు గైకొని తనయావుకొద్దకుఁ బోయెను. తనప్రాణపదమైయున్నయావు దయామయుఁడగు రంగస్వామిమూలమునఁ దనకుఁ దక్కినదిగదా యని యామెసంతోషము! ఆమె తిరిగితిరిగి చూచుచు మెల్లమెల్లగ నాయావును దనయింటికిఁ దోలుకొనిపోయెను.

నిశితాయుధముకంటెను నిష్ఠురవచనమే హృదయమున బలవంతముగ నాఁటుకొనియెను. కఠినహృదయమునుగూడ మృదులవచనము కరఁగించివైచినది. భవపర్వతములఁ బ్రకంపితములుగఁ జేయఁజాలినపాపప్రవాహమిప్పుడు ప్రబోధదూర్వాలేశమాత్రముచేతనే బంధింపఁబడిపోయెను.

కంటకమును గంటకముచేతనే వదలింపవలయు నని తలంచి కల్యాణానందుఁడు గావించినప్రయత్న మీవిధమున సఫలమయ్యెను!

నాలుగవ ప్రకరణము.

అవనతోన్నతగతుల కా ♦ లాభిరతులె
కారణము; లగు పరిణామ ♦ కాలమందుఁ
గష్టసుఖదాయకము లని ♦ కాంచి వాని
నెందు మెలఁగంగ దగఁగోరి ♦ యెంచఁగలఁడు?

నిరంత్సరాది— తారావళి

భారతరావునకుఁ గ్రైస్తవపాఠశాలయం దుపాధ్యాయపదము లభియించినది. అందుచే నాతఁ డిప్పుడు తనకుటుంబముతోఁ గాకినాడయందుఁ బ్రవేశించి యుండెను. సరస్వతి యిదివఱకే తారకాపురమును వదలిపోయినది. ఇప్పుడు సత్యవతి కూడ నచ్చట కుండఁబోయినది. అందుచేఁ దారకాపుర మిప్పుడు తననామమునకుఁ దగినట్లు కళాహీనమై యసురపురమువలెనే యుండెను. చంచలరావొక్కఁడే యగుటచే నాతఁడు కాకినాడలో భారతరావున్నయింటియందే కలసి యుండెను. నిరంతరపరిచయముచే నాతఁడు కొలఁదికాలములోనే యాకుటుంబములోనివాఁడుగఁ బరిణమించిపోయెను. సరళస్వభావయగు సత్యవతి తనయన్నతో మాటాడినట్లుగనే యాతనిసంతోషముకొఱకుఁ జంచలరావుతోఁ గూడఁ జనవుగ సంభాషించుచుండెను. అప్పుడప్పుడు వారుముగ్వురును గలసి యనేకవిషయములఁ గూర్చి చర్చించుకొనుచుందురు. సత్యవతియును భారతరావును, బుద్ధిశక్తియం దొకరినొకరు మించినవారు. చంచలరావు తెలివి కలవాఁడే గాని యాతఁడెల్లప్పుడును గూడ విషయ మెట్టిదైనను వాదప్రాబల్యమును బట్టియే వ్రాలిపోవుచుండును. అందుచే నాతఁ డొక్కప్పుడు భారతరావుపక్షమునను మఱియొక్కప్పుడు సత్య

వ

పతిపక్షమునను జేరుచుండును. ఆనగరమునం దప్పుడప్పుడు జరగుచుండునుపన్యాససభలకుఁ దఱచుగ వారు మువ్వురును గలసియే పోవుచుందురు. ఆత్మ నర్మమున కవ్యంతరము కలుగనంతవఱకుఁ దనయన్న సంతోషముకొఱకే తనజీవితమును వినియోగింపవలయు నని సత్యవతి నిశ్చయించుకొనియెను. భారతరావు కూడ సత్యవతి మనసు నొవ్వకుండఁగనే సంచరించుచుండెను.

నేఁటిసాయంకాలమున భారతరావును సత్యవతియును నొక గదిలోఁగూర్చుండి విద్యావిషయమున మాటలాడుకొనుచుండిరి. క్రమముగ రాత్రి యెనిమిదిగంటలైపోయెను. అంతలోఁ, జంచల రావు కూడ నచ్చటికి వచ్చెను. భారతరావాతనిం జూచి "ఇంత యాలస్యముగ వచ్చితివేమి ?" అని ప్రశ్నించెను.

చంచ—సనాతనధర్మమందిరమునఁ గల్యాణస్వామి యను నొకసన్యాసియుపన్యాసమిచ్చుచుండుటచే నేనాసభకుఁబోయితిని. పూర్తియగువఱకును వదలి వచ్చుటకు బుద్ధిపుట్టినదికాదు.

సత్య—ఆస్వామియుపన్యాస మంతమనోహరముగనున్నదా?

చంచ—ఆ! వినితీరవలయును. ఆతఁడు సనాతనధర్మశ్రద్ధ తులంగూర్చి చెప్పుచున్నప్పుడు—అహింసాధర్మమును బోధించు చున్నప్పుడు—అఖిలసోదరత్వమును సిద్ధాంతీకరించుచున్నప్పుడు సభ్యు లందఱును దన్మయులై చిత్రప్రతిమలవలె నైపోయిరి. అంతటిమహా త్ముని నేనిదివఱకుఁ జూడలేను. ఆతని ప్రతివాక్యమును సర్వమత సమ్మతముగ నుండెను.

అని చంచలరావు యుపన్యాససారమంతయును వారికిఁ దెలియఁజేసెను.

అప్పుడు భారతరావాతనింజూచి "సంఘసంస్కారమును గూర్చి యేమియును జెప్పలేదా ?" అని ప్రశ్నించెను.

చంచ—చెప్పకేమి? అహింసాధర్మమునందును, సర్వసోదరత్వమునందును గావలసినసంస్కారముల నెన్నిటినో నిరూపించియున్నాఁడు.

భార—అతిబాల్యవితంతువివాహసంస్కరణములం గూర్చి చెప్పలేదా?

చంచ—వివాహధర్మము లన్నియు సమగ్రముగఁ దెలిపియున్నాఁడు—కాని ప్రత్యేకసంస్కరణముంగూర్చి వేఱుగ నేమియును జెప్పలేదు.

సత్య—ఇంకేమి చెప్పవలయును? ఉపన్యాససారమంతయును వినియే యుంటిమిగా? భారతవర్షమును స్వర్గధామముగఁ జేయుటకుఁ గావలసినసంస్కరణము లన్నియు నందిమిడియేయున్నవి. ఇంకను జెప్పవలసిన దేమున్నది?

భార—సంఘాభివృద్ధికి మూలకారణమగువితంతువివాహసంస్కరణమే వక్తవ్యాంశము కాకపోయినప్పు డాయుపన్యాసము వలన నింకేమిప్రయోజన మున్నది?

చంచ—ఔను! విమర్శించిచూడఁగా నాలోపమున్నట్లగపడుచున్నది. విమర్శనీయాంశమగువితంతువివాహముంగూర్చి చెప్పవలసిన దే—

సత్య—సనాతనధర్మమునకును వితంతూద్వాహమునకును సంబంధ మేమున్నది?

భార—లేకేమి? అదియును సంఘశ్రేయమునకు సాధనమే కాదా?

చంచ—అదియే ముఖ్యసాధనము.

సత్య—కావచ్చును! కాని త్రికాలాబాధ్యములై సర్వశ్రేయోదాయకంబు లగుధర్మములు సనాతనధర్మములు. ఇంక దాత్కాలికముగఁ బ్రత్యేకసంఘశ్రేయోదాయకంబులుగ నగపడుచున్నవి

మాత్రి మైచ్ఛికధర్మములు. సనాతనధర్మములు శాసనములవలె సర్వజనులును బ్రితిపాలింపఁదగినవిధాయకధర్మములు— ఐచ్ఛిక ధర్మములో— అవివారివారియిష్టానుసారముగ నాచరింపఁదగిన యను కూలధర్మములు! అవశ్యానుష్ఠేయంబు లగువిధాయకధర్మములను నిరూపించుట పెద్దలధర్మము గాని— యథేచ్ఛానుగ్రహణీయంబు లగునను కూలధర్మములను శాసించుట వారిపని గాదు.

భార— ఊఁ! అట్లైనచో ననుకూలధర్మము లనర్థకములని గాఁ నీయభిప్రాయము?

సత్య— ధర్మమైనప్పుడు నిరర్థక మెట్లగును? భౌతికసుఖలోభముచే సామయికముగ నాచరించుచున్న యీవితంతూద్వాహధర్మమిహపరసాధక మగుసనాతనవివాహధర్మమువంటి దెట్లగును?

భార— అట్లయినచో నతిబాల్యవివాహము సనాతనధర్మమే కాఁబోలు!

సత్య— అట్లని స్వామి చెప్పినట్లు లేదే!

భార— చెప్పకపోయిన నేమి? చేయుచు నేయున్నారు కాదా? అందుచేతనే వితంతూద్వాహములు కావలసివచ్చినవి. ఆవశ్యకధర్మము నేర్పఱచుకొనవలసి వచ్చినది!

సత్య— అన్నా! ఏమి మాట! లోకము తప్పు చేయుచున్నదని చెప్పి ధర్మమునుసంస్కరించుట ధర్మమా? లోకమును సంస్కరింపవలయును!

భార— అనంత మగులోకమును సంస్కరించుట యచిరకాలములో సాధ్యమగునా? అంతవఱకును దురాచారదుఃఖశిక్షిత లగు ననాథలగతి యేమికావలసినది?

సత్య — కర్మఫలము ననుభవింపవలయును. లోకమునం దెన్నికష్టములు లేవు — వానినన్నిటి నెవ్వఁడు తీర్పఁగలఁడు? లోకమున శోకమనుమాటయే లేకుండ నెవ్వఁడు చేయఁగలఁడు?

భార — తల్లిదండ్రులు చేసినతప్పుచేఁ జిన్నతనమునందే విగతభర్తృక లగు ననాథ బాలిక లట్లే యామరణదుఃఖితలై యుండవలసినదా?

సత్య — అట్టితల్లిదండ్రులతప్పుచేతనే చిరసౌభాగ్యవతులై సుఖించుచున్నసతీమణులమాట యేల చెప్పెదవు?

భార — సుఖము ననుభవింపవచ్చునుగాని కష్టము ననుభవించుట దుస్సహము కాదా?

సత్య — ఏతంతుబాలిక స్వయముగనే వివాహము చేసికొను ననుకొందము! ఆభర్త తప్పక చిరజీవియే యైయుండు నను నిశ్చయ మెక్కడ నున్నది? మరణము సహజమైనప్పు డిట్టిదుఃఖములను దప్పించుకొనుట కవకాశ మెంతమాత్రమును లేనే లేదు.

భార — ఎప్పుడో కష్టము వచ్చునని యెంచి సుఖేచ్ఛను వదలుకొనవలసిన దేనా? పురుషులు పునర్వివాహము చేసికొనుట లేదా?

సత్య — పురుషులైన నేమి, స్త్రీలైన నేమి? కష్టముల ననుభవించుటకు సిద్ధపడినవారే కాల్పనికసుఖంబుల నభిలషించుచుందురు.

భార — సుఖము నభిలషించుట జీవధర్మము కాదా?

సత్య — పరమధర్మమునకును భౌతికసుఖమునకును సంబంధ మెంతమాత్రమును లేదు. పరస్పరభిన్నప్రకృతు లగునా రెండు నెన్నఁడు నొక్కచోఁ గలసియుండఁజాలవు? అట్టిసుఖమునకే యాశపడినవా రాధర్మమును వదలుకొనుచుందురు — ఆపరమధర్మమునే యవలంబించువా రట్టిసుఖమును ద్యజించుటయే సత్యసుఖముగ భావించుకొనుచుందురు — అన్నా! ధర్మము ననుసరించి మనమున శవ

లయినగాం. ధర్మ మెన్నటికిని మనయిష్టము ననుసరించి మెలంగునది కాదు— సుఖభ్రాంతిచే స్వేచ్ఛానుకూలముగ నాచరించుచున్న కృత్యము లన్నియును ధర్మములేయగునా? అట ధర్మతత్త్వజ్ఞులగు ప్రాజ్ఞు లెవ్వరంగీకరింతురు? ఈ యైచ్ఛికధర్మము సనాతనధర్మముగఁ బరిగణింపఁబడదు. స్వామిపై దృష్టి వెట్టుట కెప్పుడు బద్ధుల మగుమన మెంతవారము?

భారతరావు మఱి మాటాడఁ జాలకపోయెను. అతఁడు తనలో "ఈమె ప్రవర్తనములయందుఁగాని కృత్యములయందుఁగాని, హృదయమునందుఁగాని మానవసాధారణస్వభావ మెంతమాత్రమైన నున్నట్లగపడుట లేదు." అని భావించుకొనియెను. ఈసంభాషణము నాలకించుచున్న చంచలరావు క్రమముగ హృదయము కలఁగిపోవుటచేఁ బరిక్లాంతుఁడై పడకకుర్చీపైఁ జేరగిలఁబడి పోయెను. అతని యాశామార్గమునకుఁ బురోభాగము దుస్సహాకంటకగుల్మావృతమై యభేద్యపర్వతపంక్తులచే నాక్రమింపఁబడిపోయినట్లాతనికిఁ దోఁచెను. ఆయధైర్యముచే నాతఁ డస్వస్థుఁడై దీర్ఘశ్వాసములను విడువ నారంభించెను.

భారతరావాతని వంకఁ జూచి "అదియేమియట్లున్నావు?" అనియెను.

చంచ— కొంచె మస్వస్థతగా నున్నది. జ్వరమువచ్చినట్లున్నది. తలనొప్పిగాఁగూడ నున్నది.

భార— నేఁటియెండ మిగులఁ దీవ్రముగ నున్నది. నాకుఁగూడ నించుక యస్వస్థతగ నుండుటచేతనే యింటికిఁ బెందలకడ వచ్చివేసితిని. ఇప్పుడు తొమ్మిదిగంటలైనది నీకు వేఁడిచేసియుండును. భోజనము చేయుదము లెమ్ము.

చంచ — ఆఁకలి యగుట లేదు. తినవలె ననిపించు టేమి యును లేదు. నన్నీరాత్రి కిట్లే పడుండనిమ్మా?

అప్పుడు కరుణార్ద్రహృదయయగుసత్యవతి తత్తరముతోఁ జంచలరావుఁ సమీపించి యాతని చెక్కిళ్లపైఁ జేయివైచి చూచెను. ఆమెకోమలకరపల్లవమునకు తీక్ష్ణస్పర్శమైన ట్లయ్యెను!!

అయిదవ ప్రకరణము.

అలలు జనియించి నీటిలోఁ గలిసిపోవు
పల్లవులు గూడఁ జిగిరించి వాడిపోవుఁ
జంచలాలత లప్పుడే నశించిపోవు
నెక్కడనో గానఁబడకుండఁ జుక్కగుంపు
నాశలన్నియు నంతలో నంతరించె.

ఆశ — నిరాశ.

చంచలరావునకు జ్వరము వదలుట లేదు. రెండుదినము లయ్యెను. మూఁడుదినము లయ్యెను. పదిదినము లయ్యెను. ఇంకను జ్వర మట్లే యుండెను. పాపము భారతరావాతనికొఱకు కెన్నియో పాటులఁ బడుచుండెను. ఎందఱనో వైద్యులను దీసికొనివచ్చి మందు లిప్పించుచుండెను. శారీరకగుణవైపరీత్యముచేఁ గలిగినస్వాభావిక వ్యాధియైనచో మందులకు శాంతింపవలసినదే. కాని చంచలరావు వ్యాధి యట్టిది కాదు. అది మానసికస్వభావవైరుధ్యముచే జనియించినది. మనోవ్యాధికి మందెచ్చట నుండును?

చంచలరావు సత్యవతి నెట్లయినఁ బెండ్లియాడవలయు నని యాశపెట్టుకొని యుండెను. భారతరావుకూడఁ దన చెల్లెలి నెట్టులైన నాతనికిచ్చి పెండ్లి చేయవలయు ననియే యెన్నియోవిధములఁ బ్రియత్నించుచుండెను. సత్యవతిహృదయ మేమాత్రము నొచ్చినను భారతరావు సహింపలేఁడు. మంచిమాటలచేతనే యామె నామార్గమునకుఁ ద్రిప్పవలయు నని యాతనియుద్దేశము. ఏసమయమునం దెట్లు పరిశీలించినను సత్యవతిహృదయ మాతని కందుటయే లేదు. అన్యాపదేశముచే నెంతప్రబోధించినను నామెకు నచ్చుట లేదు. ఆపద్ధతియే యామెకు సమ్మతముగ లేనట్లగపడుచున్నప్పుడు భారతరా వామెతో నామాట యెట్లు చెప్పఁగలఁడు? ఎంతచనవుగ నున్నను జంచలరావుమాత్ర మామెతోఁ దనయభీష్టముంగూర్చి యెట్లు మాటలాడఁగలఁడు. సమయము ననుసరించి యామెహృదయమును మరలించి ప్రబోధింపవలయు నని యిరువురును గూడ నిరీక్షించుచుండిరి.

మొన్నటిసంభాషణమునుబట్టి సత్యవతి దృఢాభిప్రాయము విస్పష్టముగఁ దెలిసిపోయెను—భర్తృవియోగదుఃఖమునుమాత్రమే సత్యవతి యెఱుంగును. పాపమామెకు భర్తృసంయోగసౌఖ్యముంగూర్చి యెంతమాత్రమును దెలియనేతెలియదు—మఱియు నామెకు సుఖదుఃఖములు దైవాధీనము లనియు, దైవదత్తము లగు సుఖదుఃఖము లనుభవించి తీఱవలసినవియే యనియు దృఢవిశ్వాస మున్నది. ఇంతేకాక సుఖవాంఛయే దుఃఖ మనియు, దుఃఖనిరసనమే సుఖమనియు నామె యనుభవముచే బాగుగ గ్రహియింపఁగలిగెను. అందుచేతనే యామె యంతటిదృఢనిశ్చయురాలై యుండెను.

ఇంక నామెహృదయమును మరలించుట దుస్సాధ్యమని భరతరావు నిరుత్సాహుఁడై పోయెను. చంచలరావునకుఁగూడ నుత్సాహభంగ మయ్యెను. ఆతని కింత కవకాశము లేకుండఁబోయినది. అదియే యాతని మనసులోని బాధ—అదియే యాతనికింతటి ప్రాణసంకటమునకుఁ గారణమైనది. ఆతని కిప్పుడు తనపూర్వవృత్తాంత మంతయును దలఁపునకు వచ్చుచుండెను. అనాగతము లాతనికిఁ దలఁచుకొనుటకుఁగూడ దుస్సహములై యుండెను. ఆతని భవిష్యజ్జీవిత మంతయు నంధకారబంధుర మైపోయిన ట్లగపడుచుండెను. తనజీవితము నిష్ప్రయోజనమైపోయినదని యాతని హృదయము పరితపించుచుండెను. ఏదేనొకసంస్కరణము గావించి యామూలమున దృష్టాంతపూర్వకముగ లోకమునకు దారిచూపవలయు నని యాతని యుద్దేశము. అందువలనఁ బేరుసంపాదింపవలయు నని యాతని కోరిక. ఇన్నిటికిని మూలమైన సత్యవతి నెట్లయినను బెండ్లియాడ వలయు నని యాతని యాశ. ఆయాశ ఫలించుట కవకాశము లేకుండఁబోవుచున్నది. అయిన నాతఁడు దానిని త్రెంపుకొనఁజాలకుండెను. అందుచేతనే యాతని కామనోవ్యథ! ఆమనోవ్యాధిచే నాతఁడు కృశించి పోవుచుండెను.

చంచలరావునకుఁ దీవ్రజ్వరము వదలుట లేదు. అప్పుడప్పు డాతఁడు జ్వరాతిరేకముచేఁ బరాకుమాటలాడుచుండెను. “అది మూఁగది! అదిగో! మూఁగది! మూఁగది” అని యాతఁడు మంచముపైఁ దూలిపోవుచుండెను. “దొంగలు! దొంగలు!” అని కేకలు వైచుచుండెను. “స్వామి సత్యమే చెప్పినాఁడు!” అని లోలోపల గొణుగుకొనుచుండెను. “రాజరత్నము! రాజరత్నము!” అని యస్పష్టముగఁ బలుకుచుఁ గన్నులఁ దేలవైచుచుండెను. ఆ యసంబద్ధప్రలాపములం జూచి సన్నిపాతలక్షణము లేమో యని

సమీపమునందుండి యుపచారములఁ జేయుచున్న సత్యవతి మిగుల భయపడియెను. భారతరావుకూడ నట్లే దిగులుపడుచుండెను. ఆజ్వర మొకప్పుడు శాంతముగ నుండును — మఱియొకప్పుడు తీక్ష్ణముగ నుండును. అందుచేఁ జంచలరావునకుఁ దౌర్బల్యము మెండుగ నుండెను.

పిఠాపురములో భూలోకధన్వంతరియగు నొకసన్యాసి యుండెననియు నాతఁ డమూలమున నెందఱో వ్యాధిబాధితులకు నివృత్తి గల్పించుచున్నదనియును భారతరావునకుఁ దెలియవచ్చెను. అందుచేఁ జంచలరావు నచ్చటకుఁ బంపి యౌషధము నిప్పింపవలయునని యాతఁడు నిశ్చయించుకొనియెను. ఆతఁడు చంచలరావునొద్దఁ గూర్చుండి మెల్లగా, “మిత్రమా! ఇచ్చటియాంగ్లేయవైద్యము నీకేమియును బనిచేసినది కాదు. పిఠాపురమున నాయుర్వేదఘన వైద్యుఁ డొకఁ డున్నాఁడఁట! పరమహంసక్రియలచే నాపరమహంస నిమిషములో నెట్టివ్యాధినైనను గుదుర్పఁగలఁడు. నీవక్కడకుఁ బోయి మందు తీసికొన్నచో బాగుగ నుందువు. స్థానమును వైద్యమునుగూడ మార్చుటవలన నీకు స్వస్థత కలుగవచ్చును” అనియెను.

చంచలరావు హీనస్వరముతో, “అంతశ్రమ మెందుకు? క్రమముగా నదియే యుపశమించును” అనియెను.

భార — అట్లుకాదు. ఎన్నిమందు లిచ్చినను జ్వరము వదలుట లేదు. దినదినమునకుఁ గృశియించిపోవుచున్నావు. ఇట్లే యూఱక చూచుచున్నచోఁ బ్రమాదము కదా?

చంచ — అక్కడకుఁ బోయినచో నాకెవ్వరున్నారు? పామిచ్చట సత్యవతి యెట్టికష్టమును లేకుండ నాకెల్లవిధముల నుపచారములు చేయుచున్నది. అక్కడ దిక్కేమున్నది?

సత్యవతి జాలితో 'నా యన్నయొకటియు నీవొకటియునా? నీ కారోగ్యము కలుగుటయే నాకానందము. నేనుగూడ నీతో వచ్చి నీకించుక యారోగ్యము కలుగువఱకు నీయొద్దనే యుండెదను' అనెను.

చంచలరావున కించుక జీవితాశ కలిగినది. భారతరావున కొకింతయూఱట కలిగినది. అప్పుడాతఁడు చంచలరావుతో 'మిత్రమా! నీకు కష్టమును గలుగదు. సత్యవతి నీకుపచారములు చేయుచుండును. పలుదినములలో నేనుగూడవచ్చి నీయొద్దనేయుండెదను' అని సమాధానపఱచెను.

భారతరావు తల్లిదండ్రులు చంచలరావును దమబిడ్డవలెనే చూచుకొనుచుండుటచే వారుగూడ నాతనికి ధైర్యము చెప్పి యా ప్రయాణమునకు సమ్మతింపఁజేసిరి. చంచలరావు మాఱుమాట చెప్పలేదు.

ఆ అ వ ష్రి క ర ణ ము.

ఏరాత్రి యామక్క ◆ యెటుపుట్టినారొ
ఆరాత్రికే గిట్టు ◆ నంచును దెలిసి
ఏయెండ కీపూవు ◆ లిటు విచ్చినారొ
ఆయెండకే వాడు ◆ నంచును దెలిసి
ఏగాలి నీబుబ్బు ◆ లిటు కూడినారొ
ఆగాలికే వీడు ◆ నంచును దెలిసి
నాపజాపశత ధన్యం ◆ బగు మంచి
క్షణభంగురం బైన ◆ స్వసుఖంబు నమ్మి
యక్షయసుఖంబు ◆ లనుభవించుటకు
ద్వారకాంటివిడిచెదేటి ◆ దుర్బుద్ధినీకు!

విచారలహరి.

పిఠాపురమునందేకాక యానగరమునకుఁ జుట్టుపట్టుల నున్న పట్టణములయందేమి, పల్లెలయందేమి యావైద్యశిరోమణి యగు సన్యాసి నెఱుంగనివా రెవ్వరును లేరు. కాని, యాతఁ డెవ్వఁడో యెచ్చటివాఁడో యాసంగతులుమాత్రము స్పష్టముగ నెవ్వరికిని దెలియవు. ఆతఁడు సంసారమును ద్యజించివచ్చినసన్యాసి యని కొందఱును, సన్యాసాశ్రమమునఁ జరియించుచున్న సంసారియని మఱికొందఱు నాతనింగూర్చి యనేకు లనేకవిధములుగఁ జెప్పుకొను చుందురు. మంచిగనైనను జెడ్డగనైనను సత్యము నెఱుంగనివారే చెప్పుకొనుచుండుటచే మనకు వారియేమాటలను విశ్వసించుటకైనను నవకాశము లేదు. ఏమైననేమి — వ్యాధిపీడితులగువార నేకు లెచ్చటెచ్చటనుండియో వచ్చి యాతని నాశ్రయించి మందులను దీసికొనుచుందురు.

ఆమహాత్ముఁడు సాహాయ్యముగ ధర్మవైద్యమునే చేయుచుం డును. అనేకధర్మకార్యములనుగూడఁ జేయించుచుండును. తగిన వారైనయెడల విలువగల మందులను వారిచేఁ గొనిపించి యామూల మున వారిరోగములను గుదుర్చుచుండును. అట్టి వెలగల మందులకై రోగులు విశేషశ్రమపడి ప్రయత్నింపనక్కఱ లేకుండ నవి దొరకు చోటు సన్న్యాసియే వారికిఁ జెప్పుచుండును. ఆతనిశాంతవచనములు హృదయాకర్షణముం గావించుచుండును. ఆతనిసౌమ్యరూపము మ నోరంజకమై యుండును. జబ్బు కుదురనివారి కాతఁడు మిక్కిలి కను గర్మపరిపక్వము కాలేదని చెప్పి వారిని మెల్లగఁ బంపివేయుచుండు ను. రోగము కుదిరినవా రాతని బూజించి పీడఁబోయిన యానందముతో నిండ్లకుఁ బోవుచుందురు. అందుచే నాతనిభేషజప్రతిభ సుప్రసిద్ధ మై యుండెను.

భారతరావు పిఠాపురమునందలి పేటలో నొకప్రత్యేకగృహ ము నద్దెకుఁ దీసికొని చంచలరావు నందుంచెను. చంచలరావా సన్న్యాసియొద్ద మందుఁ దీసికొనుచుండెను. సత్యవతి యాతని కుప చారములు చేయుచు నచ్చటనే యుండెను. భారతరావు శుక్రవా రము రాత్రికివచ్చి సోమవారము నాఁటికి మరలఁ గాకినాడకుఁ బోవు చుండెను. సన్న్యాసి మందులచేతనో సత్యవతి నిత్యసన్నిహితయై యుపచారములు చేయుట తనో క్రమక్రమముగఁ జంచలరావున కు స్వస్థత కలుగుచుండెను. అచ్చటినీరునుగాలియు నాతని కారో గ్యకరములుగా నున్నవని యెంచి భారతరావాతనిచే మఱియొకనె లదినములు సెలవుపెట్టించి సంపూర్ణారోగ్యము కలుగువఱకుఁ జం చలరావచ్చటనేయుండుట కేర్పాటు గావించెను.

చంచలరావున కారోగ్యము కలుగుచున్నది. ఆతనిప్రాణము లేమూర్తిపై నాధారపడి యున్నవో యాతనిహృదయమేమూర్తి

యనుగ్రహము నభిలషించి నిరంతర మేమూర్తిని ధ్యానించుచుండెనో యాప్రేమైకమూర్తి సత్యవతి నిత్యము నాతనికన్నులయెదుటనే మెలంగుచున్నది! ఆకరుణామూర్తి యాతని దసప్రాణములకంటెను బ్రియముగ నెంచి యుపచారములం గావించుచున్నది. ఆతని కది పరమానందముగ నుండెను. ఆయానందముచేతనే యాతని మనోవ్యాధి యుపశమించినది. కాని, చంచలరావుమనసునకు క్రొత్తమతి యొకవ్యాధి తటస్థించినది. ఆవ్యాధిచే నాతనిహృదయము నిరంతరమును జలించిపోవుచుండెను. ఆయావేగమును సహించుట యాతని కతిదుర్భరముగ నుండెను. ఆతనిబాహ్యశరీరమునం దారోగ్యమగపడుచున్నను నంతరంగమునం దనిర్వాచ్యమగు నాందోళన మగుచునే యుండెను.

చిరకాలమునుండి తనహృదయమును వేధించుచున్న తనమనోరథమునంతను స్పష్టముగఁ గరుణార్ద్రహృదయ యగు సత్యవతికి విన్నవింపవలయునని యాతఁ డావేగపడుచుండెను. అనాలోచితముగ నొక్కసారిగాఁ దనయుద్దేశమును దెలిపినచో సుకుమారహృదయయగు సత్యవతి యెంతనొచ్చుకొనునో యని యాతఁడు శంకించుకొనుచుండెను — తనసుఖముకొఱకా మె యెంతటికష్టమునైన సహించినది. తనప్రాణముకొఱకా మె నిజప్రాణములను వినియోగించినది. అట్టిప్రేమైకమూర్తియు, నిరంతరపరోపకారపరాయణయు నగు సత్యవతి కోమలహృదయము నొచ్చునటు మెలంగ సాహసించుట యెంతటికష్టము! ఈసంగతి తలంచుకొన్నప్పు డాతనిమతి చలించిపోవుచుండెను. ఆచంచలహృదయమును గుదురుపఱచుకొనుట యాతని కతిదుస్సహముగా నుండెను.

వికలహృదయుఁ డగునాతనివదనమునుండి యవ్యక్తముగ నప్పు డస్పష్టసందర్భములగువాక్యములు వెలువడుచునే యుండెను.

అవి యాతనిచంచలహృదయమునందలి చంచలోద్దేశముల నస్పష్టముగఁ బ్రకటించుచునే యుండెను. కాని, నిర్మలహృదయ యగు సత్యవతి వాని నంతగాఁ బాటించుటలేదు. ఆమెమౌనమువలన నాతని కాశవర్ధిల్లుచునే యుండెను.

రాత్రి తొమ్మిదిగంటలైనది. వేసవికాలమగుటచేఁ జంచలరా వింటిముంగిటఁ జల్లగాలికై యొకపడకకుర్చీపైఁ గూర్చుండియుండెను. సత్యవతియును భోజనముచేసి వచ్చి యాతనికి సమీపమున నరఁగుపైఁ గూర్చుండి కొంతవ్యవధి చిక్కినపుడు వేడుకగ శ్రీమద్రామాయణము జదువుకొనవలయు నని యనుకొనుచుండెను.

అప్పుడు చంచలరా వామెం జూచి కృతజ్ఞతాసూచకస్వరముతో ,,సత్యవతీ! నీవు దినమంతయు నాకొఱకు శ్రమపడుచునే యుంటివి. అయినను జాలరాత్రివఱకును రామాయణము చదువుకొనుచుందువు. అధికపరిశ్రమచే నీకెక్కడ జబ్బుచేయునో యని నాకు భయముగనున్నది'' అనియెను.

సత్యవతి మధురస్వరముతో ,,శ్రీమద్రామాయణము సర్వజీవశ్రమనివారణౌషధముకాదా?'' అనియెను.

చంచ—దయామయి వగునీవు నిజముగ నాపాలిటికి శ్రీమద్రామాయణమవైతివి.

సత్య—ఎంత మాట!

చంచ—అనవలదు! నీమూలముననే నేనుజీవింపఁగలిగితిని.

సత్య—ఇందు నేఁజేసిన దేమున్నది? ఇంచుకసాహాయ్యమే కాదా! పరమేశ్వరుఁడు నిన్ననుగ్రహించినాఁడు.

చంచ—పరమేశ్వరానుగ్రహమును నేనభిలషింపలేదు. నీకొఱకు—నిత్యసందర్శనముకొఱకు— నిరంతరసహవాసముకొఱకు నేను జీవించియుంటిని!

సత్య—నీహృదయము నేనెఱుంగుదును. నీకు నాయందట్టి యవ్యాజప్రేమ యున్నది.

చంచ—కాని, నీహృదయముమాత్రము నాహృదయము వంటిది కాదు.

సత్య—నీవు నావంటివాఁడవయినచో నాహృదయము నీ హృదయమువంటిది కావచ్చును.

చంచ—మనయిరువురిహృదయములు నొక్కటియై యుండ వలయును నాకోరిక—

సత్య—భావములొక్కటియైనచో నట్లే కావచ్చును.

చంచ—నీవు నన్నే భావముతోఁ బ్రేమించుచుంటివో నాకు బోధపడుట లేదు.

సత్య—మన మిరువురము బరమేశ్వరుని సంతానములమే యగుటయును, బ్రేమైకస్వభావము గల జీవసముదాయములో వారమే యనియు నిన్నుఁ బ్రేమించుచున్నాను.

చంచ—అటయినచో నేను నిన్నుఁ బ్రేమించునట్లు నీవు నన్నుఁ బ్రేమించుట లేదనుకొందును.

సత్య—ఎందుచేత?

చంచ—నాకున్న కోరిక నీకు లేదు కావున—

సత్య—నాకుఁ గోరఁదగిన దేమున్నది?

చంచ—నేనును నీవంటి జీవినే గావున నీవు నాప్రాణములను నిలుపుటకుఁ గోరనక్కఱ లేదా?

సత్య—ఆవిషయమునందు నాలోప మేమున్నది?

చంచ—నీకు నాప్రాణములను నిలుపవలయు ననుకోరిక యున్నచో నీవు నీయుద్దేశమును మార్చుకొనవలయును. నాప్రాణ రక్షణముకొఱకు నీవు నన్నుఁ బెండ్లియాడవలయును. మన మిరువురి

హృదయములు నావిధముగ నేకమునైతై మనయిరువుర జీవితములు నట్లే కములైనప్పుడుగాని నాకీలోకమున జీవించుట కాధార మేమియును లేదు. ఆకోరిక చేతనే నేను నిన్నుఁ బ్రేమించుచుంటిని! ఆయాశ చేతనే నేనింకను జీవించియుంటిని.

చంచలరావింతటియవివేకియై నిర్భయముగఁ దనయెదుట నిట్లుమాటలాడునని సత్యవతి యనుకొనలేదు. నీచాభిలాషియగు నాతనివాక్యములామె కసహ్యములుగఁ దోఁచెను. అప్పు డామె తీవ్రస్వరముతో "నీనడవడికిఁ దగినట్లు నీవు మాటలాడుటలేదు. కాని నీహృదయము నీపేరునకుఁ దగినట్లే యున్నది. నీనీచమోహ వికారము నిర్మలప్రేమ యని భావించి నేనే పొరపాటుపడితిని. నా పాత్రిస్వభావము నెఱిఁగియుండియు నీవు నీచాతినీచునికంటెను నికృష్టముగ సంభాషించుచుంటివి. నీవేమో విద్యాధికుఁడ వనియు నా సోదరునకు మిత్రుఁడ వనియు, సోదరసమానుఁడవనియు భావించితిని గాని యింతటి శుద్ధమూర్ఖుఁడ వని నేననుకొనలేదు." అని గద్దించి పలికెను.

చంచలరావు మొగమింత చేసికొని హీనకంపితస్వరముతో "సత్యవతీ! నన్నునిందింపకుము! నీదయాపాత్రుఁడ నగు నాపైఁ గోపింపకుము! నీచమోహమో, నిగాఢప్రేమమో తెలియదుగాని నా కు నీయెడల నేదియో యనిర్వాచ్యమగునిచ్ఛయొకటి యున్నమా టమాత్రము సత్యము. అదియే నిమిషనిమిషమునకును నాకోరికల వర్ధిల్లఁజేయుచున్నది! నాయాశల నంతములేకుండఁజేయుచున్నది. ఆపరితాపముచేతనే నాహృదయము వేగిపోవుచున్నది. నానర్వాం గకములును దహించుకొనిపోవుచున్నవి! ఈప్రాణములు నీమూలముననే నిలిచినవి. ఆకారణముచే నివి నీయధీనములైయున్నవి. నీచే తితో నిలిపిన యీప్రాణములను మరల నీచేతులతోనే తీసివేయఁ

దలంచినచో నేనేమి చేయఁగలను? ప్రేమామృతహృదయవగు నిన్నుఁ బ్రేమార్ద్రహృదయముతోఁ బ్రార్థించుచున్నాను! ఈదీనునిబరిగ్రహించినను బరిత్యజించినను నీవే యధీశ్వరివి! నిగ్రహానుగ్రహములు నీచేతిలోనున్నవి. ఏమనుకొన్నను నీవే నాహృదయేశ్వరివి—నాజీవితేశ్వరివి—నీప్రేమైకవదనమునుండి కూడ నట్టియమృతమధురవచనము నొక్కసారి యాలకించి నీపాదసన్నిధానమునఁ బ్రాణములు విడిచివైచినను నాకుఁ బరమానందమే—' అని వేఁడుకొనుచుఁ జంచలరావు తత్తరముతోఁబోయి ప్రకంపితహస్తములతో సత్యవతి చేతులను బట్టుకొనియెను. సత్యవతి యాతనిచేతులను ద్రోసివైచి చటాలున లేచి నిలువఁబడి ధీరగంభీరస్వరముతో ''పాపాత్మా! నీకింతటిదుర్బుద్ధి యున్నదని నేననుకొనలేదు. నీకు నేఁజేసినయుపకారము పామునకుఁ బాలుపోసినటుగ నైనది! నేనొంటిగ నుంటిననియా? నీకింతటిసాహసము! ధర్మము లేదా? దైవము లేదా? దురాత్మా! దూరముగ నుండుము.'' అని ధిక్కరించి పలికెను.

చంచలరావున కాటంక మధికమైనకొలఁదిని మోహముంచుకొనిపోవుచుండెను. ఆతఁ కప్పుడు తనసంగతి తెలియుట లేదు. ఎదుటిసంగతియును దెలియుట లేదు. ఆతఁడీప్రపంచమునే మఱచిపోయెను. చంచలరావు దీనస్వరముతో ''సత్యవతీ! నాప్రాణములు తల్లడిల్లిపోవుచున్నవి. ఈదాసానుదాసుని నీపాదసేవకునిగనను గ్రహింపుము.'' అని ప్రార్థించుచు నున్మత్తునివలెఁ జంచలుఁ డామెను బలవంతముగఁ గౌఁగిలించుకొనఁబోయెను. ఆబాలిక యగు సత్యవతి కెవ్వునఁ గేకవైచి యవశయై పడిపోయెను.

అంతలోఁ బ్రాకారద్వారము బలవంతముగఁ దెఱచిన చప్పుడయ్యెను. ఆనిమిషములోనే యరఁటిచెట్లపొదలనుండి యతిలోకమోహనశృంగారమూర్తి యగునొకరమణీమణి యాకస్మిక

ముగ నాతని యెదుటకువచ్చి నిలువంబడియెను. ఆమెం జూచినతోడనే చంచలరావు ఉలికిపడి మతిభ్రష్టవలె నొక్కపరుగునం బోయి దొడ్డితలుపు తెఱచుకొని గాఢాంధకారములో నుండిపోయిన యేఱేటి కాలువంబడి పాఱిపోయెను. ఆసుందరీమూర్తికూడ నా [illegible] పోయినమార్గమునే యనుసరించిపోవుచు నాయంధకారములో నదృశ్యమైపోయెను.

ఆసుందరీమూర్తి విలాసభవనమునందలి మధుమతి మరిడమ్మ గుడిలోని పూవులమ్మి. ఆమె యిచ్చటి కెట్లు వచ్చినది? నిర్భయముగ నొకయువతీమణిని బలవంతముచేయుటకు సాహసించియున్న చంచలరా వారమణీమణిం జూచినంతమాత్రముననే భయపడి పాఱిపోవుటకుం గారణమేమి? ఏమైననేమి మధుమతి మానవతీశిరోమణి యగుసత్యవతిపాలిటికి కష్టవారణమంత్రాధిష్ఠానదేవతవలె నాకస్మికముగ సాక్షాత్కరించినది. ఆకారణముచేతనే సత్యవతికిప్పుడు తటస్థించినమహావిపత్తు తప్పిపోయినది. సాధుస్వభావులను సర్వేశ్వరుం డీవిధముగనే సంరక్షించుచుండును.

సత్యవతి దారుణభయావేశముచే మూర్ఛితయై పడియుండెను. ఇంకను నామెకుం దెలివి కలుగలేదు. ఇంతలో మఱియొకరమణీమూర్తి యాయింటం బ్రవేశించెను. ఆమెకూడ నిరువురుపురుషు లుండిరి. వారు మెల్లమెల్లగ సత్యవతి నెత్తికొనిపోయి వెలుపలనున్నబండిపై నెక్కించి యెచ్చటికో తీసికొనిపోయిరి. ఈస్త్రీమూర్తి మధుమతి ననుసరించి వచ్చినదా? సత్యవతి నెత్తికొనిపోవుటకై వచ్చినదా? ఈరమణీమూర్తి యెవ్వరు?

ఏడవ ప్రకరణము.

కాలగతికిని భేదంబు గలదె యెచటఁ
జెప్పుచుందురుగాదె యీ చెవులుగాఁగ;
నిశ్చయించంగఁ జెల్లునే యీమాట?
కాలపరిణామముల నాన కాలు గాచి
సంసృతి కష్టారణ్యగ గవన బలము మదిఁ
దెలిసి యెవ్వారు కాదని పలుకఁగలరు.

సంవత్సరాది— హారావళి

దేవగురుఁడు సింహరాశియందుఁ బ్రవేశించెను. గోదావరీపుష్కరము వచ్చినది. ఆపుణ్యకాలమునఁ బావనగౌతమీసలిలావగాహనంబులచేఁ బాపకళంకనిర్మూలనముగావింపవలయుననుసదుద్దేశముతో దేశదేశములనుండి యనేకప్రజలు రాజమహేంద్రవరనగరమునఁ బ్రవేశించి యుండిరి. ఆనగర మప్పుడు ప్రత్యేకప్రపంచమువలె నుండెను. ధర్మదేవత యచ్చట నివసించియుండెను. అధర్మదేవత యచ్చటఁ దాండవమాడుచుండెను. ఆనగరమునం దప్పుడు సుభిక్షదుర్భిక్షముల కన్యోన్యజయాపజయంబు లగుచుండెను. పాపపుణ్యములకుఁ బరస్పరసంఘర్షణము లగుచుండెను. రోగారోగ్యములకు నిరంతరసంకులసమరము జరగుచుండెను. సుఖదుఃఖములు రెండు నొండొరుల నాక్రమింపవలయునని ప్రయత్నించుచుండెను. ఆపుణ్యసమయమునం దాపుణ్యక్షేత్రమునకుఁ బుణ్యాకాంక్షితులై పుణ్యాత్ములును బాపాత్ములునుగూడ వచ్చియుండిరి. దేవతలును రాక్షసులునుగూడ మానవాకారములందాల్చి విచ్చేసియుండిరి.

ఇట్లు రాజమహేంద్రవరమునకు నూతనత్వమేమియు నగపడుట లేదు. అప్పటికి నిప్పటికి నొక్కరీతిగనే పాపపుణ్యసమ్మిశ్రితమై యుండెను. గోదావరీనదియందలియమృతజలమెంతపవిత్రమైనదియో విలాసభవనమునందలిమదిరారసమంతటి యపవిత్రమైనది. ఆపుణ్యనదీగర్భమునందలిమృదుతరంగనినాదము లెంతటిసుధామధురములైనవో యాపాపగృహాంతర్భవనములయందలి రంగస్థలాపనిస్వనములంతటివిషశిక్తములైనవి. ఆదివ్యనేఁకనెందఱు సేవింతురో యానీచమందిరము నంతకంటె నధికులే యాశయించుచుందురు. అట్లయ్యును, సర్వకలికలుషసంహారిణి యగుగౌతమీమాత నాశ్రయించి యుండుటచేతనే మనకథాకాలమునాఁటికి రాజమహేంద్రవరనగరము తనపురాతనౌన్నత్యమును నామమాత్రముచేనైనను నిలుపుకొనఁగలిగి యుండెను.

గోదావరీతీరమంతయు నిసుకవేసినరాలకుఁ దునఁతటిజనసంఘముచేఁ గిక్కిరిసి యుండెను. కొందఱు ఫలపుష్పములను గోదావరీమాత కర్పించుచుండిరి. కొందఱుభక్తికొలఁదిని, శక్తికొలఁదిని రాగినాణెములను బంగారునాణెములనుగూడ సమర్పించుచుండిరి. కొందఱు కుంకుమ, పసుపు పండ్లు మొదలగునవి పంచిపెట్టుచుండిరి. కొందఱుదంపతిస్నానములు చేయుచుండిరి. కొందఱు తీర్థవిధులఁ దీర్చుకొనుచుండిరి. దానములును, బూజలును లెక్కలేకుండఁ జరగిపోవుచుండెను. ఆజనసమ్మర్దమువలన స్నానముచేసినవారు వెలుపలకు రాఁజాలకుండిరి. స్నానార్థులకుఁ జోటు దొరకుట లేదు. భూకలుషసంహారిణు లగుపుణ్యతరంగిణు లన్నియు నీపుష్కరపుణ్యకాలమునందాత్మపాపవిమోచనమునకై వచ్చి గౌతమీనిర్మలసలిలావగాహనములం గావించి పోవుచుండు నని పురాణప్రసిద్ధ

ము. అట్టిమహాపాపభయవినాశిని యగుగోదావరిని సేవించుటకై భరతఖండమునందలి యెచ్చటెచ్చటిప్రజలో వచ్చియుండిరి.

కాలు నిలుపుట కెచ్చటను జోటులేదు. పురపాలకులు ప్రజాసౌఖ్యమునకు వలయుప్రయత్నములను జేయుచుండిరి. అందందు బాకలను బందిళ్ళను వేయించి తీర్థప్రజకు నిలువనీడలం గల్పించుచుండిరి. వచ్చువారు వచ్చుచుండిరి. పోవువారు పోవుచుండిరి. రేయుంబవ లొక్కటేజనసమ్మర్దముగనుండెను.

ఒకనాంటిరాత్రి తొమ్మిదిగంటలవేళం బేదరాలగునొకయువతి పసిబిడ్డను జంకం బెట్టుకొని విలాసభవనమునకు సమీపమందున్నయొకపెద్దయింటియొద్దకుం బోయి ద్వారమువొద్ద సంకుచితభావముతో నిలువంబడి దీనస్వరముతో, 'అమ్మా! ఈపసిబిడ్డకుం గొంచెమన్నము పెట్టెదరా?' అని యడిగెను. తోడనే లోపలినుండి యొకస్త్రీకంఠస్వరముతో, 'భోజనము లైపోయినవి. అన్నము లేదుపో!' అనువాక్యములు వినంబడియెను. పాప మాపేదరాలు ఖిన్నురాలైపోయెను. ప్రొద్దుటినుండియుం బసిబిడ్డ యన్నము లేక యేడ్చుచుండెను. కన్నకడుపు చుమ్మలుపట్టుకొనిపోవుచుండెను. అన్నము లేకుండం దాను జచ్చుటకైన సహింపంగలదుగాని యాంకలిచే నేడ్చుచున్నపసిబిడ్డను జూచుచుం దల్లి యెట్లోర్చియుండంగలదు? ఇంకొకసారి యడిగినచో నాగృహిణి హృదయము కరంగునేమో చూతుమను యాశ యామెను బ్రేరేపించెను. అప్పు డామె మరల, 'అమ్మా? నేనాంకలికెట్టయిన సహించుకొనియుండంగలను. ఈపసిబిడ్డకుం బ్రొద్దుటినుండియు నన్నముదొరకినదికాదు. ఎంతయున్న నంతియే చాలును. తల్లీ! దయయుంచియీబిడ్డను బ్రదికింపవా?' అని బ్రతిమాలి యడిగెను.

అప్పు డాగృహిణి కోపముతో "ఒకసారి చెప్పినఁ దెలియదా? పోపొమ్మా!" అని కసరుచు జటాలునఁ దలుపులు మూసికొనియెను.

అప్పు డాయరుఁగుపైఁ గూర్చుండియున్నయొకపురుషుఁ డాదీనాలాపములు నాలకించి కనికరముతో నాపేదరాలిం జూచి "తల్లీ! ఈయింట నన్నము లేదనుమాట నిజమే. కొంచెమన్న ముండఁగా నేనిప్పుడే తినివైచితిని. అయ్యో తల్లీ! నీవించుక ముందుగ వచ్చినచో నీబిడ్డ కాయన్నములోనిదైనఁ గొంచెము పెట్టఁగలిగియుందునే!" అని నొచ్చుకొనియెను.

అప్పుడాపేదరాలు శోకగద్గదస్వరముతో "అయ్యా! నేనెన్నఁడు నెవ్వరి నడిగినదానను గాను. బిడ్డయేడుపు వినలేక పట్టెఁడన్నమునకై యిట్లడిగికొనవలసివచ్చినది." అనియెను.

ఆదీనాలాపముల కాపురుషునిహృదయము నీరైపోయెను. ఆతఁడప్పుడు తనలో "పాపము! బ్రతికి చెడినయిల్లాలు—పసిపాపకుఁ బట్టెఁడన్నమైన దొరకినది గాదు" అని కటకటపడుచు గుభాలున నరుఁగుపైనుండి యురికి శీఘ్రగమనముతో విలాసభవనమువైపునకు వెడలిపోయెను.

ఆపుష్కరదినములలోఁ బుణ్యస్రవంతిని యగుగోదావరీదేవి యెట్లుసముత్సాహతరంగితయై పోవుచుండెనో యట్లే విలాసమందిరము కూడ విలాసతరంగితమై పోవుచుండెను. పురుషుఁడు నిస్సంశయముగ నామందిరమునఁ బ్రవేశించి సోపానములనధిరోహించి మేడమీఁదికిఁ బోయెను. ఆతని నెవ్వరు నడ్డగింపలేదు. మేడపైఁ బట్టపగలుగ దీపములు వెలుఁగుచుండెను. అందొకగదిలో రత్నకంబళముపైఁ గూర్చుండి వేంకటేశ్వరుఁడు వారసుందరీచతుష్టయసహితుఁడై పేకయాట నాడుచుండెను. ఆతని పార్శ్వమునందున్నమదిరాకల

శము లాంపపకాంతులలో మెఱసిపోవుచుండెను. అందఱయొద్దను మ
ధురభక్ష్యభాజనములు దొంతులుగ నమర్పఁబడి యుండెను. ఆ
యాట వట్టిదికాదు! కాసులతోఁ బందెము! వేంకటేశ్వరుఁడు
తాగుచుఁ దినుచు నాసుందరీమణులతోఁ గలసియాడుచు నోడు
చున్నకొలఁదినుత్సాహముతోడనే కాలక్షేపము చేయుచుండెను.
ఆవిలాసరంగమునం దాతనికి రెండవప్రపంచ మగపడుట లేదు.

ఆసమయమునకు సరిగనాపురుషుఁ డామందిరమునఁ బ్రవేశిం
చెను. వేంకటేశ్వరుఁ డాతనిం జూచి యులికిపడియెను. ఆతఁడు రం
గఁడు! అందుచేతనే వేంకటేశ్వరుఁ డదరిపడియెను. అప్పుడు
రంగఁడు తీవ్రస్వరముతో ‹‹నాకిప్పు డేమైనఁ గొన్నిభక్ష్యములను
బెట్టవలయును. నేనతిశీఘ్రముగ నొకచోటికిఁ బోవలయును!››
అనియెను.

వేంకటేశ్వరుఁడు కోపఘూర్ణితవదనముతో ‹‹రంగా! సమ
యాసమయములఁ దెలిసికొననక్కఱలేదా? ఎప్పుడు నొక్కటే
మాదిరియా? ఇప్పుడు గాదు పొమ్ము!›› అని కసరిపలికెను.

రంగఁడు వికటస్వరముతో ‹‹చచ్చిపోవుచున్నప్పుడు సమ
యాసమయపరీక్షణములా! చాలుఁ జాలు! పడఁతులయొద్ద నుం
టివనియా భయములేనట్లు పలుకుచున్నావు?›› అని గద్దించుచు బలవం
తముగ నచ్చటనున్నభక్ష్యపుబళ్లెరములలోఁ జేతికి దొరకినవన్నిటిని
దీసికొని యతిత్వరితముగ నాతఁడు వచ్చినత్రోవనే బయలుదేరి
పోయెను.

వేంకటేశ్వరుఁ డప్పు తీసికొనవలయునని యచ్చటకు వచ్చి
యుండెను. నాఁటిరాత్రి సానులతోడి యాటలోఁ జేతిలోని కాసులు
చెల్లిపోవుట యాతనికంత విచారముగ లేదు కాని యాఁడువాండ్ర
యెదుటఁ దనమరియాద పోయినదని యాతఁడు చాలవిచారించెను.

ఏమిచేయఁ గలఁడు? అప్పటికి సిద్ధమైయున్న ప్రబలముష్కరుఁ డగు రంగని నెవ్వరడ్డుకొనఁగలరు?

రంగఁడతివేగముగఁ దనకాపేదరాలగపడినయింటియొద్దకుఁ బోయి చూచెను. ఆమెయచ్చట లేదు. ఆతఁడు నిరుత్సాహముతో నిట్టూర్పులు విడుచు "అయ్యో! చెప్పనైనఁ జెప్పితిఁ గాను. దొరకునో దొరకదో ముందుగ నేమిఁ జెప్పదు నని యనుకొంటిని. పాపమామె హతాశురాలై యెచ్చటికో పోయియుండును. కాని యామె యిఁక మఱియొకయింటికిఁ బోయి యన్నమడుగఁజాలదు. ఈరాత్రి తిండి లేకున్నఁ బాపమాబిడ్డ యేమైపోవునోకదా!" అని చింతించుచు నాతఁడా గోదావరియొడ్డున నాడనసంఘమునందామెను వెదకికొనుచుఁ బోవుచుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

తావకీనపవిత్రపం దర్శనమునఁ
దావకీనతేజోమయ దర్శనమునఁ
దావకీనవాత్సల్యప్ర దర్శనమునఁ
దావకీనానుభోగని దర్శనమున
మాత! నాపాపసంఘంబు మాయమయ్యె
జనని! నాయంధకారంబు సమసిపోయె.

మాతృగీతము —

గోదావరియొడ్డున నొకచెట్టుక్రిందఁ బరుండి యొకవృద్ధురాలు శూలలనొప్పిచే బాధపడుచుండెను. ఆమెసమీపమున దీనవదనయై యొకయువతి కూర్చుండి యుండెను. ఆమెయొడిలోనున్న పసిబిడ్డ

విడువకుండఁ బోరుపెట్టుచుండెను. ఆయువతి యాబిడ్డ నూరడింపఁ జాలక కన్నీరు పెట్టుకొనుచుండెను. అప్పుడా వృద్ధురాలు మూలుగు మానివైచి, తల్లీ! చంటిబిడ్డకు గుప్పెడన్నము దొరకినది కాదా? పాపపురోగముచేఁ బడిపోవుటచే నీవంటిదానిచే నన్న మడిగి పడవలసివచ్చినది. ఆగర్భశ్రీమంతుఁడగు నీబిడ్డ యాకలిచే నేడువవలసినదా? అమ్మా! ఎటువంటిదానికెట్టి కష్టములు వచ్చినవి! అని యుమ్మలింపఁదొడంగెను.

యువతి మహాశోకాక్రాంతయై, అత్తా! ఏజన్మమునం దెట్టి పాపము చేసితినో యీజన్మమునం దనుభవింపలేననినఁ దప్పునా? పూటకు గతిలేని యీనిర్భాగ్యురాలికి బిడ్డకూడ నెందుకు?' అనియెను.

వృద్ధ—తల్లీ! ఆఁకలిచేఁ దూలిపోయిననీయొద్ద గుక్కెఁడు పాలైనను లేవు. ఏడ్పుటచే బిడ్డకు నోరెండుకొనిపోవుచున్నది! ఎట్లో మెల్లగ నేనైనను బోయి గుప్పెఁడన్న మెవ్వరినైన నడిగి తెచ్చెదను.

యువ—నీవు పెద్దదానవైతివనియు నిన్నుఁ బూవులలోఁ బెట్టి పూజింపవలయు ననియు నేనాశపడితిని. కాని నాకాయదృష్టము పట్టినది కాదు. కూర్చుండి లేవలేనిముసలితనమునందుఁగూడ నీకు నాకొఱకే కష్టపడవలసివచ్చినది. ఇంత బాధపడుచున్నప్పుడుకూడ నీకు నాకష్టము తప్పుట లేదు. ఈస్థితిలో నీవెక్కడకుఁ బోఁగలవు?

వృద్ధ—అక్కఱ లేదు. మెల్లఁగఁ బోయి వచ్చెదను. వెన్నెల వచ్చుచున్నది. ఈసమీపమునం దెవ్వరినైన నడిగి కొంచెమన్నము తీసికొనిరాఁగలను. ఇది యూరుగాని యడవి కాదుగదా! అందఱును రాక్షసులే యుండరు. చంటిబిడ్డపేరు చెప్పినచో నెవ్వరికైనను గడుపు గరఁగకపోదు.

అని యావృద్ధురాలటనుండి మెల్లగ లేచి సమీపమునందలి తీర్థవాసులునివసించియున్నపందిళ్ళవైపునకుఁ బోయెను. క్రమముగా వెన్నెల వచ్చుచుండెను. ఆయువతియొడిలోనిబిడ్డ యేడ్చియేడ్చి సొమ్మసిలిపోయెను. పాపము తల్లి దీనవదనముతో నాబిడ్డపైఁ గన్ను పెట్టుకొని యుండెను. ఆయువతీమణి యెవ్వరు? ఆనవాలు పట్టుటకవకాశమైన లేకుండ నెంతలో నెట్లుమాఱిపోయినది! ఆమె పాపము మనయనసూయయే. అన్నమును దేఁబోయినవృద్ధురాలు వంటలక్కయగుజోగమ్మ. అవస్థమాఱిపోవుటచే నాకారముకూడ మాఱిపోయినది.

వేంకటేశ్వరుఁడవివేకియై బలవంతముగఁ బరిత్యజించినతరువాత నగరికయగునసూయకుఁ బాపము జోగమ్మయే తల్లియయ్యెను; దిక్కయ్యెను. జోగమ్మకు మఱి యెట్టిస్వాస్థ్యమును లేదుగాని జేగురుపాడునం దొకయిల్లుమాత్రమున్నది. ఆమె యనసూయనచ్చటకుఁ దీసికొనిపోయి కన్నబిడ్డవలెఁ బోషించుచుండెను జోగమ్మ యనిన నాయూరివారందఱకును మిగులగౌరవమున్నది. అదియే యామెకున్న ధనము. అంతమాత్రముచే దినములు గడచుట యెట్లు? ఆమె యారోగ్యమున కనుకూలమగు రీతిని బోషించుటకు ధనము కావలసియుండెను. పాపము జోగమ్మయొద్దమాత్ర మేమున్నది? ఆమెయొద్దనున్న కొలఁదిద్రవ్యము వారిపోషణముక్రింద నాలుగైదు నెలలలో వ్యయమైపోయెను. తరువాత నిఁక నేమున్నది? తుదకనసూయయొద్దనున్న యలంకారములే గతియయ్యెను.

అనసూయ యచ్చటనే ప్రసవించి యీచిన్నిబిడ్డను గనియెను. ఆకుమారున కిప్పుడు రెండవయేఁడు వచ్చినది. ఎప్పటికైనను వేంకటేశ్వరునకు దయకలుగునేమోయని యనసూయయును జోగమ్మయు ననిరీక్షించుచునే యుండిరి. అందుకుఁ దగినప్రయత్నములను జేయు

చునే యుండిరి. కుమారుఁడు కలిగెనని సమాచారమంపినప్పుడు కూడ నానిర్భాగ్యుఁడు వినిపించుకొనలేదు. నిరాశాదుఃఖిత యగు ననసూయ నాచిన్నికుమారుమీఁదనే ప్రాణములు పెట్టుకొని శల్యావశిష్టయై జీవించియుండెను.

జోగమ్మ వృద్ధురాలగుటచేతను గోదావరీపుష్కరము వచ్చుటచేతను, మఱియొకపుష్కరమేమో తానేమో యని యెంచి పుణ్యాలుబ్ధయగు జోగమ్మ గోదావరీస్నానమునకుఁ బోవలయు నను తనయుద్దేశము ననసూయకుఁ దెలియఁజేసెను. అనసూయయామెను బోయిరమ్మని చెప్పినదిగాని జోగమ్మ యామెనొంటిగ నింటనుంచి పోవుటకు సమ్మతింపలేదు. జోగమ్మ యామె నెట్లు విడిచియుండఁగలదు? అందుచే నావృద్ధురాలికోరికఁ దీర్చుటకై యనసూయకూడనామెతో బయలుదేరవలసివచ్చెను. ఆమె వచ్చునప్పుడు నాలుగు రూపాయలు కూడఁ దెచ్చుకొనియెను. దానధర్మముల కాస్కనము చాలకపోయిన పూనెఁగాని చిన్నబిడ్డచేతిలో నొక్కచిలుకనైనను గొనిపెట్టుట కవకాశము లేకుండఁ బైమీఁదిబట్ట పట్టి మొత్తుకొని పోయినటు కొంగునఁగట్టుకొన్న యానాలుగురూపాయలును గోదావరిలో జారిపడిపోయెను. అందుచేతనే యీయవస్థ తటస్థించినది !

అనసూయ తనయదృష్టముంగూర్చి తలపోసికొనుచునొంటిగఁ గూర్చుండి యుండెను. అంతలోఁ బసిబిడ్డ మేల్కొని మరల నేడువ నారంభించెను కడుపులో నాఁకలి యగుచుండఁగాఁ గంటికి నిద్ర యెట్లువచ్చును ? అనసూయ యాబిడ్డ నెత్తుకొని లేచి వెన్నెలలోఁ దిరుగుచుఁ జందమామం జూపి యూఱడించుచుండఁగా నానవాలు పట్టి భక్ష్యభాజనములతో రంగఁడు వగర్చుకొనుచు నామెను సమీపించి "అమ్మా! అన్నము దొరకినది కాదు. ఈభక్ష్యములతో నీవును నీబిడ్డయు నీరాత్రి కెట్లో యాఁకలిఁ దీర్చుకొనుఁడు" అని యాపళ్ళెరములదొంతి యామెసమీపమునందుంచెను.

అనసూయ యాశ్చర్యముతో “నాయనా! నీవు పుణ్యాత్మునివలె నగపడుచున్నావు. ఇంత రాత్రివేళ నివియన్నియు నీకెచ్చట లభియించినవి ?” అనియెను.

రంగ — నీబిడ్డయేడుపుఁ జూచి సహింపఁజాలక విలాసభవనమునకుఁ బరుగెత్తుకొనిపోయి యచ్చట మదోన్మత్తుఁడగునొక విలాసప్రియునియొద్దనుండి బలవంతముగ నూఱుఁబెరికికొని వీనిని దీసికొనివచ్చితిని. నేనువచ్చునరికి నీవాయింటియొద్ద లేవు — నిన్ను వెదకికొనుచు నిక్కడకు వచ్చునప్పటికి కాలస్యమైనది. ఎంతయాఁకలిగనున్నదో! ఈభక్ష్యములలోఁ గొన్ని నిబిడ్డకుఁ బెట్టి కొన్ని నీవు తినికొనుమమ్మా!

అన — అయ్యో నాయనా! ఎంతపని చేసితివి! బలవంతముగ నితరులసొమ్ము లాగికొనుట పాపముకాదా ?

రంగ — కడుపుమండి నవారేడ్చుచుండఁగాఁ గన్నులు మూసికొనిపోయినవారు కరుణించి పెట్టుదురా తల్లీ? అట్టివారికి శిక్షా శాస్తి చేయవలయును. ఇందుఁ బాపమేమున్నది ?

అన — ఇతరులహృదయమునకుఁ గష్టము కలిగించుట యధర్మము కాదా ?

రంగ — ఇతరులకష్టమును జూచుచు నూరకుండుటమాత్రము ధర్మమా ?

అన — కాదు.

రంగ — అందుచేతనే నిర్ధనుఁడనైనను లోకధర్మమును నిర్వహించుటకై యీపని చేయవలసివచ్చినది. ఆఁకలి తీరకున్నచో నీరాత్రి నీవును నీబిడ్డయును జీవించుట కష్టము. ఇది లేకపోయినంత మాత్రమున నాతఁడు మరణించునా యేమి?

అన — అంతమాత్రముచేత నీవుచేసినపని ధర్మము కానేరదు. మమ్ము బ్రదికించుపుణ్యమునకై నీవు మఱియొకనిహృదయమును నొప్పించుపాపమును జేసితివి. నాయనా! అమృతమును విషకుంభముతో నెత్తుకొన్నందువలన లాభ మేమున్నది? తండ్రీ! ఆఁకలిబాధచే నల్లాడుచున్న మా బాధం జూచి నీకు దయకలిగినది. అట్టిబాధను నివారించుట నీకు ధర్మముగాఁ దోఁచినది. ఇంతటి దయార్ద్రహృదయుఁడ వగు నీ కితరులను బాధించుట యధర్మమని యేల తోఁచినది కాదు? బాధకు జాలిపడుస్వభావము గలనీవు బాధను గల్పించుట కెట్లొప్పఁగలిగితివి?

ఆ ప్రబోధవాక్యామృతకిరణములచే రంగనిసర్వజీవాణువులు నొక్కసారిగఁ దీవ్రసంచలితములైపోయెను. ఆతనియంతరంగమునందలివిజ్ఞాననయనకమలము మాకస్మికముగ వికసించెను. అప్పుడాతఁడు తనపూర్వచరిత్రమునంతను సమాలోచితముం గావించుకొనియెను. అంతయును విషామృతసంకలితమైయున్నట్లాతని కిస్పష్టముగ బోధపడియెను. సర్వమాయ యగుజ్ఞానశక్తి యీవిధముగ మూర్తీభవించి తనయెట్టయెదుట సాక్షాత్కరించిన దనియుఁ దన్నుద్ధరించుటకే యీవిధముగఁ బ్రబోధించిన దనియు భావించుకొనియెను. అప్పుడు రంగఁడు నిర్వేదకంపితస్వరముతో, తల్లీ! నేను పాపాత్ముఁడను! కనికారమునకు వశుఁడనైపోయి నాజీవితమునందు నేనిట్టికార్యముల నెన్నిటినో చేసియుంటిని. జాలిచేఁ దాత్కాలికధర్మనిర్వహణలాలసుఁడనై యధర్మతత్త్వమును గ్రహియింపఁజాలకపోయితిని! ఇప్పుడు నీప్రబోధచంద్రికలచే నాయజ్ఞానాంధకారము విరిసిపోయినది! నీవీహీనమానవు నుద్ధరింప నేతెంచినదివ్యశక్తివి కాని సామాన్యమానవరమణీమణివి కావు తల్లీ! నేనింతటినుండి యట్టిపాపకార్యము

లు చేయనని నీపాదములసన్నిధిని శపథము చేయుచున్నాను. ఈభ
క్ష్యముల నాఁకలిచేఁ దపించిపోవుచున్న నీచిన్నిబిడ్డకైన నించుక
పెట్టి నాకడుపుమంటను జల్లార్పుము.'' అని ప్రార్థించెను.

అన—వలదు! పాపకళంకితంబు లగునీభక్ష్యములను బసిపా
పకుమాత్ర ముపయోగింపవచ్చునా? ఈయర్భకుఁడు గ్రుడ్డిదరిద్రుఁ
డైనను నాభిజాత్యసంపన్నుఁడు!

ఆప్రశాంతవాక్యము విద్యుచ్ఛక్తివలె నతితీవ్రముగ శ్రవణ
మార్గమున నాతనిహృదయాంతరాళమున వ్యాపించెను. అప్పు డా
తనిహృదయమునం దనిర్వాచ్యమగువేదన యుదయించెను. ఆతఁ
డాదారుణపరితాపముచే దీర్ఘశ్వాసములు విడుచుచు శిలావిగ్రహ
మువలె నటే నిలువఁబడిపోయెను.

అప్పు డనసూయ మృదులస్వరముతో "నాయనా! ఇవి
మిగులవిలువగలవస్తువులవలె నగపడుచున్నవి. ఇవి యెవ్వరివో వా
రికే యిచ్చివేయుము! నీయాదరభావమునకు నే సానందించితిని.
మాప్రాణముల నిలిపినపుణ్యము నీకు లభియించుఁగాక! నీకృతజ్ఞత
ను నాజీవితమున్నంతవఱకు మఱచుదానఁగాను" అనియెను.

రంగఁడు మాటాడలేదు. ఆతఁడు నిర్విణ్ణుఁడై యట్లే చూ
చుచుండెను. అంతలో జోగమ్మ తామరాకులలోనుంచి యన్నము
ను వ్యంజనములను దీసికొని వచ్చి "అమ్మా! వారెవ్వరోపుణ్యా
త్ములు! పేరూరుద్రావిడబ్రాహ్మణులఁట! ఆయిల్లాలెంతయో యాద
రించి యీయన్నము పెట్టినది. ఇది నీకును నీబిడ్డకునుగూడ సరిపో
వును! తినుమమ్మా!'' అనియెను.

అనసూయ యెంతయో యాప్యాయనముతో నాయన్నము
ను గలిపి బిడ్డకుఁ దినిపించి తానుదినియెను. రంగఁ డంతయుఁ

జూచుచున సూయభోజన మగువలకు నట్లే నిలువఁబడి యుండి యనంతరము తనలో "ధనమదాంధుల సుఖరంగములలో నెంత యధర్మమున్నదో దరిద్రాభిభూతుల దుఃఖతరంగములలో నంతధర్మ మున్నది." అని యనుకొనుచు నొక్క ఘోర శ్వాసమును విడిచి "తల్లీ! దయయుంచుము! పోయివచ్చెదను" అని చెప్పి యాభక్ష్యభాజనముల గౌతమీగర్భమునఁ బారవైచి యటనుండి మెల్లమెల్లఁగ దిరిగి తిరిగి చూచుచు వెడలిపోయెను.

తొమ్మిదవ ప్రకరణము

జలధరంబులయందు ◆ జలములే గాక
పిడుగు లేమిటికిఁ గ ◆ ల్పింపఁగాఁబడెనో ?
ఫణిఫణంబున విష ◆ పటలమే గాక
మాణిక్య మేటిక ◆ మర్పఁగాఁబడెనో ?
అంబుధిలో బడ ◆ బాగ్ని యేమిటికో ?
కర్దమంబున జెం ◆ గలువ యెందులకో ?
తత్త్వమార్గంబును ◆ దాఁపోయలేక
ద్వంద్వభావసమాశ్రి ◆ తంబైనయట్టి
ప్రకృతికంతకు లేక ◆ భావంబెకోరి
చింతాలహరిలోనఁ ◆ జిక్కెదవేల !

విచారలహరి.

కఠినశిక్షణముకంటె మృదులప్రబోధనమే యవివేకమునకు మంచిమందు. ఎన్నిసారు లెంతెంతటి శిక్షల ననుభవించినను రంగనికిఁ దనతప్పు దెలిసికొనుట కవకాశము లభియించినది కాదు.

ఆతనికిప్పు డనసూయాపరిశాంతమధురవచనపరిబోధముచే నాకస్మికముగ నాత్మాపరాధ మద్దములోఁ ప్రతిబింబమువలెఁ దేటతెల్లమై పోయినది. పశ్చాత్తాపదుఃఖముచే నాతఁడు తల్లడిల్లిపోవుచు నా వెన్నెలలో గోదావరీతీరముంబట్టి యున్మత్తునివలె నడచిపోవుచుండెను. ఎక్కడకుఁ బోవుచుండెనో యాతనికిఁ దెలియుట లేదు. ఎక్కడకుఁ బోవలయునో యాతఁ డూహించుకొనుట లేదు. ఎక్కడకుఁ బోయినను హృదయతాప మాతని ననుసరించియే వచ్చుచుండెను. ఆతఁడటే పోవుచుఁబోవుచు నాయాసముచే నొకచింత చెట్టుక్రిందఁ గూలఁబడియె

ఆయర్ధరాత్రమునం దచ్చటి జనసంచార మేమియును లేదు. పుచ్చపువ్వువలె వెన్నెల యతట నలముకొని యుండెను. ఆచల్లని వెన్నెలయుఁ గూడ నాతని సంతాపము వర్ధిల్లుచునే యుండెను. ఆతఁడు నిర్వేదవిహ్వలహృదయుఁడై దరిద్రుఁడ నైన నా హృదయమున కీ దయ మొలకలుగవలయును? కఠినవర్తనుఁడ నైన నా కింతటికఃకర మేల యుండవలయును? ఆయెండకు నీవెన్నెలకును సంఘటన మెట్లు కలిగినది? ఈ పాపసంఘటనముచేతనే నేను ధర్మమార్గమునం బోయి యధఃపతితుఁడనై పోయితిని. ఏమి? నేను దయచేత నిర్దయుఁడనై పోయితినా? కనికరముచేతఁ గఠినవర్తనుఁడనై పోయితినా? కాదు కాదు! చంచలహృదయుఁడ నగు నేను—సనాతనధర్మానభిజ్ఞుఁడ నగు నేను—ఆకస్మికోద్దీపితంబగు భావమున ననుసరించి పోయితిని. నా కామావేశముచే నాలోచనము లేకుండఁబోయినది— అందుచేతనే నేను—పుణ్యమునకుఁ దెఱచిన కన్నులతోఁ బాపమును గనఁబట్టఁజాలకపోయితిని. జాలికిఁ గొట్టుకొనుచున్న హృదయముతో బాధను గ్రహింపఁజాలకపోయితిని. ఈవిధముగఁ బాపపుణ్యప్రవాహముల నడుమఁ గొట్టుకొనుచు నాజీవితము నిరర్థకమైపోయినది! ఎత్తే

గియు నెఱుఁగనియవస్థలోఁ బుణ్యము లనియెంచి యెన్నియో పాపకా
ర్యములను గావించితిని. ధర్మలోభముచే నధర్మమార్గము నవలంబిం
చితిని! ఆయమ్మ చెప్పినమాట సత్యమే! అమృతమును విషకుంభ
ముతో నెత్తుకొనుటవలన నేమిలాభము? ఔను. ఆయవివేకముచే
నావిధాయకధర్మము నధర్మకళంకితమైపోయినది. ఆదివ్యరమణీ
మూర్తి యుద్బోధించినట్లుగా నధర్మకళంకము నేయాభిజాత్యసంప
న్నుఁడు సహింపఁగలఁడు? నేనజ్ఞానుఁడ నగుటచే నధర్మమునఁ
బడిపోయితిని. ఏమిచేయుదును? నేను నిరుపేదలకష్టములను జూచి
సహింపఁజాలను. అధర్మహృదయు లగునర్థలుబ్ధులమూలముననే
వారికట్టికష్టములు కలుగుచున్నవి. ఆకష్టములను నివారించుట కుపా
యాంతర మేమున్నది? లేదు. ఈయసమర్థున కింక నుపాయము లేదు.
సర్వభూతదయాపరుఁడగు సర్వేశ్వరుఁడే యీసాధుసంతాపమును
నివారింపవలయును. ఆదయామయుని యనుగ్రహముకంటె నింక
నుపాయము లేదు. హాపరమేశ్వరా! దీనబంధూ! దీనచింతామణీ!
దీనజనసముద్ధరణమునకు నీకంటె దిక్కెదియును లేదు. జగన్నాథా!
జనార్దనా! జగజ్జనకుఁడవగు నీవు నీసాధుసంతానముపైఁ గటాక్షింపుము!
రక్షింపుము! రక్షింపుము! రక్షింపుము!" అని ప్రార్థించుచుఁ బరి
తాపదుఃఖావేశపరవశుఁడై పడిపోయెను.

ఒక్కింతసేపటిలో నెవ్వరో వచ్చి యాతని వెన్ను చరచిన
ట్లయ్యెను. రంగఁ డులికిపడి కన్నులు విచ్చి చూచునప్పటి కాతని
యెదుటఁ బ్రబోధానందస్వామి సాక్షాత్కరించి యుండెను. రంగఁడు
భయభక్తివినయసంభ్రమములతో స్వామిపాదములపైఁబడి "మహా
త్మా! ఈపాపాత్ము నుద్ధరింపుము!" అని ప్రార్థించెను.

స్వామి యాతని లేవఁదీసి "వత్సా! నీ వెట్టిపాపము చేసి
తివి?" అనియెను.

రంగ—స్వామీ ! పరులకష్టములను జూడఁజాలక పాపము చేసితిని.

ప్రభో—అట్టివాఁడవు పాప మెట్లు చేయఁగలిగితివి ?

రంగ—అందుచేతనే పాపము నెఱుంగకపోయితిని.

ప్రభో—ఏమిచేసితివి ?

రంగ—దరిద్రులకడుపుమంట చల్లార్చుటకై ధనాఢ్యులను బాధించితిని.

ప్రభో—ఎంత వెఱ్ఱివాఁడవు ? ఎడమకాలు జబ్బుచే నన్న మైపోవుచున్నదని జాలిచేఁ గుడికాలిరక్తముం దీసి దానిఁ బూరింప వచ్చునా ? ఇందువలన రెంటికిని మోస మగుట లేదా ?

రంగ—స్వామీ ! అదియెట్లు నరిపడును ?

ప్రభో—నీవు ధనవంతునిగొట్టి దరిద్రునకుఁ బెట్టితి నంటివి. అందుచే దరిద్రుఁడు ధనవంతుఁడై దుష్టుఁడు కావచ్చును. ధనవంతుఁడు దరిద్రుఁడై కష్టము లపాలు గావచ్చును గాదా ?

రంగ—మహాత్మా ! నేను పేదలకష్టములను జూచి సహింపఁ జాలను. ఏమి చేయుదును ?

ప్రభో—నీకు జాలియున్నచోఁ గష్టములను దీర్పుము ! కానియందుకొఱకుఁ గష్టములను గల్పింపకుము !

రంగ—కానునకు గతిలేనివాఁడను పేదలకష్టముల నెట్లు వారింపఁగలుగుదును ?

ప్రభో—నీకుఁ జేతనైనంత చేయుము ! చేయలేనిదానికై చింతింపకుము !

రంగ—స్వామీ! చేయలేనివాఁడను జింతింపకుండుటయెట్లు?

ప్రభో—లోకమునఁ గష్ట మనుమాటయే లేకుండఁ జేయుట యెవ్వరితరము ?

రంగ — మహాత్మా! దీనుల ఘోరకష్టములనూరకచూచుచు నీలోకమున జీవింపఁజాలను. మనోధైర్యమునకైనను, మరణమునకైనను మార్గముంబ్రసాదించి యీదుఃఖసముద్రమునుండి నన్నుద్ధరింపరా?

ప్రబో — బిడ్డా! పరమార్థమును జెప్పుచుంటిని విను. నీవు దుఃఖించుచున్న నీసోదరులతోఁ గలసి దుఃఖింపుము; సుఖియించుచున్న నీతోడివారితోఁ గలసిసుఖియింపుము. అప్పుడు నీకును వారికినిగూడసుఖము కలుగును. అప్పుడు నీకుసుఖదుఃఖములు సమానము లగును అప్పు డీలోకమున నీకు దుఃఖానుభవ మనుమాటయే లేకుండఁబోవును.

రంగ — తండ్రీ! నీయమృతమయప్రబోధవాక్యములు నాయల్పహృదయమునకుఁ బట్టుటలేదు. పశ్చాత్తాపదుఃఖితుఁడ నగు నన్ను నీపాదసేవకుఁగ ననుగ్రహించి పాపపంకమునం బడిపోవకుండ నుద్ధరింపుము.

ప్రబో — వత్సా! ఏతల్లిమూలమున నీకును జీవలోకమునకు ననుబంధము కలిగినదో, యేజనని నీకును నీతోడిజీవులకును బ్రియజననియో, యేదేవిమూలమున నీసర్వలోకములు నుద్ధరింపఁబడుచున్నవో యాజగన్మాత నుసందర్శించెదవుగాని రమ్ము! అప్పుడా దేవియనుగ్రహమున నీసకలసంశయములును దూరీభూతములై పోవును.

రంగఁడు భక్త్యావేశముచే స్వామిపాదములపై సాష్టాంగపడి "స్వామీ! నేను దాసానుదాసుఁడను. నన్ననుగ్రహింపుము." అని ప్రార్థించెను.

ప్రబోధానందుఁడు "వత్సా! నాతోఁగూడ రమ్ము!" అని యాతనిదనతోఁగూడఁ దీసికొనిపోయెను.

పదియవ ప్రకరణము.

దీనజనములకును గామ ॥ ధేనువైన
ఆర్తబృందంబునకును గ ॥ ల్పగమైన
పూర్వసంచితసత్ప్రప ॥ పూర్ణమైన
పూర్వసౌభాగ్యగౌరవ ॥ పూర్ణమైన
యిట్టినీగృహమందుని ॥ కేమికొదవ?
ఆలకించుమటంచు వా ॥ హాంధ్రపుత్రి

జాతీయగీతము—

కోటిలింగక్షేత్రమునందలి దేవాలయమునకు సమీపమునం దొక పెద్దమఠముండెను. ఆపవిత్రమఠమిప్పుడు రేయుంబవలువిశేష జనానందకోలాహలితమై విలసిల్లుచుండెను. ఆపుష్కరపుణ్యసమయమునకు వచ్చినవారిలో—ఆకోటిలింగస్వామిని సేవింపవచ్చిన వారిలో—ఆమఠమునకుం బోయిచూచి యానందతన్మయులైపోని వారొక్కరును లేరు. మాతృమందిరమునందలిమాతృదేవతమూర్తి యిప్పు డాత్మీయాఖిలభారతపుత్రసందర్శనార్థమై యాదివ్యమఠమున వేంచేసి యున్నది సమాదరశీతలంబు లగుపత్రసన్నకటాక్షములచే నాత్మపుత్రుల ననుగ్రహింపవలయు నని యచ్చట వెలసి యుండెను. అందలిసువర్ణపీఠకమలనివాసిని యగుజగన్మాతృకామూర్తిని నానందముతో సేవింపవలయు నని తండోపతండములై నిరంతరము ననేకప్రజలు వచ్చుచుం బోవుచుండిరి. ఆదివ్యమాతృకామూర్తి యెవ్వరుదర్శించిన వారికే తమతల్లివలెం బ్రత్యక్షమగుచుండెను. పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, సాధువులు, మహానులు, వీరు వారనునేల యందఱును భయభక్తివినయవిశ్వాసము

లతో జగన్మాతను సందర్శించి కృతార్థు లగుచుండిరి. చూచిన వారు చూడనివారికిఁ జూపించుచుండిరి. తెలియనివారు తెలిసినవారికిఁ దెలుపుచుండిరి. ఎక్కడఁజూచినను మాతృసదర్శనార్థులే— ఎక్కడ విన్నను మాతృప్రార్థనములే. ఆజగజ్జననియమృతమయ కటాక్షములచే నప్పుడు రాజమహేంద్రవరనగరమునం దంతటను సర్వసోదరత్వము నెలకొనియెను.

ఆమాతృపీఠమున కర్చకురాలైయున్నయానందాదేవి తల్లిని దర్శింపవచ్చియున్నమాతృభక్తులకువారినందఱ నమృతమధురవచనములతో నాదరించుచుండెను. భక్తులందఱు నామెను బ్రత్యక్ష దేవతామూర్తిగ భావించి సేవించుచు నారమణీమూర్తివదనకమలమునుండి వెలువడు నమృతవచనములను వేదవాక్యములవలె శిరసా వహించుచుండిరి. ఆనందాదేవి మాతృధ్యానపరాయణులగుబిడ్డలకందఱకును దేటతెల్లముగ నహింస, పరోపకారము, సర్వసౌభ్రాతృత్వముమొదలగువిషయములంగూర్చి మనసు కరఁగునట్లుగ, మనసు నిలుచునట్లుగ, మనసు కలియునట్లుగ నుపన్యసించి యందఱ నానందసముద్రమున నోలలాడించుచుండెను. అప్పు డాదేవీమూర్తిం జూచి భక్తు లందఱును జగన్మాతయే యిట్లుప్రత్యక్షమూర్తియై యాత్మపుత్రుల నిట్లు ప్రబోధించుచున్నదను విశ్వాసముతో నాకర్ణించుచుండిరి. ఆదివ్యప్రబోధములచే నాస్తికు లాస్తికు లగుచుండిరి. క్రూరులు శాంతులగుచుండిరి. అజ్ఞానులు విజ్ఞానులగుచుండిరి. దురాచారులు సదాచారసంపన్ను లగుచుండిరి— సదమలగౌతమీపావనసలిలావగాహనము, సమీపస్థితకోటిలింగక్షేత్రసన్నివాససౌభాగ్యము, సర్వజగన్మాతృకాస్వర్ణస్వరూపసాక్షాత్కారము, సనాతనధర్మమార్గప్రబోధనము—ఇన్నియు నొక్కచో లభియించినప్పు

డే భారతీయుని హృదయమానందతన్మయము గాక యుండును ? ఏ భారతీయున కాత్మజ్ఞానము కలుగకుండును ?

ఆమాతృపీఠమున కతిశయమైన ద్రవ్యమున్నది. అనేకులగు పరిచారకులును బరిచారికలునున్నారు. మాతృసేవాపరాయణులగు వారందఱునచ్చటి మహాసత్రశాలయందు నిరతాన్నప్రదానమును గావించుచుండిరి. అసంఖ్యవస్త్రదానములను గావించుచుండిరి. అప్పుడామాతృస్థానము పేదలకుఁ బెన్నిధానమువలె నుండెను. ప్రేమైకస్వరూపిణి యగుతల్లి కరుణించుచున్నప్పుడు బిడ్డలకుఁ గొదవయేముండును ?

ఆనందాదేవి యర్చకురాలుమాత్రమే కాదు. ఆమాతృపీఠమున కధీశ్వరి. మాతృమందిరమునకే మహారాజ్ఞీమణి. ఆదివ్యమూర్తిం దర్శించినవారందఱు నామెను మాతృదేవతాప్రతిమూర్తిగనే భావించుచుండిరి. ఆనందాదేవి దేవీపీఠమున సాయంకాలపూజలను గావించుచుండెను. మఠమంతయును దీపమాలికాలంకృతమైయుండెను. భక్త్యావేశమునేననేకులామఠమునం బ్రవేశించి యుపవిష్టులై మహానందముతో మాతృపూజను నిశ్చలనయనులై తిలకించుచుండిరి. అందఱు నానందముదితులై నిశ్శబ్దముగఁ గూర్చుండియుండిరి. ఆనందాదేవి పూజానంతరమున దేవీపార్శ్వమునందు నిలువఁబడి భక్తులవంకఁ దిలకించి మృదుమధురస్వరముతో నీవిధముగ నుపన్యసించెను. " బిడ్డలారా ! క్రమముగా మీరు మీతల్లియొడిలో నిదురించుటకే యలవాటుపడిపోయితిరి. అనిద్రలో దుస్స్వప్నములం గాంచి కలవరించుచుంటిరి. అభయప్రదాయిని యగు నమ్మమీకుఁ బ్రసాదించినరత్నాయంత్రముల నజ్ఞానముచేఁ బారవైచుకొంటిరి. అందుచే మీకు జాగ్రత్స్వప్నములయందుఁగూడ దుస్స్వప్నములే యగపడుచున్నవి. ఆదుస్స్వప్నములచే మీరమ్మమాటయే మఱచిపోయితిరి. కాంతాకనకములకై యొండొరులుకలహ

ములం బెట్టుకొనుచుంటిరి. జాతిరీతులకై యన్యోన్యవైరములం గల్పించుకొనుచుంటిరి. జగన్మాత సకలార్థములను, మీకు సంపాదించి యొసంగుచున్నను హాయిగ ననుభవింపఁజాలకున్నారు. కుటుంబకలహములచే మీయర్థము పరాధీనమైపోయినది. అందుచే మీరు హింసాచౌర్యములకు లోఁబడిపోయితిరి. మీయార్యధర్మమంతరించిపోయినది. దుర్వ్యసనములపాలైపోయితిరి. ఆకారణముచే మీసర్వశక్తులును నశించిపోయినవి. మిమ్ము మీరే మఱచి యజ్ఞానముచే నన్యత్వము నాపాదించుకొని యాత్మద్రోహులై దుఃఖించుచున్నారు. బిడ్డలగు మీకష్టములం జూడఁజాలక లోకమునకంతకును దల్లియగు మీకన్నతల్లి విలపించుచు గుడ్డునకుఁ గుంచెడు నీళ్లను గ్రుమ్మరించుచున్నది. కుమారులారా! కుమారీమణులారా! మీరించుక కన్నువిచ్చి మీ తల్లిని దర్శింపుఁడు; మీరెవ్వరో యించుక పరిశీలించి తెలిసికొనుఁడు. మీయమ్మ కన్నీటితో — గద్గదస్వరముతో నిట్లు చెప్పుచున్నది. బిడ్డలారా! మీరందఱును నాకన్నబిడ్డలు. మీరందఱును దోడఁబుట్టువులైనప్పుడిం దెవ్వరిని హింసించినను మీకేదుఃఖము కాదా? ఎవ్వరికపకారము చేసినను మీకే నష్టము కాదా? అజ్ఞానముచే సంతఃకలహములం గల్పించుకొని సర్వసంపత్సమృద్ధం బగు మీ శాంతిమందిరమును సర్వశూన్యంబగు దుఃఖావాసముగ నేల చేసికొనఁదలంచెదరు? నామాట వినుఁడు! అహింసయే మీయనాదిపరమధర్మము—పరోపకారమే మీపరంపరాగతపరమార్థము — సర్వసమత్వమే మీ సనాతనధర్మసూత్రము. కన్నులఁ దెఱచి తత్త్వమును గ్రహించి మీకీమాటలను మనసునందుంచికొని సోదరులగు మీరందఱు నన్యోన్యసహాయులై మీ పెద్దలమార్గము ననుసరించి మెలంగఁగలిగినచో మీకు సర్వసుఖములును గరతలామలకము లగును! సర్వ

శక్తులును స్వాధీనము లగును. సర్వాభీష్టములును సఫలములు లగును. తల్లియే దైవమని తలంచునార్యులవంశమున జన్మించిన మీరు మాతృవాక్యపరిపాలకులై సుఖింపుడు. బిడ్డలారా ! మీసుఖమే నాసుఖము. మీయానందమే నాయానందము. మీధర్మమును, మీధనమును, మీగౌరవమును, మీసుఖమును, మీసర్వమును గాపాడుకొనుశక్తి మీలోననేయున్నది. ఒక్కసారి కన్నులార మీతల్లి నగునన్నుదిలకింపుడు. బిడ్డలారా ! మీకు శుభ మగుగాక !—
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ''

అప్పుడా ప్రజాసంఘమునుండి జయ ! ఆంధ్రమాతకు జయ! జయ! భారతమాతకు జయ! జయ జగన్మాతకు జయ! '' అను నానందజయజయధ్వనులు చెలరేగెను. మాతృభక్తిపరాయణులగు వారలకందఱకును నానందాదేవిమూలమున మాతృదేవతాప్రసాదము లభియించెను.

అప్పుడందొక వృద్ధబ్రాహ్మణుడు భక్తిపూర్వకముగ నానందాదేవిని సమీపించి " తల్లీ ; ఈదేవతార్చనపేటిక యీమాతృదేవతాపీఠమునం దుండదగినది. ఇందు సర్వార్థచింతామణీమూర్తి యున్నది. దీనినీపీఠమున భక్తిపూర్వకముగ సమర్పించుకొనుట కనుజ్ఞదయచేయవలయునని ప్రార్థించుచున్నాను. '' అని యాపేటికను దేవీపీఠసాన్నిధ్యమునందుంచెను.

ఆనందాదేవి మందహాసవదనముతో " బిడ్డలెట్లు పూజించినను మాతృదేవత కానందమే——ఈజగన్మాత మీపూజల నంగీకరించినది. '' అనియెను.

ఆవృద్ధబ్రాహ్మణునకు సశరీరస్వర్గము లభియించినట్లయ్యెను. ఆతండానందముతో " అన్యథాశరణంనాస్తి త్వమేవశరణం మమ '' అని స్మరించుకొనుచు దేవీప్రసాదమునందుకొని వెడలిపోయెను.

పదునొకండవ ప్రకరణము.

ధనమొ, బాంధవమో, మత ♦ ప్రపంచంబో
కారణంబుగఁ గలిగిన ♦ కలయికలకు
సమయముం బట్టి మార్పులు ♦ జరుగు నెందుఁ
గాని మిత్రత్వ మట్టిది ♦ కాదు కాదు !"

ఆత్మసఖుఁడు — హారావళి.

విలాసభవనమునకు గోపాలకృష్ణారా వను నాతఁ డధికారియై యుండెను. ఆతఁ డొక్కప్పు డొక పెద్దయుద్యోగస్థుని యొద్ద వంట బ్రాహ్మణుఁడై యుండెను. ఆయుద్యోగస్థుఁడే యాతని యందలి ప్రేమచే గోపాలరావునకు వివాహముఁ జేయించెను. ఆతని నింకను నభివృద్ధికిఁ దేవలయు నని నిశ్చయించుకొనియుండెను. ఇట్లుండఁగ నానీచుఁడు ధనాశ చే విలువగల యాయుద్యోగస్థుని వ్రేలియుంగరమును దొంగిలించెను. ఆస్వామిద్రోహమునకై యాతని కాఱుమాసములు శిక్ష యయ్యెను. శిక్షానంతరమున నతఁ డింటికి వచ్చునప్పటి కాతని భార్య కాపురమునకు సిద్ధమయ్యెను. కుటుంబపోషణమున కాతనికి సామర్థ్య మెక్కడిది? అట్టిదుస్స్వభావముగల యాతని నిఁక నెవ్వరు తమయింట వంటబ్రాహ్మణునిగా నుంచుకొందురు? అందుచే నాతనికి గత్యంతరము లేకపోయెను. తుద కాతఁడు తానును భార్యయును రాజమహేంద్రవరము చేరి పూటకూళ్లు పెట్టుకొనుచుఁ గాలక్షేపము చేయుచుండెను.

క్రమముగా నతఁడు ద్యూతకారులకుఁ బెట్టుబడులు పెట్టియుఁ, దాగుబోతులకు ధనసాహాయ్యము చేసియు, వ్యభిచారులకు వసతివాడలఁ గల్పించియు నిట్లే నీచవృత్తుల నవలంబించి ధనము

నార్జించుచుండెను. ధనాభివృద్ధియైనకొలఁదియు నాతని కాసంబంధములగు వ్యాపారములన్నియు వర్ధిల్లుచునే యుండెను. తుట్టతుదకాతని పూటకూటియిల్లు విలాసభవనముగ మాఱినది. అతనికిఁ బ్రత్యేకముగ నంతకంటెను విలువగలనివాసభవనముకూడ నున్నది. ఆ యింటియందే యానాతి యనసూయపసిబిడ్డకుఁ బట్టెడన్నము దొరకినది కాదు.

గోపాలరావు విలాసభవనవ్యాపారమువలనఁ గ్రమముగ లక్షాధికారి యయ్యెను. ఆతనికి సంతానము లేదు. అనుభవించుట కాతఁడు నాతని భార్యయే—అయినను నాతనికి ధర్మబుద్ధి లేదు. ఇల్లాలుకూడ నాతనిసహధర్మిణియే—ఆశ్రయమే దొరకక యల్లాడిన యాతఁడిప్పు డనేకుల కాశ్రయుఁడయ్యెను. మరియాద చెడిపోకుండ మద్యపానము చేయఁగోరు మహనీయులును, మడి చెడిపోకుండ మాంసాహారముచేయఁగోరు మహానుభావులును, పేరు చెడిపోకుండ వ్యభిచారముచేయఁగోరుపెద్దపెద్దలును నాతని కాప్తమిత్రులై యర్థసంబంధులై యాశ్రితులై మెలంగుచుండిరి. అందుచే నాతని సత్యస్వరూపము తెలిసినయధికారులుకూడ నాతనిగౌరవించుచుండిరి. జూదరులు, జారులు, చోరులు మొదలగుదుర్వ్యసనపరాయణులగు వారందఱునుగూడ నాతనియాశ్రయము నభిలషించి తిరుగుచుండిరి.

కోటిలింగక్షేత్రమున మాతృదేవతాపీఠము వెలసినదిమొదలు, మాతృప్రతిమూర్తియగు నానందాదేవిమధురప్రబోధచంద్రికలు వ్యాపించుచున్నకొలఁదిని గ్రమక్రమముగ విలాసభవనము నిస్తేజ మైపోవుచుండెను. ఆ వెన్నెలవెలుఁగులోఁ గన్నులఁ దెఱచిన యాంధ్రపుత్రులకు స్వస్వరూపజ్ఞానోదయ మగుచుండెను. ఆస్పష్టచంద్రికాపత్రికలలో మాతృప్రబోధితు లగు ననేకులకు మరలఁ దమతమరక్షాయంత్రములు లభియించుచుండెను. వారిదుస్వప్నము

లు వడలిపోవుచుండెను. అందుచేఁ గ్రమక్రమముగ దుర్వ్యసనము లు దూరీభూతములై పోవుచుండెను. ఇంతయును జేరి తుదకేమైనది! విలాసభవనమునకు రాఁబడి లేకుండఁబోవునది! గోపాలరావునకు వృత్తిచ్ఛేదమైపోవునట్లగపడిమెను.

గోపాలరావున కీనడుమఁ గొలఁదికాలమునుండి దామోదరుని తో సఖ్యముకలిగినది; ఆతని మూలమున విశేషధనలాభముకూడఁ గలిగినది. ఆతనినిగూఢచరిత్ర మంతయును గోపాలరావునకుఁ దెలియును. రాత్రిపదిగంటలయినతరువాత గోపాలరావు దామోద రుని గోదావరియొడ్డునకుఁ దీసికొనిపోయెను. ఇరువురు నొక విజన స్థలమునఁ గూర్చుండి రహస్యముగ సంభాషించుకొనుచుండిరి.

గోపా—దామోదరా! ఈదిక్కుమాలిన దేవీపీఠము మనకుఁ బ్రక్కలోనిబల్లెము వలె దాపురించినది! అజ్ఞాను లందఱు నాయా నందమాయలలోఁ బడిపోవుచున్నారు.

దామో—ఔను! మనోమోహనమూర్తి యగునాత్రిపుర సుందరి మధురకంఠస్వరవృత్తి మాటాడుచున్నప్పుడ జ్ఞానులనేమి?— ఎంతటివిజ్ఞానులైన నామెకు దాసానుదాసులైపోవుట కాశ్చర్య మే మున్నది?

గోపా—అదియే మనకొలపముంచుచున్నది. పుష్కరము తో వదలిపోవు ననుకొంటినిగాని యేఁడాదినఱకును వదలునట్లు లేదు— ఇంతలో మనపని మట్టమే యైపోవును.

దామో—ఇందుకుఁ బ్రతీకార మేమైన నాలోచించితివా?

గోపా—ఆలోచన కేమున్నది? ఆపీఠమీనగరమునఁ దిక్క నగపడకుండఁ జేయవలయును.

దామో—అదియెట్లు?

గోపా—నీచేతిక్రింద బలవంతు లెందఱోయున్నారు. నేనెఱిఁగినవారుకూడఁ జాలమందియున్నారు. వారినివీరిని గూడఁగట్టుకొని నీవుప్రయత్నించినచో దేవీపీఠము పేరులేకుండఁ జేయుట యెంతసేపు? త్రిలోకసుందరీమూర్తి యగు నానందను నీ వెట్లైనఁ దక్కించుకొనఁగలిగినచో విలాసభవనము నీకువిలాసభవనమగును! నీవు మధుమతికై దేవులాడుచుంటివిగాని యది యానందకాలిగోటికైనను సరిపోలునా? నీ వెఱుఁగవుగాని మధుమతి మూఁగది!

దామో—అలాగా? పైమెఱుఁగుచూచి భ్రమపడిపోయినాను! నీకెంతశక్తియున్నదిరా? మూఁగదానిచే మూడులోకముల నేలించితివే!

గోపా—తెలియకుండ సంచరించుచుంటివి గాని నీవు మాత్రము సామాన్యుఁడవా? నీవు తలఁచుకొన్నచో నిమిషములో నానందను వశపఱచుకొనఁగలవు.

దామోదరుఁ డించుకసే పాలోచించి "ఔను. నాకును మనుపటివలె నుండవలెనని లేదు. పెండ్లిచేసికొనియొకయింటివాఁడను గావలయు ననియున్నది. ఆనందలభియించినచో నానందసామ్రాజ్యము లభియించినట్లే. కాని, దేవీపీఠమునకు బలవంతులగువేలకొలఁది పరిచారకు లున్నట్లగపడుచున్నదే. సాహసించి పోయినచోఁ జచ్చుటయేగాని మఱి లాభమేమున్నది?" అనియెను.

గోపా—మనలాభముకొఱకు మనప్రాణములనైన నర్పించుటకు సాహసించి పనిచేసికొనవలయునుగాదా? నీకునిత్యమును త్రాగుటకని జూదమునకని దానికని దీనికని ధనము కావలయును. నాకును గావలయును. ధనములేకున్నచో దినమెట్లు గడచును? కావున ధనము కొఱకు మనమెట్టిపనినైనను జేసికొనవలయును.

దామోదరున కంతలో గోపాలుని దుస్సంకల్ప మంతయును బోధపడియెను. ఆతఁడు తీవ్రస్వరముతో "గోపాలా! నాకేమో ధనము కావలసియున్నట్లును, నీవేమో నిరంతరమును నాకు దానము చేయుచున్నట్లును మాటలాడుచుంటివే! నాడబ్బు నాకిచ్చుటకు నీకింత విచార మెందుకు?" అనియెను.

గోపాలుఁడు మెల్లగా "మిత్రమా! నాకైనను నీకైనను ధనము విలాసభవనమునుండియే రావలయును గాదా?" అనియెను.

దామోదరుఁడు కోపముతో "అదియేమి? నాకీయవలసిన దేమైనది? వేంకటేశ్వరునిలకుఁ బాయిలయాస్తిని నీకఱువదివేలకుఁ గ్రియము వ్రాయించితివి గాదా? ఆతనికి నీవిచ్చినవి ముప్పదివేలేనా? మిగిలినముప్పదివేలలోను సగము పదునేను వేలు నీవు నాకీయనక్కఱలేదా? హీనక్రియమువలన నీకధనముగ దొరకినలాభములో నాకుఁ బంచిపెట్టకపోయినను నాపదునైదువేలైన నాకీయనక్కఱలేదా?

గోపా——ఆమాట యెందుకు? అప్పుడప్పుడు నీకుఁ గావలసిన సొమ్మిచ్చుటయే గాని యింతయు నొక్కమాఱుగ నిచ్చెదనంటినా?

దామోదరుఁడు క్రోధవిస్ఫారితనయనుఁడై "ఓరి దుర్మార్గుఁడా! నన్నుఁగూడ మోసముచేయఁ దలఁచితివా?" అని గద్దించెను.

గోపాలుఁడుకన్ను లెఱ్ఱజేసి "ఏమి యట్లుగసిమెగసిపడుచున్నావు? కొట్టెదవాయేమి?" అనియెను.

దామో——కొట్టెదనా? గోదావరిలోఁ బాతిపెట్టెదనా?

అని యొక్క చెంపకాయఁగొట్టెను. గోపాలుఁడుమాత్రము బలహీనుఁడా? పౌరుషహీనుఁడా? ఆతఁడు తోఁక ద్రొక్కినపాము వలెఁ గ్రోధావేశపరవశుఁడై దామోదరునిపొట్టపై నొకతన్నుదన్నెను. సమానబలపౌరుషములుగల యాయిరువురు నొండొరుల నతిక్ర

మించి యాగోదావరీతీరమునం దంధకారములోఁ జాలసేపటివఱకును గొట్టుకొని యాయాసముచే నిరవ్వునును స్మృతితప్పి పడిపోయిరి. అప్పుడాకస్మికముగ నెవ్వరో కొంతమంది వచ్చి యొడలెఱుంగక పడిపోయిన యాయిరువురను భుజములపై నెత్తుకొని తీసికొనిపోయిరి.

పండ్రెండవ ప్రకరణము.

సంగడీల వంశకావిరు ♦ లాలయు వేళ
వారి సంస్మృతి యాజ్యల్యై ♦ హైనవేళ
దడదడం గూర్చు కంపము ♦ దొరయువేళ
ననలసాన్నిధ్యమున గోరు ♦ నట్టివేళఁ
దని విశేషించి యసుఖంబుఁ ♦ దార్చువేళ
మదిఁ గలంగించువాడుహో ♦ మంతవేళ
ముడుచుకొని కన్నులను మూసి ♦ గడపినాఁడ
గాని యావేళ నాయందు ♦ గనిగూర్చి
తుణకు స్నేహపన నూహింపఁ ♦ జాలనైతి!
నుగము గుర్రుంగుమాండె నే ♦ మున్నదింక!

సంశయము — హారావళి.

ఆగర్భశ్రీమంతుఁడగు వేంకటేశ్వరున కిప్పు డన్నవస్త్రములకు గతి లేకుండఁబోయినది. స్వయంకృతాపరాధముచే నాతని సర్వస్వమును నశించిపోయినది. ధనకామిని యగునాగమణి నిర్ధనుఁడగు నాతని దనయింటికి రాకుండఁ దరిమివైచినది. రాజరత్నముచేఁ గూడ రావలదని చెప్పించుకొనుట కాతని కిష్టము లేకపోయినది.

అందుచేనాతఁడు కడసారి యామెను జూడకుండఁగనే పెద్దాపురము ను వదలిపోవలయునని నిశ్చయించుకొనియెను. కొన్నిదినములనుండి దామోదరుఁ డాతని కగపడుటయే లేదు. అగపడినమాత్రమున నేమిలాభము ? తనకీ ప్రయత్నములును దామోదరునిమూలమున నే తటస్థించిన వని యాతఁడు తెలిసికొనియెను. కట్టుబట్టకంటె నాతనియొద్ద నొకకాసైనను లేదు. అతఁడట్లే బయలుదేరెను. అఱకాలి కెన్నఁడు నవనీపరాగమైన సోఁకి యెఱుంగని యాసుకు మారమూర్తి కఱకుకంకరమార్గమునఁ గాలినడకను బోవుచుం డెను. కుసుమకోమలమగు ననసూయహృదయమును నొప్పించినపాప మునకుఁ బ్రతిఫల మనుభవింపవలదా ? క్రూరహృదయుఁడై యబల యగు ననసూయ కెట్టికష్టముం గల్పించెనో నిర్భాగ్యుఁడై యాతఁ డిప్పుడట్టికష్టమునకుఁ బాత్రుఁడైపోయెను.

అతని కీలోకమునం దిఁక నేమున్నది ? ఇల్లులేదు; వాఁకిలి లేదు; మడిలేదు; మాన్యములేదు; ఏపతివ్రతాశిరోమణి యాతని కటాక్షవీక్షణముల కెదురుచూచుచున్నదో, యేప్రేమైకమూర్తి యాతనినే తనప్రాణముగ నెంచి ప్రేమించుచున్నదో, యేసాధ్వీ రత్నమాతనినే దైవముగఁ దనహృదయకమలమున నిలిపి పూజిం చుచున్నదో యట్టిభూలోకదేవీమూర్తి యగు ననసూయకంటె నాత నికాత్మీయమగుపదార్థ మీలోకమునం దేదియును లేదు. నిర్భా గ్యుఁ డగు వేంకటేశ్వరున కంతయు ననుభవమునకు వచ్చినది. వార కాంతపొందు వలదని చెప్పినవారందఱు నాతని కష్టులైపోయిరి. ఆత్మేశ్వరియగు ననసూయను మరలఁ బరిగ్రహింపుమని బోధించిన మిత్రులందఱు నాతనికి శత్రులైపోయిరి. ఆమోహాంధకారములో నాతని కనుకూలమార్గ మేదియో ప్రతికూలమార్గ మేదియో య

గపడినది కాదు. మధురఫల మేదియో విషఫలమేదియో తెలిసినది కాదు. ఆతని కన్నులు మూసికొని పోయినవి; బుద్ధి చెదరిపోయినది; దొరకినత్రోవయే మంచిదని యెంచి తోఁచినరీతిని సంచరించెను. ఆ కారణముచేతనే యాతఁ డమృతసరోవరమును వదలి తుట్టతుదకు దుఃఖాంధకూపమునఁ బతితుఁ డైపోయెను.

ఇప్పటి కాతఁడు కన్నులను దెఱచి చూచుకొనియెను. ఒక్కసారిగ నాతనికిఁ బూర్వస్మృతి కలిగినది. ఆదినమున—బలవంతముగఁ దనచేఁ బరిత్యజింపఁబడిన యాదినమున—అవమానదుఃఖమును సహింపఁజాలక యాగతికయై కొయ్యబొమ్మవలె నిలువఁబడిపోయినయనసూయదీనవదన మాతని కన్నులఁ గట్టినట్లుండెను. అప్పుడాపవిత్రప్రేమామృతమయదివ్యమూర్తి వదనకమలమునుండి వెలువడిన యమృతమధురంబులును, బ్రియనిశితంబులును, శోకకంపితంబులు నగుప్రబోధవాక్యము లిప్పుడాతని శ్రవణకుహరములఁ బ్రతిధ్వనించుచున్నట్లుండెను. ఆతనిహృదయముపగిలిపోవుచుండెను. పశ్చాత్తాపదుఃఖముచే నాతని సర్వాంగకములును బ్రకంపితములై పోవుచుండెను; ప్రతప్తములైపోవుచుండెను.

ప్రాణేశ్వరి యగు ననసూయ నెట్లులైన మరల దర్శింపఁగోరుట యాతనికి లజ్జాకరముగఁ దోఁచుటలేదు. అర్ధాంగి యగుననసూయ పాదములపైఁ బడి యపరాధములను క్షమియింపఁగోరుట యాతని కవమానకరముగఁ దోఁచుట లేదు. ఆమె ప్రేమమయి యనియు శాంతిమయి యనియు నాతఁ డెఱుఁగనివాఁడా? ప్రేమమయదంపతుల ప్రేమమయహృదయముల నేసుఖలేశము పరస్పరసన్నిబద్ధములుగఁ జేయఁజాలినదో యట్టిసుకుమారపుత్రిగాత్రపరిష్వంగసౌఖ్యము నాతఁడు నిర్లక్ష్యముగ నవివేకియై త్యజించివైచెను.

ఆదుఃఖమాతని హృదయాంతరాళమునందప్పుడప్పుడు పొంగిపొరలు చుచేయుండెను. ఇప్పు డదుఃఖములు నొక్కసారిగ నాక్రమించు కొని యాతనిజీవితమును కాతనామయముగ జేసివైచెను. ఆదా రుణదుఃఖతాపముచే నాతని గుండె పగిలిపోవలసినదే. ఆతనిప్రా ణము లెగిరిపోవలసినదే. కాని యాతనికింకను నాశ వదలిపోలేదు.

ఆయాశచేతనే యాతఁడు ప్రాణముతో నిలువఁబడియుం డెను. ఆయాశచేతనే యాతఁడతికష్టముతో జేగురుపాడునకు బయ లుదేరెను. పుత్రోత్సంగవతియైయున్న మాతృేశ్వరి యగునసూ యను దర్శింపవలయునని యాశ! ఆయాశచే నాతనికి మార్గాయా స మగపడుట లేదు. అడుగుక్రిందఁబెట్టని వేంకటేశ్వరుఁ డిప్పు డామ డంగోలఁదిదూరము నడచుచున్నాఁడు. స్వయంకృతాపచారముచే నాతని కిప్పు డిట్టియవస్థాంతరము కలిగినది. దూరాలోచనము చేయక మనసుపోయినరీతిని పోవునందునవివేకుల కెప్పటికైన నిట్టి పశ్చాత్తాపదుఃఖమునకుఁ బాల్పడుట తప్పదు.

అట్లాతఁడు పోవుచుండఁగా మార్గమధ్యమునం దొకవృద్ధ బ్రాహ్మణుఁ డాతనింజూచి విచారాశ్చర్యసూచకస్వరముతో, ‘ వేం కటేశ్వరరావుగారా ? ’ అని పలుకరించెను. అట్టియవస్థలో నా తని కాబ్రాహ్మణసందర్శనము దుస్సహముగ నుండెను. అందుచే వేంకటేశ్వరుఁడు తలవంచుకొని నిలువఁబడిపోయెను. అప్పు డాబ్రా హ్మణుఁడు ‘ నాయనా! ఇట్లుంటిరేమి ? కాలినడకను బయలు దేరితిరేమి ? ’ అనియెను. వేంకటేశ్వరుఁడు దుఃఖముతోఁ దన జీవిత చరిత్రమంతయు నాతనికిఁ దెలియఁజేసెను. బ్రాహ్మణుఁడు విచా రముతో, ‘ నాయనా ! ఆనాఁడేనూటపదాఱు రూపాయలదక్షిణతో మీరు నాకుదానముచేసిన దేవతార్చనపేటికతో నేనన్నిపుణ్యక్షేత్రములను

దర్శించితిని. అందరిసర్వార్థచింతామణీమూర్తి నావంటివానిచే వేలకొలఁదిపుణ్యకార్యములను జేయించి ది. ఆమూర్తియనుగ్రహముచేఁ గాను చేత లే వాఁడను గనకవర్షము గురియింపఁగలిగితిని. తుదకు రాజమహేంద్రవరమున నిరతాన్నవస్త్రదానముం గావించుచు దీనజనోద్ధారణముం గావించుచున్న దేవీపీఠమున కాదివ్యమూర్తిని సమర్పించివైచితిని. ఆమూర్తి యెంతరములనుండి యిం టనున్నదో! పాప మది లేకపోవుటచేతనే మీయింటి కిట్టిగతివచ్చినదేమో కదా! నాయనా! నీవా దేవీపీఠమును సందర్శింపుము. అందుచే నీదుఃఖములు తొలఁగిపోఁగలవు. పరమేశ్వరుఁడు నిన్ను గ్రహించుఁగాక ' అని చెప్పి యాతనియొద్ద సెలవుగైకొని వెడలిపోయెను.

వేంకటేశ్వరుఁ డెట్లో జేగురుపాడునఁ బ్రవేశించునప్పటికి రాత్రియెనిమిదిగంట లయ్యెను. ఆతఁ డెన్నఁడు నాయూరు వచ్చినవాఁడుకాఁడు. ఎవ్వరి నెఱింగినవాఁడు కాఁడు. ఆతఁడు గ్రామదేవతగుడియొద్దకుఁ బోవునప్పటికి సుబ్రహ్మణ్యశాస్త్రి యనునొకసద్బ్రాహ్మణుఁ డాతని కగపడియెను. వేంకటేశ్వరుఁడు మార్గాయాసముచే నిట్టూర్పులు విడుచుచు నాతనిం జూచి ' అయ్యా! జోగమ్మనెఱుఁగుదురా ?' అని యడిగెను.

సుబ్ర—ఎఱుఁగకేమి? ఈయూరిలో నామెఁ నెఱుఁగనివా రెవ్వరున్నారు ?

వేంక—ఆమెయిల్లెక్కడ ?

సుబ్ర—ఈప్రక్కసందులోనే యున్నది. ఎందుకు? ఆమె యిచ్చట లేదు. పుష్కరస్నానమునకై రాజమహేంద్రవరము పోయినది. చాలదినములైనది. ఇంకను రాలేదు.

వేంకటేశ్వరుఁ డపరితిభుఁడై ' అయ్యా! ఆయింటిలో—'

అర్ధోక్తియందే సుబ్రహ్మణ్యశాస్త్రి ; ఆయిల్లాలుకూడఁ బసి బిడ్డనెత్తుకొని యామెతోడనే పోయినది—భూలోకమాతయగు నామహాపతివ్రత నిర్భాగ్యుఁడగుభర్తచేఁ బరిత్యజింపఁబడుటచే శ్రీమంతురాలగునామెకు జోగమ్మతోఁగూడఁ బోవలసివచ్చినది.' అనియెను.

వేంకటేశ్వరుఁడు హఠాత్తుగ్రైన నిలువునఁ గూలఁబడిపోయి యాఁడుదానివలె నేడువనారంభించెను. దుఃఖము—ఆయాసము—ఆఁకలి యొక్కసారిగ నాతని ముంచివేయుటచే నాతఁడు స్మృతితప్పి పడిపోయెను. సుబ్రహ్మణ్యశాస్త్రి యాతని సేదదేర్చి మెల్లగఁ దన యింటికిఁ గొనిపోయెను.

పదుమూఁడవ పరిచ్ఛేదము.

పడిపడిగఁబోవుకాలప్రవాహమందు
బొడమునుడిగెడుతెగులవెన్నొపడిమలె
పాంచభౌతికవస్తుపఱ్ఱపంచమెల్ల
యెన్నిమార్పులనందలే నెంతెదనుక?

కావ్యగీతము—హారావళి.

కల్యాణానందస్వామి పరిబోధోపన్యాసములచే దేశమునఁ జాలవఱకు సాధుజంతువులబలిప్రదానములు ప్రచారమున లేకుండఁ బోయినవి. కటికవాండ్రనిరంతరజీవహింసాకర్మములు నిర్మూలములై పోయినవి. అందందు విజ్ఞానపరిబోధకసమాజములు వెలసినవి.

నిమ్నజాత్యుద్ధరణవిద్యాశాలలు నెలకొల్పఁబడినవి. గోసంరక్షణశాలలు స్థాపింపఁబడినవి. ప్రజలలో నజ్ఞానము వదలి యైకమత్యము వర్ధిల్లుచుండెను. వృత్తులనుబట్టి యేర్పడినజాతిభేదముల ననుసరించిన యన్యోన్యవైషమ్యము లంతరించిపోవుచుండెను. సర్వసమత్వ మంతటను వ్యాపించుచుండెను. అహింసయుఁ బరోపకారము నావశ్యకధర్మములుగఁ బరిగణింపఁబడుచుండెను. దుర్వ్యసనములు క్రమముగఁ దొలఁగిపోవుచుండెను. అందఱును గన్నులఁ దెఱచి మాతృదేవతను దర్శింపఁగలుగుచుండిరి. ఆంధ్రదేశమంతయు మాతృమందిరమే యని భావింపఁగలుగుచుండిరి. అందుచే సర్వసౌభ్రాతృత్వ మందఱకు ననుభవమునకు వచ్చుచుండెను. ఆత్మాభివృద్ధికి—ఆత్మసోదరాభివృద్ధికి—ఆత్మదేశాభివృద్ధికి - అదియే ముఖ్యసాధనమని యందఱకును బోధపడుచుండెను. కల్యాణానందస్వామి నందఱును, గలిపురుషునిదండ్ర కలియుగమునఁ గృతయుగధర్మముల నెలకొల్పినపరీక్షిన్మహేంద్రునివలె భావించుచుండిరి. ప్రజలహృదయరాజ్యములయందుఁ గల్యాణానందస్వామియే యానందచక్రవర్తియైయుండెను.

మాతృమందిరమున మాతృసేవాదీక్షితుఁడై వచ్చినదేశిదాసునిమూలమునఁ గల్యాణానందస్వామి ధర్మగిరిప్రాంతారణ్యమునంగల చోరకుటుంబముల నన్నిటిని గృషికకుటుంబములుగాఁ జేసి వైచెను. వారందఱును జౌర్యమునే కాక మద్యపానమునుగూడ మాని వైచి జగద్ధాత్రియగుభూదేవి నాశ్రయించి జీవింప నారంభించిరి. స్వామియనుగ్రహముచే నాకృషికకుటుంబములకును గోసంరక్షణశాలలకును నిత్యసంబంధ మేర్పడియెను. అందుచే ధర్మగిరిప్రాంతమునందలిమహారణ్యమంతయును సస్యక్షేత్రమైపోయెను. మద్యపానహింసాచౌర్యదీక్షితులగువారందఱు నిప్పుడు మాతృసేవాదీక్షితులైపోయిరి. వారినవ్యప్రవర్తనముం గాంచి యానందించి స్వామి నేఁటి

దినమున వారల కందఱకును మాతృదీక్షాకంకణములఁ • సాదించుచుండెను. మాతృదేవతాప్రసాదము నొసంగుచుండెను.

జనులుగుంపులుగుంపులై వచ్చి స్వామియనుగ్రహముచే గిరిపాలికాదేవ్యాలయమున దీక్షాకంకణమును ధరియించుచుండిరి. ఆ యాలయమునందిప్పుడు చిదానందాదేవి సాక్షాత్కరించుటలేదు. ఆజగన్మాత బిడ్డలగు తమ్మందఱను కటాక్షించి యుద్ధరించి మరల మాతృమందిరమునఁ బ్రవేశించిన దని యందఱును భావించుకొనుచుండిరి. స్వామి యానాఁడు వారలకందఱకును యథేచ్ఛముగ మృష్టాన్నవస్త్రదానములను గావించుచుండెను. నాఁడు ధర్మగిరియందంతటను నన్నసంతర్పణములే. ధర్మగిరియంతయు నన్నగిరి యైపోయెను. అందఱును మాతృదేవతాప్రసాదముచేఁ బరితృప్తులై పరిశుద్ధాంతఃకరణములతో వచ్చి స్వామిని బరివేషించి కొలిచి యుండిరి. స్వామి సమున్నతశిలాఫలకముపైఁ గూర్చుండి యందఱకును మాతృమహిమముఁ గూర్చి బోధించుచుండెను. అందఱును సత్యోత్సాహముతో నాలకించుచుండిరి.

అప్పుడా సాయంసమయశీతలవాయుతరంగములనుండి ఏకృతస్వరముతో నీక్రిందిగీతము వినవచ్చుచుండెను—

అమృతములోపలనే విషమున్నది
యదియొక చిత్రము కాదా?
హిమకరుచెంగటనే నిప్పున్నది
యిదియొక చిత్రము కాదా — అ॥
పూవులతోఁటలనే ముండ్లున్నవి
బోధపడినదా లేదా?
తావులలోపలనే పొగరున్నది

తలకెక్కినదా లేదా ? —అ॥
స్నేహములోనే ద్రోహం బున్నది
జీవులకేమిఁక దారి ?
దేహములోనే తేలున్నప్పుడు
దిక్కేమున్నదిరోరి ? —అ॥

అందఱు నాశ్చర్యములో నాలకించుచుండిరి. అంతలోఁ దరుణసుందరమూర్తి యగునొక యుగ్రశక్తి వ్యక్తి యా పర్వతమునధిష్ఠించి వారివంకకే వచ్చునట్లగపడిమె. ఆతఁడు వేగముగ నా పర్వతము నెక్కివచ్చి రాజ సమూహముఁ గాంచి యున్మాదోద్రేకముచే వికృతనటనములం గావించుచు —

తెలిసిందయ్యా ! తెలిసిందీ మది
కలిసిందయ్యా ! కలిసిందీ ॥
జలజలఁ దేనెలఁ జలుకుచునున్ను
బలికినవన్నియుఁ బలుకులుగావని ॥తెలి॥
తోఁచినదయ్యా ! తోఁచిందీ తల
యూఁచినదయ్యా ! యూఁచినదీ
చూచుటకందముతోఁచినయంతనె
పూచినవన్నియుఁ బువ్వులుగావని॥తోఁచి॥
నచ్చినదయ్యా ! నచ్చినదీ ! బుద్ధి
వచ్చినదయ్యా వచ్చినదీ
అచ్చికబుచ్చికలాడినమాత్రనె
బచ్చెనలందఱు భ్రాతలుగారని॥నచ్చి॥

అనిపాడుచు నభినయింప నారంభించెను. పాపమాతఁడు మన భారతరావే ? భారతరావు పిఠాపురము వచ్చి చూచునప్పటికిఁ

జంచలరావును సత్యవతియు నాతని కగపడకుండఁబోయిరి. చంచల రావు బలవంతముగ సత్యవతి నెత్తికొనిపోయెనని యాతఁడనుకొని యెను. సత్యవతినెట్లయిన నంగీకరింపఁజేసి చంచలరావునకుఁ బెండ్లి చేయవలయునని యాతనియుద్దేశము. పాణిసమూనయగునామెమనసు నొప్పించుటయాతని కిష్టము లేదు. చంచలరావునకు నామెకు నెట్టు లైన నన్యోన్యానురాగము కల్పింపవలయునని యే యామె నాతనితోఁ బిఠాపురమునకుఁ బంపియుండెను. ఆమె యంగీకరించినచో నానంద కరముగ వారిరువురకును వివాహమే యయ్యెడును. అగపడకుండఁ బోవుటకుఁ గారణ మేమి? కారణాంతర మేమైన నున్నచో నొక్క రైన నగపడకుండ నుందురా? తప్పకుండఁ జంచలరావే సత్యవతిని బలవంతముగ నెత్తుకొనిపోయెనని యాతఁడు నిశ్చయించుకొనియెను. భారతరావునకుఁ బ్రాణమునకుఁ బ్రాణమైనసోదరి పాణిమిత్రుఁ డనుకొనుచున్న చంచలరావుచే బలవంతముగ నపహరింపఁబడిపోయి నది. ఆవిచారముచేతనే—ఆపరితాపముచేతనే—ఆనిరంతరధ్యాన సమాలోచనములచేతనే పాప మాతనిమతిచెదరిపోయినది! తానొ కటితలంచిన దైవ మొకటి తలంచిన ట్లయ్యెను. దేశకాలపాత్ర ములఁ బాటింపక కేవలము పట్టుదలయే ప్రధానముగఁ గార్యదీక్షి తులగువారి కందఱకును దుదకిట్టిప్రతిఫలమే లభియించుచుండును. భారతరావున కట్టిప్రతికూలఫలమే లభియించినది.

కల్యాణానందస్వామి యాతని దనయొద్దకుఁ దీసికొని రమ్మని దేవీదాసున కాజ్ఞాపించెను. దేవీదాసుఁ డాతనికెదురుగఁబోయి చేయి పట్టుకొనియెను. భారతరావు వెఱ్ఱిచూపులు చూచుచు "నీవు దొం గవా?" అనియెను.

దేవీ—భయములేదు. నాతోరమ్ము!

భార—నీవు పిచ్చివానివలె నున్నావు. నేనునీతోరాను.

ఆ యాతఁడు పెనగులాడ నారంభించెను. దేవీదాసు మును పటిభీముఁడే యైయున్నయెడలఁ గావడిపెట్టినటె నాతని నెత్తి గమ్య స్థానమునకుఁ జేర్చియుండును. కాని యిప్పుడాశక్తి లేదు. అందుచే దేవీదాసు భారతరావును మంచిమాటలతోఁ దీసికొనిపోయి స్వామిసన్నిధిని నిలువఁబెట్టెను.

స్వామి యాతనిం జూచి కరుణాపూరితస్వరముతో "అది యేమి యట్లున్నావు?" అనియెను.

భారతరావు చేతులు త్రిప్పుచు "ఎట్లున్నాను? నీ వెట్లుంటివో నేనట్లుంటిని—నాకు మతి లేదు—నీకు గతిలేదు. నేనాత్మద్రోహిని—నీవు ధర్మద్రోహివి! బంధుద్రోహివి!" అని గంతులు వేచుచుఁ జప్పటులు చఱచుచు—

పోయినదయ్యా! పోయినది చెడి
పోయినదయ్యా! పోయినది
మాయయు మోసమహిలో రాజ్యము
చేయుచునున్నవి జీవులసౌఖ్యము ॥పోయి॥
మారినదయ్యా! మారినది గతి
మారినదయ్యా! మారినది,
దూరంబాయెఁగనిదుర్బుద్ధులధి
కారముపాలయి కాలముశీలము ॥మారి॥

అనిపాడుచు వికటహాసము చేయుచు వికృతనాట్య నాడ నారంభించెను. కల్యాణానందస్వామి నిర్విణ్ణుఁడై యేమియు మాటాడఁ జాలకపోయెను. భారతరావు మఱియును వికృతతాండవములం గావించుచు గుణతరోన్మాదావేగముచేఁ గుప్పికూలి తిప్పకుండ—

సన్యాసంబే నెఱతనమా? బల
విన్యాసంబే దొరతనమా?

అన్యాయముగా నన్నలఁ దమ్ముల
నాలిని బంధుల నడఁచినవారికి ॥సన్న్యా॥
నెఱతనమా ? చేర్పాటతనమా ? ట
క్కరితనమా ? సిగ్గరితనమా ? తుం
టరితనమా ? దూబఱితనమా ? క
ల్లరితనమా ? యల్లరితనమా మఱి
సన్న్యాసంబే నెఱతనమా ? బల
విన్యాసంబే దొరతనమా ? —

అని కరతాళములతోఁ గోలాహలధ్వనులు చేయుచు నొక్కటేపరుగున నటనుండి వెడలిపోయెను. అందఱు నాశ్చర్యవిభ్రాంతులైపోయిరి. శ్రీకల్యాణానందస్వామియును ఱిచ్చవడిపోయెను.

పదునాలుగవప్రకరణము.

దేవదేవ! మహాత్మ! త్వ ◆ దీయదివ్య
భావబోధకశిష్యప్ర ◆ బంధమంతు
నెచట శ్రీరాముఁ బట్టితి ? ◆ నెచటఁ జిత్త
గింపవలె నని వ్రాసి ము ◆ గించినావు ?
మొదలుఁ దుది లేనినీగ్రంథ ◆ మును సతంబు
నెంతచదివిన నంతయూ ◆ హించుకొన్న
నెవ్వరీకావ్యమును రచి ◆ యింపు మీరరో ?
యెవరి కీకృతి నొసఁగితో ◆ యెఱుఁగరాదు.

ప్రకృతిప్రబంధకర్త — హారావళి.

కల్యాణానందస్వామి వికలహృదయుఁడైపోయెను. ఏదియో మహాపరాధముం గావించినట్లాతఁడు భావించుకొనఁ దొడంగెను.

విధాయకకర్మమునకును విధాయకధర్మమునకునుగల విభేదతారతమ్యములంగూర్చి యాతఁడు తనలోనే పూర్వపక్షసిద్ధాంతములను జేసికొనుచుండెను. ఆతనికి ధైర్యము చెదరిపోయినది; తత్త్వము తెలియకుండఁ బోయినది. ఆతఁడు పాపపుణ్యములను భావనామయతులాయంత్రమునందుంచి తూపవలయు నని ప్రయత్నించుచుండెను. భావము చెదరిపోవుచుండుటచే నాతని ప్రయత్నము దుస్సాధ్యమై పోవుచుండెను. ఆతనిహృదయాంతరాళము గ్రీష్మప్రతప్తమైపోయెను. వాత్యాప్రకంపితమైపోయెను. ఆపరితాపముచే నాతని సర్వాంగకములును జ్వలించిపోవుచుండెను—ఆసుడిగాలిచే నాతని ప్రాణవల్లికలు తల్లడిల్లి పోవుచుండెను.

ప్రబోధానందప్రియశిష్యుఁ డగుకల్యాణానందస్వామి యంతటివాఁడు భ్రమోన్మాదగ్రస్తుఁ డగుభారతరావుపిచ్చిమాటలచే నింత భీరుఁడైపోవుట యెందుకు? మదగజము మశకము నిరసించినట్లు మనశ్చలనముగలభారతరావు మనోనిగ్రహముగలమహనీయుఁ డగు స్వామిని దిరస్కరించినాఁడు! భారతరావు కేవలమును బిచ్చివాఁడు, అట్టియవస్థలోఁ బ్రపంచమునే లక్ష్యముచేయని యాతఁడు పరమహంసయగుస్వామిని బహుమానింపలేదనుటలో వింత యేమున్నది? స్వామి యేమో కాని యంతవఱకు నాలోచించుకొనలేదు.

మనోనిగ్రహము లేనివాఁడని ప్రబోధానందుఁ డాతని దివఱకే తూలనాడియున్నాఁడు; అందుచేతనే యాతని కిప్పటివఱకును మాతృమందిరసందర్శనభాగ్యము లభియింపఁ జేయుట లేదు. కల్యాణానందస్వామి యిప్పుడుగూడ నట్లే యగడపడుచున్నాఁడేమి? దారుణకర్ములకుఁగూడ నతిసులభముగ లభియించుచున్నమాతృసందర్శనము తపోధనుఁడగునాతని కేల దుర్లభమైపోయినది? ప్రబోధానందునకుఁ బాపాత్ములపై నున్నంతజాలి ప్రియశిష్యుఁ డగునీత

నిప్పై నీల లేకుండఁబోయినది? కల్యాణానందస్వామియిట్టితర్కవితర్కములను జేసికొనుచు నొంటిగ నాగిరిగర్భాలయమున సత్యదేవునకెదురుగ దీర్ఘశ్వాసములను విడుచుచుఁ గూర్చుండి యుండెను.

ఆ యాలోచనాపరంపరలలో నాతని హృదయ మవశమైపోయినది—ఆతని కన్నులు మూఁతలుపడిపోయినవి. అప్పుడు సంపూర్ణ యౌవనకళాసమంచిత యగుజగన్మోహన దేవీమూర్తి యమృతశుభ్రవసనావకుంఠనవతియై యంతరంగమునం దల్లనల్లన విహరించుచున్నట్లాతనికి గోచరించెను. ప్రబోధానందస్వామి యామూర్తినే దేవీమూర్తిగ భావించుచుండు మని యాతని కుపదేశించి యున్నాఁడు. ఆతఁ డాప్రబోధమున ననుసరించి తదేకదృష్టితో ధ్యానముచేయుచునే యుండెను గాని యప్పుడప్పు డాకస్మికముగ నాతనిలక్ష్యము చెదరిపోవుచుండెను. కళ్యాణానందస్వామికిఁ గార్యనిర్వహణమునం దెంతటి సంపూర్ణసామర్థ్యమున్నదో మనోనిగ్రహమునం దంతటి సంపూర్ణశక్తి లేదు. ఆతఁ డింద్రియవిజితుఁడు కాఁడు గాని సంపూర్ణముగ నతీంద్రియుఁడు కాఁజాలక పోయెను. సంపూర్ణచంద్రునియందుఁ గళంకమువలె నాతనికున్నలోప మదియొక్కటియే. కరుణించి యాయొక్కలోపమును మన్నింపవలయునని యాతఁ డనేకపర్యాయములు ప్రబోధానందునిఁగూర్చి క్షమాప్రార్థనములం గావించుకొనియే యున్నాఁడు. తనప్రియశిష్యుని నిష్కళంకునిఁగఁ జేయవలయు నని ప్రబోధానందుని పరమోద్దేశము.

కల్యాణానందునకుఁగూడ నట్టికోరికయే యున్నది. కాని, యాతనికి ధ్యానభంగ మగుచుండెను. ప్రేమైకనయనములతోఁ దన్ను వీక్షించుచున్నట్లున్న యాదేవీమూర్తి నాతఁడు నిశ్చలనయనములతోఁ జూడఁజాలకుండెను. అవనతవదనయై తన్నుఁ బ్రార్థించునట్లున్న యామెను బ్రార్థింపవలయు ననిన నాతనికి వాక్స్తంభనమై

పోవుచుండెను. ఆదివ్యమూర్తి మందహాసవదనారవిందసందర్శనమున నాతఁడు సర్వేంద్రియములు సమ్మోహరసావగాహనసుఖము ననుభవించుచునే యున్నవిగాని యాకస్మికముగ నాసుఖామృతసముద్రమున మునింగిపోవుచున్నవి. మఱియు నాసుఖామృతసముద్రము నిస్తరంగ గంభీరమై యుండుటలేదు; భావతరంగకల్లోలితమై యుండెను. ఆకల్లోలతరంగములం బడి యాతనిసర్వేంద్రియములును జెదరి కొట్టుకొనిపోవుచుండెను. అతికష్టముతో నాతఁ డాత్మసంశయమనము చేసికొనుచునే యుండెను. కాని యాతని శక్తి నిలుచుటలేదు.

కల్యాణానందునకు నిరుత్సాహములేదు గాని యుత్సాహము కలుగుటలేదు. ఆతనికి నిరాశలేదుగాని యాశకవకాశము కలుగుటలేదు. ఆసందిగ్ధావస్థలో నాతఁడు కొట్టుకొనిపోవుచుండెను. ఎందఱనో దీనుల నుద్ధరింపఁజాలిన యామహాత్ముఁ డిప్పు డాత్మసముద్ధరణముకొఱకు కార్యుఁడై ప్రబోధానందానుగ్రహమున కెదురుచూచుచుండెను. కరుణాళుఁడగు ప్రబోధానందుఁ డాతని కట్టికష్టోపాసనము నేలపరీక్షించెనో? కల్యాణానందున కది యిష్టమగుకష్టమే యగు స్వామియుద్దేశమైయుండవచ్చును. కాని శిష్యుఁడగుకల్యాణానందున కట్లుతోఁచుటలేదు. ఆతఁ డాదేవీమూర్తిని దర్శింపఁజాలకుండెను. ఆతని ప్రాణములు చలించిపోవుచుండుటచేఁ గన్నులు చెదరిపోవుచుండెను. అంతలో నాదేవీమూర్తి యంతర్ధానమైపోయెను. అప్పు డాతఁడు శోకగద్గదస్వరముతో "హా దేవీ! ఎంతపాపాత్ముఁడను!" అనిపలుకుచు దుఃఖవివశుఁడై పడిపోయెను.

కల్యాణానందునకుఁ దెలివి వచ్చునప్పటికిఁ దాను ప్రబోధానందస్వామియొడిలోఁ బడియున్నట్లు తెలియవచ్చెను. తోడనే యాతఁడతిసంభ్రమముతో లేచి "స్వామీ! అపరాధిని! క్షమింపుము! క్షమియింపుము!" అని పలుకుచు స్వామిపాదములపైఁ బడియెను.

స్వామి మాతనిలేవనెత్తి సాంత్వనస్వరముతో ‘‘వత్సా! ఏమియీవి భ్రాంతి?’ అని హెచ్చరించెను.

కల్యా—స్వామీ! నేను విభ్రాంతిలోఁబడిపోవుచున్నాను. నన్నుద్ధరింపుము!

ప్రబో—కుమారా! అనుతాపపడకుము! నీవు స్వధర్మము నిర్వహించి జగన్మాతకుఁ బ్రియపుత్రుండ వైతివి.

కల్యా—స్వామీ! మాతృసందర్శనము లేకుండఁ బోవుటకు నే నేమియపరాధము చేసితిని?

ప్రబో—బిడ్డా నీయపరాధము నీయనుతాపముచే క్షీణించి పోయినది. ఇఁక నది మాతృదేవతానుగ్రహముచే సంపూర్ణముగఁ బరిమార్జిత మైపోవఁగలదు.

కల్యా—ఎప్పటికిఁ దండ్రీ!

ప్రబో—వత్సా! నిరాశ చెందకుము! ఆజగన్మాత గోదావరీ తీరమునఁ గోటిలింగక్షేత్రమునఁ గొలువుచేసి తనబిడ్డవగు నీవు నీసోదరులనందఱ నెట్లుద్ధరించితివో కన్నులారఁగాంచుచుఁ బరమానందమునందుచున్నది. నిన్నుఁ జూచుటకై తనవేయికన్నులను దెఱచుకొని వేగిరపడుచున్నది. కుమారా! అధైర్యపడకుము! రాఁగలవసంతరాత్రులలో వసంతోత్సవవినోదినియగు జగన్మాతృకామూర్తిదివ్య సందర్శనము నీకు లభింపఁగలదు!

అని ప్రబోధించి ప్రబోధానందస్వామి యంతర్హితుఁడై పోయెను.

పదునేనవ ప్రకరణము.

నీవు పౌరుషశాలివో ◆ నీ యదృష్ట
దేవత యభీష్టఫలము లం ◆ దించుచుండ
వేఁగి నేవేగముగ వాని ◆ నందుకొనఁగ
నెపుడు కోరెదవీవు? సీఁ ◆ డేఁగదయ్య!

సీతు.—హారావళి.

వేంకటేశ్వరుఁడు కష్టపడి యెట్టో రాజమహేంద్రవరమునకు వచ్చెను. ఆతఁ డానగరమునం దనసూయకొఱకు దినమునకొకవీథిగఁ దిరిగితిరిగి చూచుచుండెను. ఆతఁడు జేగురుపాడునుండి బయలుదేరు నప్పుడు ధర్మబుద్ధియగు నొకవైష్ణవబ్రాహ్మణుఁ డాతనిం జూచి జాలిపడి పదిరూపాయల నాతనికి దారిబత్తెముగ నొసంగెను. ఆసొమ్మంతయు నిచ్చటవ్యయమైపోయినదిగాని యనసూయవృత్తాంత మేమియు నాతనికిఁ దెలియలేదు. ఇఁక నానగరమున దినముగడపుటకుపాయ మేమున్నది? ఆతఁ డన్నమునకై యెవ్వరి నాశ్రయింపఁగలఁడు? ఆతఁ డానగరమునం దొక్కవిలాసభవనమునుమాత్రమే యెఱుంగును. అందలివిలాసము లిప్పుడు కట్టుపడిపోయినవి. ఆగోపాలరా విప్పు డగపడుటలేదు. అగపడినను వేలకొలఁది ద్రవ్యమును విచ్చలవిడిగ వెచ్చించిన చేతులతోఁ గడుపుఁగూటికై వేంకటేశ్వరుఁ డేమొగముపెట్టుకొని యాతనియొద్దకుఁ బోయి యాచింపఁగలఁడు? అన్నముకొఱ కితరులను దేవిరించుటకంటె నాత్మత్యాగమే యుత్తమముగ నాతనికగపడుచుండెను. లక్షాధికారియై జీవించినలోకమున భిక్షాపాత్రముతో జీవించుటకంటెను దుర్మరణము మఱియొకటియున్నదా?

కాని, వేంకటేశ్వరరావున కనసూయను దర్శింపవలయు నను నాశ బలవంతముగ నడ్డగించుచుండుటచే నాతనిప్రాణములు శరీరము నుండి వదలిపోఁజాలకుండెను. దేవీసత్రమున నిత్యసంతర్పణములు జరుగుచుండె ననుసంగతి నాతఁ డిదివఱకే వృద్ధబ్రాహ్మణునివలన వినియుండెను. ఆమాట మాకస్మికముగ జ్ఞప్తికి వచ్చుటచే నాధార మేర్పడినదని సంతోషించి మెల్లగఁ గోటిలింగక్షేత్రమునకుఁ బోయెను. ఆ దేవీసత్రమున నన్నవస్త్రములు లభియించినవి. అప్పుడచ్చట భుజియించుచు దినమంతయు నల్లాడి యనసూయను వెదకుకొనుచుండెను. ప్రతిదినము మూడువేళలను దేవీపీఠమును సందర్శించి జగన్మాతను బ్రార్థించుచుండెను.

దినములు గడచిపోవుచున్నవి. ప్రాణసమానయగు ననసూయ యగపడుట లేదు. ఆమెజాడయైనఁ దెలుపువా రెవ్వరునగపడకుండిరి. ఆదుఃఖముచే నాతనిప్రాణములు తల్లడిల్లిపోవుచుండెను. ఆ పరితాపముచే నాతనికిఁ బ్రాణములను నిలిపికొనియుండుట మిగుల దుర్భరముగా నుండెను. మహారాజువలె జీవించుట కాతనికన్నవస్త్రములు లభియించుచున్నవి. మహామాత దుర్లభదివ్యసందర్శన మాతనికి నిరంతరమును సులభముగ లభియించుచున్నది. మహాపాపతాపసంహారిణి యగుపావనగౌతమీతరంగిణి సర్వకాలములయందు నాతనికి స్వాగత మొసంగుచున్నది. అయినను లోకమంతయు నాతని కంధకారముగనే యుండెను. ప్రేమామృతదివ్యజ్యోతి యగు ననసూయ యాతనికన్నులకు దూరమైపోయినది!!

సాయంకాలపూజాసమయమున దేవీపీఠపార్శ్వమునందు సరిగ నానందాదేవి యెప్పుడును నిలిచియుండుతావున ననసూయ చిన్నిబిడ్డ నెత్తుకొని మాతృదేవతాప్రతిమూర్తింబోలి నిలిచియున్న ట్లాతని

యాశాంతనయనములకుఁ బొడకట్టెను. ఆనందోద్రేకముచే నాతఁడా మెను సమీపించుటకు లేచఁబోయెను గాని యాకస్మికముగ నపచారభయ మాతని నడ్డగించివైచినది. స్వప్నభ్రాంతియేమో యనియెంచి యాతఁడు కన్నులను దుడిచికొని మఱియొకసారి పరీక్షించెను. అప్పు డప్పుట వేంకటేశ్వరుని కాత్మేశ్వరియగు ననసూయ యగపడలేదు! ఆనందమూర్తి యగు నాపసిబాలుఁ డిప్పు డామెయొడిలో నాడుకొనుటలేదు. ఆ దేవీపరిచారిక యగు నానందాదేవియే యిప్పు డప్పుటనిలిచి భువనమాతను బూజించుచున్నది. ఆతనివిభ్రాంతనయనముల కానందయే యనసూయ యైనది! ఆవిభ్రాంతిచేతనే యాతని కీయఖిలప్రపంచము ననసూయామయంబుగ నగపడుచుండెను.

వేంకటేశ్వరుఁడుకూడఁ దాద కట్లే భావించుకొని తత్త్వమును నిశ్చయించుకొనియెను. ఆతని కారాత్రి యాహారమనవసరమైపోయినది. ఆత కన్నులకు నిద్ర దూరమైపోయినది. ఆ దేవీపీఠసాన్నిధ్యమున నాతనివిభ్రాంతనయనముల కగపడిన యమృతమోహన సుకుమారపులకితవక్షోభాగయగు ననసూయాదేవీమూర్తి యాతని హృదయకమలమును నధిరోహించి యుండెను! ఆతఁ డా దేవీధ్యానము నందే నిమగ్నుఁడైపోయెను. ఆధ్యానోన్మాదముచే నాతఁడు నిలిచిన చోట నిలువఁజాలకుండెను.

తదేకధ్యానముతో వేంకటేశ్వరుఁడా పండువెన్నెలలోఁ బడి గోదావరీతీరమునం దున్మత్తునివలె సంచరించుచుండెను. ఆ వెన్నెలలో నాతని దృష్టి కగపడినప్రతివస్తువు ననసూయవలెనే తోఁచుచుండెను. అనసూయయొడిలోనున్న చిన్నిబిడ్డ యవ్యక్తమధురస్వరముతో ''నాన్న—నాన్న'' యని యస్పష్టముగ నుచ్చరించుచున్నట్లును, నిట్టూర్పులువిడుచుచు ననసూయ శోకగద్గదస్వరముతో ''నాయనా! వచ్చియు గానిసీముద్దుమాటల నానందముతో నీజనకుఁడాలకించి

నిన్నానందింపఁజేయు భాగ్యము నీకుఁగలిగియు లేకపోయినది! తండ్రీ! భర్తృవంచితురాల నగునాగర్భమునం బుట్టుటచే నీవెంతటినిర్భాగ్యుఁడ వైపోయితివి!" అని విలపించుచున్నట్లు నాతనికి గోచరించెను. కరుణరసోద్దీపకంబు లగునావాక్యము లాతని హృదయగోళమున వజ్రఘాతమువలెనుండెను.

ఆతఁడట్లే యున్మత్తుఁడై తిరుగుచుండెను. ఉద్భ్రాంతుఁడై ప్రేమోద్రిక్తంబగు శోకగద్గదస్వరంబున "హా! ప్రణయినీ! ప్రాణేశ్వరీ! అనసూయా! ఈపాపాత్ముని పాపపంకమును నీపవిత్రప్రేమామృతరసలేశముచేఁ బరిమార్జితముగఁ జేసి త్వదేకశరణ్యుఁడగు నీదీనునుద్ధరించుకొనుము. ఎల్లెడలనగపడుచుండియు నాశ్రయమొసంగి యాదరింపకుండ నన్నేల యీమానసపెట్టెదవు? ప్రాణప్రియా! నీవు దయార్ద్రహృదయవు—నేనుక్రూరచిత్తుఁడను. నీవుపావనప్రేమమూర్తివి! నేనుపాపకలుషవిగ్రహుఁడను! అయినను నేను నీవాఁడను! దుర్భావమానదుఃఖవికలసమయమునఁ గూడ నీవు నీయమృతమధురవచనములతో "నీవెప్పటికైన నావాఁడవే!" అని నన్ను వచియించితివి! సాధ్వీమణి వగునీవు నీసత్యవ్రతమును నిలుపుకొనఁగలవు. హృదయేశ్వరీ! నేను నీవాఁడను! నీవు నాదానవు!—అజ్ఞానముచే—ఆగ్రహావేశముచే నేనీపరమార్థమును గ్రహింపఁజాలకపోయితిని! ఆత్మేశ్వరీ! అజ్ఞానకృతం బగునాయపరాధమును క్షమియింపుము! ఇకంబె నాకీలోకమున దిక్కేమియును లేదు. నిరంతరమును నీపవిత్రస్వరూపధ్యానముచే నాపాపచింతనము లన్నియును నిర్మూలము లైపోనవి. పశ్చాత్తాపజ్వాలలచే నాసర్వాంగకములును దహించికొనఁబడుచున్నవి. ప్రాణప్రియవగు నీవు నీప్రేమామృతకటాక్షప్రసారముచే నీయగ్నిజ్వాలలనుండి నన్నుద్ధరింపుము! నీవేనాప్రాణమవు—నీవేనాప్రాణాధారమవు—నీవే నా

గతివి - నీవే నాగతివి — సతీశిరోమణీ! ఈదుఃఖమునుండి నన్నుద్ధరింపుము! ఈపరితాపమునుండి నన్ను రక్షింపుము!" అని యుచ్చైస్స్వరంబున విలపింప నారంభించెను.

ఆసమయమునం దనసూయయుఁ దనవలెనే క్షమాప్రార్థనములం గావించుచుఁ దన్ను వెదకుకొనుచున్నట్లు స్త్రీకంఠస్వరమున వెలువడుచున్నయార్తాలాపము లాకస్మికముగ నాతని చెవులఁబడియెను. ఆతఁడు త దేకధ్యానముతో నాలకించుచుండఁగా ననసూయ యాకస్మికముగఁ బ్రత్యక్షమైనట్లుగ పడియెను. తోడనే యాతఁడు శోకవిస్మయానందపరవశుఁడై యొక్కఁపరుగునఁబోయి "సతీమణీ! నాసర్వాపరాధములను క్షమియింపుము;" అనిపలుకుచు నారమణీమూర్తిపాదములపైఁ బడిపోయెను. తోడనే యారమణీమూర్తియును దుఃఖపరికంపితస్వరముతో "ప్రాణేశ్వరా! నేనుమహాపాపాత్మురాలను. నీవుక్షమియించినచో నాపాపములు పరిమార్జితములుకాఁగలవు. క్షమియింపుము!" అనివిలపించుచు నిలువునఁగూలఁబడిపోయెను.

వేంకటేశ్వరుఁడు కన్నులవిచ్చిచూచెను. ఆతనిసర్వాంగకములొక్కసారిగఁ బరికంపితములై పోయెను. అగ్నిజ్వాలనుండి యవ్వలఁబడినట్లాతఁడచ్చటినుండి చటాలున లేచి దూరమునఁదూలిపడిపోయెను. ఆరమణీమూర్తి యెవ్వరు? ఆతనికంటికిఁ గాలభుజంగినియైన రాజరత్నము!!

ఇదియేమి? వేంకటేశ్వరుఁడు సంజీవనీమంత్రమును జపియించుచుండఁగా మృత్యుదేవతసాక్షాత్కరించిన దేమి? ఆతఁడమృతఫలము నారగించుచుండఁగా విషకీటము వెలువడిన దేమి? ఆతఁడు నిత్యానందమయస్వర్గధామమును గోరుచుండఁగా నిరయాంధకూప

ము లభియించిన దేమి? ఆతఁడు కలువపూవులదండకొఱకు వెదకుకొనుచుండఁగాఁ గాలభుజంగినియగపడిన దేమి?

వేంకటేశ్వరుని హృదయమునం దీభావము లన్నియు నొక్కసారిగ మెఱసిపోయెను. ఆతఁడు భయభ్రాంతుఁడై భయంకరమృత్యుముఖముఁ గాంచిన ప్రాణలుబ్ధునివలె నూర్ధ్వశ్వాసములతో నటనుండి యొక్కటే పరుగున వెడలిపోయెను. రాజరత్నము నిశ్చేష్టురాలై పోయెను. కొంతసేపటి కా నిశ్శబ్దమగు వెన్నెలవెలుఁగున దూరము నుండి గంభీరస్వరముతో "వలదు! సాహసము చేయవలదు! కుమారా! ఆత్మహత్యమహాపాతకము!" అనుశబ్దములు శీతల వాయుతరంగములనుండి రాజరత్నమునకు శ్రవణగోచరము లయ్యెను.

రాజరత్నము భయసంభ్రమములతో గుభాలున లేచి వేంకటేశ్వరుఁడు పరుగెత్తుకొనిపోయినమార్గము ననుసరించి యతివేగముగఁ బోయెను. ఎంతదూరమట్లుపోయి పరీక్షించినను, వేంకటేశ్వరుఁ డింక నామె కగపడలేదు. గౌతమీపావనజలతరంగకలకలస్వనములు తక్క మఱియెట్టిశబ్దము నామెకు వినఁబడను లేదు. ఆమె యట్లే తిరిగి తిరిగి యాయాసముచే నొక్కచోఁ బడిపోయెను.

పదునాఱవ ప్రకరణము.

గురుభక్తి కళారత్న
కరతరణము శిష్యజీవి • కావరణంబుల్
గురుభక్తి గలుగువారల
కరుడే సకలార్థసిద్ధి • యగుట ఘటిల్లున్

గురుభక్తి — హారావళి

ప్రబోధానందుని యవ్యాజవాత్సల్యముచే రంగనియజ్ఞాన లేశము వదలిపోయినది. ఆతఁడు మాతృమందిరమునందలి సరస్వతీ మందిరమున విద్యావంతుఁ డయ్యెను; మాతృదేవతాసాన్నిధ్యమునం దాతఁడు మాతృసేవాదీక్షితుఁడు కూడ నయ్యెను. మాతృదేవత రక్షాకంకణ మాతనికి లభియించినది. శిష్యవత్సలుఁడగు ప్రబోధానందస్వామి యాతనికి రంగదాసుఁడను నామము బ్రసాదించెను. రంగదాసుని హృదయ మిప్పుడు తీక్ష్ణభావమును వదలి శాంతరస పరిపూర్ణమై యుండెను. ఆఫలమునందలి పులుపు విరియఁబారిపోయెను. ఆజలమునందలి యడుసు దిగజారిపోయెను. ఆకాంతియందలి వేఁడి చల్లారిపోయెను. కాఁగిచల్లారినపాలవలె నాతఁడిప్పుడు శాంతమూర్తియై యుండెను.

ధర్మప్రతిష్ఠాపనమునకు ధర్మమే యాధారమైనదని రంగదాసుఁ డిప్పటికి సంపూర్ణముగ గ్రహియింపఁగలిగెను. ఆతఁడిప్పుడు ప్రబోధానందస్వామి యనుమతింగైకొని మాతృదేశమంతటను సంచారము చేయుచు మాతృభక్తి, సర్వసోదరత్వము, భూతదయ యను విషయములంగూర్చి యుపన్యసింప నారంభించెను. మాతృభక్తి

ఖామణి తంబుర చేఁబూని పాడుచు నావేశనృత్యములం గావించుచు వీథులవెంట నుపన్యసించుకొనుచుఁ బోవుచుండెను. ఆతని ధర్మోపన్యాసముల నాలకించినవారు—ఆతనియావేశతాండవములం గాంచినవారు పరక్షణమునందే భక్త్యావేశపరవశులైపోవుచుండిరి. మాతృసేవాపరాయణు లగుచుండిరి.

ఆతనికి దొంగరంగఁడనునపఖ్యాతి దూరమైపోయినది. ఆతనిజూచుటకుఁగూడ భయపడువారందఱు నిప్పు డాతనితత్త్వముం దెలిసికొనుటకుఁ బ్రయత్నించుచుండిరి. ఆతఁ డేకులమువాఁడో యింతవఱ కెవ్వరికిని దెలియదు. కాని యార్యధర్మనిరతుఁ డగు నాతని నాంధ్రులందఱు నాత్మీయునిగనే భావించుచుండిరి. మాతృసేవాపరాయణుఁ డగునాతఁడుకూడ నందఱ నాత్మీయులుగనే తలంచుకొనుచుండెను. ఆతని నెఱింగినవారందఱు నింతలో నింతవాఁ డెట్లయ్యెనని యాశ్చర్యపడుచుండిరి. ఆశ్చర్యము కాదా? పాదములతోఁ దన్నిపాఱవైచినపాషాణము పద్మరాగమణియైనది! చేతులతోఁ దుడిచివైచినయశ్లీలశబ్దము చింతామణీమంత్రమైనది!

ఆతనియుపన్యాసములు సర్వజనసమ్మతములైయుండెను. సర్వధర్మసంకలితములై యుండెను. ఆప్రబోధకుకుక్కుటారావములు త్రయీసమ్మతములై త్రికాలావబోధకములై యాంధ్రసోదరుల నందఱ నానందోత్థితులం గావించుచుండెను. అందఱు నాప్రబోధవాక్యముల నాలకించి యావిధముగ నాచరించి యాత్మధర్మపరిపాలకులై మాతృసేవానిరతు లగుచుండిరి. అందఱును మాతృమంత్రమును జపియించుచుండిరి. అందఱును దమతమయంతరంగముల యందే మాతృదేవతామందిరమును సందర్శించుచుండిరి. ఆ మాతృమంత్రధ్యానముచే నాంధ్రులయంతరంగములయందు సర్వసోదర

సద్భావము జాగరిత మగుచుండెను; పరస్పరభిన్నభావములు పటాపంచలైపోవుచుండెను. అజ్ఞానాంధకారము విరిసిపోవుచుండెను. అందుచే మాతృమందిర మనిన మాతృదేశమే యనియు, మాతృసేవ యనిన మానవసేవయే యనియు మాతృధర్మదీక్ష యనిన నాత్మోద్ధరణదీక్షయే యనియు విస్పష్టముగ నందఱకును దెలిసిపోవుచుండెను.

రంగదాసుఁడు మునుపును సుప్రసిద్ధుఁడే. ఇప్పుడును సుప్రసిద్ధుఁడే యయ్యెను. కాని యిప్పుడీతఁ డానాఁడు కాఁడు. భయంకరమగునీయిహజీవనమునందే యీతనికిఁ బావనజన్మాంతరము కలిగినది.

రంగదాసుఁడు పట్టణములయందును బల్లెలయందును దిరిగి తిరిగి యుపన్యాసము లిచ్చుచుఁ గ్రమముగాఁ బీఠాపురమునఁ బ్రవేశించెను. ఆత యుపన్యాసములకుఁ బేరును లెక్కలేదు. పెద్దలక్కలేదు. ప్రణామము లెక్కలేదు. ప్రత్యుత్థానము లెక్కలేదు. ఆతఁడు మాధవపుష్కరిణికి సమీపమున మసీదునొద్దరథములు నిలుచు బయటియందలి రాజమార్గమున నిలువఁబడి పరమానందముతోఁ దంబురమీటుచుఁ బ్రేమసూచకస్వరమున నీక్రిందివిధముగ గానము చేయ నారంభించెను.

"అందఱకు నొక్కతెయె తల్లి ♦ యన్నలార !
అందఱకు నొక్కఁడే తండ్రి ♦ యన్నలార !
అందఱకు నొక్కటే గతి ♦ యన్నలార !
అన్నలము తమ్ములము మన ♦ మాంధ్రులార !—
దారధనపుత్రవాంఛల ♦ బారిఁబడి
తెలివి యుండుటచేఁ బశు ♦ వులను మించి

విశ్వసోదర భావంబు ♦ విస్మరించి
తల్లడిల్లుచు నుంటిమో ♦ తమ్ములార !—
తాను దనపండుఁ దినఁబోదు ♦ తేనెయురఁటి;
తాను దనపాలఁ గ్రోలదు ♦ ధన్యసురభి;
తాను దన తావిఁగ్రోలదు ♦ తమ్మిపూవు
జగతిలో నరుఁ డొక్కఁడే ♦ స్వార్థపరుఁడు !—
ధారుణీదేవి భరియించు ♦ తల్లి మనకు
ధాత్రిదేవత పోషించు ♦ తల్లి మనకు
అఖిలజీవులఁ దనకడు ♦ పారఁగన్న
తల్లి, భూదేవి యొక్కరి ♦ ధనము గాదు!—
ఒకని ముట్టుట దోష మొం ♦ డొకని చింత
నొలసియుండుట దోష మిం ♦ కొకనితోడ
మాటలాడుటే దోష మి ♦ దేటిమాట ?
మాలవాఁ ! డేకగర్భజు ♦ లైనమనకు ?—
పేదలగుసోదరులనోట ♦ బెడఁగొట్టి
యనుభవంబునకంటెన ♦ త్యధికవృత్తి
ధనము ధాన్య మార్జించి పె ♦ త్తనము సేత
వసుపతిత్వమె ? తస్కర ♦ త్వంబుగాక —
పొట్టకును బట్టకును లేక ♦ పొక్కి పొక్కి
తోడిబిడ్డలు మలమల ♦ మాడుచుండఁ
గోటలును బేటలును గల్గి ♦ కులుకుచుంట
ముష్కరత్వంబు కాక ప్ర ♦ భుత్వ మగునె ?—
కలిమిగలవారు లేనివా ♦ రలకు మగలు
లేనివారలు కలవారి ♦ లెంక లనుచుఁ

దలఁచివర్తించుచున్నంత ♦ దనుక మనకుఁ
బాపనిష్కృతి లేదయ్య ! ♦ భ్రాతలార !—
సకలజీవసంతతులకుఁ ♦ జాలినంత
యన్నమును గూర్చుచున్నది ♦ కన్నతల్లి
కడుపుగాలెడితమ్ముల ♦ కన్ను మూసి
యారగింప నోరాడునే ♦ యన్నలార ! —
కలిమిలేములభేదముల్ ♦ కొలఁదిగొప్ప
భేదములు జాతిభేదవి ♦ వాదములును
దలఁపవలదయ్య ! సర్వసా ♦ దర్యదృష్టి
సఖ్యము గూర్పుఁడయ్య ! మా ♦ యన్నలార !—
ఏకఫలభోగకాంక్షచే ♦ నెట్లు పక్షు
లేకవృక్షాశ్రయంబున ♦ నెసఁగు నట్లె,
యేకఫలకాంక్షచే మన ♦ మేకదేశ
మాతఁ గొలువంగవలెనయ్య ♦ భ్రాతలార ! —

సీ॥ మనమహారాజు లా ♦ త్మశ్రీ స్వభోగార్థ
మే కల్గలేదని ♦ యెంచుదాఁక
మనభూమినాథ లా ♦ త్మకుటుంబభుక్తికే
తమకల్మి కాదని ♦ తలఁచుదాఁక
మనవణిగ్వర్యు లా ♦ త్మప్రవృత్తి ధనాభి
వృద్ధికే యనుబుద్ధి ♦ విడుచుదాఁక
మనలోన మన మెక్క ♦ జననీగర్భము నుండి
యుదుగు దెంచితి మని ♦ యరయుదాఁక
శాత్రవోపద్రవంబు ద ♦ స్కరభయంబు
భీమదుర్భిక్షపీడ వి ♦ భేదబాధ

తోలంగిపోదయ్యా ! యింక శాంతి నిలువదయ్యా
యాత్మసంరక్ష లేదయ్యా ! యాంధ్రులార !"

నిమిషములో వేలకొలంది జను లాప్రదేశమందంతటను నిండి పోయిరి. ఆతని గంభీరస్వరమందఱకును విస్పష్టముగ వినవచ్చుచుండెను. ఆప్రబోధ వాక్యములచేనందఱు నానందమగ్నులగు చుండిరి. వచ్చినవారు కదలుటలేదు. చిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, మూఢులు, జ్ఞానులు, వీరువారననేల ? అందఱకు నతని వాక్యము లమృతమయములుగా నేయుండెను. ఆతనిలో నేమున్నది ? ఆప్రబోధానందుని మహిమలోనున్నది. ఆమాతృదేవతకటాక్షములో నున్నది. మునుపటి యారంగఁడు కాఁడా యీరంగదాసుఁడు ?

పదునేడవ పరిచ్ఛేదము.

పాలుపొంగిన పూర్ణిమారజని
వరశరచ్చంద్రికా వసనంబుఁ దొడిగె;
అవశయై సొక్కిన యాషాఢసరసి
పాణ్డురాతప త్రిచ్ఛాయ నిలిచె;
చెలువేదియున్నదై శిరలతాతన్వి
లలితవసంతవిలాసంబుఁ గాంచె.

ఏకాంతసేవ.

అప్పుడు శ్రీకల్యాణానందస్వామిపాదసాన్నిధ్యమునం గావించినదృఢప్రతిజ్ఞ నిప్పటికిని సక్రమముగఁ బరిపాలించుచు నేయుండెను. ఆతఁడు పాడిపంటలతోడను ధనధాన్యములతోడను దులతూఁగుచుం

డెను. ఆతనిగోరక్షణశాల యాంధ్రదేశమున సుప్రసిద్ధ మయ్యెను. ఆతఁడంత్యకులజుఁడుగా నుండియు మద్యపానాదిదుర్వ్యసనదూషితు లగు నగ్రవర్ణములవారికంటెను నత్యుత్తమగుణసంపన్నుఁడై యుం డెను. ఆతనిపెద్దకొమర్తెయగు ముత్యాలిప్పుడు పదునాలుగేం డ్లవయసు కలదయ్యెను. ఆమెకుఁ బెండ్లియీడు వచ్చినది. కాని, యభినవయౌవనవతి యగునావిద్యావతి కన్నివిధములఁ దగువరుఁ డాతనికులమునం దగపడుట లేదు. అప్పని కదియొక్కటియే విచా రముగనుండెను.

కులవుఁ వాఁ డను నుద్దేశముతో బంగరుబొమ్మవంటి యాబా లిక నొకపశువునకుఁ గట్టిపెట్టుట యాతని కిష్టము లేక యుం డెను. అందుచే ముత్యాలున కింకను బెండ్లి కాలేదు. క్రైస్తవమత ము నవలంబించినశూద్రుఁ డొకఁ డాబాలికరూపయౌవనగుణసంప త్తిం జూచి యానందించి యొకనాఁ డప్పనియొద్దకుఁ బోయి తనకా బాలిక నిచ్చి పెండ్లిచేయవలయునని యప్పనిం గోరెను. అప్పని కా సంబంధము బాగుగనే యున్నట్లగపడియెను. వరుఁడు విద్యావంతుఁడే కాక ధనవంతుఁడు. రూపవంతుఁడు. మతముచే నెట్లయినను గుల ముచేఁ దమకంటె గొప్పవాఁడు. అందుచే నాతనికాసంబంధము చే యఁదగినదని తోఁచెను. ఆతఁడు తనయుద్దేశమును దనభార్యకుఁ దెలిపెను. ఆమె భర్తమాట కెదురాడలేదు. ముత్యాలున కాసం గతి తెలిసి తండ్రియొద్దకుఁ బోయి "తండ్రీ! నాకాతని బెండ్లియా డుట కిష్టము లేదు. పెండ్లియాడఁ దగినచో నేనే నామనసువచ్చి నవరుని గోరుకొందును! అంతవఱకును నీవు నాపెండ్లికై బెంగ పెట్టు కొనవలదు!" అని చెప్పెను.

అప్పుడు తనప్రేమైకపుత్రిక యగుముత్యాలును గన్నుల కద్దుకొని పెంచుకొనుచున్నాఁడు. ఆమె మనసున కెట్టికష్టమును గలుగకుండఁ జూచుకొనుచున్నాఁడు. ఆమె గుణవతి యనియు, వివేకవతి యనియు నాతనికి సంపూర్ణవిశ్వాసమున్నది. అందుచేనప్పుడు తనప్రియపుత్రికమాట కడ్డుచెప్ప జాలకపోయెను. బిడ్డకు నచ్చిన వరున కిచ్చిపెండ్లిచేయుటయే సర్వోత్తమవివాహమని యాతఁడు నిశ్చయించుకొనియెను.

ఏఁడాదినుండి ముత్యాలునకు రంగదాసుఁ డగపడుట లేదు. ఆబాలికపవిత్రప్రేమమయప్రథమదృష్టులు ప్రప్రథమమునం దాతని ప్రేమమయమూర్తియందే ప్రసరించెను. పరిచయవశంబున నాప్రేమాంకురము క్రమక్రమముగఁ బ్రేమవల్లరి యగుచుండెను. ఇరువురహృదయములయందును నజ్ఞాతముగ నంకురించిపల్లవించుచున్న ప్రణయలతాతత్త్వ మిరువురకు నగ్రాహ్యమే యైయుండెను. కాని తెలియకుండఁగనే యాయిరువురును బరస్పరప్రేమబద్ధులై యుండిరి. అన్యోన్యసందర్శనములేని వారిశిశిరకాలమునం దాప్రణయవల్లరి యాకురాల్చినది! వాడిపోవుటకుఁ గాదు! వసంతోదయమునమరలఁ బూర్వాధికరమణీయముగఁ బల్లవించుటకే—పుష్పించుటకే—ప్రణయామృతఫలసిద్ధిం గాంచుటకే!!

తొంటికంటెను బరమపావనమూర్తియై వచ్చి యుపన్యాస మిచ్చుచున్నరంగదాసునిఁ బరమానందవికసితనయనములతో ముత్యాలు చూచినది. ఆతనిపవిత్రోపన్యాససారమును గ్రహించినది. అప్పు డామెహృదయాంతరాళమున మిణుకుమిణుకుమనుచున్న ప్రేమజ్యోతి యొక్కసారిగ నుజ్జ్వలితమైన ట్లయ్యెను. ఆమెదూరమును నందుండి యట్లే చూచుచు నానందపరవశయై నిలువఁబడిపోయెను.

ఉపన్యాసానంతరమున రంగదాసునకుఁ బ్రేమైకమూర్తియగు ముత్యాలు నొకసారి చూచిపోవలయు నని కోరిక కలిగెను. పిఠాపురమువచ్చి ప్రణయసుందరి యగునామెను జూడకుండ నాతఁడెట్లు పోఁగలఁడు ?

అతఁడు మాలపల్లెకుఁ బోవుచుండఁగా నాకస్మికముగ ముత్యా లాతనికంటఁ బడియెను. ఆసందర్శనమాత్రముచేతనే యాతఁడానందపులకితుఁడైపోయెను. సంవత్సరమునకుఁ దరువాత మరల సందర్శనము ! ముత్యా లిప్పు డమృతమోహనమూర్తియై యుండెను. అప్పుడు ముత్యాలు లజ్జామధురమందస్మితవదనయై రంగదాసునకు నమస్కరించి మృదులస్వరంబున " అనుగ్రహమున్నదా ? ఈచరణసేవకురాలుజ్ఞాపకముగ నున్నదా ? " అనియెను.

అపరిశాంతమధురస్వభావ మెవ్వరిహృదయము నాకర్షింపదు ? రంగదాసునకు సర్వేంద్రియములు నమృతావగాహనం బాచరించిన ట్లయ్యెను. ఆతఁడానందకంపితస్వరముతో " లేకేమి ? ఈ ముత్యాలపేరు నిరంతరము నాకన్నులఁ గట్టినట్లే యున్నది.' అనియెను.

ముత్యా—అదియే నాకోరిక. నేనిప్పుడు ధన్యురాల నైతిని.

రంగ—నీవు సుఖముగఁ జదువుకొనుచుంటివా ?

ముత్యా—మీదయచే నాకెట్టికష్టమును లేదు.

రంగ—మీతల్లిదండ్రులు క్షేమముగనున్నారా ?

ముత్యా—సుఖముగ నున్నారు.

రంగ—నీయా వీనినదా ?

ముత్యా—మీయనుగ్రహముచే నది బ్రతికినది. కోడెదూడను బెట్టినది.

రంగ—చూతన ; పద—

ఇరువురును సంతోషముతో మాలపల్లెం బ్రవేశించిరి. అప్పుడానందముతో రంగదాసు నెనరుకొని యింటికిఁ దీసికొనిపోయెను; పరస్పరకుశలసంభాషణములచే వారికొకకొంత సేపానందముగఁ గడచిపోయెను. రంగదాసుఁడు వారిని విడువలేక విడువలేక తుదకెట్లో యందఱను వీడుకొని వెడలిపోయెను.

పదునెనిమిదవ ప్రకరణము.

ఈయుత్ప్రశక్తితో ♦ నీరేణుగణము
ఈమహత్తత్త్వముం ♦ దనసిందాఁక
ఈప్రేమరసముతో ♦ నీయల్పపీచి
యీసుధార్ణవమునం ♦ దనసినదాఁక
ఈస్నేహరసముతో ♦ నీదీపకళిక
యీదివ్యతేజమునఁ ♦ దనసినదాఁక
ప్రాణేశ ! నీదివ్య ♦ పాదపద్మముల
భావించి సేవించి ♦ భక్తిఁ బూజింతు

ఏకాంతసేవ.

ముత్యాలునకు గుండె గుభిల్లుమనిపోయెను. ఆతని దన యింట నుండుమని చెప్పుట కామె కధికార మెచ్చట నున్నది? ఆ నాణిముత్యము సిలిదారమునఁ గూర్పఁబడి యుండెను. ఆబంగరు చిలుక యినుపపంజరమునం జేర్పఁబడి యుండెను. ఆసుందరమందిరము పల్లెగూడెమునఁ గట్టఁబడియుండెను. అందుచేతనే యామె

కంతటిసన్మానభాగ్యము లేకుండఁబోయినది. ఎంతటిరూపగుణసంప న్నురాలైననేమి? ఆమె కడజాతియందు జన్మించినది. అదియే యామెకుఁ గలగొప్పయవరోధము.

ముత్యాలున కేమియును దోఁచుట లేదు. ఆమెమనసు పరిపరివిధములఁబరుగులెత్తుచుండెను. తమకుటుంబమునకు రంగఁడు మఱవఁదగనిమహోపకారమును గావించి యుండెను; హీనజాతి యనియైనఁ దలంపక తన్నుఁ బ్రాణముకంటె నెక్కుడుగఁ బ్రేమించుచుండెను. ఆతనిఋణమును దీర్చికొనుటకుపాయ మేమున్నది? ఆప్రేమమయున కాత్మసమర్పణముం గావించి కృతకృత్యతం గాంచవలయు నని ముత్యాలు వేడుకపడుచుండెను.

నేనాతని బ్రేమించుచుంటిని. నన్నాతఁడు బ్రేమించుచుండెను. ఇట్టిచో మేమిరువురము నేల కలసియుండఁగూడదు? అయ్యో! ఎంతప్రేమించుచున్నను నేనుజండాలకన్యకను గాదా? ఆతఁడు నన్నెట్లుకలుపుకొనుట కంగీకరించును? ఎంతవిలువగలదైనను బాదరక్షలకుఁ బర్యంకసౌభాగ్యము లభియించునా? ఎంతటియవివేకము కులమును దలంపక తలకుఁ దగనికోర్కె కోరుకొనుచున్నాను. బ్రాహ్మణజాతినై పుట్టి పూజాప్రేమను గావలయు ననుకొనుచున్నాను— ఏమి? సిద్ధించుట కవకాశము లేకపోవచ్చునుగాని కోరుకొనుట కభ్యంతర మేమున్నది? హీనకులమున జన్మించినంతమాత్రముచే జీవితము నిరర్థకమైపోవలసినదేనా? పంకమునం జనియించినపద్మిని పరిమళించుట లేదా? దయామయుఁడగునాతని నర్థించి చూచెదను. ఆతఁడంగీకరించినను నంగీకరింపకున్నను నాహృదయమున కాతఁడే యధీశ్వరుఁడు! నాకన్నుల కాతఁడే యానందము—నాజీవితమున కాతఁడే నాథుఁడు! నాకాతఁడే దైవము! ఆప్రాణయస్వ

రూపునిపాదములఁ బట్టుకొని ప్రార్థించెదను. పాదదాసిగ నంగీకరించువఱకుఁ బ్రాణములనైనవిడిచెదనుగాని పాదములను విడువను."

అని యనేకవిధముల భావించుకొనుచు నాబాలిక యర్థరాత్రివేళఁ దల్లిదండ్రులకుఁ దెలుపకుండఁగనే యిల్లువిడిచి బయలుదేఱెను. అప్పుడే చంద్రోదయ మగుచుండెను. ఆయస్పష్టచంద్రాలోకమునందామె యేకాకినియై నిర్భయముగ శ్రీరాజరాజేశ్వరీసత్రమునొద్దకు వచ్చెను. చాలరాత్రి యగుటచే నాసత్రద్వారములన్నియును మూయఁబడి యుండెను. రాజమార్గము జనసంచారశూన్యమైయుండెను. అస్పష్ట మగునాపొడుపువెన్నెలలో నశ్వత్థవృక్షాంతరాళమునం దామెయొక్కతెయే నిలువఁబడి యాలోచించుకొనుచుండెను.

రంగదాసుఁ డాసత్రమునవిడిసియుండె నని యామె యెఱుంగును. కాని యాతఁ పేరుపెట్టిపిలుచుట కామెకు సిగ్గుగఁ దోఁచెను. తానువచ్చిన ట్లాతని కెట్లు తెలియును? ఆమె యించుక సేపాలోచించెను. ఆతఁడు దయార్ద్రహృదయుఁడు. ఎంతనిద్దురలో నైననార్తనాదము నాతఁ డాలకింపఁగలఁడు; ఆయర్థరాత్రివేళ నాతనిసందర్శనమున కంతకంటె నుపాయాంతర మేమియు నామె కగపడలేదు అప్పుడామె ద్వారమును సమీపించి శోకగద్గదస్వరముతో „ అయ్యో! దొంగలు! దొంగలు! రక్షింపుఁడు! రక్షింపుఁడు!" అని కేకలువైచెను.

గాఢనిద్రలోనున్న రంగదాసునకర్ణయుగళమునం దాయార్తనాద మెట్లు ప్రవేశించెనోగాని యాతఁ డులికిపడి లేచి „ భయములేదు. వచ్చుచున్నాను. భయములేదు" అని కేకలువైచుచుఁ దత్తరముతోఁ దలుపుతీసికొనివచ్చి యొక్కపరుగునఁ బోయి యా



ముత్యాలు లజ్జావనతవదనయై ‘‘దొంగలెవ్వరును లేరు. నేనే దొంగనై వచ్చితిని.’’ అనియెను. పుట. 287.

చెను సమీపించెను. అప్పుడు ముత్యాలు దీనగద్గదస్వరముతో ,, రక్షింపుము. రక్షింపుము. '' అని ప్రార్థించుచు నాతనిపాదము లను బట్టుకొనియెను.

రంగదాసు కంఠస్వరమునుబట్టియే ముత్యాలు నానవాలు పట్టెను. ఆవెన్నెలలో నొంటిగ వచ్చితనపాదములపైఁ బడియున్న యామెం జూచి విస్మితుఁడై ,, ఏమి ? ఏమైనది ? భయములేదు. నీవొంటిగనిచ్చటి కింతరాత్రివేళ నెందుకు వచ్చితివి ? దొంగ లెవ్వరు ? '' అని తత్తరముతోఁ బ్రశ్నించుచు నామెను లేవనెత్తెను.

ముత్యాలు లజ్జావనతవదనయై మృదులస్వరముతో ,, దొంగ లెవ్వరును లేరు. నేనే దొంగనై వచ్చితిని '' అనియెను.

రంగ—నీతో నెవ్వరు వచ్చిరి ?

ముత్యా—నేనెవ్వరికిని దెలియకుండఁగనే వచ్చితిని.

రంగ—ఏమి ?

ముత్యా—మీదర్శనము చేయుటకు—

రంగ—సాయంకాలమునఁ జూచితివి కాదా ? మరల నుదయమున రమ్మనినకాదా? ఇంతరాత్రివేళ నొంటిగ వచ్చుటెందుకు?

ముత్యా—ఏకాంతముగ మిమ్ము దర్శించుటకే—ఏకాంతముగ నాప్రాణములను జాలియింపఁజేయుచున్న నామనోరథము నేకాంతముగ మీకు విశదపఱచుకొనుటకే—మిమ్ముఁ బ్రార్థించుటకే వచ్చియుంటిని.

రంగ—నీకంతటికష్ట మేమికలిగినది ?

ముత్యా—నాకోరిక దుర్లభమగుటచేతనే నాప్రాణములు తల్లడిల్లిపోవుచున్నవి.

రంగ—నీకోరికయేమో తెల్పుము.

ముత్యా—తీర్చెద నీ యభయప్రదానముం గావించినచో దెలిపెదను.

రంగదాసు నిర్విణ్ణుడై పోయెను ఆ బాలికకోమలహృదయమునం దట్టియభిలాషయున్నదియో యాతనికిఁ దెలిసిపోయెను ఆ గాలియే తనహృదయకమలమునుగూడఁ జలియింపఁజేయుచున్నదని యాతనికి బోధపడియెను. ఆ బాలికప్రణయమృదులహృదయమెంతతల్లడిల్లిపోవుచున్నదో యనుభవమునుబట్టి యాతఁడు తెలిసికొనియెను. ఏమిచెప్పుటకు నాతనికి నోరాడుట లేదు. ఏమిచేయుటకు నాతఁ డస్వతంత్రుఁడైయుండెను. అతఁడు మరల నదేమాటగ "నీకోరిక యేమో తెలుపుము!" అనియెను.

ముత్యాలులజ్జావినయవినమితవదనయై చేతులు దోయిలించి దీనగద్గదస్వరముతో "దయామయా! అభయప్రదానముం గావింపుము. కరుణాళుఁడ వగునీవీమంగళగళసూత్రమును నాకంఠమునం దలంకరించి నన్ను బ్రదికించితివి. నేను నీప్రేమపాత్రురాలను నీప్రేమార్ద్రహృదయమునకు నేనాత్మసమర్పణముం గావించుకొనుచున్నాను. కృపామతివై యభయప్రదానముం గావింపుము" అని వేఁడుకొనియెను.

రంగదాసునిప్రేమార్ద్రహృదయము కరఁగినీరైపోయెను. ఆతఁడించుక సేపాలోచించి నిట్టూర్పు విడిచి "బాలికామణీ! ఆకస్మికముగ నేనిప్పుడేమియును జెప్పఁజాలను!—నీవునాతోఁగూడ రాఁగలిగినచో—"

ఆర్ధోక్తియందే ముత్యాలు "మీరెచ్చటకు రమ్మనిన నచ్చటికి వచ్చెదను. మీరేమిచేయుమన్నను జేసెదను. మీయడుగులో నడుగువైచి వచ్చుటకంటె నాకీలోకమునఁ గోరఁదగిన దేమున్నది?

మీచేతిలోఁ జేయిగలిపి పనిచేయునినాఁడు నాకీజీవితములోఁ బనియేమున్నది? నీవే నాలోకము—నీవే నాయానందము—నీవే నాస్వర్గము. నీకంటెనాకీలోకమున శరణ్య మేమున్నది ? " అని యాతని పాదములపైఁ బడియెను.

అప్పుడు రంగదాసునికర్ణరంధ్రములయందు "స్త్రీరత్నం దుష్కులాదపి" అనునార్యోక్తి ప్రతిధ్వనించుచుండెను. ఆతని ప్రేమార్ద్రహృదయమున నాదర్శసతీమణియగు రుంధతీదేవి జ్యోతిర్మూర్తియై యగపడుచుండెను; ఆదిశక్తి యగుమాతంగినీమాత శాంతశృంగారమూర్తియై సాక్షాత్కరించుచుండెను. ఆతఁడు ప్రేమానందపరవశుఁడై యామెనులేవనెత్తి సాంత్వనస్వరముతో "నీజనకుఁడంగీకరించునా" అని ప్రశ్నించెను.

ముత్యాలు సంతోషముతో "అనాయాసముగ నమృతము లభియించుచుండ నక్కఱలేదనునవివేకి యుండునా? " అనియెను.

రంగ—అట్లయినచో నీతండ్రియొద్దకు రమ్ము!

ఇరువురు నప్పుడే యచ్చటినుండి బయలుదేరి పోయిరి.

పందొమ్మిదవ ప్రకరణము.

అతిపిపాసాశాంతి కమృతంబు దొరకె;
అతనుతాపనివృత్తి కౌషధం బొదవె;
తనువెల్లఁ బులకించెఁ దన్మయత్వమున;
అంతరంగము పొంగె నానందగరిమ;
పడియుంటి నవశనై భవదంతికమున
నన్నుద్ధరింపవే?—

ఏకాంతసేవ.

అనసూయకుఁ గష్టదశ వదలిపోయినది. ఆమెకిప్పుడు పూర్వముకంటె నధికముగ శుభసౌభాగ్యముల ననుభవించుసుఖకాలము వచ్చినది. అతిదుర్లభంబు లగుమాతృదేవతాప్రేమమయకటాక్షవీక్షణము లామెపైఁ బ్రసరించుచున్నవి. పుణ్యచరిత్ర యగు ననసూయ పుంజీభవించినశక్తిస్వరూపము; మూర్తీభవించినశాంతిస్వరూపము— ఏకీభవించినధర్మస్వరూపము— అనసూయ యిప్పుడు తనచిన్నబిడ్డ నెత్తుకొని మాతృదేవీపీఠపార్శ్వమున రెండవమాతృదేవతవలె నిలువఁబడియుండెను. ఆనందాదేవి పరమానందముతో సర్వార్థచింతామణీమూర్తిని రక్షాసూత్రమునఁ గూర్చి యాబాలకు కంఠము నలంకరించి యాశీర్వదించుచున్నది. జోగమ్మ యానందముతోఁ జూచుచుండెను. అనసూయ యానందమునకు మేరలేకుండెను. తమకుటుంబము నెన్నియోతరములనుండి భోగభాగ్యములచేఁ దులదూఁగించుచున్నయాదివ్యమూర్తి యనాయాసముగఁ దనబిడ్డకు మరల లభియించినది. తన కిఁకభర్తృసందర్శనసౌభాగ్యము సమీపమునందే లభియింపఁగలదని యనసూయకప్పుడు ధైర్యము కలిగినది.

ఆసంతోషముచే ననసూయ యానందపులకితశరీరయై భక్తిరసావేశహృదయముతో నాదిశక్తి యగునాజగన్మాతయెదుట వినయవినమితవదనయై నిలువఁబడి ప్రార్థించుచుండెను. మాతృసందర్శనార్థులైవచ్చిన మాతృభక్తులందఱు నానందముదితులై యాలోకించుచుండిరి. అంతలో నాకస్మికముగ నెవ్వరో యొకరమణీమూర్తి యామఠమునఁ బ్రవేశించి యాభక్తమండలము నొత్తిగించుకొనుచుఁ బోయి యార్తస్వరముతో, ‘తల్లీ! ఈతల్లిసన్నిధిని నాతప్పులను క్షమియించి నన్నుద్ధరింపుము.’ అని పలుకుచు దేవీప్రార్థనము చేసికొనుచున్న యనసూయపాదములపైఁ బడియెను.

అనసూయకు ధ్యానభంగ మయ్యెను. ఆమె సంభ్రమముతోఁ బాదములపైఁ బడినయాయువతిని లేవనెత్తి విభ్రాంతనయనములతో నామెను దిలకింప నారంభించెను. అప్పు డాయువతి శోకగద్గదస్వరముతో, ‘తల్లీ! నీవు నన్నెఱుంగకపోయినను నిన్ను నేనెఱుంగుదును. నేను నీసుఖమార్గమునకు సునిశితకంటకమును—నీయానందచంద్రికల కకాలమేఘమును—నీజీవనసర్వస్వమును బలవంతముగ నేనే యపహరించితిని—కరుణామయీ! దయామయి యగుజగన్మాతయెదుట నాతప్పులను క్షమియించి దాసురాలిగ ననుగ్రహింపుము. నీకృపాలేశముకంటె నాఘోరపాపమునకు నిష్కృతి లేదు. నీశీతలకటాక్షములకంటె నాహృదయపరితాపమునకు శాంతి లేదు. నీమధురవచనములకంటె నామానసికవ్యాధికి మందు లేదు. తల్లీ! కరుణింపుము!” అని ప్రార్థింప నారంభించెను.

అనసూయ యచ్చెరువడి చూచుచు నిలువఁబడిపోయెను. ఆమె యెవ్వరైయుండునని యాలోచించుకొనియెను. అంతలో నామె కానాఁటిచిత్రపటము కనులఁ గట్టినట్లగపడియెను. తోడనే యామెను

రాజరత్నముమాట జ్ఞప్తికివచ్చెను. ఆరమణీమూర్తి రాజరత్నమే. చిత్రప్రతిమవలె నామె నిశ్చేష్టయైపోయెను. జోగమ్మయామెను లోనికిఁ దీసికొనిపోయెను.

అప్పు డానందాదేవి గంభీరస్వరముతో “నీకుఁ బశ్చాత్తాపము కలిగినచో నీజగన్మాత నీసర్వాపరాధములను క్షమియింపఁ గలదు ” అనెను.

రాజ—తల్లీ ! పశ్చాత్తాపదుఃఖమునుసహింపఁజాలక బలవన్మరణమునకు సాహసించితినిగాని పాపాత్మురాల నగుటచే దారుణనరకభయంబునఁ జావలేక పోయితిని. నాచరిత్రము పాపకళంకితమైపోయినది.

ఆనం—కొంతవఱకు నీచరిత్రము నేనెఱుంగుదును. నీవిచ్చటి కెట్లు వచ్చితివి ?

రాజ—తల్లీ ! నాయక్క యగునాగమణిమాటలకు లోఁబడి నేనామెయిచ్చవచ్చినట్లుగ మెలంగితిని. అట్టినామూలమున వేంకటేశ్వరుని యమృతమయజీవనము విషమయమైపోయినది. నాయక్కయును కృతఘ్నుఁడగుదామోదరునివలలోఁ బడి కేవలధనలోభముచే నన్నధోలోకమునకుఁ ద్రోసివైచినది. దామోదరునిమూలమున వేంకటేశ్వరు సర్వస్వమును నాశనమైపోయినది. నిరాధారుఁడగువేంకటేశ్వరుని నాయక్క నాకుఁ దెలియకుండ నాయింటికి రానీయకుండఁ దరిమివైచినది. నాకాసంగతి తెలిసినతోడనే నాకు నాయిల్లసహ్యమైపోయినది— నాయక్కతోడిసాహచర్యమసహ్యమైపోయినది. నాజీవితమే యసహ్యమైపోయినది. నేనప్పుడే నాయిల్లువదలి నామూలమునన ధఃపతితుఁడైన వేంకటేశ్వరుని వెదకికొనుచు నీనగరమునకు వచ్చి యర్ధరాత్రివేళ నాతనిదర్శించి క్షమాప్రార్థనముం గావించితిని. నన్నుఁ జూచి మృత్యుదేవతం జూచినట్లుగ భయ

పడి యాతఁడు పాఱిపోయినాఁడు. నేఁజగన్మాతనుదర్శించి పాపవిమోచనమునకై తల్లిపాదపీఠమునఁ బ్రాణాచారముపడఁదలఁచి వచ్చియుండఁగా దేవీమూర్తియగు ననసూయదర్శనము లభియించినది. తల్లీ! ఈపాపాత్మురాలియెడఁ గరుణించి పాపవిమోచనమునకుపాయముంజూపి రక్షింపవా ?

ఆనం—తల్లీ! ఆర్యసంఘమున మీరు దేవీపరిచారికవై పుణ్యయువతీమణులుగఁ బరిగణింపఁబడుచుంటిరి. శుభకార్యములయందు శోభనదేవతలుగ భావింపఁబడుచుంటిరి. అట్టినిత్యసువాసినులగు మీరు క్రమక్రమముగ నజ్ఞానవశంబున నీచవృత్తుల నాశ్రయించి పూర్వోన్నత్యమును బోఁగొట్టుకొంటిరి. ఆకారణముచేతనే దేవతామూర్తులైయున్నమీరు తుట్టతుదకు రాక్షసీమూర్తులైపోయితిరి. మీపుణ్యచరిత్రములు పాపభూయిష్ఠములైపోయినవి. మీరు సంఘకల్పమునకు వేరుపురుగులైపోయితిరి. ధనలోభముచే ధర్మమునువిడిచితిరి. కులవృత్తినివిడిచితిరి. గుణమును విడిచితిరి. గౌరవమును విడిచితిరి. అన్నియును విడిచి యాత్మద్రోహమునకుఁ బాల్పడిపోయితిరి. తుదకు మీకు మిగిలినదేమున్నది ?

రాజ—ఏమున్నది ? దుఃఖముమిగిలినది. పాపము మిగిలినది. పరితాపముమిగిలినది !

ఆనం—ఇప్పటికి బోధపడినదా ?

రాజ—తల్లీ! అనుభవమైనది. వ్యభిచారమే కులవృత్తియనుకొని సంచరించుట జ్ఞానముగలమానవస్వభావము కాదనియనుభవమైనది! ఆపరితాపజ్వాలలచే నాసర్వాంగకములును దహించుకొనిపోవుచున్నవి. తల్లీ! నన్నుద్ధరింపుము.

ఆనం—ఇట్టిపాపము నెన్నఁడుఁ జేయనని తల్లిపాదములమీదుటఁ బ్రమాణము చేయుదువా ?

రాజ —తల్లీ! ఆపాపవృత్తిం దలంచుకొనిన భయ మగుచున్నది. శతృవులకైన నిట్టినీచజన్మమును బరమేశ్వరుఁడు ప్రసాదింపకుండుఁగాక! ఈమహామాత పాదములసన్నిధిని నేనెన్నఁడు నిట్టిపాపమును గలలోనైనఁ దలంప నని త్రికరణశుద్ధిగాఁ బ్రమాణము చేయుచున్నాను.

ఆనం —ఇంతటినుండి మాతృసేవాపరాయణవై నీవలెనే పాపపంకమున మునిఁగిపోవుచున్నసోదరీమణుల నుద్ధరించుటకై నీజీవితమంతయు నుపయోగింతు నని నీకన్నతల్లియెదుట శపథముచేసి స్వధర్మమును నిర్వహింపఁగలిగినచో నీసర్వాపరాధములను జగన్మాత క్షమియింపఁగలదు.

రాజ —తల్లీ! మహామాత యనుగ్రహముచే నాజన్మము సార్థకమగునట్లుగా నటీసదుద్యమమునందే నాజీవితశేషమును గడపెదను. తల్లీ! నన్నుఁ గటాక్షింపుము! నరకయాతనల ననుభవింపకుండ నన్నుద్ధరింపుము.

ఆనం—అట్లయినచో మహామాత నిన్ను క్షమియించుచున్నది. నీపాపములను క్షమించుచున్నది

రాజరత్నమప్పుడు భక్తిభావముతో మాతృదేవతకు సాష్టాంగనమస్కారము గావించెను. ఆనందాదేవి యామెకు దేవీనిర్మాల్యకుసుమమును బ్రసాదించెను.

ఇరువదియవ ప్రకరణము.

చీఁకటులఁ బంపుచేసిన ♦ చేతితోడ
వెన్నెలలసృజియించిన ♦ విభుఁడెవండొ
అట్టికర్మాధిపతియాశ్ర ♦ యంబుకొఱకు
అట్టికర్మవినాశుని ♦ యండకొఱకు
విజ్ఞులై యిప్పుడైనను ♦ వెదకికొనుఁడు !

భవాబ్ధి—

శిక్షామందిరమునఁ బ్రబోధస్వామియెదుట భయభక్తివినయవినమితవదనులై చేతులు జోడించుకొని గోపాలకృష్ణరావును, దామోదరరావును, జంచలరావును నిలువంబడియుండిరి. అప్పుడు స్వామి ‘ప్రశాంతగంభీరస్వరముతో, ‘కుమారులారా! మీహృదయములు సంపూర్ణముగఁ బశ్చాత్తప్తము లైనవా?’ అని ప్రశ్నించెను.

అందఱు నేకగ్రీవముగ, ‘మహాత్మా! పశ్చాత్తప్తుల మైతిమి. మాపాపములను క్షమియించి మాకు గతిఁగల్పింపుము. మాతృదేవతాసందర్శనమున కర్హత్వమును బ్రసాదింపుము.’ అని ప్రార్థించిరి.

అప్పుడు స్వామి దామోదరునిం జూచి ‘దామోదరా! నీవు మిత్రద్రోహము చేసితివి’ అనియెను.

దామోదరుఁడు భయపరికంపితస్వరముతో, ‘జ్ఞానతండ్రీ! అవివేకముచేఁ దాత్కాలికసుఖలుబ్ధుఁడనై యమాయకుఁ డగు వేంకటేశ్వరుని సర్వస్వమును నాశనముచేసి వైచితిని. ఆపుణ్యచరిత్రుని

బాపదూషితుంగఁ జేసి వైచితిని. అబలాశిరోమణియగు ననసూయ పడరానికష్టములపా లగుటకు నేనే కారణమైతిని. కేవలవిలాసప్రియత్వముచే ధనాశకు లోనై మానవుఁడనైయుండియు రాక్షసునివలె సంచరించితిని. మహాత్మా! నాసర్వాపరాధములను క్షమియించి నన్నుద్ధరింపుము ' అని దీనవదనుఁడై నిట్టూర్పులు విడుచుచు నిలువఁబడిపోయెను.

అప్పుడు గోపాలరావు పశ్చాత్తాపదుఃఖముతో, స్వామీ! నేనీదామోదరునికంటెను మహాపాపాత్ముఁడను. ధనాశాపీడితుఁడనై యతిదారుణకృత్యముల నవలీలగఁ జేసివైచితిఁ. నాతోడిసోదరుల నెందఱనో త్రాగుఁబోతులుగఁ జేసివైచితిని. ఎందఱనో యధర్మమార్గప్రవర్తకులుగఁ జేసివైచితిని. ఎందఱనో పాపకూపమునఁ బడఁ ద్రోసి వైచితిని. కుపుత్రుఁడనగు నేను దుర్బుద్ధిచేఁ గన్నుఁగానక కన్నతల్లియగు మాతృదేవతహృదయమును నొప్పించితిఁ. ఆత్మసోదరుల దుర్వ్యసనపరాయణులం గావించి యాంధ్రదేశగౌరవములు బరిభ్రష్టములుగఁ జేసివైచితిని. మహాత్మా! నాకుఁ గతియేమైననున్నదా? నాఘోరపాపములకు నిష్కృతి యేమైననున్నదా? స్వామీ! మీదివ్యమంగళపాదకమలములే నాకుశరణ్యములు. మీపవిత్రపాదపరాగలేశమే నాపాపతాపవిమోచనపరమౌషధము. తండ్రీ! పాపకూపమునుండి నన్నుద్ధరింపుము. ' అని యనేకవిధములఁ బ్రార్థింప నారంభించెను.

స్వామి యాతనిపైఁ గరుణాకటాక్షప్రసారముంగావించుచుఁ దన చెంతనున్నయొకపుస్తకముం దీసి యాతనికిఁ జూపుచు, గోపాలా! యీగ్రంథము నెన్నఁడైనఁ జూచితివా? ' అనిప్రశ్నించెను.

గోపాలుఁడ దదరిపడి, స్వామీ! చూడకేమి? ఈగ్రంథము పరమపతివ్రతాశిరోమణి యగునొకరమణీమణిజీవితచరిత్రము. ఆమెయే తనచరిత్రము నిందు వ్రాసికొన్నది ' అనియెను.

ప్రభో—నీవుదీనిం జదివితివా ?

గోపా—లేదుస్వామీ !

ప్రభో—ఆమెయెవ్వరో నీవెఱుఁగుదువా ?

గోపా—అకల్మషదివ్యచరిత్ర యగునాయువతీమణిని దుర్బుద్ధినై నేనే నావిలాసభవనమునం దాసవవిక్రయకార్యమునకు నియోగించితిని.

ప్రభో—ఆమె నీయొద్ద కెట్లు వచ్చినది ?

గోపా—నేనొకప్పుడు తిరుపతిదేవుని దర్శించి వచ్చుచుండఁగా మార్గమధ్యమునం దీమె క్షుద్బాధాపీడితయై పడియుండి నాకంటఁబడినది. త్రిలోకమోహనమూర్తి యగునామెం జూచి నాకు జాలి కలుగుటచే నామెంజేరి సేదదేర్చి జలంబులను ఫలంబులు నొసంగితిని. ఆమె యెవ్వరో తెలిసికొనవలయునను కుతూహలముతోఁ బ్రశ్నించితినిగాని యామె మాటాడఁజాలక తన్నుఁ దనభర్త పరిత్యజించి వెడలిపోయెననియు, నాతని వెదకికొనుచుఁ దిరుగుచు నాఁకటిబాధచే శోషిల్లి యిచ్చటఁబడిపోయితి ననియు నామె యిసుకలో వ్రాసి చూపినది. ఆమె మూఁగది యని గ్రహించి యామెను వశపఱచుకొనుటకై యప్పుడు నే 'నీభర్తయొద్దకు నిన్నుఁజేర్చెదను. నీవు నాతోడ వచ్చెదవా ?' అని వ్రాసి చూపితిని. తనకుపకారముచేసిన నేను ధర్మాత్ముఁడనే యనుకొని యమాయికయగు నామె నావెంటనే వచ్చినది. అప్పుడు నేను విలాసభవనమున కామెను జేర్చి యాసవపానపరాయణుల కాసుందరి యాకర్షణయంత్రముగ నుండునని యెంచి యామెను మద్యవిక్రయమునకు నియోగించితిని—

ప్రభో—అందు కామె యంగీకరించినదా ?

గోపా—మొదట నామె యంగీకరింపలేదు. అప్పుడు నేను నీభర్తనువెదకించుటకై విశేషధనము కావలయు ననియు, నీవిపని

కంగీకరింపనిచో ధనము లభియింపదనియు, నింతమాత్రముచే నీ మరియాదకు భంగము లేదనియు, నట్టిప్రమాదము కలుగకుండ నేను గాపాడుచుందుననియు వ్రాసిచూపి యామెకు ధైర్యముచెప్పుటచే నతికష్టముగఁ దుదకంగీకరించినది. అట్లే యామె పనిచేయుచు నెప్పటికిని భర్తృదర్శనము లభియింపకుండుటచే నాదురుద్దేశమును గ్రహించినది కాఁబోలును ! అర్ధరాత్రివేళ నాతోఁ జెప్పకుండ వెడలిపోయినది. అప్పటికి నిప్పటికి నేనామెను జూడనే లేదు. తండ్రీ! ఆమహాపతివ్రతను మహాపాపాత్ముఁడ నగు నే నీవిధముగఁ గసిగండ్ల పాలు చేసితిని. పాపమామె తుదకేమైనదో గదా !

అని యాతఁడు ఖిన్నుఁడై నిలువఁబడిపోయెను. అప్పుడు దామోదరుఁడు "స్వామీ ! త్రిలోకసుందరియగు నాపరమపతివ్రతను నేనొకనాఁటి రాత్రి పెద్దాపురమున మరిడమ్మగుడిలోఁ జూచితిని. ఆమె నన్నుఁ జూచినతోడనే నన్ననుసరించి వచ్చినది. నేనా సతీమణి యుద్దేశముం గ్రహింపఁజాలక దుర్బుద్ధినై ప్రవర్తించితిని. నా దుర్బుద్ధిని గ్రహించినంతనే యామె నన్నుఁ బరిత్యజించినది. నాఁడనే యీపాపఫలము నాకనుభవమునకు వచ్చినది. ఆయర్ధరాత్రమున బలవంతులగు దొంగలు నాపైఁ బడి బలవంతముగ నన్నుఁ బ్రహరించి యామె నెత్తికొనిపోయిరి. ఆరమణీమూర్తి దేవీమూర్తియే యని నాకిప్పటికి బోధ యగుచున్నది. మహాత్మా ! చపలచిత్తుఁడనై యాదేవియెడల మహాపరాధముంగావించితిని" అనియెను.

పరి—ఆమె యంతరాత్రివేళ నిన్ననుసరించి యెందుకు వచ్చినదో నీకుఁ దెలియునా ?

దామో—నాకేమియును దెలియదు.

పరిబోధానందుఁ డించుక సేపాలోచించి చేతిలోనిపుస్తకమును దిరుగవైచుచు "దామోదరా ! నీవీచంచలరావు నెఱుఁగుదువా ?" అనియెను.